వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 13 సంచిక : 4 హైదరాబాద్ 165 ఏప్రిల్ 2015 పేజీలు : 68 రు. 20

- కార్పొరేట్ల సేవలో కేంద్ర బడ్జెట్
- ప్రాధాన్యతలు మారుతున్న తెలంగాణ బడ్జెట్
- పాత వాసనలు వదలని ఎపి బడ్జెట్
- భూ సేకరణ బిల్లు వివాదం
- మత స్వేచ్ఛ - రాజ్యాంగ హక్కు
- ఆమ్ ఆద్మీ పార్టీ ప్రత్యామ్నాయమేనా?
- ఇజ్రాయిల్‌లో జాత్యహంకారుల గెలుపు

వీక్షణం రచయితల సమావేశం 2015 దృశ్యాలు





వీక్షణం రచయితల సమావేశం 2015 గత ఏడు సమావేశాల కన్న భిన్నంగా వీక్షణంలో అచ్చవుతున్న రచనల వస్తువు, శైలి, నాణ్యతల మీద కేంద్రీకరించిన చర్చగా జరిగింది. మార్చ్ 8, ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ రిసోర్స్ సెంటర్ (ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్) సమావేశ మందిరంలో వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్ సభ్యులు బి.ఎస్. రాజు అధ్యక్షతన జరిగిన సమావేశాన్ని వ్యవస్థాపక సంపాదకులు వి. హనుమంతరావు ప్రారంభించారు. ఈ సమావేశంలో ఎ. నర్సింహారెడ్డి, ఎం. రాఘవాచారి, ఉషా ఎస్. డానీ, డా. టి. నళిని, వరవరరావు, బి. రామకృష్ణ, పిట్టల శ్రీశైలం, కె. ప్రభాకర్, కె. సురేష్, బైరెడ్డి సతీష్, రాంకి, కవిని ఆలూరి, వై. భాస్కర్, కె. బాల్‌రెడ్డి, బి. గణపతి, వి. వెంకటరమణ, ఎస్. రజిత, ఎం.ఎన్. రెడ్డి, వి. సురేష్‌బాబు, జి. సూరి, జి.వి. సుధాకర్‌రెడ్డి, బి. మధుసూదన్‌రెడ్డి, వి. సురేష్, ఎం. నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వకుళాభరణం రామకృష్ణ, పి. ప్రసాద్, కె. సజయ, ఎస్. ఆశాలత, పి. అరవింద, సిఎచ్. శ్రీమన్నారాయణ, ఎ. పున్నయ్య, వి. సంపత్‌రెడ్డి, టి. రమేష్, ఎన్. భగవాన్‌రెడ్డి సమావేశానికి హాజరు కాలేకపోతున్నామంటూ, వీక్షణంతో సంఘీభావం ప్రకటిస్తూ సందేశాలు పంపించారు.

ISSN 2231-6892

165

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్ 2015
సంపుటి : 13
సంచిక : 4

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; హైదరాబాద్ – డి. విజయభాస్కర్; కరీంనగర్ – ఎస్.తిరుపతి; నల్గొండ – జి. వెంకటేశ్వర్లు; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ఎం. రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; నిజామాబాద్ – ఎం. నర్సయ్య; రంగారెడ్డి – వి. శంకరయ్య; వరంగల్ – ఎ.కుమార్.

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; ప్రకాశం – కర్ణ సతీష్‌బాబు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

'వీక్షణం' పేరిట ఎం.ఓ.లు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **డక్కన్ ప్రెస్ / చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపేవారు మాత్రమే బ్యాంక్ స్లిప్‌లపై 'veekshanam' అని రాసి వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175**
ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి.
ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 000/0139** నెంబర్ రాసి వేయవచ్చు.

పాఠకుల వీక్షణం

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2015 మార్చ్ నెలలో వచ్చిన విరాళాలు - ఆర్. ముఖర్జీ, కలకత్తా- రు. 5,000; పి. రాజారెడ్డి, కీసర - రు. 10,000; బి. మధుసూదన్‌రెడ్డి, సిద్దిపేట - రు. 1,000; కవిని ఆలూరి, హైదరాబాద్ - రు. 2,000; వి. వెంకట్‌రావు, విజయనగరం - రు. 1,000; పొట్లపల్లి వరప్రసాద్ రావు ఫౌండేషన్, హైదరాబాద్ - రు. 10,000; రమేష్ గొండ్యాల (శ్రమజీవి సంఘం), ముంబాయి - రు. 200; చిటికన సాయిప్రసాద్, హైదరాబాద్ - రు. 5,000; ఎం. సూర్యనారాయణ, విశాఖపట్నం - రు. 1,000. దాతలందరికి కృతజ్ఞతలు. - సం.

వీక్షణం మార్చ్ సంచికలో లోకసంచారి ఉత్తరం చదివిన తరువాత ఇది రాస్తున్నాను. నాకు తెలిసిన రెండు నాలుగు దశాబ్దాల్లో వామపక్ష ఉద్యమాలు, సంస్థలు సిద్ధాంతం దారి సిద్ధాంతానిది, ఆచరణ దారి ఆచరణది అన్నట్టే వ్యవహరించాయి. ప్రజల నుండి ప్రజలకు, కేంద్రీకృత ప్రజాస్వామ్యం (అసలు కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనే సూత్రం కమ్యూనిస్టు సంస్థల్లో లేదు. ఉండవలసినది ప్రజాస్వామిక కేంద్రీకరణ - డెమోక్రటిక్ సెంట్రలిజం, సెంట్రలైజ్‌డ్ డెమోక్రసీ కాదు) వంటి సూత్రాలు వల్లించిన రోజువారీ ఆచరణ ఏదో ఒక నాయకుడి (కొద్ది మంది మహిళా నాయకులు) చుట్టు తిరిగేది. సిద్ధాంత స్పర్శలేని ఈ ఆచరణను బాలగోపాల్ ఒక్కడే గందరగోళంలోకి నెట్టగా, కుల, ఇతర గుర్తింపు వాదాలు సంస్థలను కొట్టేశాయి. చివరికి రష్యన్ విప్లవం తిరోగమనంలో స్టాలిన్ వాదుల పాత్ర గురించి ఎన్ని ఆధారాలు లభించినా ఇప్పటికీ స్టాలిన్ ఫొటోలు ప్రదర్శించడం మానుకోని స్థితిలో పార్టీలు ఉన్నాయి. సిద్ధాంతం, ఆచరణల గురించి ప్రపంచ ఉద్యమ చరిత్ర గురించి పొలిమిక్స్ ఎంత తక్కువ స్థాయిలో జరుగుతున్నాయో చూస్తేనే ఈ సంస్థల సిద్ధాంత బలం తెలుస్తోంది. దీనికి మరోవైపు నాయకత్వాలు ఆస్తుల సంపాదనలోకి దిగాయని పదిహేను సంవత్సరాలుగా వస్తున్న ఆరోపణలు. మౌలిక సూత్రాలు - తత్వశాస్త్రం, రాజకీయ, అర్థిక, ప్రపంచ చరిత్ర మీద పట్టు సాధించకుండా - ఎవరో కొందరు 'పెద్దన్నలు' కాకుండా, వీలైనంత మంది కార్యకర్తలు లేకుండా 21 శతాబ్దపు ఉద్యమాలు ఎదగలేవు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని పది సంవత్సరాలకైనా ఏర్పడుతుందా అనే అనుమానం కలుగుతుంది. 28 నిమిషాల్లో ఏర్పాటు చేస్తానని ఆమోదించిన బిజెపి, తనకున్న మెజారిటీతో ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేదు? బిజెపి నాయకుడే కదా అప్పుడు ప్రత్యేక హోదా కోసం పట్టుబట్టింది? ఆంధ్రప్రదేశ్ మరొక పంజాబ్ అవుతుందేమో అన్న ఆందోళన నిజమయ్యేట్లు ఉంది. కేంద్ర ప్రభుత్వం చుట్టూ తిరిగేకంటే ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా ఉద్యమం ప్రారంభించడం మంచిది. ఆంధ్రప్రదేశ్‌లో పౌర సమాజం బలహీనంగా ఉంది. ఉన్న మానవ వనరులు హైదరాబాద్‌లో ఆశ్రయం కొంతైనా వదులుకొని రాష్ట్రంలో ఉద్యమ నిర్మాణానికి తోడ్పడాల్సిన అవసరం ఉంది.

- నరేంద్రమోహన్,
ఆస్ట్రేలియా

'హిజ్రా సమస్య' గురించి, రచయిత అసలేం చెప్పారో చూసే సహనం లేకుండా, 'మెతుకుని చూస్తే అన్నం సంగతి తెలిసినట్టే' అంటూ, ఆ వ్యాసంలో ఉన్నదంతా ఇప్పుడే తెలిసి పోయినట్టు కె. వెంకటేశం విమర్శకు దిగడం అసందర్భంగా ఉంది. 'అన్నం'లో ప్రతి మెతుకూ ఒకే గుణంతో ఉంటుంది. ఈ రచనని 'అన్నం'తో పోల్చడానికి వీలవదు. రచనలో అనేక పాత్రలూ, వాదాలూ, సంఘటనలూ రకరకాలుగా ఉంటూ, చివరికి రచయిత చెప్పేది తేలుతుంది. ఆ ఉత్తరం కింద, సంపాదకులు 'ఏ రచన విషయంలో అయినా, పూర్తిగా చూసే వరకూ ఆగడం సరైన పద్ధతి' అని ఒకటి రెండు వాక్యాలు చేర్చితే అది పత్రికకే మంచి పద్ధతి.

- జె.యు.బి.వి. ప్రసాద్
కాలిఫోర్నియా

వీక్షణం పత్రిక నేను, మా మిత్రులు క్రమం తప్పకుండా చదువుతున్నాం. పత్రిక బాగుంటుంది. వీక్షణం తరఫున ప్రచురిస్తున్న పుస్తకాలు కూడా డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలుగా పిడిఎఫ్ ఫార్మాట్‌లో పెడితే మాలాంటి వాళ్లకు ఉపయోగకరంగా ఉంటుంది. ఆలోచించగలరు.

- మంజు
ఇమెయిల్ ద్వారా

వీక్షణం మార్చ్ సంచికలో 'కమ్యూనిస్టులకు అధికారం ఇచ్చిన గ్రీస్' అనే శీర్షికతో బైరెడ్డి సతీష్ వ్యాసం ప్రచురించారు. వ్యాసంలో, శీర్షికను సమర్థించే విషయమేమీ లేదు. జనవరి 25న జరిగిన ఎన్నికల్లో వివిధ పార్టీలకు వచ్చిన సీట్లు ఇలా ఉన్నాయి. మొత్తం సీట్లు 300. సిరిజా పార్టీకి 149 (71); పాత ప్రభుత్వంలో భాగస్వాములైన న్యూడెమోక్రసీకి 76(129), సోషల్ డెమోక్రటిక్ పసోక్ పార్టీకి 13(33), ఫాసిస్టు గోల్డెన్ డాన్ పార్టీకి 17(18), కమ్యూనిస్టు పార్టీకి 15(12) వచ్చాయి. బ్రాకెట్‌లోని సంఖ్య ఆయా పార్టీలకు 2012 ఎన్నికల్లో వచ్చిన సీట్లు. కమ్యూనిస్టు పార్టీ సిరిజా నాయకత్వంలోని అధికార కూటమిలో భాగస్వామి కాదు. కాని ఫాసిస్టు గోల్డెన్ డాన్ పార్టీ సిరిజా కూటమిలో భాగస్వామి. కనుక, వాస్తవాలను, కప్పిపుచ్చి, కమ్యూనిస్టులకు గ్రీస్ అధికారం ఇచ్చిందనడం సరికాదు. సిరిజా పార్టీ వామపక్షీయమైనా జాతీయ వాద పార్టీ, మార్క్సిస్ట్ కాదు.

- త్రిపురనేని హనుమాన్ చౌదరి
హైదరాబాద్

వీక్షణం గత సంచికలో 'తెలంగాణ విద్యార్థి సభలపై ప్రభుత్వ నిర్బంధం' వ్యాసంలో రచయిత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ ప్రభుత్వం వాక్ సభా స్వాతంత్ర్యాలను కాలరాస్తున్న తీరును వివరంగా రాశారు. ప్రజల్ని నమ్మించడానికి తెలుగు ప్రజల ఆత్మగౌరవం పేరుతో వచ్చిన తెలుగుదేశం పార్టీ అయినా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో వచ్చిన తెలంగాణ రాష్ట్ర సమితీ పార్టీ అయినా కనీసం రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కూడా అమలు చేయలేదు, చేయదు అనే విషయాన్ని రచయిత చాలా సూటిగా చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర మరువలేనిది. కాని విద్యార్థి ఉద్యమ నాయకులను వివిధ రాజకీయ పార్టీలు లొంగదీసుకొని, తమకు అనకూలంగా మార్చుకున్నాయి. సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ సభలు జరుపుకుంటున్న తెలంగాణ విద్యార్థి వేదిక సభ్యుల వ్యక్తిగత వివరాలు, ఫొటోలు తీసుకోవడం వల్ల వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడం అవుతుంది. లాబీయింగ్‌కు పరిమితమై, విద్యార్థుల బలిదానాలకు కారణమై, ప్రజలు ఈడ్చితే రోడ్డు మీదికి వచ్చిన రాజకీయ నాయకులు ఇప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని విద్యార్థుల పట్ల అనుసరిస్తున్న దుర్మార్గ దమనకాండను ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలి. 'పెరుమాళ్ మురుగన్-రచనా స్వేచ్ఛ' వ్యాసం ఈ సమాజంలో మూఢ విశ్వాసాల నుండి ప్రజలను చైతన్యపరుస్తున్న రచయిత మురుగన్‌పై హిందూత్వ శక్తులు చేసిన దాడి అప్రజాస్వామికం. ఈ విషయాన్ని బయటి ప్రపంచానికి తెలియజేసిన రచయితకు కృతజ్ఞతలు.

- ఎల్. సంతోష
కరీంనగర్

హిజ్రాల సమస్య గురించి, నాకు తెలిసినంత వరకూ, ఇంతవరకూ చర్చించినది లేదు. రంగనాయకమ్మ ఈ సమస్యను నిశితంగా పరిశీలించి రాస్తున్నారు. ఆమె వ్యాసం పూర్తయిన తరువాత, అందులో చర్చించాల్సిన విషయాలుంటే తప్పకుండా చర్చించండి. అంతేగానీ ఆమె వ్యాసాలు సగంలో ఉండగా, చివరగా ఆమె ఏం చెపుతారో తెలియకుండా కామెంట్స్ రాయడం సరికాదు. ఇక మదన్‌మోహన్ ఉత్తరం చాలా బాగుంది. వ్యాస రచయితలు భాష విషయంలో తగినంత శ్రద్ధ తీసుకోకపోతే, అది ఎవరి కోసమైతే రాస్తున్నారో అది వాళ్లకు చేరదు. పాఠకులకు అర్థం కాని సాహిత్యం వ్యర్థం.

- ఎ. వెంకయ్య
విజయనగరం

సృజన 1966-1992 డివిడి కొన్నవారికి విజ్ఞప్తి

సృజన ఆధునిక సాహిత్య వేదిక 1966-1992 సర్వస్వం డివిడిలో జూన్ 1973 (సంచిక 45) స్కానింగ్ లో రెండు పేజీలు పొరపాటున తప్పిపోయాయి. అలాగే మే 1979 (సంచిక 91) లో మరొక సంచిక నుంచి పది పేజీలు కలిసి, అక్కడ ఉండవలసిన పేజీలు తప్పిపోయాయి. ఈ పొరపాట్లకు చింతిస్తున్నాం. సృజన డివిడి కొనుక్కున్నవాళ్లు srjana.missingpages@gmail.comకు మీ మెయిల్ ఐడి పంపితే ఆ రెండు సంచికలూ సవరించిన ప్రతులు పంపుతాం. మీ డివిడిలో లేదా కంప్యూటర్ లో పాత ప్రతుల బదులు కొత్త ప్రతులు చేర్చుకోవచ్చు.

- 'సాహితీమిత్రులు'

కార్పొరేట్ల వల్ల, కార్పొరేట్ల కొరకు, కార్పొరేట్ల కేంద్ర బడ్జెట్

భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఎ) ప్రభుత్వపు తొలి పూర్తి స్థాయి బడ్జెట్‌గా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన 2015-16 బడ్జెట్ లో ప్రజలు లేరు. సంక్షేమ భావనలకు ప్రాధాన్యత లేదు. వ్యవసాయ రంగానికి అదనపు కేటాయింపులు లేవు. నిరుపేద వర్గాలకూ, మధ్యతరగతి వర్గాలకూ ఇవ్వగలిగిన ఉపశమనం కూడ లేదు. సంక్షేమ పథకాలనూ కేటాయింపులనూ పూర్తిగా విస్మరించారు. అదే సమయంలో బహుళ జాతి సంస్థలకు, కార్పొరేట్లకు, సంపన్నులకు అడగని, ఊహించని రాయితీలు, మినహాయింపులు, హామీలు గుప్పించారు.

బడ్జెట్ ప్రసంగం మొదటి నుంచి చివరివరకూ పెట్టుబడుల మంత్ర జపం సాగింది. ఉద్యోగ కల్పన కోసం, ప్రభుత్వ ఖజానాకు పన్నుల ఆదాయాన్ని పెంచుకోవడం కోసం, దేశ ఆర్థికాభివృద్ధి కోసం పెట్టుబడులను ఆహ్వానించడం ఒక ఎత్తు. కాని ఎటువంటి షరతులూ లేకుండా పెట్టుబడుల కోసమే పెట్టుబడులు అన్నట్టు, పెట్టుబడులను ఆహ్వానిస్తూ, వారి లాభాలకు హామీనిస్తూ, లాభాలు రాకపోతే దేశ ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసి వెళ్లిపోయినా సరే అన్నట్టుగా పెట్టుబడుల భజన సాగింది. అనుమతులు, పర్యావరణ నిబంధనలు, వివాదాలు, నియంత్రణా వ్యవస్థ వంటి అవరోధాల వల్ల పెట్టుబడులు రావడం లేదని, కనుక తమ ప్రభుత్వం నియంత్రణ వ్యవస్థను తొలగించే దిశగా, నియంత్రణా సంస్కరణల చట్టం తేనున్నదని, అడగకుండానే అనుమతులు ఇచ్చే వ్యవస్థ తెస్తామని ఆర్థిక మంత్రి అన్నారు. అసలు ఆ పెట్టుబడిదారులు దేశంలోకే రాకుండా, ఇక్కడి పరిశ్రమల్లో, వ్యాపారాల్లో స్థిరమైన పెట్టుబడి పెట్టకుండా కేవలం స్టాక్ మార్కెట్ లో జూదంలా పెట్టుబడి పెట్టే విదేశీ పోర్ట్ ఫోలియో పెట్టుబడుల మీద ఆంక్షలను తొలగిస్తామనీ, దానికీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికీ మధ్య ఉన్న తేడాను రద్దు చేస్తామనీ ఆర్థిక మంత్రి అన్నారు.

పారిశ్రామిక, వ్యాపార కార్పొరేషన్లు చెల్లించే కార్పొరేట్ పన్ను ప్రస్తుతం ఉన్న 30 శాతం చాల ఎక్కువ అని ఆర్థిక మంత్రి కార్పొరేట్ల వకీలు లాగ మాట్లాడారు. అంత ఎక్కువ ఉండడం వల్లనే కార్పొరేట్ సంస్థలు పన్ను చెల్లించడం లేదని, అందువల్ల అసలు కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించబోతున్నానని చిట్కా చెప్పారు. ఇలా తగ్గించినందువల్ల కార్పొరేట్ సంస్థలకు కనీసం రు. 25,000 కోట్లు మిగులుతుంది. అలాగే సంపద మీద పన్ను ప్రస్తుతం రు. 1008 కోట్లు మాత్రమే వస్తున్నదని, అది వసూలు చేయడానికే అంతకన్న ఎక్కువ ఖర్చు అవుతున్నదని సాకు చూపి సంపద పన్ను కూడ రద్దు చేస్తున్నానని ప్రకటించారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే సంపన్నులకు, పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ఇస్తున్న ఈ రాయితీల వల్ల ప్రభుత్వ ఖజానా అక్షరాలా ఐదు లక్షల నలభైతొమ్మిది వేల కోట్ల రూపాయలు కోల్పోతున్నది. అలాగే ప్రత్యక్ష పన్నులను రు. 8000 కోట్లు తగ్గించి, పరోక్ష పన్నులను రు. 23,000 కోట్లు పెంచుతున్నానని కూడ ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఒక్క మాటలో చెప్పాలంటే సంపన్నులకు, లాభార్జనాపరులకు, పారిశ్రామిక, వ్యాపారవర్గాలకు తక్కువ పన్నులు, సరుకులూ సేవలూ కొనుక్కునే సాధారణ ప్రజలకూ, నెలసరి ఆదాయం తెచ్చుకునే మధ్యతరగతికీ ఎక్కువ పన్నులు అనే ధోరణిని ఈ బడ్జెట్ వ్యక్తీకరించింది.

ఇలా పేద, మధ్యతరగతి వర్గాల నుంచి హెచ్చుగా వసూలు చేసిన పన్నుల నిధులను ప్రజల అభివృద్ధికి దోహదం చేసే రంగాలలో ఖర్చు పెడుతున్నారా అంటే అదీ లేదు. మొత్తం రు. 17,77,477 కోట్ల బడ్జెట్‌లో ప్రణాళికేతర వ్యయం రు. 13,12,200 కోట్లు కాగా, ప్రణాళికా వ్యయం రు. 4,65,277 కోట్లు. ప్రణాళికా సంఘమే రద్దయింది గనుక ఈ మాటలకు అర్థం లేదు గాని ప్రణాళికేతర వ్యయం అంటే ఎప్పటికప్పుడు పెట్టే వినియోగ ఖర్చు అనీ, ప్రణాళికా వ్యయం అంటే నిరంతర, దీర్ఘకాలిక ఆదాయ వనరులను తయారు చేయడానికి పెట్టే ఉత్పాదక ఖర్చు అనీ అర్థం. అంటే మొత్తం బడ్జెట్‌లో పావువంతు మాత్రమే ఆదాయ వనరుల అభివృద్ధి మీద ఖర్చు పెడుతున్నారు.

రక్షణ రంగానికి అతి ఎక్కువగా రు. 2,46,727 కోట్లు కేటాయించారు. ఇది గత బడ్జెట్ కేటాయింపు అయిన రు. 2,22,370 కోట్లతో పోలిస్తే రు. 24,357 కోట్లు ఎక్కువ. ఈ ఇబ్బడి ముబ్బడి కేటాయింపులు నిజంగా అట్టడుగు సైనిక సిబ్బంది జీతభత్యాల కోసం కూడ కాదు. ఈ నిధులన్నీ ఆయుధ వ్యాపారపు బహుళజాతి సంస్థల బొక్కసాలకు చేరేవే. మరొకవైపు కోట్లాది మంది ప్రజలకు అవసరమైన సంక్షేమ రంగాలన్నీ కలిపినా ఇంత కేటాయింపులు లేవు. కొన్ని రంగాలకైతే మొత్తం నిధులు, రక్షణ రంగంలో పెరిగిన నిధులకన్న తక్కువ. సంక్షేమ రంగాలకు గత సంవత్సర కేటాయింపులకన్న ఈ సంవత్సరం కేటాయింపులు ఎంత తగ్గిపోయాయో చూస్తే ఈ ప్రభుత్వానికి అనాదృత వర్గాలకు కనీస ఉపశమనం అందించాలని కూడ లేదని తేటతెల్లమవుతుంది. ఈ తగ్గింపులు వ్యవసాయ రంగానికి రు. 19852 కోట్ల నుంచి రు. 17,004 కోట్లకు, మహిళా శిశు సంక్షేమానికి రు. 18,588 కోట్ల నుంచి రు. 10,351 కోట్లకు, పంచాయతీరాజ్‌కు రు. 3,400 కోట్ల నుంచి రు. 94 కోట్లకు, తాగునీరు, పారిశుధ్యాలకు రు. 12,107 కోట్ల నుంచి రు. 6,243 కోట్లకు, షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికకు రు. 43,208 కోట్ల నుంచి రు 30,000 కోట్లకు, గిరిజనుల ఉపప్రణాళికకు రు. 26,714 కోట్ల నుంచి రు. 19,000 కోట్లకు, మధ్యాహ్న భోజన పథకానికి రు. 11,770 కోట్ల నుంచి రు. 9,236 కోట్లకు తగ్గిపోయాయి.

కార్పొరేట్లకు, సంపన్నులకు 'జీ హుజూర్ జో హుకుం' అనడానికి చూపిన ఉత్సాహంలో పదోవంతయినా ఈ బడ్జెట్ నిజంగా ఈ దేశపు మనుగడకూ అభివృద్ధికీ కారణమైన ప్రజల విషయంలో చూపలేదు. తనను తాను స్వదేశీ గుత్తేదారుగా భావించుకునే, గప్పాలు కొట్టుకునే పార్టీ ప్రభుత్వం విదేశీ బహుళ జాతి సంస్థల, వారి దేశీ తైనాతీల అడుగులకు మడుగులొత్తే బడ్జెట్ తయారు చేయడం ఈ దేశ పార్లమెంటరీ రాజకీయాలకు సహజాభరణంగా మారిపోయిన వంచనాశిల్పానికి ప్రతీకగా ఉంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

సాంస్కృతిక ఆభిజాత్యం జై, ఆర్థిక సమస్యలు నై

మార్చ్ 11న తెలంగాణ ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ ప్రవేశ పెట్టిన తొలి పూర్తిస్థాయి బడ్జెట్ మాటల్లో ఆశను కలిగిస్తూనే చేతల్లో నిరాశను మిగిల్చేలా సాగింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే, తమ నిర్దిష్ట సమస్యలకు పరిష్కారం దొరుకుతుందనీ, మొత్తంగా తెలంగాణ సమాజం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందనీ కలలతో, ఆశలతో సకల వర్గాలూ ఉద్యమంలో పాల్గొన్నాయి. ఆ ఉద్యమగతిలో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కోణాలు మూడూ ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్ర పాలకవర్గాలు తెలంగాణ వనరులను కొల్లగొడుతున్నారనీ, వారు తొలగిపోతే తమ ఆర్థిక వనరులను తామే అనుభవించవచ్చుననీ ప్రజలందరూ భావించినందు వల్లనే ఉద్యమానికి విస్తృత భాగస్వామ్యం దొరికింది. ఆ ఆర్థిక ఆకాంక్షలను సాకారం చేసే ఒక సాధనంగా బడ్జెట్ ఆయా వర్గాలకు ఆర్థిక ఫలాలు ఇవ్వడానికి ప్రయత్నించాలి. వారి తక్షణ సమస్యలను పరిష్కరించే, ఉపశమనంగా ఉండే సంక్షేమచర్యలతో పాటు, గతం వల్ల ఘనీభవించిన సమస్యలను తుడిచివేసే, భవిష్యత్తుకు హామీ ఇచ్చే దీర్ఘకాలిక చర్యలను కూడ ప్రకటించాలి. కాని ఈ బడ్జెట్ దృష్టి తాత్కాలిక సంక్షేమ చర్యల మీద ఎక్కువగా, దీర్ఘకాలిక పునాది చర్యల మీద తక్కువగా ఉంది. చేసిన వాగ్దానాలు కూడ నెరవేరుతాయో లేదో చెప్పలేని స్థితి ఉంది. కాగా, ఉద్యమపు రాజకీయ కోణంలో ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ నిర్ణయాధికారంలో తమకు సముచిత భాగస్వామ్యం దక్కలేదని భావించిన వర్గాలు పాల్గొన్నాయి, నాయకత్వం వహించాయి. ఉద్యమక్రమంలో ఈ కోణాన్ని కూడ ప్రజలు సొంతం చేసుకుని ఉండవచ్చు గాని ఈ రాజకీయ కోణం సకల వర్గాల ప్రజలకూ సంబంధించినది కాదు. పాలకవర్గాలలో ఒక బృందానికి సంబంధించినది. కొత్త రాష్ట్రంలో రాజకీయాధికారం వారికే దక్కింది గనుక ఆ రాజకీయ దృక్పథం బడ్జెట్‌లో ప్రతిఫలిస్తున్నది. బడ్జెట్ ద్వారా ఒనగూడే ఆర్థిక, విధానపర, పాలనాపర ప్రయోజనాలు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఆ బృందానికి, ఆ బృందపు ఆశ్రితులకు అందించడానికి బడ్జెట్ ప్రయత్నించింది. ఇక ఉద్యమపు మూడో కోణమైన సాంస్కృతిక కోణం మళ్లీ సకల వర్గాలది. తమ సంస్కృతి వివక్షకు, అవమానానికి గురైందని భావించిన సకల వర్గాల ప్రజలూ ఉద్యమంలో పాల్గొన్నారు. ఆలోచనాపరులు, సాహిత్య, సాంస్కృతిక కార్యకర్తలు ఈ అంశం మీద కేంద్రీకరించడంతో ఉద్యమం విస్తరించింది. ఇవాళ ఆర్థిక, రాజకీయరంగాలలో ప్రజలందరి ఆకాంక్షలను నెరవేర్చడానికి సిద్ధంగాలేని పాలకులు, ఈ సాంస్కృతిక కోణాన్ని మాత్రం పట్టించుకుని, దాని ఆధారం గానే ప్రజల మద్దతునూ, కనీసం మౌన ఆమోదాన్నీ పొందగలుగుతున్నారు. తెలంగాణ సాంస్కృతిక చిహ్నాలను, కళలను, సాహిత్యాన్ని, చరిత్రను, వారసత్వాన్ని, చివరికి దైవభక్తిని, మూఢనమ్మకాలను కూడ వాడుకుని ఆ మద్దతును నిలుపుకుంటున్నారు. బడ్జెట్ కూడ ఆ పని చేసి, మౌలికమైన ఆర్థిక సమస్యల పరిషారాన్ని పక్కనపెట్టి, రాజకీయ, సాంస్కృతిక ఆభిజాత్యంతో నెగ్గుకు రాగలిగింది. ఎప్పుడైనా మౌలిక సమస్యలు వాయిదా పడతాయేమో గాని చెరిగిపోవని చరిత్ర చెప్పిన సత్యం. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్


ఓటమినిచ్చిన విధానాలే ఇంకా ముద్దు

గత పాలనాకాలంలో చరిత్ర అవసరం లేదు అనే సూక్తి చెప్పి చంద్రబాబు నాయుడు ప్రసిద్ధికెక్కారు. ఆయన గానీ, ఆయన నిర్వహణ లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గానీ ఇంకా ఆ మాటకే కట్టుబడున్నారని, గతం నుంచి ఏ గుణపాఠాలూ నేర్చుకోదలచుకోలేదని మార్చ్ 12న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన బడ్జెట్ మరొకసారి రుజువు చేస్తున్నది. ఆ బడ్జెట్ ప్రసంగం లోనూ, విధాన ప్రకటనలలోనూ కేటాయింపులలోనూ 1995–2004 నాటి పాలనా విధానాలు అక్షరం పొల్లు పోకుండా మళ్లీ దర్శనమిస్తున్నాయి. నిజానికి రాష్ట్ర విభజన జరిగిన తర్వాత, కొత్త రాష్ట్రంగా ఒడిదుడుకులతో ప్రయాణం ప్రారంభించిన తర్వాత ఆ పాత రోజులను గుర్తు చేసుకోవలసిన అవసరమే లేదు. కాని బడ్జెట్ ప్రసంగం గత పాలనాకాలంలో సాధించిన విజయాల గురించి ప్రగల్భాలు పలికింది. అన్ని విజయాలు సాధిస్తే ఆ విధానాలు ఓటమికి ఎందుకు దారితీశాయనే కనీస ప్రశ్న కూడ విధానకర్తలకు, ప్రసంగ రచయితలకు తట్టినట్టు లేదు. సరిగ్గా పాతరోజుల్లో లాగనే విజన్ 2020 ప్రశంస, ఈ సారి విజన్ 2029 కలలు, పదేపదే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యం) భజన, అదే పద్ధతిలో ఓడరేవులు, స్మార్ట్ సిటీలు, పారిశ్రామిక కారిడార్లు, ప్రాంతీయ విమానాశ్రయాలు, సింగపూర్, వగైరా వగైరా జపం. ప్రజల అవసరాలు, విభజనానంతర ప్రజా సమస్యలు, తుపాను బీభత్సానికి దెబ్బతిన్న జిల్లాల ప్రజలు, రాజధాని తాకిడికి దెబ్బతిన్న ప్రజలు, రాష్ట్రంలోని పదమూడు జిల్లాలనూ సమతౌల్యంతో పునర్నిర్మించవలసిన వివేకం ఎంతమాత్రం కనబడకుండా రంగుల కలలతో బడ్జెట్ తయారు చేయడం చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికే చెల్లింది. శాశ్వత ప్రాతిపదిక మీద ప్రజా అవసరాలు తీర్చదలచుకోకపోయినా, కనీసం తక్షణ, తాత్కాలిక ఉపశమనంగా ఉపయోగపడే సంక్షేమ చర్యలు ప్రతిపాదించి, అమలు చేయడానికి కూడ ఈ బడ్జెట్ పూనుకోలేదు. పైగా గత సంక్షేమ చర్యలలో కోతలు విధిస్తూ తమ ప్రజావ్యతిరేకతను బహిరంగంగా చాటుకున్నారు. దేశదేశాల పెట్టుబడిదారులను ఆకర్షించడానికి చేసిన ప్రయత్నంలో పావు వంతైనా తమకు అధికారం కట్టబెట్టిన ప్రజల అవసరాలు తీర్చడానికి, సమస్యలు పరిష్కరించడానికి చేయలేదు. మరొకవైపు ఆకర్షణీయంగా కనబడడానికి అవాస్తవికమైన భారీ అంకెలతో గారడీ విద్య ప్రదర్శించారు. ఈ భారీ అంకెలు నిజం చేయడం ఎలాగూ అసాధ్యం గాని, అవి నిజం చేసే ప్రయత్నంలో భాగంగా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ప్రజల మీద పన్నుల భారం మోపక తప్పదు. అలాగే ఆ భారీ అంకెలను కొంతవరకైనా నిజం చేయడం కోసం ఇదివరకే పరిచయం ఉన్న ప్రపంచబ్యాంకు రుణాలకు, షరతులకు లోబడక తప్పదు. అంటే ఈ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ సాధారణ ప్రజానీకం మీద పిపిపి మార్గంలో, సంక్షేమ కేటాయింపుల కోత మార్గంలో, ప్రచ్ఛన్న పన్నుల రూపంలో, పెరగనున్న రుణభారం రూపంలో మూకుమ్మడి దాడి కాబోతున్నది. ఈ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించే ప్రజాచైతన్యాన్ని మేల్కొలపడమే ఇవాళ్టి కర్తవ్యం. వీ

ఇజ్రాయిల్ ఎన్నికలు నెతన్యాహు విజయం

అంచనాలను, ఎన్నికల సర్వేలను, ఎగ్జిట్ పోల్ ఫలితాలను తలక్రిందులు చేస్తూ లికుడ్ పార్టీకి అధినేత, ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ఆ దేశ పార్లమెంటు (క్నెసెట్)కు జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సాధించారు. 120 స్థానాలున్న పార్లమెంటులో లికుడ్ పార్టీకి 29 స్థానాలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీ జియోనిస్టు యూనియన్‌కు 24 స్థానాలు, అరబ్ పార్టీల కూటమికి 14 స్థానాలు, లికుడ్ మాజీమంత్రి మోషె కెహలాన్ నూతన పార్టీ కులూనుకు 10 సీట్లు లభించాయి. ప్రతిపక్ష జియోనిస్టు యూనియన్ నాయకుడు ఇసాక్ హెర్డోగ్ కాబోయే ప్రధాని అని రెండు రోజుల ముందు వరకు ఎన్నికల సర్వేలు తెలిపాయి. దీంతో జనాదరణ తగ్గిన నెతన్యాహుకు గుబులు పుట్టింది. వ్యూహం మార్చి దూకుడు పెంచాడు. తనకు అధికారం అప్పగిస్తే ఆరేళ్ల క్రితం తానే అంగీకరించిన పాలస్తీనా ఏర్పాటు ప్రతిపాదనకు వ్యతిరేకంగా ప్రపంచ పటం నుంచి పాలస్తీనాను తుడిచి పెడతానన్నాడు. తమ స్వాధీనంలోని తూర్పు జెరూసలెంలో యూదులకు వేలాది గృహాలు నిర్మిస్తానన్నాడు. ఇస్లామిక్ దేశాలలో నెలకొన్న తీవ్రవాద బూచిని చూపాడు. తన ప్రధాన ప్రత్యర్థి జియోనిస్టు పార్టీ యూదుల ప్రయోజనాల్ని దెబ్బతీయడానికి పూనుకుందని ఆరోపించాడు. అమెరికన్ కాంగ్రెస్ సమావేశంలో ఇరాన్-అమెరికా మధ్య కుదిరే పౌర అణు ఒప్పందాన్ని తీవ్రంగా దుయ్యబట్టాడు. యుద్ధం ద్వారా తప్ప ఇరాన్‌ను దారికి తీసుకరాలే మన్నాడు. ఒబామా ప్రభుత్వ తీరును విమర్శించినట్టు నటించి ప్రపంచ వ్యాప్త యూదు మతోన్మాదాన్నీ, సంపన్నులనూ రెచ్చగొట్టాడు.


ఈ విధంగా విషాన్నీ, విద్వేషాన్ని నూరిపోసి జాతిని, మతాన్ని విచ్చలవిడిగా వాడి ఎన్నికల్లో నెగ్గాడు. తొమ్మిది సంవత్సరాలుగా అధికారంలో ఉండి ఇప్పుడు నాలుగోసారి అధికారం చేపడుతున్నాడు. ఇజ్రాయిల్ ప్రజలు యూదు, యూదేతర వర్గాలుగా చీలిపోయి ఓట్లేసినట్లు ఓటింగ్ సరళి చెబుతోంది. చివరికి బెయిత్ యెహూది, కులూను, ఇజ్రాయిల్ బెయిటన్, షాస్, యునైటెడ్ టోరా జూడాయిజం పార్టీల ఐక్య సంఘటనతో పార్లమెంటులో 63 స్థానాలు అవుతాయి. రాజ్యాంగం ప్రకారం ఏ పార్టీకి ఆధిక్యత రానప్పుడు కనీసం 3.25 శాతం ఓట్లు తెచ్చుకున్న పార్టీలతో ఐక్య సంఘటన ప్రభుత్వం ఏర్పడవచ్చు. నెతన్యాహుకు మళ్లీ అధికారం దక్కడం పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు మరింత పెరగడానికి దారితీస్తుంది. అవాస్తవికమైన సాకులతో పాలస్తీనా జనావాసాలపై బాంబు దాడులు, అమాయక పాలస్తీనియన్ల ఊచకోత పెరుగుతాయి. తమ భూభాగంపై దురాక్రమణకు వ్యతిరేకంగా పాలస్తీనియన్లు ఆరు దశాబ్దాలుగా సాగిస్తున్న పోరాటం మరింత క్రియాశీలం అవుతుంది. ఇజ్రాయిల్ అధికార పీఠం మీద ఎవరు మారినా పాలస్తీనియన్‌లకు పెద్ద తేడా లేదు. స్వాతంత్ర్య సాధన కొరకు తమ కృషిని మరింత ముమ్మరం చేస్తామని పాలస్తీనా ప్రభుత్వం తెలిపింది. ప్రపంచ ప్రజాభిప్రాయం ఎంత వ్యతిరేకంగా ఉన్నా, సంపద అహంకారంతో, అమెరికా మద్దతుతో పశ్చిమ ఆసియాను అతలాకుతలం చేస్తున్న ఇజ్రాయిల్ పాలకవర్గాలు నెతన్యాహు విజయంతో తాత్కాలికంగా సంతోషపడవచ్చు కాని, వారి పీడన, దురాక్రమణ, అణచివేత వారిని మరింత అసహ్యానికే గురిచేస్తాయి. వీ




భూమి కావాలి అని భూమిలేని నిరుపేద ప్రజానీకం వలసవాద వ్యతిరేక ఉద్యమంలో, జమీందారీ వ్యతిరేక ఉద్యమాలలో ఎలుగెత్తిన నినాదానికి జవాబుగా 1947కు ముందే జాతీయోద్యమ నాయకత్వం భూసంస్కరణల వాగ్దానం ప్రారంభించింది. 1947 భూసంస్కరణల నినాదంలో భూమిని చాపచుట్టి మీద కూర్చున్న భూస్వాములు ఒకవైపు, భూమి కావాలని పోరాడుతున్న ప్రజలు మరోవైపు ఉండగా, ప్రభుత్వం మౌనసాక్షిలా నిలబడింది.

2015 వచ్చేసరికి భూమిలేని నిరుపేదల స్థితిగాని, వారి భూమి కావాలనే కోరిక గాని ఏమీ మారలేదు. కొత్త పరిణామం భూ యజమానులైన చిన్న రైతుల నుంచి భూమి లాక్కొని కార్పొరేట్లకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుంది.

ఈ పరిణామాలను వ్యంగ్యంగా, భూసంస్కరణలు 1947 పద్ధతి, భూసంస్కరణలు 2015 పద్ధతి అని అరుణ్ ఫెరీరా చిత్రించిన కార్టూన్లు



❖ **విధ్వంసక అభివృద్ధి – ఆరు దశాబ్దాల పాలనా విధానాలు** – అనువాదం ఎ. రాజేంద్రబాబు – 254 పేజీలు, 1/8 డెమీ, రు. 170, ప్రతులకు : మలుపు, 2-1-1/5, నల్లకుంట, హైదరాబాద్ – 500 044




❖ **కందుకూరి విస్ఫులింగం** – శ్రీశ్రీ – ప్రచురణ : శ్రీశ్రీ సాహిత్య నిధి – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 30, ప్రతులకు : శ్రీశ్రీ సాహిత్య నిధి, ఎస్‌టి మారుతినగర్, విజయవాడ –520004; email: srisri_sahityanidhi@yahoo.com, ఫోన్ : 9246277375



❖ **ఆమె** – కవిత్వం – చైతన్య ప్రకాశ్ – మట్టి ముద్రణలు – 105 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు : పుట్ట పుస్తక శిబిరం ఆలగడప, మిర్యాలగూడ నల్లగొండ – 508 207; ఫోన్ : 9848015364




❖ **తొలి మహామంత్రిణి – నాయకురాలు నాగమ్మ** (చరిత్ర దాచిన పల్నాటి ప్రామాణిక దర్పణం) – వై.ఎచ్.కె. మోహన్‌రావు – 68 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : వై.ఎచ్.కె. మోహన్‌రావు, పల్నాడు రచయితల సంఘం అధ్యక్షులు, ఇ.నెం. 11-61/3, జె.పి. రోడ్, పిడుగురాళ్ల – 522 413, గుంటూరు జిల్లా




❖ **రసాయనశాస్త్రం – ఓ అద్భుత ప్రపంచం** – డాక్టర్ ఆళ్ళ అప్పారావు – ప్రచురణ – నవచేతన పబ్లికేషన్స్ 110 పేజీలు, 1/8 డెమీ, రు. 70,



❖ **గులేర్ – దెబ్బకు నవ్విసస్తరు** – తెలిదేవర భానుమూర్తి – నవచేతన పబ్లికేషన్స్ – 164 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు : నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జి.ఎస్.ఐ. (పోస్టు) హైదరాబాద్ – 500068; email:navachethanaph@gmail.com;




❖ **ఐడెంటిటీ అండ్ స్ట్రగుల్ – తెలంగాణ అండ్ ఆదివాసిస్** – బి. జనర్ధన్‌రావు మెమోరియల్ ఫౌండేషన్ – ఎంఆర్‌కె పబ్లికేషన్స్ – 235 పేజీలు, 1/8 డెమీ, రు. 250, ప్రతులకు : ఎంఆర్‌కె పబ్లికేషన్స్ 305, లాండ్ మార్క్ రెసిడెన్సీ, 1-2-365/4, దోమలగూడ, హైదరాబాద్ – 500 029; ఫోన్ : 040-66754971



❖ **లీడర్‌షిప్ నిర్మాణం స్వభావం లక్షణాలు** – బి.ఎస్. రాములు – విశాల సాహిత్య అకాడమి – 288 పేజీలు, 1/8 డెమీ, రు. 195, ప్రతులకు : విశాల సాహిత్య అకాడమి, 201, సులేఖ గోల్డెన్ టవర్స్ 2-2-186/53/5, రామకృష్ణనగర్ బాగ్ అంబర్‌పేట్, హైదరాబాద్ – 500 013; ఫోన్ : 08331 966987



❖ **ముఖం లేని మనిషి** – కవితలు – రవికాంత్ – అడుగుజాడ ప్రచురణలు – 76 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు : పద్మాంజలి, 18-25-9/2, కృష్ణనగర్, రాజమండ్రి; రవికాంత్, సూరజ్ హోమ్, స్టేట్ బ్యాంక్ దగ్గర, కోరుకొండ – 533 289; సెల్: 96424 89244, 94948 42274




❖ **కళింగసీమ ప్రజా సమస్యలు పోరాటాలు** 5 – వంశధార ప్రచురణలు – పేజీలు 32, 1/8 డెమీ, రు. 10, ప్రతులకు: ఎ. అన్నపూర్ణ, 13-408/8, జ్యోతినగర్, అరిలోవ, విశాఖపట్నం-530040; సెల్ : 9963789486



❖ **పోరాడి గెలిచిన తెలంగాణ** – వేముల ప్రభాకర్ – విరాట్ పబ్లికేషన్స్ – 93 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: వేముల రోహిత్, అడ్వకేట్, ఫ్లాట్ నెం. 01, జయదర్శిని ఎన్‌క్లేవ్, పోస్టు : దేవర యంజాల్, సికిందరాబాద్– 500 078; ఫోన్ : 9247040332




❖ **రంగులు మాయని సీతాకోక చిలుక** – మమత కవిత్వం – 59 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో; ఈబుక్స్: kinige.com




❖ **జాజిపూల పరిమళం** – షహీదా కథలు – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 392 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు : పాణి, 50-348, ఎల్-19, బి-2, అరోరా నగర్, బి క్యాంప్, కర్నూల్-2, ఆంధ్రప్రదేశ్



❖ **కథల పంట – 3** – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 232 పేజీలు, 1/8 డెమీ, రు. 120, ప్రతులకు : ఎం.ఎ. బాసిత్, నెం. 6-38/1, వివేక్‌నగర్ కాలనీ, కె.సి. కాలనీ, హనుమకొండ, వరంగల్, తెలంగాణ; సెల్: 9441348111



❖ **సామాన్యుల సాహసం** – కథలు – మైనా, నిత్య, సుజాత – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 117 పేజీలు, 1/8 డెమీ, రు. 60



❖ **తీత్వాల్ కుక్క** – మరికొన్ని కథలు – సాదత్ హసన్ మంటో – విప్లవ రచయితల సంఘం ప్రచురణ – 110 పేజీలు, 1/8 డెమీ, రు. 60

పై రెండు ప్రతులకు : పి. వరలక్ష్మి, 5-1820, గీతాశ్రమం వీధి, ప్రొద్దుటూరు, కడప జిల్లా – 516 360; ఆంధ్రప్రదేశ్

అసలే దొంగ లెక్కలు, ఆపై టక్కుటమార విద్యలు

జనవరి 30న భారత ప్రభుత్వం ఒక మహత్తరమైన టక్కుటమార విద్యను ప్రదర్శించింది. అంతకు ముందు రోజు వరకూ భారత ఆర్థికవ్యవస్థలో జాతీయాదాయం పెరుగుదల రేటు 2013-14 సంవత్సరానికి 4.7 శాతం ఉన్నదల్లా, హఠాత్తుగా ఒక ప్రభుత్వ ప్రకటనతో 6.9 శాతంగా పెరిగిపోయింది. అంతకు ముందు సంవత్సరం (2012-13) ఆ దశాబ్దిలోనే అతి తక్కువగా 4.5 శాతం ఉన్నదల్లా 5.1 శాతంగా మారిపోయింది. వీటిలో మొదటి అంకె నడుస్తున్న సంవత్సరానిది కాగా, రెండోది తొమ్మిది నెలల కింద గడిచిపోయిన సంవత్సరానిది. గడిచిన సంవత్సరంలో జాతీయాదాయం పెరుగుదల రేటు అప్పుడే చెప్పిన అంకె కంటె ఎట్లా పెరిగిందని, ఈ సంవత్సరం పెరుగుదల రేటు నిన్నటిదాకా అంచనావేసిన దానికన్న ఎట్లా పెరిగిందని ఎంత అమాయకులకైనా సందేహం వస్తుంది. కాని మహాఘనత వహించిన ప్రభుత్వ అర్థశాస్త్రవేత్తలకు ఆ సందేహమే రాలేదు. నరేంద్ర మోడీ పాలనాకాలంలో ఇబ్బడి ముబ్బడిగా అభివృద్ధి జరుగుతున్నదని చెప్పడమే వారి ఏకైక లక్ష్యం. అందుకోసం అంకెలను ఇష్టారాజ్యంగా వండడమే వారు నేర్చుకున్న విద్య. ఈ సర్కస్ ఫీట్ సాధించడానికి వారు చేసిన పని ప్రాతిపదిక సంవత్సరం (బేస్ ఇయర్) మార్చడం.

జాతీయాదాయం, పెరుగుదల రేటు, ప్రాతిపదిక సంవత్సరం అనే పదజాలమే సాధారణ ప్రజానీకంలో అత్యధికులకు తెలియవు. ఇక ఇటువంటి ఇంద్రజాల మహేంద్రజాల కసరత్తులు కూడ జరుగుతుంటే ఇంకా గందరగోళం పెరుగుతుంది. పాలకులు, పీడకులు, దోపిడీదారులు ఎప్పుడూ తమ ఎత్తులనూ జిత్తులనూ ప్రజలు అర్థం చేసుకోకుండా ఉండడానికి ఒక భిన్నమైన భాషను, పదజాలాన్ని తయారు చేసుకుని వాడుతుంటారు. ప్రజలకు అవసరమైన విషయాలను అర్థం కాకుండా చెప్పే మాయమాటలుగా, విషపూరితమైన విధానాలను ప్రజలచేత ఇష్టంగా మింగించే తీపిపూతలా ఈ పదజాలం ఉపయోగపడుతుంది. భారతదేశంలో పాలకవర్గాలు చాలకాలం సంస్కృత భాషను ఇందుకు వాడుకున్నాయి. ఆ తర్వాత ఆ స్థానాన్ని పర్షియన్, ఇంగ్లిష్ ఆక్రమించాయి. ఇప్పుడు ఆ స్థానంలోకి అర్థశాస్త్ర పరిభాష వచ్చి చేరింది. అర్థశాస్త్ర పరిభాషలో చాల పదాలకు అర్థం లేదు, ఒకటి ఉద్దేశించి మరొకటి చెపుతాయి, వ్యతిరేకమైన అర్థమే అసలు అర్థమైనవీ ఉంటాయి. వాటికి అంతగా తప్పుడు అర్థం లేనప్పుడు కూడ అవి పాలకవర్గాల చేతుల్లో వక్రీకరణకు గురవుతాయి.

ఇక్కడ జాతీయాదాయం, పెరుగుదల రేటు, ప్రాతిపదిక సంవత్సరం అనే మూడు మాటలనూ, ప్రస్తుత కేంద్రప్రభుత్వ పాలనలో అవి సంతరించుకుంటున్న అర్థాలనూ చూద్దాం.

జాతీయాదాయం, లేదా మొత్తం జాతీయోత్పత్తి (గ్రాస్ డొమెస్టిక్ ప్రాడక్ట్ – జిడిపి) అనే భావనను అమెరికన్ కాంగ్రెస్ కు సమర్పించిన ఒక నివేదికలో 1934 లో సైమన్ కుజ్నెట్స్ అనే ఆర్థిక శాస్త్రవేత్త సూచించాడు. బ్రెటన్‌ఉడ్స్ సమావేశం ఈ భావనను అంగీకరించి అన్ని దేశాలకూ తప్పనిసరి చేసింది. ఇవాళ ఒకదేశ ఆర్థిక స్థితిని, ఆరోగ్యాన్ని లెక్కించడానికి ఈ భావననే వాడుతున్నారు. విచిత్రం ఏమంటే, ఈ భావన సంక్షేమానికి, మొత్తం ఆర్థిక వ్యవస్థ పరిస్థితికి సూచిక కాదని స్వయంగా ఈ భావనను సృష్టించిన కుజ్నెట్స్ చెప్పిన మాటను పెట్టుబడిదారీ అర్థ శాస్త్రవేత్తలు విస్మరించారు. ఇవాళ ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, యూరపియన్ యూనియన్, ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఒఇసిడి) వంటి సామ్రాజ్యవాద సంస్థలన్నీ ఈ జాతీయాదాయ భావనను తలకెత్తు కున్నాయి. ఆయాదేశాల సౌభాగ్యానికీ, అభివృద్ధికీ అదే ఏకైక సూచిక అన్నట్టు ప్రవర్తిస్తున్నాయి. స్థూల జాతీయోత్పత్తి అంకెను జనసంఖ్యతో భాగిస్తే వచ్చే అంకె తలసరి ఆదాయం అవుతుంది. ఈ తలసరి ఆదాయం అనే అంకెను ప్రజల జీవనప్రమాణానికి సూచికగా గుర్తించే మాయాజాలాన్ని అంతర్జాతీయ సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. ఒకవైపు ఐక్యరాజ్యసమితి కూడ జాతీయాదాయం, తలసరి ఆదాయం భావనలను ఆమోదిస్తుండగా, ఐక్యరాజ్యసమితి అనుబంధసంస్థ అయిన యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (యుఎన్‌డిపి) మాత్రం జాతీయాదాయం/ తలసరి ఆదాయం అంకెలు ప్రజల జీవన వాస్తవాన్ని ప్రతిఫలించ జాలవనీ, ప్రజల జీవన ప్రమాణాలను గుర్తించడానికి మరికొన్ని సూచికలు కావాలని సన్నాయి నొక్కులు నొక్కుతున్నది.

ఆ భావనను ఎవరు తయారు చేశారు, ఎవరు రుద్దుతున్నారు, ఎవరు ఒప్పుకుంటున్నారు, ఎవరు ఒప్పుకోవడం లేదు అనే విషయాలు కాసేపటికి పక్కన పెడదాం. దాన్ని లెక్కించడానికి పెట్టుబడిదారీ అర్థ శాస్త్రవేత్తలు అనేక సంక్లిష్టమైన సాంకేతిక సూత్రాలు తయారు చేసి దాన్నొక బ్రహ్మ పదార్థంగా మార్చేశారు. 'మొత్తం ఉత్పత్తికి స్థూల కొలత. దేశంలో ఉత్పత్తిలో ఉన్న సమస్త నివాస, వ్యవస్థీకృత సంస్థల స్థూల విలువలను కలపడం ద్వారా అది తేలుతుంది. ఆ విలువలకు పన్నుల మొత్తాన్ని కలపాలి. ఉత్పత్తి విలువలలో కలవని సబ్సిడీలను తీసివేయాలి' అని ఒఇసిడి ఇచ్చిన నిర్వచనాన్ని ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. మామూలు మాటల్లో చెప్పాలంటే సాధారణంగా ఒక జాతి రాజ్యంలో, అంటే ఒక దేశ సరిహద్దుల లోపల, ఒక నిర్ణీత కాలంలో ఉత్పత్తి అయిన మొత్తం సరుకుల, సేవల విలువను జాతీయాదాయం, స్థూల జాతీయోత్పత్తి అంటారు. సాధారణంగా దీన్ని సంవత్సరానికి లెక్కకడతారు. ఇటీవలి కాలంలో త్రైమాసిక అంచనాలు కూడ లెక్కకడుతున్నారు. స్థూల జాతీయోత్పత్తిని లెక్కించడానికి ఉత్పత్తి దృక్కోణం, ఆదాయ దృక్కోణం, వ్యయ దృక్కోణం అనే మూడు పద్ధతులను కూడ అర్థ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. మొత్తం ఉత్పత్తిని బట్టి, అవసరమైన తరుగుదలలు, మినహాయింపులు తీసివేసి లెక్కించడం ఉత్పత్తి దృక్కోణం. ఒక సరుకు తయారీలో, లేదా సేవలో మధ్యంతరంగా ఎన్నో సరుకులు, సేవలు ఇమిడి ఉంటాయి గనుక అన్ని సరుకులనూ

సేవలనూ లెక్కగడితే కొన్ని ఒకటి కంటె ఎక్కువసార్లు లెక్కలోకి వచ్చే ప్రమాదం ఉంటుంది. తద్వారా జాతీయాదాయం అని చెప్పేది నిజంగా జాతీయాదాయం కాకుండా పోతుంది. అందువల్ల మధ్యంతర స్థాయిలో వినియోగించే సరుకుల, సేవల విలువలను మొత్తం విలువ నుంచి తీసివేస్తారు. ఆర్థిక వ్యవస్థలో ఉన్న ఉత్పత్తి కారకాలన్నిటికీ వస్తున్న ఆదాయాలన్నిటినీ కలిపితే జాతీయోత్పత్తి విలువ తేలిపోతుందనేది ఆదాయ దృక్కోణం. జరిగిన ఉత్పత్తి అంతా వినియోగం కోసమే కనుక దేశంలో ఖర్చు అయ్యే ధనాన్నంతా లెక్కవేస్తే కూడ ఉత్పత్తి లెక్క తేలుతుందని భావించేది వ్యయ దృక్కోణం. సైద్ధాంతికంగా చూస్తే ఈ మూడు పద్ధతులలోనూ ఒకే మొత్తం రావాలి, వస్తుంది. మూడు పద్ధతులలోనూ లెక్కకట్టడానికి భిన్నమైన సూత్రాలున్నాయి.

ఈ భావనను ప్రతిపాదించిన కుజ్నెట్స్ దానితోపాటే జరగగల వక్రీకరణల గురించీ, దురుపయోగాల గురించీ హెచ్చరించాడు. ఇది పరిమాణాన్నే చెప్పగలదు గాని గుణాన్ని చెప్పజాలదని కూడ అన్నాడు. ఇది ప్రధానంగా సగటు భావన గనుక తీవ్రమైన అసమానతలున్న సమాజంలో ఈ సగటు అంకె అబద్ధంగా, మాయగా మిగలక తప్పదు. ఒక సమాజంలో వంద మంది ఉన్నారనుకుంటే, వారిలో వంద కోట్ల ఆదాయం ఉన్నవారు ఒకరు, పదివేల రూపాయల ఆదాయం ఉన్నవారు తొంబైతొమ్మిది మంది ఉన్నారనుకుంటే, ఆ సమూహపు స్థూల ఆదాయం వంద కోట్ల తొమ్మిది లక్షల తొంబై వేలు అవుతుంది. తలసరి ఆదాయం ఒక కోటీ తొమ్మిది వేల తొమ్మిది వందలు అవుతుంది. అంటె పదివేల ఆదాయం సంపాదిస్తున్నవారు కాగితాల మీద మాత్రం హఠాత్తుగా ఒక కోటి ఆదాయపరులు అయిపోతారు. ఇంతకంటె హాస్యాస్పదం మరొకటి ఉండదు.

ఆర్థిక పరిభాషా మాయాజాలంలో జాతీయాదాయం, తలసరి ఆదాయం అనే భావనలే గందరగోళాన్ని సృష్టించేవైతే, వాటిని మించిన తప్పుడు భావన పెరుగుదల రేటు. ఈ భావనను పాలకవర్గాలు ఎంత పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాయంటే, దాని అర్థం ఏమిటో తెలియ కుండానే అసంఖ్యాక పత్రికాపాఠకులు ఆ మాయలో పడిపోతున్నారు. పెరుగుదల రేటు అంటే ఒక వస్తువు, స్థితి, అంకె మారుతూ ఉన్నప్పుడు ఆ మార్పు వేగం ఏమిటి అని లెక్కకట్టడం. జాతీయాదాయం, దానితోపాటు తలసరి ఆదాయం ఏటేటా మారుతుంది గనుక ఆ మార్పు ఎంత వేగంగా ఉంది అనే లెక్క వృద్ధిరేటు ద్వారా తెలుస్తుంది. ఈ విలువ పెరుగుదలలో కొంత ద్రవ్యోల్బణం ద్వారా కూడ రావచ్చు గనుక ఆ తరుగుదలను కూడ లెక్కిస్తారు. గత సంవత్సరం 100 గా ఉన్నది ఈ సంవత్సరం 104 గా మారిందంటే 4 శాతం లేదా, ద్రవ్యోల్బణ తరుగుదలను బట్టి కొంత తక్కువ వృద్ధి రేటు ఉన్నదన్నమాట.

ఈ వృద్ధి రేటు ఎక్కువగా ఉంటే దేశం ప్రగతి పథాన పురోగమిస్తున్నదనడానికి సూచిక అని, వృద్ధి రేటు తక్కువగా ఉంటే దాన్ని పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిర్దేశించడం ద్వారా అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు అన్ని దేశాల పాలకవర్గాలనూ ప్రభుత్వాలనూ మాయలోకి నెట్టాయి. ఇప్పుడు వృద్ధిరేటును పెంచుకోవడం మీద, లేదా పెరిగినట్టు దొంగలెక్కలైనా చూపడం మీద కేంద్రీకరించడమే ప్రతి ప్రభుత్వ కర్తవ్యం అయిపోయింది.

భారతదేశంలో స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల రేటు చాల తక్కువగా 3.5 శాతంగా ఉన్నదని, దానికి నిందార్థకంగా హిందూ పెరుగుదల రేటు అని పేరు పెట్టి, దాన్ని పెంచాలని పెట్టుబడిదారీ అర్థశాస్త్రవేత్తలు ఎప్పటినుంచో వాదిస్తూ వస్తున్నారు. అది పెంచాలంటే జాతీయోత్పత్తి పెంచాలి. ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాల తర్వాత దేశంలోకి విదేశీ పెట్టుబడుల మీద ఆంక్షలు తొలిగాయి గనుక, ఉన్నత వర్గానికైనా సంపద ప్రవహించింది గనుక పెరుగుదల రేటు పెరగడం మొదలయింది. దేశంలో ఏడాదికేడాదికీ శతకోటీశ్వరుల సంఖ్య పెరిగినట్టుగానే వృద్ధిరేటు పెరుగుతూ వస్తున్నది. కాని అది ఆర్థిక వ్యవస్థ నిజమైన బలాన్ని కాక వాపును మాత్రమే సూచించింది గనుక వృద్ధి రేటులో ఒడిదొడుకులు మొదలయ్యాయి. అది వెనుకకు తగ్గడం లేదని, ఇంకా ఇంకా పైకి వెళ్తున్నదని చెప్పడానికి కేంద్ర పభుత్వ గణాంక మంత్రిత్వ శాఖ, పాలకవర్గాలు ఒక కొత్త ఎత్తుగడ పన్నాయి.

ఎప్పుడైనా వృద్ధిరేటు అనేది పోలిక అంకె గనుక అది చెప్పడానికి రెండు సమయాలు ఉండాలి. ఒక సమయంలో ఇంత ఉన్నది, మరొక సమయానికి ఇంత అయింది అన్నప్పుడే పెరుగుదల రేటు తేలుతుంది. వీటిలో మొదటి సమయాన్ని ప్రాతిపదిక సంవత్సరం అని, ఆ సంవత్సరం 100 ఉన్నదనుకుంటారు. రెండో నిర్ణీత సమయానికి 104 అయిందా, 106 అయిందా అనేదాన్ని బట్టి వృద్ధి రేటు తేలుతుంది. భారతదేశంలో జనగణన ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి 1951, 61, 71 అలా జరుగుతుంది గనుక జాతీయాదాయ ప్రాతిపదిక సంవత్సరాన్ని కూడ పది సంవత్సరాలకొకసారి నిర్ణయించాలని తొలుత అనుకున్నారు. అందువల్ల మొదట 1948-49, 1960-61, 1970-71, 1980-81 ప్రాతిపదిక సంవత్సరాలుగా ఉన్నాయి. ఆ తర్వాత ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలలో అంకెల గారడీయే ప్రధానాంశం గనుక ప్రాతిపదిక సంవత్సరాన్ని ఇష్టారాజ్యంగా మార్చడం ప్రారంభించారు. పెరుగుదల రేటు ఎక్కువగా ఉన్నట్టు చూపడానికి ఏ సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటే వీలవుతుందో దాన్నే తీసుకోవడం ప్రారంభించారు. అలా ఆతర్వాత 1993-94, 1999-2000, 2004-05 ప్రాతిపదిక సంవత్సరాలు అయ్యాయి. అంటే అంతకుముందు క్రమబద్ధంగా పది సంవత్సరాలుగా ఉన్నది, ఆ తర్వాత ఏ పద్ధతీ లేకుండా, ఒకసారి 13, మరొకసారి 6, మరొకసారి 5 సంవత్సరాల వ్యవధిగా మారింది. ఇప్పుడు 2004-05 స్థానంలో ఏడు సంవత్సరాల వ్యవధితో, 2011-12 ను ప్రాతిపదిక సంవత్సరంగా చూపడం ద్వారా హఠాత్తుగా పెరుగుదల రేటు రాత్రికి రాత్రి 4.7 శాతం నుంచి 6.9 శాతానికి మారింది.

ఆ తర్వాత అదేరకంగా భవిష్యత్తు అంచనాలు వేసి 2016 నాటికి 8.1 శాతం నుంచి 8.5 శాతం పెరుగుదల రేటు ఉంటుందనీ, అంటే 6.3 శాతం పెరుగుదల రేటును అంచనా వేస్తున్న చైనా కంటే భారత్ చాల ముందుకు పోతుందనీ ప్రభుత్వం ప్రకటించింది. స్వయంగా కేంద్రప్రభుత్వ ప్రధానఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ కూడ ఇవి విచిత్రమైన అంకెలు అన్నాడు గాని, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, హాంకాంగ్ అండ్ షాంఘై బ్యాంకింగ్ కార్పొరేషన్ వంటి అంతర్జాతీయ ద్రవ్యసంస్థలన్నీ తాన తందాన అని భారత ప్రభుత్వ ఘనతను పొగిడాయి.

ఇంత మోసపూరితమైన, తప్పుడు లెక్కల, ప్రజా వ్యతిరేకమైన, ప్రజాజీవితాలతో ఏ సంబంధమూ లేని ఆర్థిక వ్యవస్థా నిర్వాహకుల చేతిలో ఈ దేశ పాలన ఉంది. వీ

కార్పొరేట్ల సేవలో కేంద్ర బడ్జెట్

***బడ్జెట్ కేటాయింపుల్లో అభివృద్ధి పేరుతో సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు అప్రధానమై, కార్పొరేట్ సంస్థల సేవే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అంటున్నారు* ఎ. నర్సింహారెడ్డి**

యుపిఎ అయినా, ఎన్‌డిఎ అయినా అక్షరాల్లో, అంకెల్లో, వాగ్దానాల్లో మార్పులు తప్ప వాటి ఆర్థిక వ్యవస్థ లక్ష్యం, ధ్యేయం ఒక్కటేనని కేంద్ర బడ్జెట్ స్పష్టపరిచింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ 2015-16కి ప్రవేశపెట్టిన బడ్జెట్ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ పారిశ్రామిక వర్గాలకు పెద్దపీట వేసింది. రైల్వే బడ్జెట్‌లో వడ్డించిన అదనపు రవాణా చార్జీల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగనున్న నేపథ్యంలో మధ్య తరగతి నికరాదాయ వర్గాలకు పన్ను విధింపు ఆదాయ పరిమితిని పెంచుతారని చూసిన ఎదురు చూపులు అడియాసలయ్యాయి. ఆదాయపు పన్ను మినహాయింపు సెక్షన్లు కొన్నింటిని కొద్దిగా సవరించి బడ్జెట్ కంటితుడుపుతో సరిపుచ్చింది. పేద వర్గాలకు చెప్పుకోదగిన మేలంటూ ఏదీ లేదు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపు రు. 5 వేల కోట్లు పెంచడం ఒక్కటే ఒకింత మేలు. ఆహారం, ఎరువులు, పెట్రోలియంపై సబ్సిడీలను పది శాతంపైగా తగ్గించి కోట్లాది రూపాయల కోత పెట్టారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజునే పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రు. 3 కు మించి పెరగడం గమనార్హం.

ఇది 'పెట్టుబడుల బడ్జెట్ 'అన్నారు ప్రధాని మోడీ. నిజమే, అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగమంతా పెట్టుబడులు, వృద్ధి, ద్రవ్య నియంత్రణల చుట్టే తిరిగింది. అయితే ఉపాధి కల్పనకోసం, ప్రభుత్వ ఆదాయ వనరులు పెంచుకోవడం కోసం, సంపద పెరుగుదల కోసం పెట్టుబడులను స్వాగతించడం ఒక ఎత్తు. కాని పెట్టుబడులపై ఎటువంటి ఆంక్షలు లేకుండా, పెట్టుబడులకు లాభాలు గ్యారంటీ చేసేలా, అది పర్యావరణాన్ని నాశనం చేసైనా, ఉపాధి రహిత అభివృద్ధి అయినా, కార్మిక హక్కులను హరించైనా, మన ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసైనా లాభాలు దండుకోవచ్చునన్నట్లు పెట్టుబడుల జపం సాగడం అత్యంత విషాదం. ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వ నియంత్రణ వ్యవస్థను రద్దు చేసే దిశగా పెట్టుబడి సానుకూల చట్టం తీసుకు వస్తామన్నారు. ఇక్కడి పరిశ్రమల్లో, వ్యాపారాల్లో స్థిరమైన పెట్టుబడి పెట్టకుండా స్టాక్ మార్కెట్‌లో స్పెక్యూలేషన్ పెట్టుబడి పెట్టే విదేశీ పోర్ట్ ఫోలియో (ఎఫ్ఐఐ) పెట్టుబడుల మీద ఆంక్షలను రద్దు చేస్తామని, దానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ)కి మధ్యనున్న తేడాను రద్దు చేస్తామని జైట్లీ ప్రకటించారు. ఈ విధానాన్ని అనుసరించిన ఆసియా టైగర్స్‌గా పేరున్న ఆగ్నేయాసియా దేశాల ఆర్థిక వ్యవస్థలు 1990వ దశకంలో కుప్పకూలాయి. విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు మరిన్ని రాయితీలిస్తేనే వారు వచ్చి పెట్టుబడులు పెట్టి దేశాన్ని అభివృద్ధి చేస్తారని, దాని వల్ల ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయనే తర్కం దీని వెనుక ఉన్నది. నిజానికి కార్పొరేట్లకిచ్చే లక్షలాది కోట్ల అనుచిత రాయితీలను రద్దు చేసి ఆ నిధులను ప్రజా సంక్షేమానికి, మౌలిక వసతులు, వ్యవసాయరంగ అభివృద్ధికి ఖర్చుపెడితే ఆర్థిక ప్రగతి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

మేక్ ఇన్ ఇండియా పేరుతో నియంత్రణలన్నీ ఎత్తివేస్తున్నామన్నారు. కార్మిక చట్టాలు యజమానులకనుకూలంగా తిరగదోడడం ఇప్పటికే మొదలైంది. ప్రభుత్వరంగ పరిశ్రమల పెట్టుబడుల ఉపసంహరణ మరింత వేగంగా అమలు జరపాలన్న లక్ష్యం ప్రకటించారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న ఓడరేవులను కార్పొరేషన్లుగా మార్చాలని నిర్ణయించారు.

అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రవేశ పెట్టడంతోనే సెన్సెక్స్ (స్టాక్ మార్కెట్ సూచి) అమాంతంగా 141 పాయింట్లు పెరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే సంపన్నులకు, లాభార్జనాపరులకు, పారిశ్రామిక వ్యాపార వర్గాలకు తక్కువ పన్నులు విధిస్తూ, సరుకులూ, సేవలూ కొనుక్కునే సాధారణ ప్రజలకు, నెలసరి ఆదాయం తెచ్చుకునే మధ్యతరగతికి ఎక్కువ పన్నులు అనేదే ఈ బడ్జెట్ సారాంశంగా కనబడుతున్నది.

2015-16 సాధారణ బడ్జెట్ గత బడ్జెట్ రు. 16,81,158 కోట్ల కంటె రు. 96,319 కోట్లు అధికంగా అంటే రు. 17,77,447 కోట్లుగా నమోదు చేసుకున్నది. అయితే ఇందులో సింహభాగం ప్రణాళికేతర వ్యయంగా ఉండి, ప్రణాళికా వ్యయం కేవలం రు. 4,65,000 కోట్లుగా సూచించబడింది. అంటే గత సంవత్సరపు ప్రణాళికా వ్యయం కంటె తక్కువగా కేటాయించబడిందన్న మాట. వచ్చే మూడేళ్లలో ద్రవ్యలోటుని మూడు శాతానికి తగ్గించగలమన్న ధీమా వ్యక్తం చేసినా, అది ఏ మార్గం

కేంద్ర బడ్జెట్ స్వరూపం (రు. కోట్లలో) 2015-16

	2013-14 వాస్తవ గణాంకాలు	2014-15 బడ్జెట్ అంచనాలు	2014-15 సవరించిన అంచనాలు	2015-16 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ వసూళ్లు	10,14,724	11,89,763	11,26,294	11,41,575
మూలధన వసూళ్లు	5,44,723	6,05,129	5,54,864	6,35,902
మొత్తం వసూళ్లు	15,59,447	17,94,892	16,81,158	17,77,477
ప్రణాళికేతర వ్యయం	11,06,120	12,19,892	12,13,224	13,12,200
ప్రణాళికా వ్యయం	4,53,327	5,75,000	4,67,934	4,65,277
మొత్తం వ్యయం	15,59,447	17,94,892	16,81,158	17,77,477
రెవెన్యూ లోటు	3,57,048	3,78,348	3,62,486	3,94,472
ద్రవ్య లోటు	5,02,858	5,31,177	5,12,628	5,55,649
ప్రాథమిక లోటు	1,28,604	1,04,166	1,01,274	99,504

ద్వారా సాధ్యమో చెప్పలేదు. నిశితంగా పరిశీలిస్తే గత బడ్జెట్‌లోనే ప్రకటించిన విధంగా ప్రభుత్వరంగ ఆస్తుల వాటాల విక్రయం ఒక మార్గం అయి ఉండవచ్చు. అందులో మొట్టమొదటి లక్ష్యం బహుశా ప్రభుత్వ బ్యాంకులే అయి ఉండవచ్చు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ఆగమన ప్రవాహం ఉత్తేజపరుస్తుందన్న ధీమా బహుశా మరొకటి అయి ఉండవచ్చు.

మోడీ సర్కార్ మానస పుత్రికలైన 'మేక్ ఇన్ ఇండియా', 'స్వచ్ఛ భారత్', 'డిజిటల్ ఇండియా' కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. మన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ పెట్టుబడులు మన మౌలిక సదుపాయాలకు పెంచాల్సిన అవసరం ఉంది అన్నారు. ఇందుకోసం 'ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం' (పిపిపి) విధానాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై రు.70,000 కోట్లు అధికంగా ఖర్చు చేయబోతున్నట్లు ప్రకటించారు. మౌలిక ప్రాజెక్టులకు అవసరమైన నిధుల సమీకరణ కోసం 20 వేల కోట్ల రూపాయలతో జాతీయ పెట్టుబడులు, మౌలిక సదుపాయాల నిధి (నిఫ్) పేరుతో ప్రత్యేక ట్రస్టు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రైల్వే, రహదార్లు, నీటిపారుదల వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం 'పన్నురహిత రుణ పత్రాలు' జారీ చేయడాన్ని అనుమతించే విషయం పరిశీలిస్తున్నట్టుగా కూడా జైట్లీ వెల్లడించారు. కొత్తగా మరో ఐదు అల్ట్రామెగా థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఒక్కోటి 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వీటి నిర్మాణానికి దాదాపు ఒక లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు అవసరమవుతాయని అంచనా.

వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థికాభివృద్ధి 8-8.5 శాతం మధ్య ఉంటుందని అరుణ్ జైట్లీ ఊదరగొట్టేశారు. తాము అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో తీసుకున్న చర్యలతో మరో నెలలో ముగియనున్న 2014-15లో జిడిపి వృద్ధి 7.5 శాతానికి చేరుతుందన్న అంచనాల్ని కూడా ప్రకటించారు. మరి దానికి కావాల్సిన కేటాయింపులేమైనా ఈ బడ్జెట్లో ఉన్నాయా అంటే అసలే లేవు. మరెలా!? అభివృద్ధి గురించి అంకెల గారడీతో మాయ చేస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దిగజారుతుందని ప్రపంచబ్యాంక్ ఘోషిస్తుందని అరుణ్ జైట్లే చెప్పారు. గత సంవత్సరం మన ఎగుమతులు 11 శాతం తగ్గాయి. వ్యవసాయ భూమి తగ్గింది. తయారీరంగం క్షీణించింది. నిరుద్యోగం 10 శాతం దాటింది. ఏటా కోటి 20 లక్షల మంది యువత నూతనంగా ఉపాధి కోసం వెతుకులాటలో చేరుతున్నారు. ఈ నేపథ్యంలో 8-8.5 శాతం వృద్ధిరేటు ఎట్లా సాధ్యం అవుతుంది? దేశ ప్రజల కొనుగోలు శక్తి పెంచే చర్యలేవి బడ్జెట్‌లో లేవు. పైగా మరింత తగ్గే సూచనలున్నాయి. తయారీరంగం ముందుకెలా సాగుతుంది?

వాస్తవానికి ఏ దేశ వృద్ధికైనా తోడ్పడేది ప్రణాళికా వ్యయమే. అంటే ఆస్తుల్ని సృష్టించే వ్యయమన్న మాట. ప్రణాళికేతర వ్యయమంటే జీతాల వంటి అంశాలపై పెట్టే ఖర్చే తప్ప ఆస్తులేమీ సృష్టించబడవు. అలాంటిది 2014-15 బడ్జెట్లో ప్రణాళికా వ్యయం కింద కేటాయించిన మొత్తం ఏకంగా రు.5.75 లక్షల కోట్లు. సవరించిన అంచనాల ప్రకారం రు. 4,67,934 కోట్లు. మరి వృద్ధి సాధించాలంటే 2015-16 బడ్జెట్లో ఈ కేటాయింపులెలా ఉండాలి? వృద్ధిరేటును ఎనిమిది శాతానికి చేర్చాలను కున్నపుడు ఈ కేటాయింపులు పెరుగాలి కదా. కానీ వాస్తవంగా కేటాయించింది మాత్రం రు. 4.65 లక్షల కోట్లు. మరి తాజా అంచనాల ను కూడా సవరించాల్సి వస్తే ఏమవుతుంది? కేంద్ర ప్రభుత్వానికి వచ్చే పన్ను ఆదాయంలో సుమారు సగం వడ్డీ చెల్లింపులకే పోతుంది, తద్వారా పెరుగుతూ వస్తున్న లోటుని భర్తీ చేయడానికి ఇంకా అప్పులు చేయడం లేదా ఉన్న ఆస్తులు అమ్ముకోవడం ఒక అలవాటుగా మారింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రు. 69,500 కోట్లు సమీకరించాలని నిర్ణయించారు.

కార్పొరేట్లకు ప్రోత్సాహం - వేతన జీవులకు రిక్త హస్తం

పారిశ్రామిక, వాణిజ్య కార్పొరేషన్లు చెల్లించే కార్పొరేట్ పన్ను ప్రస్తుతం ఉన్న 30 శాతం చాల ఎక్కువ ఉండడం వల్ల 23 శాతం కార్పొరేట్ సంస్థలు పన్ను చెల్లించడం లేదని, అందుకు పరిష్కారంగా కార్పొరేట్ పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించబోతున్నానని జైట్లీ చిట్కా చెప్పారు. నిజానికి అమెరికా, పశ్చిమ యూరోపియన్ దేశాలు, 30 శాతం కంటె ఎక్కువే కార్పొరేట్ పన్ను విధిస్తున్నాయి. మన దేశంలో కార్పొరేట్ పన్ను ఇలా తగ్గించినందువల్ల కార్పొరేట్ సంస్థలకు కనీసం రు. 25,000 కోట్లు మిగులుతుంది. ఆర్థిక అసమానతలు పెరుగుతున్న సమాజంలో సంపదపై పన్ను విధించాలని '21వ శతాబ్దంలో పెట్టుబడి' (కాపిటల్ ఇన్ ద ట్వెంటిఫస్ట్ సెంచరీ) గ్రంథ రచయిత థామస్ పికెట్టి పేర్కొన్నారు. రాబోయే కాలంలో ప్రపంచ ద్రవ్య సంస్థల నిర్వాహకం వలన ఆర్థిక అసమానతలు బాగా పెరిగి ప్రజాస్వామిక వ్యవస్థలు బలహీనమయ్యే ప్రమాదమున్నందున, అందుకు పరిష్కారంగా ధనికవర్గ సంపదపై పన్ను విధించాలని నొక్కి చెప్పాడు.

అలాగే సంపద మీద పన్ను ప్రస్తుతం రు. 1008 కోట్లు మాత్రమే వస్తున్నదని, అది వసూలు చేయడానికే అంతకన్న ఎక్కువ ఖర్చు అవుతుందని సాకు చూపి కులీన వర్గానికి సంపద పన్ను కూడ రద్దు చేస్తున్నానని ప్రకటించారు. దాని స్థానంలో కొనుగోళ్ల మీద రెండు శాతం సర్ చార్జి విధిస్తానన్నారు. దీంతో రు. 9000 కోట్లు వస్తుంది. అలాగే ప్రత్యక్ష పన్నులను రు. 8000 కోట్లు తగ్గించి, పరోక్ష పన్నులను రు. 23,000 కోట్లు పెంచుతున్నానని కూడ ప్రకటించారు. విదేశీ పెట్టుబడిదారులపై విధించ తలపెట్టిన 'గార్' (జనరల్ యాంటీ ఎవాయిడెన్స్ రూల్స్) ను రెండేళ్ల పాటు వాయిదా వేయడం దేశ, విదేశీ, బడా పారిశ్రామిక వేత్తలను అమితానందంలో ముంచెత్తింది. దీంతో పన్ను ఎగవేతదారులకు రక్షణ కల్పించి పేదలపై భారం వేసినట్లయింది.

వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) పేరుతో కేంద్రీకృత పన్నుల వ్యవస్థ అమలుకు నిర్దిష్ట కాలం ఏప్రిల్ 2016 అని ప్రకటించారు. ఇవన్నీ బడా బాబులకు మేలు చేసే చర్యలే. ఒక పక్క కార్పొరేటు సంస్థలు కట్టాల్సిన ప్రత్యక్ష పన్నులు తగ్గిస్తూ మరోపక్క జనసామాన్యం భరించాల్సిన పరోక్ష పన్నులు (ఉదాహరణకు సర్వీస్ టాక్స్ 12.36 శాతం నుంచి 14 శాతానికి పెంపు) పెంచుకుంటూ పోవడం కచ్చితంగా టాక్సేషన్ విధానం తిరోగమ ముఖం పట్టడమే. 2 శాతం సర్వీసు పన్ను పెంచడంతో రు. 41,600 కోట్లు అదనంగా పిండుతున్నారు. ఇక్కడే ఈ ప్రభుత్వం విధేయత ఎవరి వైపున ఉందో అర్థమవుతోంది. తగ్గించిన కార్పొరేట్ పన్ను అదనపు పెట్టుబడి రూపంలో ఆర్థిక వ్యవస్థలోకి రావడమో లేదా అదనపు డివిడెండ్ల రూపంలో బడా పెట్టుబడిదారుల జేబుల్లోకి చేరడమో జరుగుతుంది. ఈ రెండింటిలో ఏది జరిగినా లాభపడేది సంపన్నవర్గాలే నన్నది జగమెరిగిన సత్యం. జన బాహుళ్యం సంక్షేమ పథకాల సబ్సిడీలకు కేటాయింపులు 8.5 శాతం తగ్గిస్తూ కార్పొరేటు వర్గాలకు పన్ను రాయితీ ఇవ్వడం చూస్తుంటే కార్పొరేట్ వర్గాలకు మరిన్ని లాభాలు దండుకునే రోజులు వచ్చేశాయనిపిస్తుంది.

సంక్షేమానికి కోతలు పెట్టిన జైట్లీ బడ్జెట్‌లో రక్షణ, పోలీసు శాఖలకు మాత్రం భారీగా నిధులు కేటాయించారు. 2014-15లో సవరించిన అంచనా రు. 2,22,370 కోట్లలో రు. 2,46,727 కోట్లు అంటే 10.95 శాతం మేర రక్షణ రంగానికి నిధులు పెరిగాయి. ఇందులో రు. 94 వేల కోట్లు ఆయుధాల కొనుగోళ్లకు వెచ్చించనున్నారు. ఈ నిధులు అమెరికా, ఫ్రాన్స్ దేశాలకు చెందిన ఆయుధ వ్యాపారపు బహుళజాతి సంస్థల బొక్కసాలకు చేరేవే. ఫ్రెంచ్ ఆయుధ వ్యాపార సంస్థ రఫేల్ యుద్ధ విమానాలను భారత్‌కు అమ్మి సొమ్ము చేసుకోవాలని వెంపర్లాడుతుంది. ఇప్పటికే మన స్వదేశీ తేజస్ విమానాలకు, హెలికాప్టర్‌లకు ఇంజన్లు సరఫరా చేస్తున్న రోల్స్ రాయస్, అమెరికా, ఇజ్రాయిల్ ఆయుధ ఉత్పత్తిదారులు మన బడ్జెట్‌ను సొంతం చేసుకోవడానికి తంటాలు పడుతున్నారు. అలాగే కేంద్ర హోంశాఖకు గత ఏడాది రు. 56,372 కోట్లు కేటాయించగా 2015-16 బడ్జెట్‌లో రు. 62,124 కోట్లు కేటాయించారు. దీనిలో కశ్మీరీ పండిట్ల పునరావాసం కోసం రు. 580 కోట్లు, నక్సల్ వ్యతిరేక ఆపరేషన్లలో పాల్గొనే పారా మిలటరీ సిఆర్‌సిఎఫ్ కోసం రు. 14,089 కోట్లు, బిఎస్ఎఫ్‌కు రు. 12,517 కోట్లు, ఐటిజిపికి రు. 3736 కోట్లు, సిఐఎస్ఎఫ్‌కు రు. 5196 కోట్లు కేటాయించారు.

సంక్షేమానికి తగ్గిన కేటాయింపులు

కేంద్రం వసూలు చేసిన పన్నుల నుండి రాష్ట్రాలకు ఇచ్చే వాటా 32 శాతం నుండి 42 శాతానికి పెరిగిందన్న సాకుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా 8 ప్రధాన పథకాల నుంచి రాష్ట్రాలకిచ్చే సహాయం పూర్తిగా ఉపసంహరించుకుంది. మరో 24 పథకాలను కేటాయించే నిధుల్లో తన వాటాను తగ్గించుకోనుంది. మరోవైపు సంక్షేమ రంగాలకు గత సంవత్సరం కంటె నిధులు తగ్గించింది. విద్యా రంగానికి రు. 68,960 కోట్లు, ఉపాధిహామీ పథకానికి రు. 34,699 కోట్లు, మహిళల సంక్షేమానికి 79,258 కోట్లు. బడ్జెట్‌లో ఆహార భద్రత చట్టం ఊసేలేదు. నిర్భయ నిధిని రెండు వేల కోట్లకు పెంచారు. మహిళ శిశు సంక్షేమానికి రు. 10,513 కోట్లు, ఆరోగ్యానికి రు. 33,152 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రు. 79,526 కోట్లు, ఎస్‌సి-ఎస్‌టి వ్యాపారుల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు రు. 20 వేలకోట్ల మూలధనంతో ముద్రా బ్యాంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ యువతలో వృత్తి నైపుణ్యాలు పెంచేందుకు, ఉపకార వేతనాలు అందించేందుకు రు. 1500 కోట్లతో 'దీన దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన'ను ప్రారంభించింది. రక్షణ రంగానికి, హోంశాఖకు కేటాయింపులు పెంచుతూ పోవడం, వినియోగ సంస్కృతిని పెంచి పోషించేలా పరోక్ష పన్నుల విధానాల రూపకల్పన చేయడం వంటి మరెన్నో విషయాలు పాత ప్రభుత్వ విధానాల కొనసాగింపేనన్నది స్పష్టం.

మనదేశంలో ఐదేళ్లలోపు బాలబాలికల్లో సగం మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని పలు నివేదికలు వెల్లడించిన సందర్భంలోనే పిల్లలకు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించడానికి ఉద్దేశించిన సమగ్ర శిశు అభివృద్ధి పథకానికి (ఐసిడిఎస్) నిధుల కేటాయింపులో సగం కోత విధించారు. గత ఏడాది రు. 16,000 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రు. 8,000 కోట్లకు తగ్గించారు. ఈ మొత్తం రక్షణ రంగంలో పెరిగిన నిధుల కన్నా తక్కువ. ఫలితంగా పేద మహిళలకు, పిల్లలకు అందే ఆరోగ్య నిధులు తగ్గి తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది. తల్లి తీసుకునే ఆహారాన్ని బట్టే పిల్లల ఎదుగుదల ఉంటుంది. ముఖ్యంగా మెదడు ఎదుగుదలలో సగం తల్లి గర్భంలోనే జరుగుతుందని, మిగిలిన సగభాగం మూడేళ్ల వయసులోపు జరుగుతుందని వైద్య నిపుణులు చెపుతున్నారు. ఇప్పుడు ఐసిడిఎస్ బడ్జెట్‌ను సగానికి సగం తగ్గించడంవల్ల కొన్ని కోట్ల మంది శిశువులపై, మహిళలపై ఆ ప్రభావం పడక తప్పదనేది కఠోర సత్యం.

పెన్షన్, ఆరోగ్య భీమా రంగాలలో కాంట్రిబ్యూటరీ పథకాలను కూడా కార్మికుల ముందుంచి ఎంపిక చేసుకోవచ్చంటున్నారు. అంటే క్రమంగా ఈ రెండు రంగాల బాధ్యత నుండి తప్పుకోవడానికవసరమైన నిర్దిష్ట చర్యలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. సబ్సిడీలు హేతుబద్ధం చేస్తున్నామన్నారు. అంటే అర్థం కోతపెట్టడమే సుమా! సబ్సిడీల కోసం రు. 3,78,000 కోట్లు భరించలేని భారమని ఆర్థిక సర్వే నివేదిక స్పష్టంగా హెచ్చరించింది. పేదలకిచ్చే సబ్సిడీలు హేతుబద్ధం చేస్తామన్నారే తప్ప పెద్దలకిచ్చే సబ్సిడీ (ముద్దుపేరు రాయితీ) హేతుబద్ధం చేస్తామనలేదు. పైగా పెంచారు. రానున్న మూడేండ్లలో ద్రవ్యలోటు 3 శాతానికి తగ్గిస్తారట. అంటే ప్రభుత్వం ఖర్చు తగ్గిస్తారన్న మాట! అంటే సబ్సిడీల తగ్గింపే కదా!

ఈ బడ్జెట్‌లో ఎస్‌సి / ఎస్‌టిల అభివృద్ధికి రు. 30,851 కోట్లు, రు. 19,980 కోట్లు కేటాయించారు. గత సంవత్సరంతో పోలిస్తే 50 శాతం కోత విధించినట్లు కనబడుతుంది. అలాగే మధ్యాహ్న భోజన పథకానికి రు. 13,000 కోట్ల నుండి రు. 9000 కోట్లకు కుదించారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి గత బడ్జెట్‌లో రు. 35,163 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో రు. 29,653 కోట్లు కేటాయించారు. గృహ నిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలనకు గత బడ్జెట్‌లో రు. 6008 కోట్లు కేటాయించగా ఈ బడ్జెట్‌లో రు. 5634 కోట్లు కేటాయించారు. మహిళా సాధికారత, అభ్యుదయానికి కేటాయించే నిధులు రు. 20,000 కోట్లు తగ్గించారు. గత ఆర్థిక సంవత్సరంలో పేదలకు ఇచ్చే సబ్సిడీలకు రు. 2,62,658 కోట్లు కేటాయించగా ఈసారి బడ్జెట్‌లో రు. 2,43,811 కోట్లు కేటాయించారు. అంటే గతం కంటె రు. 16,847 కోట్లు తగ్గించింది. మొత్తం సబ్సిడీలు గత బడ్జెట్‌లో జిడిపిలో 2.1 శాతం కాగా, ఈ బడ్జెట్‌లో 1.7 శాతానికి కుదించారు.

విద్యకు నిధుల తగ్గింపు

విద్యా రంగానికి సంబంధించిన ఆదర్శ పాఠశాలల పథకాన్ని పూర్తిగా ఉపసంహరించుకుంది. ప్రస్తుతం తెలంగాణలో 192 ఆదర్శ పాఠశాలలు నడుస్తున్నాయి. రెండో దశలో ఈ ఆర్థిక సంవత్సరానికి మరో 125 ఆదర్శ పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉంది. కేంద్రం రద్దు చేయడంలో రెండోదశ పాఠశాలలు ప్రారంభం, మొదటిదశలో నెలకొన్న పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఎ) రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్షా అభియాన్ (రూసా), నిధుల వాటాను తగ్గించనుంది. ఇప్పటి వరకు ఆర్ఎంఎస్ఎలో కేంద్ర రాష్ట్ర వాటాలు 75, 25 శాతాలుగా, రూసాలో 65,35 శాతాలుగా ఉన్నాయి.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రు. 69,074 కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులు రు. 82,000 కోట్లు. అంటే గతం కంటె 16.54 శాతం తక్కువ. తాజా బడ్జెట్ 2015-16లో పాఠశాల విద్యకు గత ఏడాది కంటె 9.79 శాతం నిధులను తగ్గించి రు. 42,219 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్యకు గత ఏడాది

కంటె 13.31 శాతం పెంచి రు. 26,855 కోట్లు కేటాయించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాలకు 2014-15 బడ్జెట్‌లో ఎస్ఎస్ఎకు రు. 28,258 కోట్లు కేటాయించగా 2015-16 బడ్జెట్‌లో రు. 22 వేల కోట్లు కేటాయించింది. ఆర్ఎంఎస్ఎ పథకానికి గత ఏడాది రు.5,000 కోట్లు కేటాయించగా ఈసారి రు. 3,565 కోట్లు కేటాయించింది. మధ్యాహ్న భోజన పథకానికి గత ఏడాది రు.13,215 కోట్లు కేటాయించగా ఈసారి రు.8900 కోట్లు కేటాయించింది.

ఉన్నత విద్యను బలోపేతం చేయడానికి పలు రాష్ట్రాల్లో కేంద్ర విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు ఆర్థికమంత్రి తెలిపారు. ధన్‌బాద్ (జార్ఖండ్) లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ స్థాయిని పెంచి పూర్తిస్థాయి ఐఐటిగా మార్చాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. కేరళలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ స్థాయిని పెంచి యూనివర్సిటీ ఆఫ్ డిజేబిలిటీ స్టడీస్ అండ్ రిహాబిలిటేషన్‌గా మార్చాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. బీహార్‌లో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) తరహా సంస్థను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రతి విద్యార్థికి 5 కి.మీ దూరంలో సీనియర్ సెకండరీ స్కూలు అందుబాటులో ఉండేలా 80 వేల సెకండరీ స్కూళ్ల స్థాయిని సీనియర్ సెకండరీ స్థాయికి పెంచాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. జూనియర్/మిడిల్ స్కూళ్ల స్థాయి పెంచడం, కొత్త వాటిని ఏర్పాటు చేయడం ద్వారా మరో 75 వేల సీనియర్ సెకండరీ స్కూళ్లను తేవాలని అనుకుంటున్నారు.

ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక పాఠశాల, ప్రతి పది కిలోమీటర్లకు ఒక కళాశాల అని ఊదరగొట్టిన ఆర్థిక మంత్రి ఆ స్థాయిలో నిధులు ఇవ్వకపోవడంపై ఏమనుకోవాలి. ప్రపంచ దేశాలన్నీ విద్యా, వైద్యాలను ప్రాధాన్యతా రంగాలుగా గుర్తిస్తున్నాయి. అదే స్థాయిలో నిధులు కేటాయిస్తున్నాయి. ప్రపంచస్థాయిలో మన యూనివర్సిటీల స్థాయి ఎక్కడ? అక్కడ కల్పిస్తున్న వసతుల్లో మనమెక్కడ ఉన్నామనే దానిపైనా చర్చ నడవాలి. ఒకవైపు ప్రైవేట్ యూనివర్శిటీలను, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తూనే విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామనడం విడ్డూరంగా ఉంది. అధ్యాపకులకు సరైన వసతులు కల్పించడంలోనూ ప్రభుత్వం అలసత్వ ధోరణిని ప్రదర్శిస్తున్నది. గ్రామీణ పేద పిల్లలు చదువుకోవడానికి సరైన వసతి కల్పించడం అనేది బాధ్యతగా గుర్తించడం లేదు.

వ్యవసాయానికి నిరాదరణ

వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచకపోవడం, స్వాతంత్ర్యం తర్వాత కూడా ఆహార భద్రతకై ప్రభుత్వంపై ఆధారపడాల్సిన పరిస్థితికి సామాన్యుని నెడుతూ ఉండడం, ప్రచార పటాటోపంతో ప్రజల్ని కలల సౌధాలలో విహరింప జేసింది. దేశంలో కీలక రంగమైన వ్యవసాయాన్ని బడ్జెట్ ఉపేక్షించింది. 4 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకున్నామన్న బడ్జెట్ – దీని సాధనకు అనుసరించాల్సిన వ్యూహాన్ని గాలికి వదిలేసింది. ఉత్పత్తి, ఉత్పాదకతలు పెంచడం ద్వారా రైతు ఆదాయాన్ని సుస్థిరం చేసేందుకు తీసుకోబోయే చర్యలేమిటో నిర్దిష్టంగా చెప్పలేక పోయింది. వ్యవసాయ అభివృద్ధి పట్ల స్పృహ ఉందని చెపుతూనే ఇప్పటికిప్పుడు చేయగలిగిన మంత్రదండం తమ వద్ద ఏమిలేదని చేతులు ఎత్తేశాడు. నిజానికి దశాబ్దాలు గడుస్తున్నా రైతును సగౌరవంగా నిలబెట్టే ప్రయత్నం ఏ ప్రభుత్వం చేయలేదు.

జనాభాలో 60 శాతం ఆధారపడి ఉన్న వ్యవసాయ రంగానికి సంబంధించి మాటలకు చేతలకు పొంతనలేదు. నాబార్డ్ నెలకొల్పిన గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (ఆర్.కె.ఐ.ఎఫ్) కార్పస్ నిధికి రు. 25 వేల కోట్లు, దీర్ఘకాలిక గ్రామీణ పరపతి రీఫైనాన్స్ నిధికి రు. 45 వేల కోట్లు, స్వల్పకాలిక ఆర్.ఆర్.బి.రీఫైనాన్స్ నిధికి రు. 15 వేల కోట్లు కేటాయించారు. మైక్రో ఇరిగేషన్, వాటర్‌షెడ్ అభివృద్ధికి రు.5.300 కోట్లు కేటాయించారు. ఇవన్నీ సన్న, చిన్నకారు రైతుల వృద్ధికేనన్నారు. బ్యాంకుల ద్వారా రు.8.5 లక్షల కోట్ల రుణాలు ఇప్పిస్తామని వాగ్దానం చేశారు. గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ సౌకర్యాల అభివృద్ధి ప్రస్తావనే లేదు. స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) లో సుమారు 14 శాతం వాటా కలిగిన వ్యవసాయ రంగానికి సముచిత కేటాయింపులు చేయలేదు. గత సంవత్సరం కంటె 14 శాతం నిధులు తగ్గాయి.

ఇవాళ దేశంలోని 14.5 కోట్ల మంది రైతుల్లో ఏడు కోట్ల మందికైనా బ్యాంకు రుణాలు అందడం లేదు. వాస్తవంగా సాగుచేస్తున్న వారిలో 25 శాతం రైతులకు సైతం పంట రుణాలు అందడం లేదని ప్రభుత్వాలు నియమించిన పలు కమిటీలే స్పష్టం చేశాయి. ఉత్పత్తి ఖర్చుకు ప్రతిఫలాలకు ఎలాంటి పొంతనలేని సేద్యంతో రైతు నేడు సాగులో నిలదొక్కుకోవడం జీవన్మరణ సమస్యగా మారింది. ఈ పరిస్థితుల్లో మార్పులు తెచ్చి చిన్న కమతాల సాగుదార్లకు సక్రమంగా పంట రుణాలు అందేలా రుణ వితరణను మరింత సులభతరం చేయాల్సిన అవసరముంది.

ముగింపు

అధికార దాహాన్ని తీర్చుకునేందుకు కార్పొరేట్ల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వమిది. కార్పొరేట్లు, పెట్టుబడుల పట్ల భక్తి శ్రద్ధలను ప్రదర్శించేందుకు వెనుకాడని ప్రభుత్వమిది. ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలుచేసి, దేశీయ, విదేశీ బహుళజాతి సంస్థలను మెప్పించే ప్రభుత్వమిది. ప్రజల మనోభావాలను భేఖాతర్ చేస్తూ వారి సంక్షేమం కొరకు పని చేయకుండా, ప్రజా హక్కులను కాలరాసే ప్రభుత్వమిది. కార్పొరేట్లకు లాభించే విధంగా కార్మిక చట్టాలను, భూసేకరణ చట్టాలను సవరించిన ప్రభుత్వమిది. రైల్వే, బీమా, బ్యాంకింగ్, రక్షణ రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్న ప్రభుత్వమిది. కార్పొరేట్లకు నచ్చినట్లుగా, వారు మెచ్చే విధంగా నడుచుకుంటూ చట్టాలను, విధానాలను రూపొందిస్తూ కార్పొరేట్ల తొత్తుగా మారిన ప్రభుత్వమిది.

ఈ బడ్జెట్ సామాజిక అంతరాలను మరింత పెంచేదిగా ఉంది. అభివృద్ధికి, ఉపాధి కల్పనకు, ప్రజల జీవనోపాధిని పెంచేదిగా ఉండాల్సిన బడ్జెట్ మరిన్ని భారాలు ప్రజలపై ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలపై మోపే విధంగా ఉంది. మొత్తంగా చూస్తే ఈ బడ్జెట్ రైతుల, కార్మికుల, విద్యార్థి, పేద, మధ్యతరగతి, మైనారిటీ, మహిళా, దళిత, ఆదివాసి ప్రజల ఆశలను నీరుగార్చే విధంగా ఉంది. 'మేక్ ఇన్ ఇండియా' కోసం కొన్ని ప్రతిపాదనలు బడ్జెట్‌లో కనిపించినా, అది కూడ సాకారం అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, వ్యవసాయ రంగానికి, గ్రామీణాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు తీరని అన్యాయం చేసింది. బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన ఈ అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వం సరిదిద్దుకునేలా ప్రజాస్వామిక వాదులు, ప్రజాసంఘాలు, ప్రజా క్షేమాన్ని కోరే అభ్యుదయ పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

(రచయిత ఉపాధ్యాయ నాయకులు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

ఆర్థిక పరిస్థితి అధోగతి వైపు పురోగతి

***కేంద్ర బడ్జెట్ సామాన్యులకు సంబంధించిన బడ్జెట్‌లా కాకుండా బడా కార్పొరేట్, బహుళజాతి సంస్థల అనుకూల బడ్జెట్‌లా ఉందని అంటున్నారు* వి. హనుమంతరావు**

బడ్జెట్ అంటే చాలామంది ఆమడ దూరం పోతారు. ఆ లెక్కలు, డొక్కలు మాకేమీ అర్థం కావంటారు. కాని వచ్చే సంవత్సరాల్లో లేదా రాబోయే సంవత్సరాల్లో మన ఆర్థిక భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ఈ బడ్జెట్ తెలియజేస్తుంది. అలాంటప్పుడు తెలుసుకోకపోతే ఎలా? మీ ఇంట్లో ఏదైనా శుభకార్యం జరగబోతుందంటే ఎంత ఖర్చవుతుంది, ఎంత డబ్బు మీ బ్యాంకులో ఉంది, అప్పుచేయాలా అని లెక్కలు వేసుకోరా? అలాగే దేశ జనాభా 126 కోట్ల మందికి సేవలందించా లంటే ఎంత డబ్బు అవసరం అవుతుంది. ఎంత ఆదాయం వస్తుంది. దేనికోసం ఎంత, ఎలా ఖర్చు చేయాలి, అప్పుచేయడం అవసరం ఉందా అని ప్రభుత్వం కూడా లెక్కలు వేసుకోవడమే బడ్జెట్. క్లుప్తంగా చెప్పాలంటే ఆదాయ వ్యయాల పట్టిక.

2015-16కి బడ్జెట్ అంచనా రు. 17 లక్షల కోట్లు. ఇందులో అప్పు, వడ్డీ చెల్లింపులు, రక్షణ ఖర్చే ఏడు లక్షల కోట్లు. మిగతా పది లక్షల కోట్లతో బండి నడుస్తుందా? నడవబోదని ప్రభుత్వానికి ముందే తెలుసు. ఎక్కడ ఖర్చు తగ్గించాలి లేదా పెంచాలి, ఎంత అప్పు చేయాల్సి వస్తుంది అనే వివరాలు బడ్జెట్‌లో ఉంటాయి. దేశంలో నూటికి డెబ్బై మంది నివసించే గ్రామాల బాగోగులు చూడాలని మెడ మీద తలకాయ ఉన్నవారెవరైనా అనుకుంటారు. ఈ సామాన్యులే ఓటేసి మోడీని అధికారంలో కూర్చోబెట్టారు కాబట్టి ముందు వీరి బాగోగులు పట్టించుకోవాలి కదా. కాని ఇలాంటి పరిస్థితి సామాన్యునికి ఎదురైతే తల తాకట్టుపెట్టి అయినా సమస్యను పరిష్కారం చేసుకోవాలని అనుకుంటాడు. కాని పాలకులు అసామాన్యులు; సామాన్యునిలా ఆలోచించరు. కాగా పాలకులు తమ తలకాయలను అమెరికాకు తాకట్టుపెట్టేశారు. (ఇంతకు ముందే 2005లో ఆర్థికమంత్రిగా ఉన్న ప్రణబ్ ముఖర్జీ అమెరికా వెళ్లి ఆ పని చేసుకొని వచ్చారు) బిజెపి ప్రభుత్వం ఈ విషయంలోనూ కాంగ్రెస్ విధానాలనే కాపీ కొట్టింది. అదే విధానాన్ని కొనసాగించింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి చేసిన వాగ్దానాలను అమలుపరిచే దిశలో పయనించకుండా, అమెరికాకు పరుగులు తీశారు. మీరు మా దేశానికి రండి, పెట్టుబడులు పెట్టించండి అంటూ 'మేక్ ఇన్ ఇండియా' అనే నినాదాన్నిచ్చారు. అంటే మా నిప్పుల్లో పప్పులేరించండి అని అభ్యర్థించారు. మా షరతులంగీకరిస్తే వస్తాం అన్నారు. మోడీ ఆలోచన ఏమంటే వాళ్లొచ్చి పెట్టుబడులు పెట్టి, పరిశ్రమలు ఏర్పాటు చేసి, భారతీయులకు ఉద్యోగాలిస్తారు. పెట్టుబడులు వస్తే, దేశ ఆదాయం పెరుగుతుంది. అప్పుడు ప్రజలకు సేవలందిస్తాం అని చెప్పడమే కదా. ఈ ఆలోచనల నేపథ్యంలో 2015-16 బడ్జెట్ రూపకల్పన జరిగింది.

తన ఆహ్వానాన్ని అందుకొన్న అమెరికాలోని బహుళజాతి సంస్థలు వచ్చి పరిశ్రమలు పెడతాం, స్థలాన్ని చూపించండి, అంటే కొన్ని వేల ఎకరాల స్థలం కావాలి. రాబోయే ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని భూ దురాక్రమణ కోసం ఆర్డినెన్స్‌ను ప్రవేశపెట్టి, దానిని పార్లమెంట్ ఆమోదానికి పెట్టి, లోక్‌సభలో నెగ్గించుకొని రాజ్యసభలో యుద్ధానికి సన్నద్ధమవుతున్నారు. అంటే రైతు ఏమవుతేనేమిటి, ముందు బహుళజాతి సంస్థల కోర్కె తీర్చాలి. అంటే బడ్జెట్‌లో ఇదివరకు కాంగ్రెస్ పాలనలో లాగే ప్రథమ లక్ష్యం కార్పొరేట్లు తర్వాతే వ్యవసాయం. అదే మనకు బడ్జెట్‌లో కనిపిస్తుంది.

ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు రైతులకు సంబంధించినంత వరకూ గుడ్‌బై. అదే ఎన్నికల కోసం కోట్లు కుమ్మరించిన భారతీయ కార్పొరేట్లకు ఎర్రతివాచి పరచి ఆహ్వానం. అచ్చే దిన్ వారికి వచ్చేసింది. ఇక సామాన్యు లంటారా? ప్రపంచ మంతటిలో లాగే మనదేశంలో చమురు ధరలు తగ్గగా, ఆమేరకు వినియోగదారులకు ధరలు తగ్గినట్లే తగ్గించి, ఆ మేరకు ఎక్సైజ్, కస్టమ్స్ సంకాలు పెంచి, రైతులు, మధ్యతరగతి ప్రజల చెంపవాయగొట్టారు. ఖరీఫ్‌లో, రబీలో పంటలు దెబ్బతిన్నాయి. రైతుకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు ధరలు తగ్గలేదు. కాగా రైతు చేతిలో డబ్బులేక కొనుగోలు శక్తి తగ్గి, తయారీ రంగంలో తయారైన వస్తువులకు గిరాకీ తగ్గింది. ఉత్పత్తి తగ్గితే జిడిపి ఎలా పెరుగుతుంది? ఈ పెరుగుదల గణాంకాలు ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్‌కే అంతుచిక్కలేదు. కొనుగోళ్లు తగ్గితే ప్రజలు చెల్లించాల్సిన పన్నులు తగ్గి, ప్రభుత్వాదాయం తగ్గుతుంది. బడ్జెట్ అంచనా ప్రకారం 2013-14లో రెవెన్యూ లోటు 2013-14లో రు. 3,57,048 కోట్లు ఉండగా 2015-16లో రు. 3,94,472 కోట్లకు పెరగనుంది. వడ్డీ చెల్లింపులు 2013-14లో రు. 3,74,254 కోట్ల నుంచి 2015-16లో రు. 4,56,145 కోట్లకు పెరగనుంది. ఖజానాలో ప్రతి రూపాయిలో నాలుగోవంతు అంటే 24 పైసలు రుణమే. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొ.జె. మనోహరరావు ప్రకారం మొత్తం బడ్జెట్‌లో సింహ భాగం ప్రణాళికేతర వ్యయంగా ఉండి ప్రణాళికా వ్యయం కేలవం రు. 4,65,000 కోట్లుగా సూచించబడింది. అంటే గత సంవత్సరం ప్రణాళికా వ్యయం కంటే కూడా 40 లక్షలు తక్కువగా కేటాయించారు. 'దేశంలో మౌలిక సౌకర్యాలు (అంటే విద్యుచ్ఛక్తి, రైళ్లు, పోర్టులు వగైరా) కొరత హెచ్చుగా ఉండి ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానం ఆశించిన ఫలితాలు లభించక పోయినా, అదే మార్గాన ఈ ఏడాది, వచ్చే ఏడాదిల్లో అవలంబిస్తానంటున్న ప్రభుత్వం ఈ ఐదేళ్లలో కూడా విఫలమవడం ఖాయం. ఈ సౌకర్యాల కల్పన పేదలకు ఉపాధి లభించదు. ఇలాంటి పరిస్థితిలో కార్మిక శక్తి ప్రతి నెల ఈ పది లక్షల మంది చొప్పున పెరుగుతుంటే వారికి ఉపాధి ఎక్కడ లభిస్తుంది.

వ్యవసాయ రంగాలు రు. 8,50,000 కోట్లు పెరగడం కొత్త విషయం ఏమీ కాదు. చిదంబరం ఈ పెరుగుదలకు బోణీ చేశారు. ఈ ప్రభుత్వం ఆ పనే చేసింది. ఇది కూడా కాంగ్రెస్ పాలన కాపీయే. గురివిందగింజ తన కింద నలుపు తానెరుగదన్నట్లు, పెట్టుబడులు లేక దేశ దేశాల్లో భిక్షాటణ చేస్తున్న భారతదేశ ఆర్థికశాఖ అధికారులకు చైనాలో పెరుగుదల వేగం తగ్గిందని, త్వరలో భారత్ చైనా కన్నా ప్రథమ స్థానంలో ఉంటుందని అంటుండగా మనదేశ ప్రభుత్వ ఆర్థిక సలహాదారులు సుబ్రమణియన్ 'చైనాలో 35 ఏళ్ల నుంచి పది శాతం జిడిపి పెరుగుతోంది. అదో అద్భుత'మని పరోక్షంగా మందలించారు. నిధులు లేనప్పుడు ప్రజల మీద సవారీ చేయడం ప్రభుత్వానికి అలవాటే; సేవా పన్నును 14 శాతానికి పెంచి ప్రజల నుంచి వసూలు చేయడం, కార్పొరేట్ల మీద పన్ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించడం చూస్తే ప్రభుత్వం మొగ్గు ఎటువైపో అర్థమైపోతుంది. ప్రపంచ బ్యాంకు ఆదేశం మేరకే ఈ సేవల పన్ను వసూలు చేయడం ప్రారంభించిందని గుర్తుంచుకోవాలి.

కార్పొరేట్ సేవలో తరిస్తున్న ప్రభుత్వానికి సామాన్యులెలా కనిపిస్తారు? సామాజిక సంక్షేమ పథకాలు కోకొల్లలు. కాని కేటాయింపుల కంటే ఐసిడిఎస్, మధ్యాహ్న భోజన పథకం, సర్వ శిక్షా అభియాన్, తాగునీరు, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం లాంటి పద్దులన్నింటికీ కేటాయింపులు తగ్గించారు. 14వ ఫైనాన్స్ కమిషన్ కేంద్ర పన్నుల్లో వాటాను పెంచారు. కాబట్టి పైపద్దులకు కేటాయింపులు తగ్గించామని ప్రభుత్వం అనుకుంటున్నట్లుంది. కాని వాస్తవం వేరు. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ లోటు బడ్జెట్; రాజధాని నిర్మాణానికి నిధులు కావాలి. అలాంటి పరిస్థితిలో సంక్షేమ పథకాలకు అదనపు నిధులు ఖర్చు చేయాలో, కొత్త రాష్ట్రానికి లోటు బడ్జెట్ పూడ్చుకోవడానికి ఆ నిధులు ఖర్చు చేయాలా? తెలంగాణ రాష్ట్రం కూడా కేంద్రం నుంచి నిధులు తక్కువగా వస్తాయని అంటోంది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో పరిశ్రమలపై 90 శాతం పన్ను విధించి దానిని క్రమంగా 30 శాతానికి తగ్గించగా మోడీ ప్రభుత్వం 25 శాతానికి తగ్గించింది. ప్రభుత్వం ఎవరి సేవలో తరించనున్నదో ఈ విశ్లేషణ తెలియ చేస్తుంది.

ఒబామాకు ముందుగా ఉన్న అమెరికా అధ్యక్షుడు భారతీయులు తిండి పోతులయ్యారు కాబట్టి ఆహార కొరత, సబ్సిడీలు ఇవ్వాల్సి వచ్చిందని అనడం పాఠకులకు గుర్తిండే ఉంటుంది. మోడీ కూడా అలాంటి ఆలోచనలోనే ఉన్నట్లుంది. అందుకే వ్యవసాయానికి మొత్తం అభివృద్ధి ఖర్చులో వ్యవసాయానికి కేటాయింపు శాతం 2013-14లో 9.5 శాతం ఉంటే దానిని 2015-16లో కేవలం 2.7 శాతానికి తగ్గించింది. అమెరికా మోడీ అనుబంధం అలాంటిది. ఆ మోజు ఎంత లోతుగా ఉందంటే అక్కడి బహుళజాతి సంస్థలను మోడీ స్వయంగా వెళ్లి ఆహ్వానించి వచ్చారు. వారికి కావాల్సిన భూమి కోసం రైతులను వారి భూముల నుంచి వెళ్లగొట్టే చట్టాన్ని తీసుకుని రానున్నారు.

ఆర్థిక పట్టాల నుంచి తొలగించిన రైల్వే బడ్జెట్

2015-16 రైల్వే బడ్జెట్‌లో టికెట్ ధర పెంచలేదు. సంతోషిద్దామా? ఆగండి. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే రైల్వే ఛార్జీలు పెంచిన విషయం గుర్తులేదా? ఢిల్లీ నగర ఎన్నికల ఫలితాలతో చెంప పగిలేసరికి ఒళ్లు దగ్గరపెట్టుకొని ప్రవర్తించడం వల్లనే ఛార్జీలు ఇప్పుడే మళ్లా పెంచితే ప్రజలు తన్ని తగిలేస్తారనే భయంతోనే ఛార్జీలు పెంచలేదని గ్రహించాలి. ఛార్జీలు పెంచకపోవడానికి రైల్వే మంత్రి ఓ సాకు చూపించారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించకుండా ఛార్జీలు పెంచడం న్యాయం కాదన్నారు. మంత్రి గతాన్ని మరచిపోయి ఉంటారు. వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్న కాలంలో సౌకర్యాలు కల్పించకుండానే ఛార్జీలు పెంచారు. అసలు విషయమేమంటే డీజిల్ ధరలు తగ్గాయి. 70 శాతం రైళ్లు డీజిల్‌తోనే నడుస్తున్నాయి. కాగా రైల్వే ఛార్జీలు తగ్గించాలి. అలా తగ్గించకుండా ఉంటే ఖర్చు పెరుగుతుంది. అక్కడ ఆదాయం ఖర్చు తగ్గుతుంది. అలాంటప్పుడు ఛార్జీలు పెంచడం ఎందుకు? పెంచక పోవడానికి వెనుకనున్న రహస్యం ఇది. లాలూ ప్రసాద్, మమతా బెనర్జీ కూడా ఛార్జీలు పెంచలేదు. ప్రజలకు కావాల్సింది కొత్త రైలు మార్గాలు, ప్రయాణ సౌకర్యాలు, వాటిని పెంచి ఛార్జీలు పెంచితే ఎటువంటి వ్యతిరేకత రాదు. ఒక పక్క ప్రయాణికుల మీద ఛార్జీలు పెంచకుండా, బొగ్గు, ఇనుము లాంటి ఉత్పత్తుల మీద సరుకు రవాణా ఛార్జీలు పెంచితే ఆ పెరుగుదల భారం పారిశ్రామికవేత్తలు ధరలు పెంచి సామాన్య ప్రజానీకం మీదకు నెట్టేస్తారు. ఓ చేత్తో తగ్గించి, రెండో చేత్తో వడ్డిస్తే, ప్రయాణికుల మీద ఛార్జీలు పెంచలేదనే బుడగ పేలిపోతుంది.

ఎక్కడ, దేనిలో పెట్టుబడి పెట్టినా, లాభాల మాట అలా ఉంచి పెట్టిన పెట్టుబడి అయినా తిరిగి రావాలి కదా. కాని మన భారత రైల్వేలలో పెట్టుబడి పెట్టడం అంటే చిల్లుకుండలో నీళ్లు పోసినట్లే. ప్రయాణికులు చెల్లించే టిక్కెట్ల ఖరీదు, సరుకుల రవాణా చేయడం వల్ల వచ్చే ఆదాయంతో రైల్వేలు నడవడంలేదు; కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం తన నిధుల నుంచి రు. 40,000 కోట్లు, రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ మార్కెట్ నుంచి అప్పులు తెచ్చి రు. 17,655 కోట్లు రైల్వే శాఖకు అందిస్తేనే రైళ్లు నడుస్తున్నాయి. రైల్వే శాఖ అధీనంలో లక్షల హెక్టార్ల భూమి ఉందని లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్నప్పటి నుంచి చెపుతూ వచ్చారు కాని ఆ పని ఎందుకు చేయలేదు? ఇప్పటికే ప్రకటించిన కొత్త రైలు మార్గాలను పూర్తి చేయడానికి రు. 17,136 కోట్లు కావాలి. గత 30 సంవత్సరాల్లో 874 రైల్వే ప్రాజెక్టులను మంజూరు చేస్తే, కేవలం 312 ప్రాజెక్టులు మాత్రమే పూర్తయ్యాయి. పూర్తి చేయడం ఆలస్యం అయినా కొద్దీ ధరలు పెరుగుదలతో మరింత ఆలస్యం అవుతాయి. రైల్వేల అధీనంలో ఉన్న భూములను అమ్మితే ఒక సంవత్సరం బడ్జెట్‌కు సరిపోతుందేమో. రైల్వేలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన వచ్చింది. కూర్చుంటే లేవలేని పరిస్థితుల్లో ఉన్న రైల్వేలో పెట్టుబడి పెట్టడానికి ఎవరు ముందుకు వస్తారు? మోడీ బహుశా ఈ పరిస్థితిని గమనించే అబ్బే రైల్వేలను ప్రైవేటీకరించబోమని ప్రకటించాల్సి వచ్చింది. బహుశ ఏవో చిన్న చిన్న విషయాల్లో ప్రైవేటీకరణను అనుమతించవచ్చు; అంతే. రైల్వేలు ఇంత దారుణ ఆర్థిక దుస్థితిలో ఉండి ఇదివరకే మంజూరు చేసిన కొత్త రైల్వే మార్గాలను పూర్తిచేయలేనపుడు కొత్త మార్గాలు మా రాష్ట్రానికి రాలేదనే దానికన్నా, నిర్మాణంలో ఉన్న రైలు మార్గాలను నిర్ణీత గడువులో పూర్తి చేయమని ఆదేశించి అమలు జరిగేలా చూస్తే సబబుగా ఉంటుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 11 కొత్త రైలు మార్గాలను మంజూరు చేసినా (కొన్ని 1996-97లో మంజూరయ్యాయి), ఇంకా సుమారు రు. 1700 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. →

వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే మోడీ లక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయాభివృద్ధికి పది కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయని, ఆ కంపెనీలతో పది రోజుల్లో ఒప్పందం చేసుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయ మంత్రి పత్తిపాటి పుల్లారావు ప్రకటించారు. ఇటు గ్రామాల్లో పంట భూములు, అటు పట్టణాల్లో, నగరాల్లో పరిశ్రమలు స్థాపిస్తే మనం ఎక్కడ ఉంటాం? చిప్ప పట్టుకుని అడుక్కుంటూ తిరగాలి. ఎందుచేతనంటే కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు పండించే పంటలు బాగా చలిగా ఉండే దేశాల్లో పండించడానికి వీలులేని పంటలనే పండించి, ప్రాసెసింగ్ చేసి, డబ్బాల్లో విదేశాలకు ఎగుమతి చేస్తారు. ప్రజలు మణులు, మాణిక్యాలు అడగడం లేదు. ఇల్లు, విద్యుచ్ఛక్తి, పరిశుభ్రమైన మంచినీరు, టాయిలెట్, రహదారులు, కుటుంబంలో ఒక్కరికైనా ఉపాధి, వైద్య, విద్య సదుపాయాలు వగైరా మాత్రమే ఏ దేశంలోనైనా ప్రజలు కోరుకునేవి ఇవే. కాని మిలియనీర్లు, బిలియనీర్లు కావాలని కాదు. ఈ కనీస సౌకర్యాలు కలుగజేయని ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు. 2022 నాటికి అందరికీ ఇళ్లు ఇచ్చేస్తామని వాగ్దానం ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు ఏమయ్యాయో మనం చూస్తూనే ఉన్నాం. ఈ బడ్జెట్‌లో సామాజిక సేవల పద్దులకు కోత విధించారు. మోడీ అధికారంలోకి వచ్చిన ఆరేడు నెలల్లో ఒక కోత విధించారు. ఇప్పుడు రెండో కోత.

బడ్జెట్ ఉపన్యాసం వింటుంటే ఇది భారత ప్రజలకు సంబంధించిన బడ్జెట్టా, కొద్ది మంది బహుళజాతి కార్పొరేట్లకు సంబంధించిన బడ్జెట్టా అని చూడబోతే 'పెట్టుబడిదారుల వర్గ ప్రాబల్యాన్ని పెంచేదిశగా చేసిన పెద్ద అడుగు ఈ బడ్జెట్. దానితో అభివృద్ధి జరగదు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఈ విషయం ప్రస్ఫుటమవుతుంది. అయితే ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఈ అభివృద్ధి వ్యూహం విఫలమైనప్పుడు నయా ఉదారవాదానికి మిగిలిన ఏకైన విషయమేమంటే పెట్టుబడివర్గ ప్రాబల్యాన్ని పెంచడం. దీనికి ప్రత్యక్ష పన్నుల క్షేత్రంలో పెట్టుబడిదారులకు ఇచ్చిన రాయితీల వల్ల ఖజానా రు. 8315 కోట్ల ఆదాయం కోల్పోవడం ఒక ఉదాహరణ మాత్రమే. పెట్టుబడిదారులకు పల్లకి మోస్తూ సామాన్య జనానికి అందవలసిన సంక్షేమ పథకాల కేటాయింపులు ప్రభుత్వాలు తగ్గిస్తూ వస్తున్నాయి. స్థూల జాతీయాదాయం లో ఈ పథకాలకు కేటాయింపు ఎలా తగ్గిస్తూ వచ్చారో చూడండి -

జిడిపిలో సంక్షేమ పథకాల కేటాయింపు శాతం: 2010-11 - 2.49; 2011-12 - 2.28; 2012-13 - 1.98; 2013-14 - 1.92; 2014-15 - 1.82; 2015-16 - 1.68 ఈ వివరాలు చదివిన తర్వాత మోడీ ప్రభుత్వం గానీ, అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం గానీ ఎవరి కోసం పని చేస్తూ వస్తున్నాయో వేరే చెప్పాలా?

(రచయిత వీక్షణం వ్యవస్థాపక సంపాదకులు) వీ

→ దేశానికి మౌలిక సౌకర్యాల కల్పన అత్యవసరం. మోడీ మేక్ ఇన్ ఇండియా కార్యరూపం దాల్చాలంటే ఈ సౌకర్యాలేవీ లేకుండా ఏ విదేశీ పెట్టుబడిదారుడు మన దేశంలో అడుగుపెట్టడు. ఈ సౌకర్యాలేవి అని అడుగుతున్నారు, కాదు, డిమాండ్ చేస్తున్నారు. విద్యుదుత్పాదనకు బొగ్గు ప్రాథమిక అవసరం. ఆ బొగ్గును రైల్వే రవాణా చేయాలి. ఇంతకు ముందు కోల్ ఇండియా సంస్థ జనరల్ మేనేజరు మా పిట్‌హెడ్స్ దగ్గర బోలెడంత బొగ్గు ఉంది, మీరు వాగన్లు తెచ్చుకోండ'ని అన్నారంటే వాగన్ల కొరతను అర్థం చేసుకోవచ్చు.

ప్రయాణికుల ఛార్జీలు పెంచలేదని, సరుకు రవాణా ఛార్జీలు మాత్రం పెంచామంటున్నారు మంత్రి వర్యులు. ఛార్జీలు పెరిగితే సరుకుల ధరలు పెరుగుతాయి. ఆ పెరిగిన ధరలను చెల్లించాల్సింది ప్రజలే. గత అయిదు దశాబ్దాల్లో 61 శాతం మంది ప్రయాణికులు, 59 శాతం సరుకు రవాణా లారీలకు మళ్లిందని లెక్కలు చెపుతున్నాయి. రైల్వేల సమర్థత ఎలా దిగజారుతూ వస్తోంది ఈ గణాంకాలు తెలియ జేస్తున్నాయి. రాను రాను కేంద్ర ప్రభుత్వ నిధుల నుంచి, అప్పులు తెచ్చి నడిపిస్తుండగా, జపాన్‌లో రైల్వేలే అక్కడి ప్రభుత్వానికి తన నిధుల నుంచి 15 శాతం ప్రభుత్వానికి అందచేస్తోంది. ఇలాంటి పరిస్థితికి చేరుకోవడానికి మన రైల్వేలకు ఎన్ని దశాబ్దాలు పడుతుందో మోడి జపాన్ వెళ్లివచ్చారు. ఈ విషయం మనకు ఎందుకు చెప్పలేదో? గతంతో పోలిస్తే డీజిల్ ధర కారు చౌక అయింది. ఎక్కువ శాతం రైళ్లు డీజిల్‌తోనే నడుస్తున్నాయి. ధర తగ్గింది కాబట్టి రైలు ప్రయాణీకుల టికెట్ ఖరీదు తగ్గించాలి కదా.

రైల్వే మంత్రులు మారుతున్నారు గాని, రైల్వే ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ప్రస్తుత రైల్వే మంత్రి తన ఉపన్యాసాన్ని చదవడానికి ముందు రోజునే మన రాష్ట్రంలో ఓ రైలు ప్రమాదం జరిగింది. రైలు-రోడు క్రాసింగ్‌లో ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. ఏదో లాంచనంగా కొంత డబ్బు కేటాయించారు. ఈ లెక్కన అన్ని రైల్వే గేట్ల వద్ద రక్షణ ఏర్పాట్లు చేయడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుంది? రక్షణ చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ప్రకటించారు గాని వివరాలు లేవు. పరిశుభ్రత, కేటరింగ్, వినోదం, టెక్నాలజీ గురించి మంత్రి మాట్లాడారు. ఇవన్నీ ఏ తరగతి ప్రయాణీకులతో చెబితే బావుండేది.

ఇటీవల వరకూ కాంగ్రెస్, ఇప్పుడు బిజెపి రైల్వేలను భ్రష్టు పట్టిస్తున్నాయనడానికి మన సరిహద్దుల్లో ఉన్న మనతో పాటు స్వతంత్రం సంపాదించుకొన్న చైనాతో పోల్చి చూస్తే తెలిసి పోతుంది. స్వతంత్రం సంపాదించిన ఇండియా గత 68 సంవత్సరాల్లో మనదేశం అదనంగా 11 వేల కిలోమీటర్ల నిడివిగల రైలు మార్గాన్ని నిర్మించగా, అదే కాలంలో చైనా 1,10,000 కిలోమీటర్ల రైలు మార్గాన్ని నిర్మించుకొంది. మనమెక్కడ, నాగలోకమెక్కడ? ఈ విషయం ప్రభుత్వాలకు తెలియని విషయమేమి కాదు. మన రైల్వేల తీరుతెన్నులిలావున్నాయని గమనించి ఒకటి కాదు, సుమారు ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేయగా వారిచ్చిన నివేదికలను ఏమిచేశారు? బుట్టదాఖలా చేశారా? ఓ దేవుడా నన్ను కరుణించవా అని మంత్రి అన్నాడంటే మన రైల్వేలు ఎంత దుస్థితిలో ఉన్నాయో అర్థమవుతుంది. ఇలాంటి నేపథ్యంలో వచ్చే సంవత్సరంలో ఇంత ఖర్చు చేస్తాం, వచ్చే ఐదేళ్లలో 8.5 లక్షల కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యం పెట్టుకొన్నామని (ఆ ఐదేళ్లూ అధికారంలో ఉండాలి కదా) ప్రకటిస్తే నమ్మగలమా?

14 లక్షల మంది పనిచేసే ఈ దేశ వ్యాప్త సంస్థను ఒక్క రైల్వే బోర్డు మేనేజ్ చేయగలదా? వాగన్లు, రైల్వే బోగీలు లాంటి తయారీ రంగం ఉత్పత్తులను తయారీని వేరే ప్రభుత్వ రంగ ఉత్పత్తుల తయారీని వేరే ప్రభుత్వ రంగ సంస్థను ఏర్పాటు చేయవచ్చు. బోర్డుకు ఇంత పెద్ద వ్యవస్థను నడిపించే బాధ్యత ఇవ్వడం వల్ల దానిలో ఉన్నత స్థాయిలో ఉన్న రైల్వే బ్యూరాక్రాట్లు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు; దాని తోక కత్తిరించాలి. రైల్వే బోర్డును వికేంద్రీకరణ చేయాలి. సౌకర్యాలు పెంచడం ప్రధాన లక్ష్యంగా ఉండాలి. వీ

చేతల్లో కనబడని మాటల ప్రాధాన్యతలు

***తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తొలి పూర్తిస్థాయి బడ్జెట్ గంభీరమైన ప్రకటనలు చేసినప్పటికీ ప్రణాళికల్లో, ప్రాధాన్యతల్లో, అంకెల్లో ఆ స్ఫూర్తి కనబడడం లేదంటున్నారు* ఎన్. వేణుగోపాల్**

గత ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడినందువల్ల గత సంవత్సరం పూర్తి బడ్జెట్ ను ప్రవేశపెట్టలేకపోయిన తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్చ్ 11న పూర్తి బడ్జెట్ ను ప్రవేశపెట్టింది. అలా ఒకరకంగా దీన్ని తెలంగాణ ప్రభుత్వ తొలి బడ్జెట్ గానే పరిశీలించవచ్చు. అలా పరిశీలిస్తూ సాగే ఈ సమీక్ష మూడు ప్రశ్నలకు పరిమితమవుతుంది. ఒకటి, ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ఉద్యమ లక్ష్యాలను ఏ మేరకు ప్రతిఫలిస్తున్నది? రెండు, ఆ ఆకాంక్షల, లక్ష్యాల ప్రతిఫలనం ఉన్నా లేకపోయినా, ఈ బడ్జెట్ ప్రకటించిన ప్రాధాన్యతల క్రమం ఏమిటి? మూడు, ఈ బడ్జెట్ పెట్టుకున్న లక్ష్యాల సాధ్యాసాధ్యాలేమిటి? ఏవి నెరవేరే అవకాశం ఉంది? ఏవి నెరవేరకపోయే అవకాశం ఉంది?

ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ మార్చ్ 11న శాసనసభలో ప్రవేశపెట్టిన 2015-16 బడ్జెట్ రు. 1,15,689 కోట్లతో తయారయింది. ఇందులో ప్రణాళికా వ్యయం రు. 52,383 కోట్లు కాగా ప్రణాళికేతర వ్యయం రు. 63,306 కోట్లు. మొత్తం రెవెన్యూ ఆదాయం రు. 94,131 కోట్లు. దీనిలో కేంద్ర పన్నుల్లో వాటా రు. 12,823 కోట్లు, రాష్ట్ర పన్నులు, సుంకాలు రు. 46,494 కోట్లు, పన్నేతర ఆదాయం రు. 32,019 కోట్లు, వడ్డీ వసూళ్లు రు. 2,793 కోట్లు ఉంటాయి. ఈ రెవెన్యూ ఆదాయంలోనుంచి అభివృద్ధి వ్యయంగా రు. 69,434 కోట్లు, వడ్డీల చెల్లింపులు రు. 7,958 కోట్లు, పాలనాపరమైన ఖర్చులు రు. 5,769 కోట్లు, పన్నుల వసూళ్ల ఖర్చు రు. 863 కోట్లు, ఇతర ఖర్చులు రు. 9,575 కోట్లు కలిపి మొత్తం ఖర్చు రు. 93,600 కోట్లు పోగా, రు. 531 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని బడ్జెట్ అంచనా వేసింది. రెవెన్యూ ఖాతాలో మిగులు ఉన్నప్పటికీ, ఈ బడ్జెట్ రు. 16,968 కోట్ల విత్త లోటు (లేదా ద్రవ్య లోటు - ఫిస్కల్ డెఫిసిట్) అంచనా వేసింది. రుణాలు మినహా ఇతర ఆదాయానికీ వ్యయానికీ మధ్య ఉండే తేడాను విత్త లోటు అంటారు. ఇటీవలి కాలంలో అన్ని ప్రభుత్వాలూ ఆదాయ వ్యయాల మధ్య తేడాను రుణాల ద్వారా తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి గనుక ఈ విత్తలోటు నిర్ణీత పరిమితి లోపలే నియంత్రించడానికి 2003లో ద్రవ్య బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం (ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెటరీ మేనేజ్‌మెంట్ యాక్ట్) తెచ్చారు. దాని ప్రకారం విత్త లోటు స్థూల రాష్ట్ర ఉత్పత్తిలో 3 శాతానికి మించగూడదు. కాని తెలంగాణ బడ్జెట్ 2005-16 లో 3.9 శాతం విత్త లోటు అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం కూడ ఈ పరిమితిని పాటించడం లేదనే కారణం చూపారు. అది నిబంధనలకు లోబడినదా కాదా అనే ప్రశ్న కన్న ఇంత పెద్ద లోటు చూపేలా ఆడంబరమైన వ్యయ అంచనాలు వేసే బదులు, ఆదాయానికి తగిన వ్యయాన్ని చూపి ఉండవచ్చు. లేదా, ఇప్పుడు పన్నులు లేని బడ్జెట్ తయారు చేశామని చూపుకుని, ఆ తర్వాత ఈ లోటును పూరించడానికి అదనపు పన్నులు విధించవచ్చు. లేదా నిబంధనలను అతిక్రమించి దేశీ విదేశీ రుణాలు తెచ్చి, ఆ అసలు, వడ్డీ చెల్లింపుల భారాన్ని ప్రజలపై మోపవచ్చు.

ఈ అంకెలు, పారిభాషిక పదాలు ఒక మాయాజాలం. అవి సాధారణ ప్రజానీకానికి మాత్రమే కాదు, విద్యావంతులకు కూడ అర్థమయ్యే అవకాశం తక్కువ. ఈ అర్థం కాని ఆర్థిక పరిభాష చాటున తమ అంకెల గారడీని సాగించడానికి, ప్రజా ప్రయోజనాలు నెరవేరుతాయో లేదో తెలియకుండా మసిపూసి మారేడు కాయ చేయడానికి ప్రయత్నించడం ఈ దేశంలో పాలకవర్గాలు, అధికారవర్గాలు దశాబ్దాలుగా అమలు చేస్తున్న నీతి. అందువల్ల ఆ అంకెలను, పారిభాషిక పదాలను దాటి, బడ్జెట్ ను రానున్న సంవత్సరపు ప్రభుత్వ లక్ష్యాలను, ప్రాధాన్యతలను, సంకల్పాన్ని సూచించే కీలక పత్రంగా పరిశీలించవలసి ఉంటుంది.

ఆర్థిక మంత్రి ఉపన్యాసంలో బడ్జెట్ ఏమిటో, బడ్జెట్ ఏమి చేయవలసి ఉందో ప్రశంసనీయమైన మాటలే ఉన్నాయి.

'బడ్జెట్ అంటే చిట్టా పద్దుల పట్టిక కాదు. జీవం లేని అంకెలు, సారం లేని గణాంకాలు కాదు. బడ్జెట్ అంటే తెలంగాణ ప్రజల ఆకాక్షలు. వారి కళ్లలో తొణికిసలాడుతున్న కలలు. వారి ఆశలను ఆకాంక్షలను నిజంచేసే నిర్మాణాత్మకమైన ప్రణాళిక. ప్రజాధనాన్ని ప్రజల నిజమైన అభివృద్ధి కోసం వెచ్చించే గంభీరమైన, బాధ్యతాయుతమైన ప్రక్రియ. ఈ బడ్జెట్ తెలంగాణ నెలకొల్పిన సామాజిక విలువల ఆధారంగా రూపొందించిన సజీవ ఆర్థిక ప్రణాళిక' అనీ, 'ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ నిధులు మళ్లింపుకు గురైనాయి' అనీ, 'ఉద్దేశ్యపూర్వకమైన వివక్షే తెలంగాణ ఉసురు తీసింది' అనీ, 'నేడిది తెలంగాణ రాష్టం. తెలంగాణ ప్రజలు స్వాభిమానంతో తమ భవిష్యత్తును తామే నిర్మించుకునే సత్తా పొందిన స్వరాష్ట్రం. ఇవాళ ఈ నేల మీద ఉత్పత్తి అయ్యే సంపదా, ఇక్కడి ప్రజలు చెమటోడ్చి సృష్టించిన ప్రతి పైసా తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసమే వెచ్చించే చారిత్రాత్మకమైన గొప్ప అవకాశం, అధికారం మనం సాధించుకున్నాం' అనీ, 'ఎవరైతే కాయలు కాసిన భుజాల మీద ఉద్యమ భారాన్ని మోసినారో, ఎవరైతే క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి ఆకాంక్షలను, అవసరాలను అర్థం చేసుకున్నారో, ఎవరు ప్రజలను ఒక్క తాటిమీద నడిపించినారో, ఎవరు

త్యాగాలకు వెనుదీయకుండా యుద్ధరంగంలో ముందుండి నడిచినారో, ఎవరు పోరాటాన్ని విజయతీరానికి చేర్చి గమ్యాన్ని ముద్దాడినారో, వారి నేతృత్వంలోనే ఏర్పడిన ప్రభుత్వం తెలంగాణను ఆశించిన స్థాయిలో అభ్యుదయ పథంలో నడిపించేందుకు నిజాయితీగా రూపొందించిన ఆర్థిక ప్రణాళికల సారం ఈ బడ్జెట్. తెలంగాణ ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం, అట్టడుగు వర్గాల నిజమైన అభివృద్ధి కోసం రూపొందించిన పథకాల సమాహారమే ఈ బడ్జెట్' అనీ, 'బడ్జెట్ రూపకల్పనలో అన్ని నిర్ణయాలకూ తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయో సంక్షేమాలే గీటురాయి. ఈ స్ఫూర్తితోనే ప్రభుత్వం మూడు ప్రాథమ్యాలను గుర్తించింది. ఇందులో మొట్టమొదటిది బలహీన వర్గాల సంక్షేమం. వ్యవసాయ, అనుబంధ రంగాల వికాసం రెండవది. పారిశ్రామిక రంగ అభివృద్ధి మూడవది...' ఆర్థిక మంత్రి బడ్జెట్ ఉపన్యాసంలో ఇటువంటి ఆమోదించదగిన మాటలు ఉన్నప్పటికీ, అవి ఎంతవరకు ఆచరణలోకి వస్తాయనే అనుమానాన్ని కలిగించేలా అంకెలు, ప్రాధాన్యతలు ఉన్నాయి. ప్రకటించిన విధానాలనూ, ప్రణాళికలనూ, పథకాలనూ, అంకెలనూ ఈ మాటల గీటురాయి మీదనే పరిశీలించినా, ఆ లక్ష్యాలు నెరవేరే అవకాశం తక్కువని తెలుతుంది.

బడ్జెట్ గణాంకాలను, ఆర్థిక మంత్రి ప్రకటించిన లక్ష్యాల నేపథ్యంలో పరిశీలించడానికి ముందు, తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవలసిన మూడు అంశాలున్నాయి:

ఒకటి, మామూలుగా బడ్జెట్ గణాంకాలలో ఎప్పుడైనా అంతకు ముందరి ఆర్థిక సంవత్సరపు వాస్తవ గణాంకాలు, గత సంవత్సరపు బడ్జెట్ అంచనాలు, గత సంవత్సరపు సవరించిన అంచనాలు, రానున్న ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ అంచనాలు అనే నాలుగు అంకెలు ఉంటాయి. తెలంగాణ ఏర్పడక ముందు ఉమ్మడి రాష్ట్రంలోని అంకెలను విడదీసి కచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు గనుక ఈ నాలుగు కాలమ్ లలో మొదటి కాలం తెలంగాణ బడ్జెట్ లో ఖాళీగా వదిలేశారు. దాని తర్వాత ఉండే రెండు కాలమ్ లలో గత ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ అంచనాలు, సవరించిన అంచనాలు ఉండాలి. కాని ఆ 2014-15 బడ్జెట్ అంచనాలు పూర్తి సంవత్సరానివి కావు, పది నెలలవి మాత్రమే. నిజానికి ఆ పదినెలల్లో కూడ ఆరునెలలు గడిచిన తర్వాత, నవంబర్ లో బడ్జెట్ ప్రతిపాదన జరిగింది గనుక ఆ అంకెల విశ్వసనీయత సందేహాస్పదం. ఆ బడ్జెట్ అంచనా అంకె యథాతథంగా ఖర్చయి ఉండదు గనుక, ఎక్కువో తక్కువో ఖర్చయి ఉంటుంది గనుక, సవరించిన అంచనాగా మరొక అంకె ఉండవలసి ఉంటుంది. కాని ఇప్పుడు ప్రవేశపెట్టిన 2015-16 బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధి, సాగునీరు, ఇంధనం, రవాణా, సాధారణ విద్య, వైద్యం, నీటి సరఫరా, పారిశుధ్యం, పటణాభివృద్ధి, గృహనిర్మాణం, సంక్షేమం, వివిధ విశ్వవిద్యాలయాలకు కేటాయించిన నిధులు వంటి అనేక చోట్ల బడ్జెట్ అంచనా, సవరించిన అంచనా అంకెలు రెండూ ఏ మార్పూ లేకుండా చూపారు. అంటే కేటాయింపు మొత్తం ఖర్చు పెట్టడమో, వ్యయ అంచనాల్లో వీసమెత్తు మార్పు కూడ లేకపోవడమో జరిగిందన్నమాట. ఎటువంటి సందర్భంలోనైనా అలా జరగడం అసాధ్యం. ఇందుకు కారణం అధికారుల నిర్లక్ష్యం కావచ్చు, ప్రభుత్వమే అంకెల గారడీ చేయదలచుకోవడం కావచ్చు. కనుక మొత్తం మీద ఇటువంటి అంకెలను బట్టి ప్రభుత్వ పనితీరును గాని, భవిష్యత్ ప్రణాళికలను గాని కచ్చితంగా అంచనా వేయడం సాధ్యం కాదు.

రెండు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం వల్ల ఏర్పడిన సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థల విభజన గాని, ఉద్యోగుల, అధికారుల విభజన గాని, ఆదాయవనరుల, అప్పుల విభజన గాని ఇంకా నిర్దిష్టంగా, స్పష్టంగా పూర్తికాలేదు. కనుక ఆదాయం గురించి, వ్యయం గురించి, అప్పుల గురించి ఇక్కడ ప్రకటించిన అంకెల్లో గణనీయమైన మార్పులు ఉండే అవకాశం ఉంది. ఉదాహరణకు, ఉమ్మడి రాష్ట్రం దేశీ విదేశీ సంస్థలకు చెల్లించవలసి ఉండిన ఒక లక్షా నలభై ఎనిమిది వేల కోట్ల రూపాయల అప్పును ఇంకా పూర్తిగా రెండు రాష్ట్రాల మధ్య విభజించలేదు. తాత్కాలిక లెక్కల ప్రకారం తెలంగాణా వాటా అప్పు రు. 61,711 కోట్లు అని తేల్చారు. అప్పు ఎంతో కచ్చితంగా తేలితే గాని అసలు, వడ్డీ చెల్లింపులకు ఎంత కేటాయించవలసి ఉంటుదో తేలదు.

మూడు, ఉద్యమ క్రమంలో నాయకుల వాగ్దానాలు విపరీత స్థాయిలో ఉండినందువల్ల కొంత, గత కాలపు సమస్యలన్నిటినీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు దానికదే తొలగిస్తుందనే ఆశల వల్ల కొంత ప్రజల ఆకాంక్షలు విస్తృతంగా పెరిగాయి. ఆ ఆకాంక్షలను తీర్చే సాధనాలలో ఒకటిగా బడ్జెట్ మీద చాల బాధ్యతలు వచ్చిపడ్డాయి. కాని వివిధ కారణాల వల్ల బడ్జెట్ కు ఆ శక్తీ లేదు, పాలకవర్గాలకు ఆ కోరికా లేదు. పైగా ఆ ఆకాంక్షలను తీర్చడం రాత్రికి రాత్రి మంత్రదండంతో సాధ్యమయ్యే పని కాదు. ఆ సమస్యలు చారిత్రకంగా, దశాబ్దాల మీద ఏర్పడ్డాయి గనుక, ఆ ఆకాంక్షలు కూడ కొన్ని దశాబ్దాలుగా రూపు దిద్దుకుంటున్నాయి గనుక ఒక క్రమబద్ధమైన పద్ధతి ప్రకారం, వార్షిక లక్ష్యాలు విధించుకుని, తగిన కేటాయింపులు చేసి, సక్రమంగా అమలు చేస్తేనే అవి సాధ్యమవుతాయి. ఈ బడ్జెట్ అందులో విఫలమైందని చెప్పక తప్పదు. ఉద్యమ క్రమంలో వెలికివచ్చిన వాస్తవికమైన, న్యాయమైన ప్రజా ఆకాంక్షలను నెరవేర్చడం తెలంగాణ ప్రభుత్వపు ప్రథమ, ప్రధాన కర్తవ్యం అవుతుంది. జయశంకర్ నిర్వచించినట్టు నీళ్లు, నిధులు, నియామకాలు అనుకున్నా, ఇతరులు నిర్వచించినట్టు స్వపరిపాలన, స్వావలంబన, ఆత్మగౌరవం, స్థానికులకే స్థానిక వనరుల మీద అధికారం, ఇతర ప్రాంత వాసుల దోపిడీ తొలగిపోవడం అనుకున్నా అవన్నీ సాధించడం ఒక్కరోజులో, ఒక సంవత్సరంలో సాధ్యం కాదని గుర్తిస్తూనే, అసలు ప్రభుత్వ ప్రయాణం ఆ దిశగానైనా ఉన్నదా, ఆ ప్రయాణ దిశను ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తున్నదా అని పరిశీలించవలసి ఉంటుంది.

ఇక్కడ బడ్జెట్ లో జరిగిన కొన్ని మాయల గురించి చెప్పుకోవాలి.

ఆర్థిక వ్యవహారాలలో కేంద్ర రాష్ట్ర సంబంధాలను, ఆదాయ వ్యయాలను నిర్ణయించే రాజ్యాంగబద్ధ సంస్థ పద్నాలుగో ఆర్థిక సంఘం ఇటీవలనే రూపొందించిన నివేదికలో, తెలంగాణ ప్రభుత్వానికి సొంత పన్నులు, పన్నేతర ఆదాయాలు కలిసి రు. 57,426 కోట్లు ఆదాయం ఉంటుందని అంచనా వేసింది. కాని ప్రస్తుత తెలంగాణ బడ్జెట్ ఇవే పద్దుల కింద ఆదాయాన్ని రు. 68,907 కోట్లుగా చూపింది. ఇక్కడ ఉన్నవి రెండు ఖాతాలు మాత్రమే గనుక ఆ రెంటిలోనో, వాటిలో ఏదో

ఒక దానిలోనో ఈ సంవత్సరంలో హఠాత్తుగా పెరుగుదల కనబడి ఈ రు. 11,481 కోట్లు వస్తాయని అనుకోవాలి. అంటే పన్నుల పెరుగుదల అయినా ఉండాలి. లేదా, పన్నేతర ఆదాయం (ప్రధానంగా అప్పులు) అయినా పెరగాలి. ఏది జరిగినా ప్రజల మీద అదనపు భారం పడుతుంది.

భూముల అమ్మకం ద్వారా పన్నేతర ఆదాయం పెంచుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఒక సూచన బడ్జెట్లోనే ఉంది. భూముల అమ్మకాల ద్వారా రు. 13,500 కోట్లు సమకూరుతాయని బడ్జెట్ అంచనా వేసింది. ఐదు సంవత్సరాల అధికార నిర్వహణకు వచ్చిన ప్రభుత్వం తరతరాలుగా వారసత్వంగా వస్తున్న ప్రజా ఆస్తులను ఇలా అమ్మవచ్చునా అనే విస్తృతమైన ప్రశ్న కూడ అడగనక్కరలేదు. ఒకవేళ అలా అమ్మజూపినా అన్ని నిధులు సంపాదించడం సాధ్యమేనా అనే ప్రశ్న కూడ ఉంది. గత కొద్ది సంవత్సరాలుగా హైదరాబాదు లోనూ, తెలంగాణ లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించిందని, భూముల అమ్మకాలు గతంలో లాగ జోరుగా జరగడం లేదని వార్తలు వస్తున్నాయి. తెరాస ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ను ప్రోత్సహించడానికి ఎంత ప్రయత్నించినా ఫలితాలు కనబడడం లేదు. గత బడ్జెట్ లో భూముల అమ్మకాల ద్వారా రు. 6,500 కోట్లు వస్తాయని అంచనా వేసినప్పటికీ, రు. 120 కోట్లు మాత్రమే వచ్చాయి. కనుక ఈ అంకె విశ్వసనీయత ప్రశ్నార్థకమే. కాగా రిజిస్ట్రేషన్ల ద్వారా రు. 3750 కోట్లు వస్తాయని ప్రస్తుత బడ్జెట్లో అంచనా వేశారు. గత బడ్జెట్ లో రు. 2583 కోట్లు వస్తాయని అంచనావేయగా ఆ స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరిగిన దాఖలా లేదు. కాని సవరించిన అంచనాలలో కూడ అదే అంకె చూపారు. ఈ సంవత్సరానికి ఆ అంకె కన్న రు. 1233 కోట్లు ఎక్కువ చూపుతున్నారంటే అది రిజిస్ట్రేషన్ రుసుమును పెంచడం ద్వారా సాధిస్తారనుకోవాలి.

అలాగే మద్యం అమ్మకాల ద్వారా, లైసెన్సు రుసుము ద్వారా రు. 12,207 కోట్ల ఆదాయం ఉంటుందని ప్రస్తుత బడ్జెట్ లో అంచనా వేశారు. ఇది గత సంవత్సరం ఆదాయం కన్న రు. 3,080 కోట్లు ఎక్కువ. అంటే ఆ మేరకు మద్యం అమ్మకాలను పెంచాలని ప్రభుత్వం ఆశిస్తున్నదన్నమాట.

ఇలా అదనపు పన్నుల ద్వారా, పన్నేతర ఆదాయం ద్వారా నిధుల సమీకరణ, రియల్ ఎస్టేట్ కు ప్రోత్సాహం, మద్యం అమ్మకాలు పెంచడానికి ప్రయత్నాలు చర్యలేవీ తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలో భాగమైనవి కాకపోగా, వ్యతిరేకమైనవి కూడ. పోనీ, ఇటువంటి చర్యల ద్వారా నిధుల సేకరణ జరిపి, అభివృద్ధి కార్యక్రమాల మీద వెచ్చించి, తద్వారా తెలంగాణ సర్వతోముఖాభివృద్ధిని సాధించాలని ఆశిస్తున్నారా అంటే అందుకు కూడ సూచనలు తక్కువ. బడ్జెట్ ఉపన్యాసంలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నట్టుగానే షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, షెడ్యూల్డ్ తెగల సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం, మైనారిటీ సంక్షేమం, మహిళా శిశు సంక్షేమం, ఉద్యోగుల సంక్షేమం, వంటి ఆనవాయితీ అంశాలు ఉన్నాయి. ఆ ఆనవాయితీ అంశాలతో పాటు, కొన్ని కొత్త అంశాలను ప్రవేశపెట్టడం ప్రతి ప్రభుత్వమూ చేస్తూ వస్తున్న పనే. ఆ విధంగానే ఈ బడ్జెట్ కూడ షెడ్యూల్డ్ కులాల, తెగల ఉప ప్రణాళిక, ఆసరా పింఛన్లు, ఆహార భద్రత, వసతి గృహాలకు, పాఠశాలలకు సన్న బియ్యం, కళ్యాణ లక్ష్మి వంటి కొన్ని కొత్త అంశాలను ప్రవేశపెట్టింది. ఆయా పద్దుల కింద ఎంతో కొంత కేటాయింపులు ఉన్నప్పటికీ, సంవత్సరం ముగిసేసరికి ఆ కేటాయింపులు సక్రమంగా అమలు జరగకపోవడమో, జరిగినా నిజంగా అవసరమైన ప్రజలకు చేరకపోవడమో ఆరు దశాబ్దాలుగా జరుగుతూ వస్తున్నదే. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజల ఆశలను తీర్చడానికి ఈ సంక్షేమ చర్యల సక్రమ అమలుకు ఏ చర్యలు తీసుకోనున్నదనే ప్రణాళికలు ఎక్కడా లేవు. అసలు ఆయా వర్గాల, బృందాల ప్రజలను సంక్షేమం, సహాయం అవసరం లేని, సొంత కాళ్లమీద నిలబడడానికి వీలు కల్పించే మౌలికంగా బలోపేతం చేసే చర్యలు ఏమి తీసుకుంటున్నారనేదే ఏ ప్రభుత్వ పనితీరుకైనా గీటురాయి అవుతుంది. భూసంస్కరణలు, ఉద్యోగ కల్పన దిశగా పారిశ్రామికీకరణ, ఉపాధి అవకాశాలు పెరిగేలా సామాజికాభివృద్ధి వంటి చర్యలు చేపడితే తప్ప పునాది బలపడదు. ఆ పునాదిని బలపరచకుండా సంక్షేమచర్యల మీద కేంద్రీకరించడం శిథిలమవుతున్న భవనానికి మరమ్మత్తులు చేయకుండా పూత మీద పూత సున్నం కొట్టడమే అవుతుంది.

బడ్జెట్ లో యథావిధిగా వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధి, విద్యుత్తు, నీటి పారుదల, రహదారుల అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, పట్టణాభివృద్ధి, అడవులు, పర్యావరణం, సాంస్కృతిక పర్యాటక రంగాలు, పోలీసు, ప్రజా రక్షణ వంటి అంశాలతో పాటు జలహారం, మిషన్ కాకతీయ, దళితులకు భూపంపిణీ వంటి కొత్త కార్యక్రమాలు కూడ ఉన్నాయి. వీటిలో ప్రతి ఒక్క రంగంలోనూ ప్రణాళికల, కేటాయింపుల దృష్టి తెలంగాణ ప్రజా ప్రయోజనాల కన్న ఇతర ప్రయోజనాల మీద ఉన్నదో వివరంగా చర్చించవచ్చు గాని ఇక్కడ రెండు మూడు ఉదాహరణలు చూస్తే సరిపోతుంది. మత, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, పోలీసులను బలోపేతం చేయడానికి, బహుళజాతి సంస్థలను, ఆరు దశాబ్దాలుగా దోపిడీ పీడన వివక్ష అమలు చేసిన ఆంధ్ర పారిశ్రామిక, వ్యాపారవేత్తలను ఆకర్షించడానికి చేస్తున్న ప్రయత్నాలతో పోలిస్తే తెలంగాణ ప్రజా ప్రయోజనాలు, ఉద్యమ ఆకాంక్షలు వెనుకపట్టు పడుతున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన పథకం మిషన్ కాకతీయ పేరుతో జరగనున్న చెరువుల పునరుద్ధరణ. సూత్రబద్ధంగా ఇది చాల అవసరమైన, ఉపయోగకరమైన కార్యక్రమం. 'తెలంగాణ పల్లెలకు మళ్లీ జవజీవాలు తెచ్చేందుకు చెరువుల పునరుద్ధరణకై ప్రభుత్వం నడుం కట్టింది. చెరువును బతికించి తద్వారా పల్లెలను బతికించే ఈ పునర్నిర్మాణానికి మిషన్ కాకతీయ అని పేరుపెట్టి ఒక మహాసంకల్పానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చెరువు బాగుంటే ఊరు బాగుంటుంది. సకల వృత్తులూ పునరుజ్జీవనం పొందుతాయి. మత్స్యకారుల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. భూగర్భ జలాలు పెరిగి పల్లెలు పచ్చని ప్రాంతాలుగా మారుతాయి' అని బడ్జెట్ ఉపన్యాసం చెప్పిన మాటతో అంగీకరించని వారు ఉండరు. కాని చెరువుల పునరుద్ధరణకు జరగవలసింది పూడిక తీయడం, కట్టలను బలోపేతం చేయడం మాత్రమే కాదు. ఆ పనులతో సమానంగా, వాటికన్న మిన్నగా వాగులూ వంకలూ సక్రమంగా పారేలా చూసినప్పుడే చెరువులు నిండుతాయి. అంటే ఇసుక

తవ్వకాలను పెద్ద ఎత్తున నియంత్రించాలి. చెరువుల ఆరగాణి ప్రాంతంలో అడవులను కొట్టకుండా, కొండలను పేల్చేయకుండా, అడ్డగోలు నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకుండా ఉండాలి. అంటే చెరువుల పునరుద్ధరణ ఒక నిర్మాణచర్య మాత్రమే కాదు, అది రాజకీయార్థిక చర్య, సామాజిక, సాంస్కృతిక చర్య, విలువల చట్రం మారవలసిన చర్య. అది జరగకుండా పూడిక తీయడం మాత్రమే జరిగితే రాబోయే మార్పేమీ ఉండదు. ఆ పూడిక తీసే, కట్టలు పోసే పని కూడ మానవశ్రమను ఉపయోగించి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడ కలిపి చేసి ఉంటే కనీసం గ్రామీణ నిరుద్యోగులకు పని అయినా దొరికేది. కాని, ఈ పనులు యంత్రాల ద్వారా మాత్రమే జరగాలని నిర్దేశించడం ద్వారా ప్రభుత్వం ఈ పథకాన్ని ఎర్త్ మూవర్ల, బుల్డోజర్ల, ట్రక్కుల, ట్రాక్టర్ల అమ్మకందార్లకు, యజమానులకు లాభాలు చేకూర్చి పెట్టేదిగా మార్చింది. ఇప్పటికే శాసనసభ్యులు, వారి ఆశ్రితులైన పెత్తందార్లు ఈ వాహనాలను కొని ఇబ్బడి ముబ్బడిగా సంపాదిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. కనుక ఒక మంచి, ప్రజోపయోగకరమైన కార్యక్రమం కూడ తగిన విధినిషేధాలు రూపొందించకపోతే ఎలా స్వార్థపరశక్తుల పాలవుతాయో ఇది ఉదాహరణ.

అలాగే భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి మూడు ఎకరాల భూమి కొని ఇచ్చే పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. కొని ఇవ్వవచ్చునా, అలా కొని ఇవ్వాలంటే ఎన్ని నిధులు కావాలి, అవి ఎలా సమీకరిస్తారు వంటి సమస్యలు కూడ ఇప్పుడు చర్చించనక్కరలేదు. కాని, రాష్ట్రంలో భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలు ఆరు లక్షల పైచిలుకు అని ప్రభుత్వ లెక్కలే చెపుతున్నాయి. అంటే కావలసింది పద్దెనిమిది లక్షల ఎకరాలు. గత ఆగస్ట్ లో మొదలైన ఈ కార్యక్రమం కింద సేకరించడానికి అవకాశం ఉన్న భూమి లెక్కలు తేల్చమని జిల్లా కలెక్టర్లను ఆదేశించగా, ఈ ఏడు నెలలలో వారు చెప్పిన లెక్క 1900 ఎకరాలు. అంటే ప్రభుత్వం నిర్దేశించుకున్న కర్తవ్యంలో ఇప్పటికి సాధ్యమయినది 0.001 శాతం. ఈ లెక్కన కార్యక్రమం ఎప్పటికి సఫలమవుతుందో ఎవరైనా ఊహించవచ్చు.

ఇక పారిశ్రామికాభివృద్ధి గురించీ, పారిశ్రామికవేత్తలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న ఇరవై లక్షల ఎకరాల భూమి గురించీ, సింగిల్ విండో గురించీ బడ్జెట్ గంభీరమైన ప్రకటనలు చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితం మూసివేతకు గురైన ప్రభుత్వ, ప్రైవేటు, సంయుక్త రంగ పరిశ్రమల పునరుద్ధరణ గురించి మాట మాత్రం కూడ లేదు. ఈ బడ్జెట్ ప్రవేశపెడుతున్న సమయానికి సిర్పూర్ కాగితపు మిల్లు మూతబడి మూడువేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఆ కార్మిక సంఘం అధ్యక్షుడు స్వయంగా రాష్ట్ర మంత్రి. కాని పరిశ్రమను పునరుద్ధరించడానికి ప్రయత్నించాలని అనిపించనంత ఘనత వహించిన పారిశ్రామికాభివృద్ధి వ్యూహాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్నది.

ఉద్యమ స్ఫూర్తి ఇంకా తగ్గలేదు గనుక, ఆరు దశాబ్దాల పరాయి పాలన మీద కోపం ఇంకా తగ్గలేదు గనుక, కొత్త ప్రభుత్వానికి సమయం ఇద్దామని వేచి చూస్తున్నారు గనుక ప్రజలు ఈ దారిమళ్లిన విధానాల మీద మౌనంగా ఉన్నట్టు కనబడుతున్నారేమో గాని ఈ విధానాలను ఇలాగే కొనసాగిస్తే, పెరిగే అసంతృప్తి పాలకులకు ప్రమాదకరంగా మారుతుంది.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

వీక్షణం విడి ప్రతి కొనుగోలుదారులకు
ఒక క్షమాపణ, ఒక విజ్ఞప్తి

వీక్షణం పాఠకులలో దాదాపు సగం మంది వీక్షణంకు చందాదారులు కారు, ఏనెలకానెల తమ తమ ప్రాంతాలలో వార్తాపత్రికలు అమ్మే దుకాణాలలో విడి ప్రతి కొనుక్కుని చదువుతుంటారు. గత రెండు నెలలుగా ఆ దుకాణాలలో వారికి వీక్షణం దొరకడం లేదు. రెండు రాష్ట్రాలలోని దాదాపు 300 న్యూస్ స్టాల్స్‌లో వీక్షణం పంపిణీ చేస్తూ ఉండిన ఆనంద్ ఏజెన్సీస్ వీక్షణంను ఇప్పుడు పంపిణీ చేయడం లేదు. మరొక రాష్ట్ర వ్యాప్త సోల్ ఏజెన్సీ గాని, ఎక్కడికక్కడ ఏజెన్సీలు గాని ఏర్పడేవరకూ న్యూస్ ఏజెంట్ల దగ్గర వీక్షణం దొరకదని చెప్పడానికి చింతిస్తున్నాం. పాఠకులకు కలుగుతున్న ఈ అసౌకర్యానికి క్షమించవలసిందిగా కోరుతున్నాం.

ఇప్పటిదాకా ఏనెలకానెల విడిప్రతి కొనుక్కుంటున్న పాఠకులు, అభిమానులు చందాదారులుగా చేరవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం. ఎక్కువ కాపీలు అమ్మకం అయ్యే ప్రాంతాలలో, పట్టణాలలో కొత్త, నమ్మకమైన ఏజెంట్లను ఏర్పాటు చేయవలసిందిగా మిత్రులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

- సర్క్యులేషన్ మేనేజర్
9949391028

పాత వాసనలు వదలని ఎపి బడ్జెట్

బడ్జెట్ కేటాయింపుల్లో ప్రజల మౌలిక అవసరాల మీద కోత విధించి, ప్రైవేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ముందుకు తెచ్చి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోజూస్తున్నదని అంటున్నారు **డా. శ్రీనివాస్ చొప్పర**

'నమ్మి నానబోసుకుంటే పుచ్చి బుర్రలైనవి' అన్న చందంగా నేను మారాను! నన్ను నమ్మండి! అధికారం కోల్పోయిన తొమ్మిది సంవత్సరాలు నేను ఎంతో నేర్చుకున్నాను. రాష్ట్ర ప్రజల అవసరాలు తెలిసొచ్చాయి. నేను చాలా మారాను!' అని చెప్పినప్పుడు రాష్ట్ర ప్రజలు నిజమని నమ్మారు. నానబోసుకున్నారు. తను కూడా ఊహించని మెజారిటీతో అధికారం కట్టబెట్టారు. కాని విజన్ 2020కి బదులుగా విజన్ 2029 అనే అంకెలు మార్చి పాతపాట లంకించి నన్ను నమ్మడం మీరు చేసిన నేరమన్నాడు. పదే పదే నిరూపిస్తున్నాడు. గత ఆగస్టులో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఇది మధ్యంతర బడ్జెట్, వచ్చే బడ్జెట్ పూర్తిస్థాయి బడ్జెట్ కాబట్టి నేనేంటో అప్పుడు తెలుస్తుందని నమ్మబలికాడు. పూర్తిస్థాయి బడ్జెట్ రానే వచ్చింది; ఆ ముసుగు తొలగిపోయింది.

అద్దంలో ముఖం కనిపించినట్లుగా బడ్జెట్‌లో ప్రభుత్వ పనితీరు కనిపిస్తుంది. ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యకలాపాలు, వాటిని నిర్వహించడానికి కావలసిన ద్రవ్య వనరులను సమకూర్చుకునే పద్ధతులు బడ్జెట్ తెలియజేస్తుంది. అంత ప్రాధాన్యతగల బడ్జెట్ అంకెల వెనుకున్న మతలబుని పరిశీలించాలి. రాష్ట్రాన్ని ఎటువైపు తీసుకెళ్లుతున్నారో అర్థం చేసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2015-16 ఆర్థిక సంవత్సరానికి గాను మార్చ్ 12న సాధారణ బడ్జెట్ (13న వ్యవసాయ బడ్జెట్) ప్రవేశపెట్టింది. రాష్ట్ర విభజన తరువాత సాంకేతికంగా రెండవ బడ్జెట్ అయినప్పటికీ ఇది మొదటి పూర్తిస్థాయి బడ్జెట్. ఈ బడ్జెట్ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్స్ – పిపిపి) తో ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేసింది. సంక్షేమ రంగానికి నిధుల కోత విధించింది.

2015-16 బడ్జెట్ స్వరూపం (రు. కోట్లలో)

మొత్తం బడ్జెట్	1.13,049
ప్రణాళికా వ్యయం	34,412
ప్రణాళికేతర వ్యయం	78,637
రెవెన్యూ లోటు	7,300
ఆర్థిక లోటు	17,584
రాష్ట్ర సొంత ఆదాయం (పన్నుల రూపంలో 44,423) (పన్నేతర రూపంలో 5,341)	49,764
కేంద్ర ప్రభుత్వం ద్వారా (పన్నులలో వాటా 22,638) ((గ్రాంట్ 17,722)	40,360
అప్పు (మార్కెట్ రుణం)	22,825
మొత్తం బడ్జెట్	1,13,049

ప్రజలపై మరిన్ని భారాలు మోపనుంది. రు. 1,13,049 కోట్ల ఆర్థిక లోటును ప్రతిపాదించింది. అలానే రు. 34,412 కోట్ల ప్రణాళికా వ్యయం (30 శాతం), రు. 78,637 కోట్ల ప్రణాళికేతర వ్యయం (70 శాతం) గా ఉన్నది. ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయాల పొందికను అంటే నిష్పత్తిని బట్టి ఆ ప్రభుత్వ ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. ప్రణాళికా వ్యయం కనీసంగా 50 శాతం పైబడి ఉండాలి. తద్వారా ఆస్తులు సమకూరడమే కాకుండా ప్రాధాన్యతా రంగాలకు నిధులు పెరుగుతాయి. అందుకు భిన్నంగా ప్రణాళికేతర వ్యయం పెరగడమంటే ప్రజలకు ఉపాధి కల్పించే వ్యయం కాకుండా వృథా ఖర్చునే ఎక్కువ పెట్టడానికి ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అర్థం.

మొత్తం బడ్జెట్‌లో ద్రవ్య వనరులు సమీకరణను పరిశీలించినపుడు మార్కెట్ రుణాలు రు. 22,825 కోట్లు తేవడాన్ని బడ్జెట్ చూపింది. మరోవైపు రెవెన్యూ లోటు 7,300 కోట్లు. అంటే ఈ రెండింటినీ కలిపితే బడ్జెట్‌లో 26.64 శాతం లేని ఆదాయాన్ని చూపినట్లయింది. బడ్జెట్ రు. 17 వేల కోట్ల భారీ ఆర్థిక లోటుతో, భారీ ప్రణాళికేతర వ్యయం చూపడమంటే ప్రజలపై పెనుభారం మోపడానికి ప్రభుత్వం పూనుకున్నట్లే.

ఆదాయ వనరుల లక్ష్యాలను భారీగా పెంచిన ఆర్థిక మంత్రి ఆ వనరుల సమీకరణ విషయంలో హేతుబద్ధత చూపలేదు. మొత్తం రెవెన్యూ వసూళ్ల అంచనా రు. 90,125 కోట్లు. అందులో రాష్ట్ర సొంత ఆదాయ వనరుల అంచనా రు. 49,764 కోట్లు, దానిలో సొంత పన్ను ఆదాయం కింద రు. 44,423 కోట్లు అంచనా వేసింది. గత ఏడాది బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఇది రు. 7,026 కోట్లు అధికం. ప్రభుత్వం పన్నుల్లో 18 శాతం వృద్ధిని అంచనా వేసింది. అంటే ఆ మేరకు ప్రజలపై కొత్త పన్నులు విధిస్తుందని గుర్తించాలి. బడ్జెట్‌లో కొత్త పన్నులు విధించలేదని ప్రకటించిన ఆర్థికమంత్రి భారీ లోటును భర్తీ చేయడానికి సహజ వృద్ధిని సాకుగా చూపుతున్నాడు. కానీ రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ లెక్కల ప్రకారమే 238 మండలాలు కరువు మండలాలు, మరోవైపు రాష్ట్ర రాజధాని నిర్మాణం పేరుతో మూడు కార్లు పండే పంట భూములు 33 వేల ఎకరాలను స్వాధీనం చేసుకున్న తరువాత రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో పెరుగుదలను అంటే సహజ వృద్ధిని ఆశించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే.

గత ఏడాది రు. 28,749 కోట్ల అమ్మకం పన్ను లక్ష్యాన్ని ఈ ఏడాది రు. 4091 కోట్లు పెంచి రు. 32,840 కోట్లు రాబట్టాలని అంచనా వేసింది. వాణిజ్య పన్నులన్నీ వినియోగం ప్రాతిపదికనే ఉంటాయి కాబట్టి అవి ద్రవ్యోల్బణం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఆధారంగా సహజంగానే పెరుగుతుంటాయని ఆర్థిక మంత్రి అన్నాడు. అంటే నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించే చర్యలు ఏమీ చేపట్టేది లేదని చెప్పకనే చెప్పడం. అంటే నిత్యవసర వస్తువుల ధరలు పెరగడం ఖాయం. మరోవైపు ఎన్నడూ లేని విధంగా ఎక్సైజ్ పన్ను లక్ష్యాన్ని రు. 4,680 కోట్లుగా నిర్ణయించింది. గత బడ్జెట్ కంటే రు. 653 కోట్లు

పెంచింది. బెల్ట్‌షాపులను రద్దుచేస్తానని చెప్పిన ఎన్నికల వాగ్దానాన్ని మరిచి మద్యాన్ని మరింత పారించి ప్రజల బలహీనతను సొమ్ము చేసుకోవాలని చూస్తుంది. బడ్జెట్‌తో సంబంధం లేకుండానే పన్నులు విధించే ఆనవాయితీ ఉండనే ఉంది. కాబట్టి రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలు పన్నుల భారాన్ని తప్పించుకోజాలరు.

నేటికీ రాష్ట్ర ప్రజలలో 64 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. అలాంటి కీలకమైన వ్యవసాయ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నది. సహజంగా వరద కోతకు గురయ్యే వ్యవసాయం ఇటీవల నిధుల కోతకు గురవుతుంది. ఆ కోత రైతుని వ్యవసాయం నుండి గెంటివేసే పరిస్థితిని తెచ్చింది. వరద కోతను నివారించగలమేమో గాని నిధుల కోతను, పాలకుల నిర్లక్ష్యాన్ని నివారించలేక పోతున్నామని రైతు ఆవేదన చెందుతున్నాడు.

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పేరుతో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రు. 14,184 కోట్లు కేటాయించింది. ఇందులోనే రైతు రుణమాఫీ పద్దును, ఉచిత విద్యుత్‌ను, ఉపాధిహామీ పద్దును చేర్చారు. వీటన్నింటికి పోను వ్యవసాయానికి మిగిలింది రెండు శాతం నిధులు మాత్రమే. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్నిరకాల రుణ మాఫీలను కలుపుకుంటే రు. 95 లక్షలకు పైమాటే. కానీ అధికారం చేపట్టిన తరువాత అది రు. 37,900 కోట్లు, ఆ తదుపరి ప్రభుత్వ అంచనాల ప్రకారం రు. 20 వేల కోట్ల రూపాయలు మాత్రమే అని తేల్చి ప్రభుత్వ అసలు రూపాన్ని ప్రదర్శించింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రు. 4300 కోట్లకు తగ్గించారు. గత బడ్జెట్ కంటే తగ్గించారు. ప్రస్తుతం రెండో దశ కిందకి వచ్చే రైతులతో పాటు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వర్తింపజేసిన తర్వాత 50 వేల రూపాయల లోపు రుణ పరిధిలోకి వచ్చే రైతులకు ఏక మొత్తంగా ఒకేసారి రు. 50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీనంతటికీ సుమారు రు. 700 కోట్లు తగ్గించారు. కౌలు రైతుల గురించి ప్రస్తావించనే లేదు. ఫలితంగా ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కాస్త రైతునే మాఫీ చేసేట్లు మారింది. కరువు కోరల్లో చిక్కుకొని దిక్కుతోచక వలసబాట పట్టిన వ్యవసాయ కూలీలను గూర్చి చర్యలేమీ ప్రస్తావించలేదు. పైగా వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రాథమిక రంగ మిషన్‌లో చేర్చామనీ, ఆ రంగంలో పిపిపి పద్ధతులను పెద్దఎత్తున చేపట్టబోతున్నామని మంత్రి ప్రకటించాడు.

వ్యవసాయానికి ఆయువుపట్టు సాగునీటి రంగం. అలాంటి దానికి బడ్జెట్ కేటాయింపులలో భారీకోత విధించారు. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయడానికి 27 వేల కోట్ల రూపాయలు అవసరమని ప్రభుత్వ లెక్కలే చెపుతుండగా కేవలం రు. 5258 కోట్లు మాత్రమే కేటాయించారు. గత బడ్జెట్ కంటే రు. 8626 కోట్లు అంటే 37 శాతం తక్కువగా కేటాయించారు. ఆ మొత్తంలో ప్రపంచ బ్యాంకు నుండి వస్తాయని అంచనా వేసినది రు. 1765 కోట్లు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ ప్రాధాన్యతగా నిర్ణయించిన ఆ భారీ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి రు. 15,255 కోట్లు అవసరం కాగా అందులో పదో వంతు కూడా కేటాయింపు జరగలేదు. ఈ రంగంలో పిపిపిని పెంచడానికి తగిన భూమికను ఏర్పాటు చేయడంలో భాగమే ఇది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు జలయజ్ఞం పేరుతో కాంట్రాక్టర్లను కోటీశ్వర్లుగా చేశాయి తప్ప తొమ్మిది సంవత్సరాలలో అదనంగా ఒక్క ఎకరానికి చుక్క సాగునీరు అందించలేదు. ఈ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సాగునీటి వ్యవస్థను పూర్తిగా ప్రైవేట్‌పరం చేసి బహుళజాతి కంపెనీలకు అప్ప జెప్పడానికి సిద్ధమైంది. ప్రపంచబ్యాంకు ఆదేశాలను పొల్లుపోకుండా అమలు చేస్తుంది. అందులో భాగమే ఇటీవల ముంబాయిలో జరిగిన విదేశీ కంపెనీల సదస్సులో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు తమ రాష్ట్రంలో పది లక్షల ఎకరాల సాగుభూమి సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని తమ రాష్ట్రానికి రావలసిందిగా ఆహ్వానించడం. విశాఖలో 45 బహుళజాతి కంపెనీల సమావేశంలో వ్యవసాయ మంత్రి ప్రతిపాదనలలో గానీ, తన బడ్జెట్ ప్రసంగంలోగాని వ్యవసాయ రంగంలో పిపిపి విధానం వల్లించని రోజు లేదు.

విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక లోటుకూ, ఈ బడ్జెట్‌లో చూపిన కేటాయింపులకూ పొంతనలేదు. 7716 కోట్ల రూపాయల లోటును పూడ్చుకునేందుకు ఇప్పటికే రు. 1261 కోట్ల మేర చార్జీల పెంపుకు ప్రతిపాదించిన విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రభుత్వం నుంచి సబ్సిడీల రూపంలో రు. 6455 కోట్లు వస్తాయని ఆశించాయి. కాని బడ్జెట్‌లో రు. 4360 కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో రు. 2094.49 కోట్ల లోటు ఏర్పడనుంది. వెరసి రానున్న రోజుల్లో రు. 3355 కోట్ల మేర విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడనుంది.

సంక్షేమ రంగం ప్రభుత్వానికి రెండో కన్ను అని ప్రభుత్వం అనేక సార్లు ప్రస్తావించింది. మాటల్లో తప్ప చేతల్లో కానరాని వైనం ఈ బడ్జెట్ ద్వారా తెలుస్తుంది. గత బడ్జెట్‌లోనే అరకొర నిధులు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఒక్క ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ నిధులలో రు. 691 కోట్లు కోత విధించి సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టింది. ఎస్‌సిల సంక్షేమానికి ఈ ఏడాది బడ్జెట్‌లో రు. 534 కోట్లు కోత విధించారు. గత ఏడాది రు. 2657 కోట్లు కేటాయిస్తే ఇప్పుడు రు. 2123 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇక రాష్ట్రంలో 28 లక్షల జనాభా ఉన్న గిరిజనుల సంక్షేమానికి రు. 157 కోట్లు కోత విధించారు. రు. 1150 కోట్ల నుండి రు. 993 కోట్లకు కుదించారు. బిసిల సంక్షేమానికి అతి తక్కువగా రు. 3231 కోట్లు, మైనారిటీల సంక్షేమానికి రు. 379 కోట్లు, వికలాంగుల సంక్షేమానికి రు. 45 కోట్లు మాత్రమే నిధులు విదిలించారు. ఒకపక్క రాష్ట్రంలో సంక్షేమ వసతి గృహాలు విద్యార్థుల సంక్షేమానికి బదులుగా సమస్యలు పెంచుతున్నాయి. దళిత విద్యార్థులకు విదేశీ విద్య మిథ్యగానే మిగిలిపోయింది.

ఈ బడ్జెట్‌లో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ కింద గత బడ్జెట్ కంటే నిధుల కేటాయింపు కొంత మేర పెరిగినప్పటికీ అసలు సమస్య కేటాయించిన నిధుల ఖర్చు విషయంలో చిత్తశుద్ధి లోపించడమే. గత పదేళ్లలో అంచనాలకు మించి ఖర్చు చేసిన బడ్జెట్‌గా 2014-15 బడ్జెట్‌ను కీర్తిస్తున్న ప్రభుత్వం, ప్రణాళికేతర వ్యయాన్ని పెంచి ఖర్చు చేయగా ప్రణాళికా వ్యయాన్ని రు. 3924 కోట్ల మేర తక్కువగా ఖర్చు చేసింది. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు కేటాయింపులు ప్రణాళికా వ్యయం నుండే జరుగుతాయి. అలాంటి ప్రణాళికా వ్యయాన్ని పూర్తిగా ఖర్చు పెట్టకపోవడమంటే సబ్‌ప్లాన్ నిధులను పూర్తిగా ఖర్చు పెట్టకపోవడమే. ఆ మేరకు 2014-15 బడ్జెట్‌లో ఎస్‌సి సబ్‌ప్లాన్ కింద రు. 4576 కోట్లు కేటాయించగా ఫిబ్రవరి వరకు రు. 2770 కోట్లు అంటే 65 శాతం మాత్రమే ఖర్చు చేశారు. ఎస్‌టి సబ్‌ప్లాన్ కింద రు. 1500 కోట్లు కేటాయించగా 1040 కోట్లు అంటే 69 శాతం నిధులు మాత్రమే ఫిబ్రవరి నాటికి ఖర్చు చేశారు. అంటే రెండు సబ్‌ప్లాన్‌ల కింద ఖర్చు చేయకుండా మిగిలించినది రు. 2266 కోట్లు. కాబట్టి సబ్‌ప్లాన్‌ల కింద కేటాయింపు చూపుతున్నారు తప్ప ఆ కేటాయింపులను ఖర్చు చేయకుండా ఆ ప్రజలను దగా చేస్తున్నారు. అలానే ప్రణాళికా వ్యయం పెరిగితే ఆ మేరకు సబ్‌ప్లాన్ నిధులు పెరుగుతాయి. కాని గత బడ్జెట్, ప్రస్తుత బడ్జెట్‌లోనూ ప్రణాళికా వ్యయం తక్కువగా చూపించి సబ్‌ప్లాన్ నిధులకు గండి కొడుతున్నారు. ఈ బడ్జెట్‌లో బిసి సబ్‌ప్లాన్ గూర్చి ప్రస్తావనే లేదు. ఇది ఎన్నికల వాగ్దానానికి పాతర వేయడం, బిసిలను దగా చేయడం.

వృద్ధాప్య, వితంతు పింఛన్‌ను ఒకేసారి ఐదు రెట్లు పెంచిన ఘనత ఒక చంద్రబాబుకే దక్కుతుందని ఊదరగొట్టిన ప్రభుత్వం ఆ పింఛన్‌కు అర్హులైన వారిని తగ్గించి చూపడంలో అంతే ఘనత సాధించింది. ఇప్పుడు చెల్లిస్తున్న 41 లక్షల మందితో పాటు కొత్త పింఛన్లకు 'జన్మభూమి – మా ఊరు'లో ఐదు లక్షల దరఖాస్తులు వచ్చాయి. అయితే ప్రభుత్వం వచ్చే నెల నుండి మరో 77 వేల మందికి అదనంగా ఇవ్వనున్నట్లు ప్రకటించింది. నాలుగు లక్షల పై చిలుకు అర్హులను గాలికి వదిలేసింది. మరోవైపు ప్రస్తుతం ఇస్తున్న వారికి అవసరమైన దానికంటే తక్కువ కేటాయించింది. ప్రభుత్వ లెక్క ప్రకారమే నెలకు రు. 435 కోట్ల లెక్కన సంవత్సరానికి రు. 5220 కోట్లు అవసరం కాగా రు. 3741 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే రాబోయేకాలంలో ఈ సంఖ్యను పెంచకపోగా తగ్గించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తుంది. వృద్ధులకు ఎన్నికల హామీ ఇస్తూ చంద్రబాబు 'మీకు నేను పెద్ద కుమారుడనవుతా'నని ప్రకటించాడు. నేడు వారిని జనాభా లెక్కల నుండి తొలగించి అంతిమ సంస్కారాలకు పెద్ద కొడుకు పాత్ర పోషించడానికి సిద్ధమవుతున్నట్లుగా ఉంది.

డ్వాక్రా మహిళలను ఊరించని రోజు లేదు. వారి మొత్తం రుణాన్ని మాఫీ చేస్తానని చెప్పాడు. ఒకొక్క మహిళకు రు. 10 వేలు మాత్రమే మాఫీ చేస్తానని మాట మార్చాడు. అది కూడా నిలబెట్టుకోలేని పరిస్థితి. రాష్ట్రంలో 76 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రు. 10 వేల చొప్పున రు. 7600 కోట్లు అవసరం కాగా ఈ బడ్జెట్‌లో కేవలం రు. 1000 కోట్లు మాత్రమే కేటాయించారు. 'బాబు వస్తే జాబు' వస్తుందనే ఎన్నికల హామీ నిరుద్యోగ యువతను ఎంతో ఆశ పెట్టారు. జాబు ఇవ్వకపోతే ప్రతి ఇంటికీ రు. 2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఈ పదినెలల కాలంలో ఉన్న ఉద్యోగాలు ఊడాయి తప్ప కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. ఇంకోవైపు నిరుద్యోగ భృతికి అర్హులు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయాల్లో నమోదు ప్రకారం 8,80,206 మంది. వీరికి నెలకు రు. 2 వేల చొప్పున నెలకు రు. 176.04 కోట్లు, ఏడాదికి రు. 2112.5 కోట్లు అవసరం అయితే ఈ బడ్జెట్‌లో వంద కోట్లు మాత్రమే కేటాయించింది. అది కూడా బిసి సంక్షేమ శాఖ కింద కేటాయింపులను చూపారు.

విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెరిగినట్లు కనిపిస్తున్నా ఆ పెంపుదల మొత్తం జీత భత్యాలకే సరిపోతుంది తప్ప ప్రణాళికా వ్యయం కింద మౌలిక వసతుల కల్పనకు అదనపు కేటాయింపులేమీ లేవు. ఉన్నత విద్యకు, అందునా యూనివర్సిటీ విద్యకు కేటాయింపులలో కోత విధించారు. సంప్రదాయ యూనివర్సిటీలకు, ఇటీవల నెలకొల్పిన యూనివర్సిటీలకు వాటి అవసరాలలో పదవ వంతు కూడా కేటాయించక పోవడం యూనివర్సిటీ విద్యపై గల శ్రద్ధను తెలియచేస్తుంది. విదేశీ యూనివర్సిటీలకు ప్రాధాన్యతను పెంచుతుంది.

మౌలిక సదుపాయాల కల్పన రంగాన్ని మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) ద్వారా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధానితో పాటు, కొత్తగా ఏర్పాటు చేయదలచిన నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు అన్ని పిపిపి విధానంలోనే నిర్మించాలని బడ్జెట్‌లో ప్రకటించడమైనది. అందుకే అంతర్జాతీయ కన్సల్టెన్సీ కోసం ఈ బడ్జెట్‌లో రు. 50 కోట్లు కేటాయించారు. ఏడు మిషన్లు, ఐదు గ్రిడ్‌లతో రాష్ట్రాన్ని అభివృద్ధి పుంతలు తొక్కిస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి అందుకోసం ప్రపంచ బ్యాంకును, బహుళజాతి కంపెనీలను ఆశ్రయిస్తున్నాడు. వాటికి ప్రభుత్వాలే భూమిని ఉచితంగా లేదా చౌకగా సమకూర్చి, ఇతర రాయితీలను కల్పించి స్థానిక వనరులన్నింటినీ కట్టబెట్టబోతున్నాయి. మరోవైపు రాష్ట్రంలోని రెండు వేల కిలోమీటర్ల పొడవు గల ఆర్–బి రోడ్లను కూడా ఇక మీదట మూడు 'పి'ల పద్ధతిలోనే అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఫలితంగా రాష్ట్రంలో ప్రతి చోటా పెద్ద ఎత్తున టోల్ ప్లాజాలు ఏర్పడతాయి. ఇక మీదట ప్రయాణాలు మరింత ప్రియం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను తరలించేటప్పుడు టోల్ ఫీజు చెల్లించాల్సి రావడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు పెరిగే అవకాశం ఉంది. దీనికి తోడు గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు వసూళ్లకు తెరతీసిన యూజర్ చార్జీలను నేడు తిరిగి ప్రవేశపెట్టి, విస్తృతం చేయాలని నిర్ణయించాడు. బడ్జెట్‌లోని అన్ని విభాగాల్లో యూజర్ చార్జీల పద్దులను పెట్టారు. వీటి ద్వారా రు. 500 కోట్లు ఆదాయాన్ని బడ్జెట్‌లో అంచనా వేశారు. అలానే 'ఆంధ్రప్రదేశ్ పట్టణ సంస్కరణలు–మున్సిపల్ సేవలు' పథకాన్ని విదేశీ నిధులతో చేపట్టనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించి ఇక్కడ కూడా మూడు 'పి'ల విధానాన్నే ప్రకటించాడు. దీనికోసం రు. 219 కోట్లు కేటాయించారు. మున్సిపల్ సేవల రంగంలో సంస్కరణలు అమలు చేయకుండానే అన్ని రంగాల్లోనూ యూజర్ చార్జీలు మోత మోగనున్నాయి. సామాన్య మానవునికి ప్రభుత్వ సేవలు మరింత ప్రియం కానున్నాయి.

బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి కేటాయింపులలో భారీగా కోత విధించారు. గత బడ్జెట్ కంటే 20.81 శాతం తక్కువగా కేవలం రు. 8212 కోట్లు మాత్రమే కేటాయించారు. పేదల గృహ నిర్మాణానికి యూనిట్ కాస్ట్‌ను లక్ష నుంచి లక్షా యాభై వేలకు పెంచుతానని ప్రకటించి అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు పైసా విదల్చలేదు. ఒక పక్కా గృహ నిర్మాణం జరగలేదు. ఆ శాఖ రు. 2000 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపగా రు. 879 కోట్లు మాత్రమే కేటాయించింది. అన్న క్యాంటిన్లు, ఎన్‌టిఆర్ సుజల పథకాల ఊసేలేదు. రాష్ట్ర ఆర్థిక లోటుతో సతమతమవుతుందని తెగ బాధపడిపోతున్న ముఖ్యమంత్రి తన ప్రభుత్వ ప్రచార ఆర్భాటానికి ఈ బడ్జెట్‌లో ప్రత్యేకంగా రు. 201.22 కోట్లు కేటాయించారు. వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపుకు చేతులు రాని ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు ఏకంగా రు. 200 కోట్లు కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వం వేటికి ప్రాధాన్యత ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు.

ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించిన రు. 22 వేల కోట్ల అప్పులతో రాష్ట్రం అప్పుల కుప్పగా మారనుంది. రాష్ట్ర అప్పు లక్షా నలభై ఆరు వేల కోట్లకు చేరనుంది. ఈ ఏడాది అప్పుతో రాష్ట్ర తలసరి అప్పు 7 వేలు పెరిగి స్థూలంగా ప్రతి వ్యక్తి తలపైన రు. 29 వేల అప్పు ఏర్పడనుంది. ఇది రానున్న రోజుల్లో ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) రాష్ట్రాన్ని మరింత దివాలా అంచుకు నెడుతుంది. రాష్ట్రంలో అమలు జరిగిన ఆరోగ్య శ్రీ పథకం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రెండు కూడా ఈ పిపిపిల పద్ధతితో జరిగినవే. ఇవి ప్రభుత్వ వైద్య రంగాన్ని, ప్రభుత్వ విద్యా వ్యవస్థని ఎలా నీరుగార్చాయో, ప్రైవేట్ వ్యక్తులకు, శక్తులకు ఎలా కోట్లు కట్టబెట్టాయో మన కళ్లముందే అనుభవం ఉంది. విమానాశ్రయం నిర్మాణం విషయంలో ఈ పిపిపి విధానం అనుసరించిన జిఎంఆర్ మలేషియాలోనూ, ఢిల్లీలోనూ ఎలగబెట్టిన అనుభవం మన కళ్లముందు ఇంకా కదలాడుతూనే ఉంది. పిపిపి విధానంలో ప్రపంచం అందించిన అనుభవం భాగస్వామ్యం ఏమీలేదు అంతా భోగస్వామ్యమే. కాబట్టి రాష్ట్ర ప్రజలు అప్రమత్తం కావలసిన సమయం ఆసన్నమైంది. చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన సమయం వచ్చింది.

(రచయిత వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు) వీ

ఆంధ్రప్రదేశ్ 2015-16 బడ్జెట్

***ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలనూ తీవ్ర నిరాశకు గురిచేసిందనీ, పూర్వం అధికారంలో ఉండగా చేసిన తప్పిదాలే ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ మళ్లీ చేస్తోందనీ అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశపెట్టిన 2015-2016 ఆర్థిక బడ్జెట్, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. 2015 మార్చ్ 12న రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంబేద్కర్ ప్రవచనంతో ప్రారంభమై గాంధీ సూక్తితో ముగించి తన వాగాడంబరాన్ని ప్రదర్శించారు తప్ప వారిరువురూ కోరుకున్న 'ఆదర్శ సంక్షేమ రాజ్యం' దిశగా బడ్జెట్ పయనించలేదని చెప్పవచ్చు.

'నేను కలలు కంటున్న ఆదర్శ సమాజం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల మీద ఆధారపడి ఉంటాయి. ఆదర్శ సమాజం గతిశీలంగా ఉండాలి. సమాజంలో ఒక భాగంలో సంభవిస్తున్న పరివర్తన తక్కిన అన్ని విభాగాలకు ప్రసరించాలి' అన్న అంబేద్కర్ ప్రవచనంతో బడ్జెట్ ప్రసంగం ప్రారంభించబడింది. కానీ అందుకు పూర్తి విరుద్ధంగా అభివృద్ధి, సంక్షేమాలకు పూర్తిగా కోతల వాత పెట్టారు.

ప్రజల నడ్డివిరిచి ఖజానా నింపుకునేందుకు, కార్పొరేట్ వర్గాలకు లబ్ధి చేకూర్చేందుకు యనమల రామకృష్ణుడు శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి ప్రాధాన్యతా రంగాలను పక్కన పెట్టారు. మొత్తం రు. 13,049 కోట్ల, వార్షిక బడ్జెట్ అంచనాల్లో ప్రణాళికా వ్యయానికి రు. 34,412 కోట్లు, ప్రణాళికేతర వ్యయానికి రు. 78,637 కోట్లు కేటాయించారు. రెవెన్యూ లోటు రు. 7,300 కోట్లు, ఆర్థిక లోటు రు. 17,584 కోట్లు ఉంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్రం నుంచి ఆశించిన సాయం అందక తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉన్నవి. ఈ పరిస్థితులలో 'అభివృద్ధి – సంక్షేమం' రెంటినీ సమతౌల్యం చేసుకుంటూ ముందుకు సాగాల్సి ఉండగా, బడ్జెట్‌లో ప్రణాళికా, ప్రణాళికేతర వ్యయం మధ్య ఆర్థిక మంత్రి ఓ పెద్ద అగాథం సృష్టించాడు. ఇది పన్ను రహిత బడ్జెట్‌గా వారు అభివర్ణించినా 'పరోక్ష బాదుడు' తప్పదని కీలక రంగాల కేటాయింపులు స్పష్టం చేస్తున్నాయి. వాస్తవానికి బడ్జెట్‌లో భారాలు మోపే సంప్రదాయాన్ని వదిలేసి, అవసరాన్ని బట్టి రకరకాల రూపాల్లో, వివిధ దశల్లో జనం నెత్తిన సుతిమెత్తంగా మోదడం పాలకులు అలవాటు చేసుకున్నారు. రానున్న కొద్ది రోజుల్లోనే జనానికి కరెంట్ షాక్‌లూ, పెట్రోల్, డీజిల్‌లపై వ్యాట్ విధించడం, తప్పవని ఈ బడ్జెట్ పరోక్ష హెచ్చరికలు అందిస్తోంది. మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం, ప్రైవేట్, భాగస్వామ్యం (పిపిపి – పబ్లిక్ – ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) మార్గాన్ని ప్రభుత్వం ఎన్నుకొన్నది. ప్రైవేట్ పెట్టుబడికి పెద్దపీట వేసిన చంద్రబాబు విజన్ 2029కి అనుగుణంగా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారు. 2020 నాటికి దేశంలో అత్యున్నత పురోగతి సాధించిన మూడు రాష్ట్రాల్లో ఒకటిగా, 2029కి మొట్టమొదటి స్థానంలో నిలుపుతామనే లక్ష్య ప్రకటన చేశారు.

మంత్రి ప్రసంగం మొత్తం 'ఆత్మస్తుతి – పరనింద'గా ఉన్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకత్వంలో 1995 – 1996లో చేపట్టిన రెండవ దశ ఆర్థిక సంస్కరణలు దశాబ్దం పాటు దారిద్ర్య నిర్మూలన, ఆర్థికాభివృద్ధికి, సమాచార విప్లవం వల్ల భూమి, జల సంపద, అటవీ సంపదల భాగస్వామ్య నిర్వహణలో గొప్ప పురోగతి సాధ్యమైందని చెప్పారు. 2004 తర్వాత దశాబ్ద కాలం పాటు ప్రభుత్వ ఉదాసీనతతో ఈ బృహత్తర ఉద్యమం నెమ్మదిగా వన్నె తగ్గిందంటూ విపక్షాల పాలనపై విమర్శలు చేశారు. గతంలో ఇలాంటి చర్యల వల్లే దశాబ్దం పాటు అధికారానికి దూరమయ్యారనే వాస్తవాన్ని ఇప్పటికీ తెలుసుకున్నట్లు లేరు. ఈ విషయం ఈ బడ్జెట్ రూపకల్పన రుజువు చేస్తున్నది.

తన పరిపాలనానుభవం, రాజకీయ నిర్మాణ దక్షతతో విభజిత ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తారన్న ప్రజల నమ్మకాన్ని మరోసారి వమ్ముచేసే విధానాలనే బాబు ప్రభుత్వం అనుసరిస్తోందని నిరూపితమయింది. తమ ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు కట్టుబడి ఉందని ఒట్టిమాటలు చెప్పడం తప్ప ఆ దిశగా కేటాయింపులకు చేతులు రాలేదు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు, యువజనులకు, వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు అతి తక్కువ కేటాయింపులతో సరిపెట్టారు. గత 7 నెలలకే పరిమితమైన బడ్జెట్‌తో పోల్చినా, వీరికి ఈసారి కేటాయించింది చాలా తక్కువే. జనాభాలో 13 శాతంగా ఉన్న వృద్ధులకు, వికలాంగులకు రు. 81 కోట్లతో సరిపెట్టడమంటే, సంక్షేమానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చారో అర్థమవుతున్నది. ఇంటర్మీడియట్ విద్యకు రు. 585 కోట్లు కేటాయించడమంటే ఉద్యోగుల జీత భత్యాలు, పరీక్షల నిర్వహణకే తప్ప విద్యార్థులకు ఒక్క రూపాయి కూడా దక్కే అవకాశం ఉండదు. గ్రామాల్లో అనారోగ్యానికి దారితీస్తున్న ముఖ్య కారణాల్లో కలుషిత తాగునీరు ఒకటి. ఈ బడ్జెట్‌లో రక్షిత తాగునీరు అందించే ప్రయత్నమే కనిపించడం లేదు.

అంగన్‌వాడీలు, స్త్రీ, శిశు సంక్షేమం, వైద్య, ఆరోగ్య రంగాల కేటాయింపులు, జీత భత్యాలు, బిల్లులకే సరిపోయేలా ఉన్నాయి. పేదలకు 2 లక్షల ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రు. 897 కోట్లతో సరిపెట్టారు. ఇందులో సగం పాత బకాయిలకే సరిపోతాయని నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో పేదరిక నిర్మూలన ఎలా సాధ్యం అవుతుంది?

వ్యవసాయరంగం సంక్షోభంలో ఉందనీ, రైతుల కష్టాలు చూసి ముఖ్యమంత్రి చలించిపోయారని చెప్పిన ఆర్థిక మంత్రి, దానిని

భూ సేకరణ బిల్లు వివాదం

అభివృద్ధి పేరుతో ప్రజాభిప్రాయం లేకుండా రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం కోసం తెస్తున్న భూ సేకరణ బిల్లు వల్ల లక్షలాది మంది నిర్వాసితులవుతారనీ, జీవించే హక్కును కోల్పోతారనీ అంటున్నారు **బి. రామకృష్ణ**

ఎంత అంటే అంత, ఏదంటే అది, ఎక్కడంటే అక్కడ, ఎప్పుడంటే అప్పుడు ప్రజల ప్రమేయం, భాగస్వామ్యం, అంగీకారం లేకుండా ప్రజల భూములను లాక్కోవడం బ్రిటిష్ వలస పాలనలో జరుగుతూ వచ్చింది. దీనికి ప్రజా ప్రయోజనమనే పేరు తగిలించి భూములను గుంజుకోవడానికి భూసేకరణ చట్టం -1894 తీసుకొచ్చారు. ప్రజా ప్రయోజనం అనేది ఎంతో ఆదర్శవంతమైనది కాని ఈ చట్టంలో అది ప్రజల పాలిట శాపంగా మారింది. పదాల గారడీతో తేనె పూసిన కత్తులుగా ఇది ప్రజా గొంతుకలపై వేలాడుతూనే ఉంది. భూపతి, భూపాలుడు అనేవి రాజుకు పర్యాయ పదాలుగా వాడతారని తెలిసిందే. రాజు అంటే భూమికి అధిపతి, భూమిని పాలించేవాడు, సర్వసంపదలకు హక్కుదారు. తాను పాలించే ప్రాంతానికి స్వంతదారు, యజమాని, సర్వశక్తివంతుడు, సర్వ సంపన్నవంతుడు అన్న మాట. తన ఇష్టానుసారం భూములను తీసుకుని ఉపయోగించుకోవడానికి రాజుకు, రాజ్యానికి ఉండే తిరుగులేని నిరంకుశ పరమ, సర్వాధికారానికి భూసేకరణ చట్టం-1894ను సంకేతంగా చూడవచ్చు. వ్యక్తి ప్రయోజనాల కంటె సమిష్టి ప్రయోజనాలు గొప్పవనే సూత్రానికి ప్రతిబింబంగానూ చూడవచ్చు.

అయితే ఏ సమిష్టి, ఏ సమూహాల ప్రయోజనాలచే దగ్గరే అసలు పేచీ వస్తుంది. ఎవరి రక్తమాంసాలు, చెమట చుక్కలు కరుగుతూ రెక్కలు ముక్కలవుతూ ఏ వర్గ సుఖ సంతోషాలకు, అభివృద్ధికి దోహదపడుతున్నాయి? బ్రిటిష్ పాలన (ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన) వారి వ్యాపార ప్రయోజనాల కోసం, ఇక్కడ సంపదలను కొల్లగొట్టడం, వనరులను తరలించకు పోవడమే లక్ష్యంగా సాగింది. అందులో భాగంగా మైనింగ్, రోడ్లు, రైల్వేలు, పోర్టులు, డ్యాంలు, రక్షణ రంగం, తంతి తపాల, తదితరాలు అవసరమైనాయి. వారి వలసవాద, వ్యాపార ప్రయోజనాలు నేరవేర్చుకోవడం కోసం ప్రజాప్రయోజనం అనే మిషతో స్థానిక ప్రజల జీవనాధారమైన భూమిని, దానిని అనుసరించి ఉన్న అనేక సహజ వనరులను, సంపదలను కొల్లగొట్టడానికి 1894 భూ సేకరణ చట్టం తేబడింది. వలసపాలన అంతమయ్యాక కూడా

పునరుద్ధరించేందుకు బడ్జెట్‌లో ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం శోచనీయం. రైతు రుణమాఫీకి కేటాయించిన 5 వేల కోట్లు ఏ మూలకూ సరిపోవు. వ్యవసాయం ప్రధానమైన రాష్ట్రంలో సాగునీటి రంగానికి గతంలో రు. 8,465 కోట్లు కేటాయించగా, చాలా తక్కువగా రు. 5,258 కోట్లు కేటాయించడం ఇది తిరోగమన బడ్జెట్ అని తేలిపోయింది. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు దాదాపు రు. 2,000లు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఆ ఊసే ఎత్తలేదు. మహిళల రుణమాఫీ అంశం ప్రస్తావనే లేదు.

రాష్ట్రాభివృద్ధికి కీలకమైన మూడు రంగాలు వ్యవసాయం, పరిశ్రమలు, సేవలకు ఏ ఒక్కదానికీ సరైన కేటాయింపులు చేయని దశ-దిశలేని బడ్జెట్ ఇది. ప్రత్యేకంగా రు. 9,000 కోట్లతో ప్రవేశ పెట్టనున్న వ్యవసాయ బడ్జెట్‌లో ఐదు వేల కోట్లు రుణమాఫీకే సరిపోతుంది. అన్నదాతను ఆదుకోవడానికి ఏమి మిగులుతుంది? వ్యవసాయం తర్వాత ప్రధానమైనది చేనేత రంగం. ఈ రంగానికి రు. 46 కోట్లు కేటాయించడమంటే నేతన్నకు నూలు తాళ్లను ఉరితాళ్లుగా చేయడమే. అంతే కాకుండా రాజధాని నిర్మాణానికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. వీటన్నింటికీ మించి, భవిష్యత్తును ప్రైవేట్ పరం చేసే 'ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం' (పిపిపి) విధానానికి ప్రభుత్వం పూర్తిగా మొగ్గు చూపుతున్నదని ఈ బడ్జెట్ తెలియజేస్తున్నది. రాష్ట్రంలో రెండు వేల కిలోమీటర్ల రోడ్లను ఈ విధానం ద్వారా నిర్మించడానికి ఈ ప్రభుత్వం సిద్ధపడడమంటే, టోల్ గేట్ పేరుమీద సామాన్య ప్రజల నుంచి దండుకోవడమే తరువాయి కార్యక్రమం. మౌలిక వసతుల కల్పన కూడా ప్రైవేట్ శక్తులకు అప్పచెప్పాలనే ఆలోచనతో ఈ ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది.

లోటు భర్తీ చేసేందుకు ఖనిజ సంపద తవ్వితీస్తామని మంత్రి చెప్పడం కూడా అనుమానాస్పదమే. ఎలానగా ఈ రంగానికి కేటాయించినది కేవలం రు. 27 కోట్ల రూపాయలే అంటే దీనిని పూర్తిగా కార్పొరేట్ శక్తుల పరం చేస్తారన్నది వాస్తవం.

కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంతో రాష్ట్రంలోని టిడిపి పార్టీ కూడా భాగస్వామ్య పక్షమే. అయినప్పటికి, ప్రత్యేక హోదా గానీ, పోలవరం ప్రాజెక్టుకు నిధులూ, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలూ సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొని రాకుండా, ఆర్థికంగా లోటుతో ఉన్న రాష్ట్రంలో అభివృద్ధిని సాధిస్తామని చెప్పడం పూర్తిగా బూటకమే.

విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలో వచ్చిన హుద్ హుద్ తుఫాను బాధితులను ఆదుకునేందుకు ఈ బడ్జెట్‌లో ఏమాత్రం కేటాయింపులు జరుపకపోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యమే. ఓడరేవులు, స్మార్ట్‌సిటీలు, పారిశ్రామిక కారిడార్లు, ప్రాంతీయ విమానాశ్రయాల గురించి బడ్జెట్‌లో కేవలం ప్రకటనలైతే చేసింది కానీ నిధులు మాత్రం కేటాయించలేదు. మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం ఆర్భాటం చేస్తున్న 7 మిషన్‌లు, 5 గ్రిడ్‌లూ, కేవలం మాటలు తప్ప, ఆచరణ కనిపించడం లేదు. ఇది ప్రజల ఆశలను అడియాసలు చేసే బడ్జెట్ తప్ప మరొకటి కాదు.

(రచయిత ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

ప్రజాస్వామిక ప్రభుత్వాలుగా చెప్పబడుతున్నవి కూడా అదే చట్టాన్ని అమలు చేస్తూ వచ్చాయి. అలా వలస పాలన సంకెళ్లను ప్రజలు మోస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు వేస్తూనే ఉన్నాయి.

1894 చట్టాన్ని ఉపయోగిస్తూ ప్రకృతి సంపదలపై, వనరులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తూ వచ్చారు. 1960ల నుండి ప్రత్యేకించి 1980ల తరువాత భారత ప్రభుత్వాలు ప్రజా సంపదలైన భూమి, నీరు, ఖనిజాలు, అడవి మొదలైనవి ప్రైవేట్ కంపెనీలకు, కార్పొరేషన్‌లకు బదలాయిస్తూ వస్తున్నాయి. ఇండస్ట్రియల్ చట్టం, మైనింగ్ చట్టం, నేషనల్ హైవే చట్టం వంటివి ఎన్నో ఈ పని చేస్తున్నాయి. ప్రజా ప్రయోజనం, అభివృద్ధి పేరుతో అమలు చేయబడుతున్న ప్రాజెక్టులు, (మైనింగ్, డ్యాంలు, విద్యుత్ ప్లాంట్లు రోడ్లు, రైల్వేలు, పోర్టులు, బహుళార్థ సాధక ప్రాజెక్టులు, రక్షణరంగం) ఎంతో మంది ప్రజలను నిరాశ్రయులను చేస్తూనే ఉన్నాయి. చిత్రమేమిటంటే వీటివలన నష్టపోయిన, నిరాశ్రయులైన వారి వివరాలు గాని, లెక్కలు గాని ఏ ప్రభుత్వ రికార్డుల్లో లేవు. దీన్ని ప్రభుత్వాల కుట్రలుగా అనుకోవాలి. లేదా నిరాశ్రయుల పట్ల ప్రభుత్వాలు కనీస మానవీయంగా స్పందించ లేదనీ, భారత రాజ్యాంగం గ్యారంటీ చేసిన ప్రాథమిక హక్కులను వారికి దూరం చేసి నియంతలుగా ప్రవర్తించారనీ అనుకోవచ్చు. ఒక అధ్యయనం ప్రకారం భారతదేశంలో 3,300 పెద్ద డ్యాంలు ఉన్నాయి. ఇది ప్రపంచం మొత్తం డ్యాంలలో 15 శాతంగా ఉన్నాయి.

1980లలో నర్మద నదిపై ప్రారంభించిన అనేక డ్యాంలు, సర్దార్ సరోవర్ డ్యాం వలన మొత్తంగా ఐదు లక్షల మంది ప్రజలు నిరాశ్రయులైనారు. డ్యాంలే కాకుండా స్వాతంత్ర్యానంతరం మరెన్నో ప్రాజెక్టులు అనేక మందిని రోడ్డున పడేశాయి. కొంతమంది స్వతంత్రంగా చేసిన పరిశోధనలు, అధ్యయనాలు తేల్చి చెప్పిన లెక్కల ఆధారంగానే 2011లో 12వ పంచవర్ష ప్రణాళిక అభివృద్ధి పేరిట ఎన్నో ప్రాజెక్టుల వలన గత 50 ఏళ్లలో ఆరు కోట్ల మంది ప్రజలు నిర్వాసితులు అయ్యారని స్పష్టం చేసింది. ప్రపంచంలోనే అత్యధిక అభివృద్ధి ప్రేరేపిత నిరాశ్రయుల జనాభా (డెవలప్‌మెంట్ ఇన్‌డ్యూస్డ్ డిస్‌ప్లేస్డ్) ఉన్నది భారత్‌లోనే.

ఇదే విషయాన్ని యునైటెడ్ నేషన్స్ వర్కింగ్ గ్రూప్ ఆన్ హ్యూమన్ రైట్స్ ఇన్ ఇండియా తన 2012 రిపోర్టులో పేర్కొన్నది. ఆరు కోట్ల మంది నిరాశ్రయుల్లో 40 శాతం ఆదివాసులు, 40 శాతం దళితులు మిగిలిన వారు గ్రామీణ నిరుపేదలు ఉన్నారు. దేశ జనాభాలో ఎనిమిది శాతంగా ఉన్న ఆదివాసులు నిరాశ్రయులవుతున్న వారిలో అధికంగా 40 శాతం ఉన్నారు. నిరాశ్రయులైన వారిలో 75 శాతానికి పైగా ఎలాంటి పరిహారాలకు, పునరావాసాలకు, పునఃస్థాపనలకు నోచుకోలేదు. నాలుగున్నర కోట్ల ప్రజలు అభివృద్ధి ప్రాజెక్టుల వలన విధ్వంసానికి గురయ్యారు. వీరి దయనీయ పరిస్థితుల గురించి పట్టించుకోని ప్రభుత్వాలు అమానవీయంగా ప్రవర్తిస్తూ వస్తున్నాయి. ఫలితంగా చట్ట ప్రకారమే ఆ ప్రజలు ఎంతో హింసకు, హక్కుల ఉల్లంఘనలకు లోనయ్యారు. వారి జీవించే హక్కు ఎంతగా గేలి చేయబడుతున్నదో తెలుసుకోవచ్చు. నిరాశ్రయులైన ప్రజలు, భూములు, ఉపాధి, ఉద్యోగాలు, విద్య, ఆహార భద్రత, సామాజిక భద్రత లేకుండా, తమ సంస్కృతులను కోల్పోవల్సి రావడం, జీవన భద్రత కొరవడడం, హక్కులు కోల్పోవడం, భవిష్యత్ జీవితంపై నమ్మకం, విశ్వాసం సన్నగిల్లడం వలన ఎంతో వేదనకు గురవుతున్నారు. అభివృద్ధి మాటున ఎన్నో జీవితాలు బుగ్గిపాలు అవుతున్నాయి. ఇది అభివృద్ధి వెనుకున్న వాస్తవ పార్శ్వం. దీన్ని పట్టించుకోని సమాజం ఎంత క్రూరత్వానికి చేరుకుంటున్నదో అర్థం చేసుకోవాలి.

జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు డ్యాంలను (మల్టిపర్పస్ ప్రాజెక్టులను) ఆధునిక దేవాలయాలని వర్ణించాడు. దేశవ్యాప్తంగా అనేక డ్యాంలను నిర్మించారు. ఫలితంగా ఎంతో మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారు. అప్పుడప్పుడే బ్రిటిష్ వలస పాలన నుండి విముక్తి పొందిన తరుణంలో ప్రజల్లో స్వాతంత్రోద్యమం, దేశభక్తియుత భావాలు నిండి ఉండడం మూలంగా భారత ప్రభుత్వాలు తీసుకున్న అనేక నిర్ణయాలను ఉదాహరణకు. డ్యాంలు, రక్షణ రంగం, మౌలిక సదుపాయాలు కల్పన మొదలగు వాటిని తమవిగా, అవి తమ అభివృద్ధికి అవసరమైనవిగా భావించారు. వాటిని వ్యతిరేకించలేదు. క్రమేపి 1970ల వరకు వచ్చేసరికి ఈ ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులు పెరగడం, వారికి సరైన పునరావాసం, పరిహారం, ఆ ప్రాజెక్టుల ఫలాలు అందకపోవడం, వారి జీవితాలను కోల్పోవడం తేటతెల్లం కావస్తూ వచ్చింది. ఇక వాటిపై భ్రమల పొరలు తొలగడం ప్రారంభం అయింది. స్వాతంత్ర్య పోరాట క్రమంలో ముందుకొచ్చిన భారత ప్రజల ఆశలు, ఆకాంక్షలు అయినటువంటి సామాజిక భద్రత, విద్య, ఉపాధి, దారిద్ర నిర్మూలన, సమసమాజ నిర్మాణం మరెన్నో ఆశయాలు, ఆదర్శాలు, నమ్మకాలు వమ్ముకావడం స్పష్టం అవుతూ వచ్చాయి. స్వాతంత్ర్య పోరాట ఫలాలు కొందరికే స్వంతం కావడం, తలచిందొకటి, జరుగుతున్నదొకటి అని నెమ్మది నెమ్మదిగా అవగతం అవుతూ వచ్చింది. ఈ క్రమంలోనే దున్నేవానికే భూమి, సమసమాజ లక్ష్యాలతో 1960లలో నక్సల్బరీ ఉద్యమం బద్ధలైంది. అది దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోయింది. నర్మదా నదిపై 1980లలో సర్దార్ సరోవర్ డ్యాంతో పాటుగా మరొన్నో వందల ప్రాజెక్టులను కట్టడాన్ని నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమాలు వచ్చాయి. సుందర్‌లాల్ బహుగుణ సారథ్యంలో చెట్లను, పర్యావరణాన్ని రక్షించే చిప్కో ఉద్యమం వచ్చింది.

ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలుచోట్ల భారీ ప్రాజెక్టులపై నిరసనలు రావడంతో 1894 భూ సేకరణ చట్టానికి మౌలిక మార్పులేమి లేకుండా చిన్న చిన్న సవరణలు లేదా కొత్త చట్టాలు చేస్తూ వచ్చారు. ఏవో కొన్ని మినహాయింపులు తప్పిస్తే 1980కు పూర్వం పునరావాసం, పునఃస్థాపన విధానమే లేదు. నాగార్జునసాగర్, హీరాకుడ్, తుంగభద్ర, మయూరాక్షి వంటి డ్యాంలు, రూర్కేలా, భిలాయ్, బొకారో స్టీల్ ప్లాంట్లు, రక్షణ రంగ ప్రాజెక్టులు, బొగ్గగనులు మొదలగు కొన్నింటి విషయంలో అక్కడి పునఃస్థాపనలో భాగంగా ఇళ్ల స్థలాలు చూపించారు. కేవలం ఎన్‌టిపిసి, కోల్ ఇండియా లిమిటెడ్‌లు మాత్రమే పునరావాసం, పునఃస్థాపన విధానాన్ని రూపొందించాయి. షెడ్యూల్డ్ ప్రాంతంలో అక్కడి గ్రామసభల అనుమతి లేకుండా ప్రాజెక్టులు నిర్వహించరాదని నిర్ణయించారు. ఒడిషా, జార్ఖండ్, చత్తీస్‌గడ్ ప్రాంతాల్లో ఆదివాసులపై ప్రయోగించే ప్రాజెక్టులకు వ్యతిరేకంగా, వారి స్వయం నిర్ణయాధికారం కోసం ఉద్యమాలు జరుగుతున్నాయి. చేపలు పట్టుకునే, పశువులను మేపుకునే, అడవులు, అటవీ సంపదలపై హక్కులు, సాగు భూములపై హక్కుల కోసం మత్స్యకారులు, రైతులు, దళితులు, ఉద్యమాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా అభివృద్ధి పేరిట లక్షలాది కోట్లాది మంది ప్రజలను నిర్వాసితులను చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరసనలు వస్తున్నాయి. ఒడిషాలోని పోస్కో స్టీల్ ప్లాంట్, పశ్చిమ బెంగాల్‌లో టాటా కార్ల కంపెనీకి, థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో కాకర్లపల్లిలో అణువిద్యుత్ కేంద్రాలను నిరసిస్తూ తమిళనాడులోని కూడంకుళం, మహారాష్ట్రలోని జైతాపూర్‌లలో నిరసనకారులపై పోలీసులు కాల్పులు జరిపారు.

నర్మద నదిపై నిర్మించే అనేక డ్యాంలకు వ్యతిరేకంగా వచ్చిన తీవ్రమైన నిరసనల నేపథ్యంలో 1984లో 1894 భూసేకరణ చట్టానికి మార్పులు చేయడం, భూ హక్కుల విషయంలో, అభివృద్ధి పేరుతో వస్తున్న ప్రాజెక్టుల గురించి పునరాలోచనలు మొదలయ్యాయి. అయినప్పటికి విధాన నిర్ణేతలకు అంతగా పట్టింపులు లేకున్నాయి. సుప్రీంకోర్టు సైతం పలు సందర్భాలలో ఈ చట్టంపై అసంతృప్తిని వ్యక్తం చేసింది. 1984, 1993, 1994, 1998 లలో పరిహారం, పునరావాసం చట్టాల గురించి ప్రయత్నాలు జరిగాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్ 2007లో నేషనల్ రిహాబిలిటేషన్ అండ్ రిసెటిల్‌మెంట్ పాలసీని తయారు చేసింది. భూసేకరణ చట్ట సవరణ బిల్లును 2007లో, 2009లో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అది ల్యాప్స్ అయింది. 2011 నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్ భూ సేకరణ చట్టానికి పునరావాస, పునఃస్థాపనలను కలపమని సూచించింది. దీని ఫలితంగా భూసేకరణ పునరావాసం, పునఃస్థాపనలను కలిపి ఒకే బిల్లుగా 2012లో వచ్చింది. దీనిపై ఎన్నో తర్జనభర్జనలు, మార్పులు చేర్పులు జరిగాయి. చివరిగా భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలో న్యాయమైన పరిహారం పారదృకతా హక్కు చట్టం - 2013 (ది రైట్ టు ఫెయిర్ కంపెన్సేషన్ అండ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ల్యాండ్ ఆక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రిసెటిల్‌మెంట్ యాక్ట్ -2013) 2013 సెప్టెంబర్ 26న యుపిఎ-2 కాలంలో రాష్ట్రపతి ఆమోదం పొందింది. ఈ వ్యాసంలో ఈ చట్టాన్ని భూసేకరణ చట్టం-2013గా పిలుద్దాం. ఈ చట్టం అల్లా ఉద్దీన్ అద్భుత దీపమేమి కాదు. పూర్తి స్థాయిలో ప్రజా ప్రయోజనాలను ప్రతిబింబించేది కూడా కాదు. కాని దీనిలో 1894 భూసేకరణ చట్టంలో లేనటువంటి ప్రజానుకూల విషయాలు ఉన్నాయి.

ప్రపంచంలో ఇండియా అగ్రస్థానంలో ఉండాలని నరేంద్రమోడీ అంటున్నాడు. ఆ అగ్రస్థానం కొరకు 'మేక్ ఇన్ ఇండియా' అంటున్నాడు. ప్రపంచ పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నాడు. వారికి రాయితీలు ఇస్తానంటున్నాడు. అందులో భాగంగా భూ సేకరణ చట్టం - 2013లో సవరణలు తెస్తూ డిసెంబర్ 2014లో ఆర్డినెన్స్ తెచ్చారు. ఈ చట్టం బిజెపికి సమ్మతితోనే వచ్చింది. భూసేకరణ ఇంచుమించుగా అసాధ్యంగా ఉన్న అతి సంక్లిష్టంగా తయారైన భూసేకరణ విధానం భారతదేశ అభివృద్ధిని ఒప్పిస్తుందని ఆర్థిక శాఖామంత్రి అరుణ్‌జైట్లీ అంటున్నాడు. దేశాభివృద్ధి అంటే అట్టడుగు పొరల్లో ఉన్న ప్రజల, ఆదివాసుల, దళితుల అభివృద్ధి అని భావిస్తే వారికి భూములు పంచి వాటిని వ్యవసాయ యోగ్యం చేసి, వారి జీవన ప్రమాణ స్థాయిలను పెంచి విద్యా, వైద్యం, ఉపాధి, ఆర్థిక సామాజిక స్థితిగతులను మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకోసం భూసేకరణ చేపట్టేలా చర్యలు తీసుకుంటే సమూచితంగా ఉంటుంది. కాని ప్రైవేట్ కంపెనీలకు, కార్పొరేట్లకు, బడా పారిశ్రామిక వర్గాల కోసం భూసేకరణను సులభరం చేసి వారి వ్యాపార ప్రయోజనాలను నేరవేరుస్తూ అదే దేశాభివృద్ధి అని అంటున్నది బిజెపి ప్రభుత్వం. భూ సేకరణను సులభతరం చేయడానికి తెచ్చిన ఆర్డినెన్స్‌లో స్వల్ప మార్పులు తెచ్చి భూ సేకరణ చట్ట సవరణ బిల్లు -2015 (ది రైట్ టు ఫెయిర్ కాంపన్సేషన్ అండ్ ట్రాన్స్‌పరేన్సీ లాండ్ అక్విజిషన్, రిహాబిలిటేషన్ అండ్ రీసెటెల్డ్ (అమెండ్‌మెంట్) ను బిల్ - 2015) ను 2015 మార్చ్ 9న లోక్‌సభలో నెగ్గించుకున్నారు. రాజ్యసభ ఆమోదం కోసం వేచిచూస్తున్నారు. ఆ ఆమోదం పొందకుండా పార్లమెంట్ సమావేశాలు ముగిశాయి. కాని తదుపరి పార్లమెంట్ సమావేశాల్లో దీన్ని నెగ్గించి చట్టం తేరనే గ్యారంటీ ఏమిలేదు. భూసేకరణ చట్టం-2013 చట్టంలోనే అనేక ప్రత్యేక అంశాలు ఉన్నాయని అనుకుంటుంటే దాంట్లో మరింతగా ప్రజా వ్యతిరేకమైన, ప్రమాదకరమైన సవరణలను చేసింది నరేంద్రమోడీ ప్రభుత్వం. ఆ సమీరణలు ప్రజా ప్రయోజనం కోసమేనని బుకాయిస్తున్నారు.

భూ సేకరణ చట్టం-2013 ప్రకారం ప్రైవేట్ కంపెనీ కోసం భూ సేకరణ జరిపేటప్పుడు తప్పని సరిగా 80 శాతం పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ ప్రాజెక్టు (పిపిపి) కోసం 70 శాతం భూ స్వంతదారుల కుటుంబాల అంగీకారం ఉండాలి. ప్రభుత్వమే భూమలు సేకరిస్తున్నప్పుడు వీరి అంగీకారం అవసరమే లేదు. ప్రభుత్వం భూములు సేకరించిన తరువాత అనతికాలంలో ప్రైవేట్ కంపెనీలకు ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య సంస్థలకు కట్టబెట్టే దొడ్డిదారి తెరిచే ఉన్నది. 1894 భూ సేకరణ చట్టంలో ప్రజా ప్రయోజనాల కోసమని ప్రభుత్వమే భూమిని సేకరించేది కాని ప్రైవేట్ కంపెనీల కోసం కాదు. 2013 చట్టం భూ స్వంతదారుల అంగీకారం విషయంలో 1894 చట్టాన్నే అనుసరించింది. ఇది అదనంగా ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్‌షిప్ ప్రాజెక్టులను చేర్చి వాటికి భూ స్వంతదారుల అంగీకారాన్ని చేర్చింది. కాని స్వంత భూములు లేని బాధిత కుటుంబాల అందరి అంగీకారం చేర్చలేదు. 2015 సవరణ బిల్లులో 1) జాతీయ భద్రత లేదా రక్షణ రంగానికి సంబంధించి 2) గ్రామీణ మౌలిక వసతుల, విద్యుత్తీకరణ 3) అందుబాటులో (అఫర్డబుల్) ఉండే గృహాలు, నిరుపేదల కొరకు గృహాలు 4) ప్రభుత్వం ఏర్పాటు చేయబోవు పారిశ్రామిక కారిడార్‌ల కోసం రైల్వే లైన్లు, రోడ్ల పక్కన ఒక కిలోమీటర్ వరకు భూసేకరణ 5) ప్రభుత్వమే స్వంతదారుగా ఉండే పిపిపి కిందికి వచ్చే మౌలిక వసతుల ప్రాజెక్టులు అనే ఐదు విషయాలలో భూ స్వంతదారులైన బాధిత కుటుంబాల అంగీకారం అవసరం లేదు.

భూ సేకరణ చేపట్టే ముందు తప్పని సరిగా విస్తృత స్థాయిలో ఆ ప్రాజెక్టు వల్ల కలిగే సామాజిక, ఆర్థిక ప్రభావాలు, దాని ప్రజా ప్రయోజన స్వభావాన్ని అంచనా వేయడానికి అధ్యయనం జరగాలి. దీన్ని సామాజిక ప్రభావ అంచనా (సోషల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ - ఎస్ఐఎ) అంటున్నారు. దీనికి సంబంధించి చట్టంలోగాని, రూల్స్‌లోగాని చూస్తే చాలా విస్తృతమైనదిగా, మేలు చేసేదిగా ఉంటుంది.

ఎస్ఐఎ నిర్వహించేటప్పుడు గ్రామసభల, పంచాయితీల, మున్సిపాలిటీల, మున్సిపల్ కార్పొరేషన్‌లను సంప్రదించమనే చెప్పారు. కాని వాటి అంగీకారం తప్పనిసరి అని ఎక్కడా పేర్కొనలేదు. ఎస్ఐఎలో గ్రామసభలకు నిర్ణయాత్మకమైన పాత్రను ఇవ్వకపోవడం ద్వారా తమ ప్రాంతాల్లో భూమికి సంబంధించిన ప్లానింగ్, నిర్వహణలపై వాటి హక్కును ఉల్లంఘించారు. పబ్లిక్ హియరింగ్‌ను నిర్వహించి ప్రతి అభ్యంతరాన్ని రికార్డ్ చేయాలి. ఎస్ఐఎలో సామాజిక, ఆర్థిక, పర్యావరణ విషయాలను విస్తృతంగానే స్పృషిస్తుంది. దీనిపై ఎక్స్‌పర్ట్ గ్రూప్ మూల్యాంకనం చేసి భూ సేకరణ చేపట్టాలా వద్దా అని తెలుపుతుంది. అయితే ఎస్ఐఎ రిపోర్టును గాని దాన్ని మూల్యాంకనం చేసే ఎక్స్‌పర్ట్ గ్రూప్ సిఫార్సులను ఏ విధంగా అనుసరించాలనే నిబంధనలేదు. వీటిని పరీక్షించి ప్రభుత్వం భూసేకరణ చేపట్టే అధికారం కలిగి ఉంది. ఎంతో ప్రయోజనకరమైన ఎస్ఐఎను ఎక్స్‌పర్ట్ గ్రూప్ సిఫార్సులను తప్పని సరిగా పాటించాలని చెప్పకపోవడం అంటే ప్రభుత్వానికి మరో రూపంలో ఏకపక్ష అధికారాన్ని కట్టబెట్టినట్లే. అయితే ఎస్ఐఎ రిపోర్టు గాని ఎక్స్‌పర్ట్ గ్రూప్ సిఫార్సులను గాని ప్రజలను అందుబాటులో ఉంచాలి.

2015 భూ సేకరణ సవరణ బిల్లు ఇంతకు ముందే చెప్పిన ఐదు అంశాలకు సంబంధించి భూసేకరణ చేసేటప్పుడు ఎస్ఐఎను సైతం

మినహాయించారు. కనీసం ఎస్ఐఎను కూడా జరపడానికి ఇష్టపడని ప్రభుత్వం ఇది. ఎక్కడ ఆలస్యం అవుతుందో, ఎక్కడ ప్రైవేట్ కంపెనీలకు, కార్పొరేట్లకు కష్టం కలుగుతుందోననే ఆత్రుత ఆరాటం బిజెపి ప్రభుత్వానికి ఎంతలా ఉందో స్పష్టమవుతున్నది. గ్రామసభలు, బాధితులు కాబోయో ప్రజలందరి అంగీకారం, ఎస్ఐఎ, ఎక్స్‌పర్ట్ గ్రూపులను శాస్త్రీయంగా నిర్వహించి వాటి సిఫార్సులను అమలు చేయడం తప్పనిసరి చేస్తేనే ప్రభుత్వం సేకరించే భూముల విషయంలో న్యాయం జరుగు తుంది. లేదంటే మరో రూపంలో 1894 చట్టాన్ని ముందుకు తెచ్చినట్లే.

2013 చట్టంలో ఆహార భద్రతకు సంబంధించి చాప్టర్ 3 సెక్షన్ 10లో వివరించారు. నీటి వసతులున్న బహుళ పంటల (ఇర్రిగేటెడ్ మల్టీక్రాప్ ల్యాండ్స్) భూములను సేకరించరాదు. విధి లేని పరిస్థితుల్లో, తప్పని సరైతే తప్ప చిట్టచివరి అవకాశంగా మాత్రమే సేకరించాలి. అది కూడా జిల్లా, రాష్ట్రం మొత్తంలో నిర్ధారిత వ్యవసాయ భూ పరిమితికి లోబడి ఉండేలా చూడాలి. భూ పరిమితి ఎంత అనేది వేరే విషయం అనుకోండి. దీన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఒకవేళ ఇటువంటి భూములను సేకరిస్తే దానికి సమానమైన బీడు భూములను వ్యవసాయ భూములుగా చేయాలి. లేదా ఆ భూమికి సమానమైన విలువ మొత్తాన్ని ప్రభుత్వం జమచేసి దాన్ని ఆహార భద్రతను పెంచడం కోసం వ్యవసాయం లో పెట్టుబడి పెట్టాలి.

ఇక్కడ గమనించాల్సిందేమంటే నీటి వసతిలేని వర్షాధార భూములు ఏడాదికి ఒక పంట పండించే భూములను ఈ చట్టం మినహాయించ లేదు. ఇలాంటి భూములు భవిష్యత్‌లో నాటి వసతులలో బహుళ పంటల భూములుగా మారే అవకాశాన్ని తోసిపుచ్చలేం. దేశంలో ఎక్కువ మంది రైతులు ఇలాంటి భూములనే కలిగి ఉన్నారు. అంతే కాకుండా రైల్వేలు, ప్రైవేట్, మేజర్ జిల్లా రోడ్లు, నీటి పారుదల కాలువలు, విద్యుత్ లైన్లు మొదలైన వాటికి సంబంధించి బహుళ పంటల సాగు భూములను (మల్టీక్రాప్ ల్యాండ్స్) సైతం సేకరించవచ్చని 2013 చట్టం స్పష్టంగా చెప్పింది. తద్వారా ఆహార భద్రత గురించి మాట్లాడిన 2013 చట్టం మరో దారిలో వ్యవసాయ భూములను లాగేసుకునే అధికారాన్ని కలిగి ఉన్నదనే దానిని గుర్తించాలి. 2015 భూ సేకరణ సవరణ బిల్లు అయితే ఇంతకు ముందే చెప్పిన ఐదు అంశాలకు సంబంధించి చాప్టర్ 3ఎ ను చేర్చింది. వీటి విషయంలో భూసేకరణ చేసేటప్పుడు ఆహార భద్రత, బహుళ పంటల సాగు భూములకు ఎలాంటి మినహాయిపులు లేకుండా నిర్దాక్షిణ్యంగా సేకరించేలా సవరణలు తెచ్చింది. ఇప్పటికే వ్యవసాయ భూములు తగ్గుతూ వచ్చి ప్రమాదకర స్థాయిని చేరుకుంటున్నాయని ఓ వైపు అధ్యయనాలు చెపుతున్నాయి.

వ్యవసాయ భూములేవైన సరే అవి సంవత్సరానికి ఒక పంటనా లేక బహుళ పంటలా అనే దానితో సంబంధం లేకుండా వాటిని సేకరించడం సరైంది కాదు. వాటికి నీటి వసతులను కల్పించడమెలాగో ఆలోచించేది పోయి వాటిని సేకరించేందుకు సిద్ధమయ్యారు. దీని ద్వారా రైతుల, ఆహార భద్రతపై ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు ఉన్నదో తేలి పోతున్నది. ఈ సవరణలు ఎలా ప్రజా ప్రయోజనాలు అవుతాయో మరి? ఇది ఏ క్రూరత్వాన్ని సూచిస్తుంది?

2013 చట్టంలోని ప్రైవేట్ కంపెనీలు అనే స్థానంలో ప్రైవేట్ ఎన్టిటీని చేర్చారు. ప్రైవేట్ ఎన్టిటీ పరిధిలోకి ప్రైవేట్ కంపెనీలతో పాటుగా ప్రొప్రైటర్‌షిప్ (స్వంతదారులు/యజమానులు), పార్టనర్‌షిప్ (భాగస్వామ్య, వ్యాపార సంస్థ), కార్పొరేషన్ (ఒక వ్యక్తిగా గుర్తించడిన సంస్థ), లాభాపేక్షలేని సంస్థలు వంటివి వస్తాయి. భూ సేకరణ చేయడానికి ప్రైవేట్ కంపెనీలే కాకుండా మరెన్నో ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులను అర్హులను చేస్తూ, భూ సేకరణదారుల విస్తృతిని పెంచారు.

2013 భూసేకరణ చట్టం పరిధిలోకి రానటువంటి 13 కేంద్ర ప్రభుత్వ చట్టాలను 2015 భూసేకరణ సవరణ బిల్లు ఈ చట్ట పరిధిలోకి తెచ్చింది. తద్వారా బాధిత కుటుంబాలకు పునరావాస, పునఃస్థాపన ప్రయోజనాలు అందుతాయని బిజెపి ప్రభుత్వం గొప్పగా చెప్పు కుంటున్నది. అసలు విషయం ఏమిటంటే భూ స్వంతదారుల అంగీకారం, ఆహార భద్రతను ఉద్దేశించే పంట భూముల సేకరణ, తప్పనిసరిగా నిర్వహించవల్సిన ఎస్ఐఎల నుండి 2015 సవరణ బిల్లు ద్వారా మినహాయింపులు పొందిన వాటి పరిధిలోకి ఏదో ఒక రూపంలో ఈ 13 చట్టాలు కూడా వస్తాయి. కాబట్టి సరైన పునరావాసం, పరిహారం, పునఃస్థాపన జరిగే అవకాశం లేదు.

నిర్ధారిత ప్రాజెక్టు కోసం సేకరించిన భూమిని ఐదేళ్ల లోపు ఉపయోగించకుండా ఖాళీగా ఉంచితే దానిని తిరిగి భూ స్వంతదారులకు లేదా భూ బ్యాంక్‌లకు ఇచ్చేయాలనే దానికి సవరణలు తెస్తూ ఐదు ఏళ్లకు బదులుగా ప్రాజెక్టు మొదలుపెట్టడానికి నిర్ధారించిన కాలం అని అన్నారు. అంటే ప్రాజెక్టు స్వంతదారు నిర్ణయించే కాలమే అంతిమం. ప్లానింగ్ పీరియడ్‌ను పొడిగిస్తూ పోయే అవకాశం ఉండడం వల్ల భూ స్వంతదారులకు భూమి చేరేదేమి ఉండదు.

2013 చట్టంలో

షెడ్యూల్డ్ ప్రాంతంలో సాధ్యమైనంత వరకు భూసేకరణ వద్దు. తప్పని సరైతే చిట్టచివరి అవకాశంగానే అని అన్నారు గాని ఏ పరిస్థితుల్లో నైనా సరేనని అనలేదు. దేశంలోని 90 శాతం బొగ్గుగనులు, 50 శాతం ముఖ్యమైన ఖనిజాలు, డ్యాంల స్థలాలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లోనే ఉన్నాయి. అలాంటప్పుడు జాతీయ ప్రయోజనాల దృష్ట్యానో, తదితర ప్రయోజనాల దృష్ట్యానో చిట్టచివరి ప్రయత్నంగానే ఇక విధిలేని పరిస్థితుల్లోనే అనే నెపంతో ఆదివాసులను నిరాశ్రయులను చేసే అవకాశాన్ని ప్రభుత్వం చేతిలో ఉంచింది 2013 భూ సేకరణ చట్టం.

షెడ్యూల్డ్ ప్రాంతం పరిధిలోకి రాకుండా 50 శాతం నుండి 70 శాతం మంది ఆదివాసులు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారని జాతీయ సలహా సంఘం (ఎన్ఏసి) గుర్తించింది. వీరి విషయంలో తప్పనిసరి గ్రామసభల అంగీకారం ఉండాలనే పెసా – 1996 చట్టం వర్తించదు. గ్రామసభల అంగీకారం కూడా స్వచ్ఛందంగా, స్వతంత్రంగా కాకుండా భయపెట్టో, బెదిరించో, ప్రలోభపెట్టో, తదితర అక్రమ మార్గాల ద్వారా పొందడం, ప్రాజెక్టులను వ్యతిరేకించే ఉద్యమాలపై, కార్యకర్తలపై, ప్రజలపై రాజ్యహింసను ప్రయోగించడం జరుగుతున్నది.

పరిహారం, పునరావాసం, పునఃస్థాపనకు సంబంధించి ఎన్నో లొసుగులు ఉన్నా సూత్రబద్ధంగా ఒక విధానాన్నైతే 2013 భూ సేకరణ చట్టం తయారు చేసింది.

బాధిత కుటుంబాలకు నష్టపరిహారం, పునరావాసం, పునఃస్థాపనలను అందించేటప్పుడు భూ స్వంతదారులకే కాకుండా భూ సేకరణ నాటికి మూడేళ్లుగా భూ సేకరణ చేసే ప్రాంతంపై ఆధారపడి నివసిస్తున్న వ్యవసాయ కూలీలు, కిరాయిదార్లు, కౌలుదార్లు, వివిధ వృత్తులవారు తదితరులందరికి అందిస్తారు. సూత్రబద్ధంగా ఇది 2013 చట్టంలో ఒక ముందడుగే. పరిహారం, పునరావాసం, పునఃస్థాపన ప్రయోజనాలను భూసేకరణ చేపట్టేలోపే కల్పించాలి. ఇదీ ఒక ముందడుగు చర్యే.

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయే వారికి ఇళ్లు కట్టివ్వడం (ఇందిరా

అవాస్ యోజన) పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయే వారికి 50 చదరపు మీటర్లకు తగ్గకుండా ఇళ్లు కట్టివ్వడం. ఇది ఆ ప్రాంతంలో సొంత ఇళ్లు లేని వారికి కూడా వర్తిస్తుంది. ఇళ్లు వద్దనుకుంటే ఏకమొత్తంలో పట్టణ ప్రాంతం వారికి 1.5 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారికి ఇంటి విలువతో సమానమైన నగదును చెల్లిస్తారు. పట్టణీకరణ కోసం భూసేకరణ జరిగితే అభివృద్ధి చేసిన భూమిలో 20 శాతం భూ స్వంతదారులకు రిజర్వ్ చేయాలి. అందులో వారు కోల్పోయిన భూముల దామాషా ప్రకారం కేటాయిస్తారు.

బాధిత కుటుంబాలలో కనీసం ఒకరికి ప్రాజెక్టు ద్వారా కల్పించబడే ఉద్యోగాల్లో స్థానం ఇస్తారు. దానికి తగిన శిక్షణ ఇస్తారు. లేదా ఏక మొత్తంగా ఐదు లక్షలు కుటుంబానికి చెల్లిస్తారు. లేదా కుటుంబానికి నెలకు 2000 తగ్గకుండా 20 ఏళ్ల వరకు చెల్లిస్తారు.

నిర్వాసిత కుటుంబాలకు జీవనోపాధి అలయెన్సుగా నెలకు మూడు వేల చొప్పున ఒక ఏడాది చెల్లిస్తారు. ఎస్‌సి, ఎస్‌టిలకు దీనికి అదనంగా రు. 50,000 చెల్లిస్తారు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని వారిని తరలించాల్సి వస్తే సాధ్యమైనంత వరకు వారు నివసించే పరిసర ప్రాంతాన్ని పోలిన చోటుకే పునరావాసం కల్పిస్తారు. దీని ద్వారా వారి సంస్కృతి, భాష, ఆర్థిక అవకాశాలు, సంఘ జీవనం పరిరక్షించబడుతుంది.

- నిర్వాసిత కుటుంబాలు షిఫ్ట్ కావడానికి రవాణా ఖర్చుల నిమిత్తం ఏకమొత్తంగా 50,000 ఇస్తారు.
- ప్రతి బాధిత కుటుంబానికి పునఃస్థాపన అలయెన్స్‌గా ఏకమొత్తంలో రు. 50,000 చెల్లిస్తారు.
- పశువులను లేదా చిన్న కొట్టును కలిగి ఉన్న బాధిత కుటుంబాల వారికి రు. 25,000 లకు తగ్గకుండా ఒకేసారి చెల్లిస్తారు.
- వివిధ వృత్తులు చేసేవారు, చిన్న వ్యాపారస్తులు, స్వయం ఉపాధి కలిగిన వ్యవసాయేతర భూములను కలిగి ఉన్న లేదా వ్యాపార పారిశ్రామిక సంస్థాగత నిర్మాణాలు ఉన్న బాధిత కుటుంబాలకు ఒకేసారి రు. 25,000 లకు తగ్గకుండా ఆర్థిక సహాయం చేస్తారు.
- నీటి పారుదల, హైడెల్ ప్రాజెక్టుల విషయంలో బాధిత కుటుంబాలకు రిజర్వాయర్‌లో చేపలు పట్టే హక్కును కల్పిస్తారు.
- నీటి పారుదల ప్రాజెక్టుల విషయంలో వ్యవసాయ భూములు కోల్పోయిన భూ స్వంతదారులను ప్రాజెక్టు కమాండ్ ప్రాంతంలో కనీసం ఒక ఎకరా భూమిని కేటాయిస్తారు. ఎస్‌సి, ఎస్‌టిల విషయంలో అయితే గరిష్టంగా 2.5 ఎకరాల భూమికి ఇస్తారు. ఒక్క నీటి పారుదల విషయంలో తప్పిస్తే వేరే ఏ ఇతర ప్రాజెక్టుల్లో కూడా భూమికి భూమి ఇవ్వరు.
- భూములు కోల్పోయిన భూ స్వంతదారులకు గ్రామీణ ప్రాంతాల్లో అయితే నాలుగు రెట్లు. పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్ల మార్కెట్ విలువను పరిహారంగా చెల్లిస్తారు. పైన తెలిపిన పరిహారాలు అన్ని కూడా వీటికి అదనంగా ఉంటాయి. నష్టపరిహారంగా ఇచ్చేది వారు కోల్పోతున్న భూమికి భూ అమ్మకాల రిజిస్ట్రేషన్ల సమయంలో ఉన్న విలువలను బట్టి మార్కెట్ విలువను నిర్ణయిస్తారు. వాస్తవానికి నిజ అమ్మకాల విలువ మార్కెట్ విలువకి ఎన్నో రెట్లు అధికంగా ఉంటుంది. నిజానికి భూమిపై ఆధారపడిన వారికి కోల్పోయిన భూమి పరిమాణంతో సమానమైన భూమిని ఇవ్వడమే సరైనది. ఇది ఎక్కడా కూడా 2013 చట్టంలో లేదు. నష్టపరిహారంగా వచ్చే సొమ్ముతో బాధితులు తమ భూమితో సమానమైన పరిమాణంలో భూముల్ని కొనుక్కోగలరా? అది సాధ్యం కాదు.

పునఃస్థాపనం గావించబడే కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించాలి. రోడ్లు, డ్రైనేజీ, సురక్షిత మంచినీరు, పశువులకు తాగు నీరు పశువులను మేపుకునేటందుకు భూములు, రేషన్‌షాపులు, పోస్టాఫీస్‌లు, రవాణా వసతులు, స్మశాన వాటికలు, విద్యుత్ సరఫరా, అంగన్‌వాడీలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రం, పిల్లలకు ఆటస్థలం, కమ్యూనిటీ హాల్, పశు సేవాసంస్థ, సరైన భద్రత యంత్రాంగం మొదలగునవి భూ సేకరణదారు కల్పించాల్సి ఉంటుంది.

ఆచరణలో ఇవన్నీ ఎలా ఉంటాయో తెలియదు. ఒకవేళ అలా కల్పించకపోతే చట్టపరంగా చేపట్టే చర్యల ప్రస్తావన చట్టంలో లేదు.

2015 భూసేకరణ సవరణ బిల్లులో భూసేకరణ చేపట్టడానికి ముందు తప్పని సరిగా నిర్వహించే ఎస్ఐఎ నుండి ఇంతకు ముందే చర్చించిన ఐదింటిని మినహాయించారు. కాబట్టి చాలా విస్తృత పరిధిని కలిగి ఉన్న ఈ ఐదు ప్రాజెక్టుల ఫలితంగా నిర్వాసితులైన వారికి సరైన రీతిలో పరిహారం, పునరావాస, పునఃస్థాపన ప్రయోజనాలను నిర్ణయించే వీలు లేకుండా పోతుంది. ఫలితంగా ప్రభుత్వం ఏకపక్షంగా తూతూ మంత్రంగా పరిహారం, పునరావాసం, పునఃస్థాపన ప్రయోజనాలను నిర్ణయిస్తారు. ఎంత సేపటికీ ప్రాజెక్టుల కోసం ప్రజలను తమ జీవనాధార ప్రాంతాల నుండి వెళ్ల గొట్టడమే తప్పించి వారికి సరైన పరిహారం, వారి హక్కుల పట్ల గౌరవం వాటి పరిరక్షణ గురించి లేశ మాత్రం పట్టింపులు లేకుండా 2015 భూసేకరణ సవరణ బిల్లు తయారైంది.

అభివృద్ధి కోసం భూములు కావాలని ప్రభుత్వాలు చెపుతున్నాయి. అవును సరైనదే. అయితే ఏ రకమైన భూములు తీసుకోవాలి. బంజరు భూములు, బీడు భూములు, వృథాగా పడి ఉన్న ప్రభుత్వ భూముల గురించి ఆలోచించవచ్చు గాని, సాగుభూములు, బహుళ పంటలు పండుతున్న భూములనూ వదలకుండా, నివాస ప్రాంతాలను ఊళ్లకు ఊళ్లే ఖాళీ అయ్యేలా చట్టం తీసుకొచ్చే ప్రయత్నాలు దేశానికే అవమానకరం. అంతేకాదు ప్రజాస్వామ్యానికి, ప్రజలకు ప్రమాదకరం.

అభివృద్ధి అంటే ఎవరి అభివృద్ధి? ఎన్ని జీవితాలు ఛిద్రమవుతూ మరెవరికో అభివృద్ధి అంటే చెల్లదు. పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, రవాణా వ్యవస్థలు, విద్యుదీకరణ, డ్యాంలు, వంతెనలు మొదలగునవి అభివృద్ధికి సూచికలుగా చెపుతుంటారు. అయితే ఈ అభివృద్ధి వల్ల సమాజంలోని అందరూ లాభపడాలి. కొందరికే అభివృద్ధి ఫలితాలు దక్కి మరెందరో నిర్వాసితులు, నిరాశ్రయులు అవుతూ సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా చితికిపోవడం అభివృద్ధి ఎలా అవుతుంది? పర్యావరణానికి, జీవవైవిధ్యానికి హానీ కలిగించకుండా సుస్థిర అభివృద్ధి జరగాలి. కాలుష్యం, రోగాల, బారిన పడేలా, ఎందరినో పేదరికం వైపు నెట్టేల చేసేది అభివృద్ధి ఎలా అవుతుంది?

నిజానికి ప్రజల నుండి భూముల సేకరణ కాదు చేయవల్సింది. బంజరు భూములను ప్రభుత్వ అధీనంలో ఉన్న సాగు యోగ్యమైన భూములను లేదా వ్యవసాయ యోగ్యం చేసి లేదా ఎలా వ్యవసాయ యోగ్యం చేయాలో పథకాలు వేసి ఉపాధి, భూమిలేని ప్రజలకు వీటిని ఎలా పంచాలో పథకాలు వేయవల్సి ఉన్నది. ఇందుకోసం భూసేకరణ చట్టాలు చేయవల్సి ఉన్నది. కాని అభివృద్ధి పేరు మీద ప్రభుత్వాలు ప్రైవేట్ కంపెనీల కోసం ప్రజల వద్ద ఉన్న కనీస భూములను కూడా లాగేసుకోవడం నాగరిక సమాజ లక్షణం కాదు. ప్రజాస్వామ్యం అసలే కాదు. ప్రజలకు భూములు పంచేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాల్సి ఉన్నది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

జమ్మూ కశ్మీర్‌లో బిజెపి - పిడిపి పొత్తు

***స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం నిత్యం నెత్తురోడుతూ సైన్యం పహారాలో ఉన్న జమ్మూ కశ్మీర్‌లో ప్రజల అంగీకారం లేకుండా పాలకులు కుదుర్చుకున్న అవకాశవాద పొత్తులు అధికారం కోసమేననీ, ప్రజలే తమ స్వప్నాల సాకారం కోసం కృషి చేయాలనీ అంటున్నారు* బి.ఎస్. రాజు**

2014 డిసెంబర్ 23న జమ్మూ – కశ్మీర్ శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. కేక్‌ను కత్తితో రెండు సమాన భాగాలుగా కోసినట్టు జమ్మూలో భారతీయ జనతా పార్టీ (బి.జె.పి) కి 25 సీట్లు, కశ్మీర్‌లో ప్రోగ్రెస్సివ్ డెమోక్రాటిక్ పార్టీ (పి.డి.పి) కి 28 సీట్లు వచ్చాయి. తేడా పిసరంత, మూడు సీట్లు అంతే. జమ్మూలో పిడిపి, కశ్మీర్ లోయలో బిజెపి ప్రజల దృష్టిలో రెండు భిన్న రూపాలుగా కనిపించే బిజెపి – పిడిపిల ఆత్మ ఒక్కటే. వారు భిన్న మత సమూహాల సామాజిక, రాజకీయ ప్రతినిధులుగా చలామణి అవుతున్నప్పటికీ వారి ఆర్థిక సంవిధానం భూస్వామ్య – పెట్టుబడిదారీ వ్యాపార వర్గాల ప్రయోజనాలను సదా కాపాడే తంత్రమే. కాబట్టే, మతాన్ని అడ్డుపెట్టుకొని వోట్లు వేయించుకుని, సీట్లు గెలుచుకున్న ఈ రెండు పార్టీలు పొత్తు పెట్టుకోవడం కోసం ప్రజలను ఎలా ఏమార్చాలి? ఎలా మభ్యపెట్టాలి? అన్నదే తాత్కాలిక సమస్యగానీ, నిజానికి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే వారిరువురికి మానసికంగా పొత్తు కుదిరిపోయింది. ఎటొచ్చీ పదవుల పంపకాలపై అంగీకారం కుదరడానికి రెండు నెలలు గుంపు చింపీలు పడవలసి వచ్చింది. పదవుల పంపకాలపై అంగీకారం కుదిరిన వెంటనే అధికారికంగా పొత్తు ప్రకటన జరిగింది. ఈ పొత్తుకు ముద్దుగా 'ఎజెండా ఫర్ ఎలియన్స్' అనే పేరు పెట్టుకున్నాయి. ఓ అవగాహన అంగీకార పత్రాన్ని రాసుకున్నాయి.

జమ్మూ – కశ్మీర్‌కు 12వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సీనియర్ పి.డి.పి నాయకుడు 'ముఫ్తీ మొహమ్మద్ సయ్యిద్' బిజెపితో తమ పొత్తు చెప్పుకోదగ్గ చారిత్రిక సంఘటన అని, ఈ పొత్తు ఓ ముఖ్యమైన చారిత్రిక మలుపుగా మారాలని కోరుకుంటున్నట్లు ప్రకటించాడు. దేశ ప్రధానులుగా ఉండిన అప్పటి జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, అటల్ బిహారి వాజ్‌పేయ్‌లకే కాక ఇప్పుడు నరేంద్రమోడీ వరకు కశ్మీర్ ఒక సమస్యగానే ఉంటూ వచ్చిందని, ఇప్పటి ఈ 'బి.జె.పి– పి.డి.పి' పొత్తు భిన్న ధ్రువాల కలయికే ఐనప్పటికీ, ఈ నూతన కలయిక చరిత్రను మలుపుతిప్పేది అవుతుందని తాను నమ్ముతున్నానన్నాడు. ఈ కలయిక అవకాశవాద కలయిక కాదని, ధృడమైన నమ్మకంతో కూడుకున్నదని అంటూ జమ్మూ నుండి కశ్మీర్‌కు విమాన ప్రయాణం 30 నిముషాలని, ఆధునిక రహదారుల అభివృద్ధి పూర్తయితే 4 గంటల్లో జమ్మూ నుండి కశ్మీర్ చేరుకోవచ్చని అయితే ఈ ఇరు ప్రాంతాల మధ్య ఇప్పుడున్న (మానసిక) దూరం ఇంతకన్నా చాలా ఎక్కువేనని, కశ్మీర్ ఢిల్లీకి దగ్గరవ్వాలంటే, ముందుగా జమ్మూ కశ్మీర్ ప్రాంతాలు దగ్గరవ్వాలని, ఈ పొత్తు ద్వారా తాను ఈ దూరాన్ని దగ్గర చేయాలని ఆశిస్తున్నానని అన్నాడు.

మాటలో మాటగా ఆయన ఓ అడుగు ముందుకు వేసి లోయలో ఎన్నికల సమయంలో ప్రశాంతతకు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనడానికి పాకిస్థాన్ వేర్పాటువాద నాయకత్వం తటస్థ వైఖరి దోహద పడిందని తాను గుర్తించానని, ఇదే విషయాన్ని తానూ మోడీతో కూడా ప్రస్తావించాననీ, వారితో అర్థవంతమైన వైఖరి (మీనింగ్‌ఫుల్ ఎంగేజ్మెంట్) కలిగి ఉండాలని కుండ బద్దలుకొట్టాడు. ఈ పని వాజ్‌పేయ్ చేశారని అది తిరిగి కొనసాగించాలని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశాడు.

ఆయన ఇలా అనడం హిందూత్వ శక్తులకు, కేంద్ర ప్రభుత్వానికి ఒక్కసారే గాలి తీసేసినట్లయింది. తమ సైన్య పాటవాన్ని, రాజనీతిజ్ఞతను కించపరచి తమతో జతకడుతున్న, తమ ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి పదవిని కొట్టేసిన ముఫ్తీ మొహమ్మద్ సయ్యాద్ పెంటకుప్ప పైకివిసిరేసి మాట్లాడం ఓ పెద్ద దుమారమే లేపింది. సయ్యాద్ ఏమైనా వెర్రివెంగళప్పా ఇలా మాట్లాడడానికి? కాదే ! ఆయన పొత్తుల రాజకీయంలో ఆరితేరిన ఉద్దండుడు. ఇదివరకు కాంగ్రెస్‌తో పొత్తుపెట్టుకొని 3 ఏళ్ల పాటు జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి పదవిని, కేంద్రంలో విపిసింగ్ మంత్రివర్గంలో హోం మంత్రిగాను పనిచేశాడు. ఈ రోజు అతను తిరిగి ఆరేళ్ల పాటు ముఖ్యమంత్రి కాగలిగేడంటే అసలు కశ్మీర్ లోయలో ఎన్నికలు జరగనిచ్చిన శక్తులకు, ఓట్లేసి గెలిపించిన ప్రజలకు శాభాషీ చెప్పక పోతే తన మనుగడ ప్రశ్నార్థకం కాదా ? ప్రజల బద్ధ శత్రువుతో తను జతకడుతున్నందుకు కశ్మీర్ ముస్లిం సమాజం తనను వెలివేయదా ? ఇటువంటి దుస్థితి దాపురించకుండా పరిపాలనకు మార్గం సుగమం చేసుకోవడానికే ఈ శాభాషీ అంతా. ఇక బి.జె.పికి ఇది నచ్చినా, నచ్చకపోయినా వేరే గత్యంతరం లేదు. రాక రాక అందివచ్చిన కాశ్మీరీ రాజ్యాధికార ప్రవేశం బి.జె.పికి సిక్సరే కదా! రాబోయే అచ్చేదిన్, మంచి కాలానికి శుభ సూచకమే కదా!

ఆర్టికల్ 370 ని రద్దుచేసి పారేస్తామని, ప్రత్యేక సైనికాధికార చట్టాన్ని కొనసాగిస్తామని చెప్పి హిందూ ప్రజాధిక్యత కల జమ్మూలో ఓట్లు సీట్లు దండుకుంది బి.జె.పి. తమకు ఓట్లేసి గెలిపిస్తే కశ్మీర్ ప్రజల పాలిట శాపంగా తయారైన ప్రత్యేక సైనికాధికార చట్టాన్ని వెంటనే రద్దు చేస్తామని ముస్లిం ప్రజల ఆధిక్యతగల లోయలో ఓట్లు సీట్లు దండుకుంది పి.డి.పి ఇప్పుడు పచ్చి అవకాశవాద పొత్తుతో అధికారం కోసం ఒకటైన ఈ రెండు పక్షాలు అభివృద్ధి, శాంతి సంరక్షణ నామజపం చేస్తున్నాయి. ఒకడుగు ముందుకు వేసి మసారత్ ఆలం అనే వేర్పాటువాద ముస్లింలీగ్ నాయకుణ్ణి వ్యూహాత్మకంగా జైలు నుండి విడుదల చేయించడం వీరిరువురి పాలక రాజనీతిలో భాగమే. కశ్మీర్ ప్రజల పుండు మీద ఒకింత మలాము పూయ ప్రయత్నించడమే!

రాజ్యాధికార ఆకాంక్ష, పరిపాలనా దాహం రాజకీయ పార్టీలకు పీల్చేగాలంత సహజం. పాలనాధికారపు పగ్గాలను చేజిక్కించుకోవడానికి భిన్నధ్రువాలు కలుస్తూ ఉంటాయి. పొత్తు కడుతూ ఉంటాయి, విడిపోతూ ఉంటాయి. అవకాశవాదం తప్ప ఈ కలయికలకు, సమీకరణాలకు వేరే తాత్వికత అంటూ ఉండదు. ఇటువంటి ధోరణి మనదేశ పార్లమెంటరీ రాజకీయాలకు కొత్తేమీకాదు. మనదేశంలోనే కాదు, అనేక ఇతరదేశాల్లోనూ ఈ ధోరణి సర్వసాధారణ రాజకీయ ప్రక్రియగా కొనసాగుతోంది. తాజాగా ఇప్పుడు, ఇటు భారతదేశంలో కశ్మీర్ రాష్ట్రంలోను అటు గ్రీస్‌దేశంలోను ఇటువంటి భిన్న ధ్రువ రాజకీయ అవకాశవాద అధికార పొత్తులు తెరపైకి వచ్చాయి.

అక్కడ 'గ్రీస్ దేశంలో రాజ్యాధికారానికై 'సిరిజా' అని పిలవబడుతున్న రాడికల్ వామపక్ష వాదులు, మితవాద జాతీయ వాదులతో చేతులు కలిపారు. ఇక్కడ కశ్మీర్‌లో హిందూత్వ జాతీయవాద భారతీయ జనతా పార్టీ (బి.జె.పి), ముస్లిం జాతీయ వాద ప్రోగ్రెస్సివ్ డెమోక్రాటిక్ పార్టీ (పి.డి.పి) జత కట్టి అధికారంలోకి వచ్చాయి. ఈ కలయిక మూన్నాళ్ల ముచ్చటా? లేక ధృడమైన బంధమా? అన్నది రాజకీయ బొమ్మలాట వెండితెరపై చూడవలసిందే!

ఈ అవకాశవాద కలయిక కశ్మీర్ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నదా? అటు పాకిస్థాన్ ఇటు ఇండియా గుప్పెట్లో చిక్కుకుని నిత్య చిత్రహింసలకు గురవుతున్న కాశ్మీరీ ప్రజలకు, స్వతంత్ర కశ్మీర్ కోరుకుంటున్న ప్రజలకు ఇటువంటి రాజకీయ పొత్తుల వల్ల ఒరిగేదేమిటి? కాశ్మీరీ ప్రజల మనోభావాల కనుగుణంగానే 'పి.డి.పి', 'బి.జె.పి'తో పొత్తు పెట్టుకున్నదా? ఇటువంటి పొత్తు పెట్టుకుంటామని ఎన్నికల సమయంలో గనుక పి.డి.పి ప్రకటించి ఉంటే కశ్మీర్ ప్రజలు ఈ పార్టీకి ఓట్లు వేసేవారా? హిందూ ప్రజల మెజారిటీ గల జమ్మూలో భాజపా అధిక సీట్లను హస్తగతం చేసుకుంటే, ముస్లిం ప్రజల మెజారిటీ గల కశ్మీర్ లోయలో పి.డి.పి అధిక సంఖ్యలో శాసన సభ సీట్లు గెల్చుకుంది. ఈ పరిణామం ఏమి తెలియచేస్తోంది? జమ్ముకు ఒక శాసన సభ, కశ్మీర్‌కు వేరే శాసన సభ పరిపాలనా ప్రభుత్వాలు ఉండాల్సిన స్థితిని తెలియచేస్తోంది. ఇండియన్ మిలటరీ పదఘట్టనలతో నుజ్జు నుజ్జైన కాశ్మీరీ ప్రజలు, తమ ప్రాంతంలో ఒక్క సీటైన గెలవని బిజెపి పొత్తు పాలనను ఎలా స్వీకరిస్తారు? భారతదేశ పార్లమెంటరీ కపట రాజకీయ బూటకానికి ఇది పరాకాష్ట కాదా?

ఇక్కడ, ఈ మొత్తం ఎన్నికల రొచ్చులో, కశ్మీర్ మనసుల మనుష్యులు ఉండరు, కేవలం మరబొమ్మలే ఉంటాయి. సైన్యం, ఇనుప బూట్లు, మర తుపాకులు ఉంటాయి. వీటికి తోడుగా, కొత్తగా కార్పొరేట్ హిందూత్వ అభివృద్ధి ఇనుపడేగలు వచ్చిచేరతాయి. కశ్మీర్ నేల తల్లి గుండెలు చీల్చి, పచ్చని ప్రకృతిని రక్త సిక్తం చేస్తాయి. చూడండి! కశ్మీర్‌లో, వేము ఎటువంటి అధ్భుతాలను సృష్టిస్తున్నావో చూసి తరించమంటాయి! గుజరాత్ నమూనా కాంచమంటాయి! మోదీత్వ మహిమను కశ్మీర్ ప్రజలకు ఉదారంగా పంచిపెడుతాయి!

పచ్చి అవకాశవాద పొత్తుతో అధికారం కోసం ఒకటైన ఈ రెండు పక్షాలు అభివృద్ధి, శాంతి సంరక్షణ నామజపం చేస్తున్నాయి. ఒకడుగు ముందుకు వేసి మసారత్ అలం భట్ అనే వేర్పాటువాద ముస్లింలీగ్ నాయకుణ్ణి వ్యూహాత్మకంగా జైలు నుండి విడుదుల చేయించడం వీరిరువురిపాలక రాజనీతిలో భాగమే. కశ్మీర్ ప్రజల పుండు మీద ఒకింత మలాము పూయ ప్రయత్నించడమే! ఇంకా 'ఎజెండా ఫర్ ఎలియన్స్'పై బి.జె.పి–పి.డి.పిల 'సంతకాల తడి ఆరాక ముందే, సైనిక, పోలీస్ స్థావరాలపై కశ్మీర్ ఏర్పాటువాద మిలిటెంట్ల దాడులు రెండు జరిగాయి. ముందు ముందు, కశ్మీర్ ముఖచిత్రం ఎలా ఉండబోతోందో ఈ రెండు సంఘటనలు తెలియచేస్తున్నాయనుకుంటా!

ఈ రోజు కశ్మీర్‌లోనూ, ఈశాన్య భారతంలోనూ నివసిస్తున్న ప్రజలే కాక యావత్ భారతదేశ ప్రజలు భూస్వామ్యం, సామ్రాజ్యవాద దళారీ పెట్టుబడి, మతతత్వ ఫాసిజం అనే మూడు పర్వతాల పెనుభారాన్ని మోస్తున్నారు. ఈ పర్వతాల పెను భారాన్ని; దోపిడీ, పీడనల పునాదిపై లేచి నిలిచిన అంతరాల దొంతరల భారత సామాజిక వ్యవస్థా సౌధాన్ని సర్వ మతాల జన జాతుల ప్రజలు ఐక్యమై తమ మూపులపై మోస్తున్న ఈ పర్వతాలను విసరికొట్టి, నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణానికి పూనుకోవడం మినహా ప్రజలకు వేరే ప్రత్యామ్నాయం మేమీ లేదన్న సత్యాన్ని గత 68 ఏళ్ల పొత్తుల పార్లమెంటరీ రాజకీయ చరిత్ర మనకు తెలియ చెపుతున్న, విస్మరించలేని వాస్తవం. వీ

(రచయిత శ్రామిక నేస్తం సంపాదకులు)

విలువల విజయమే ఢిల్లీ ఎన్నికల ఫలితం

***ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ప్రధాన కారణమనీ, సామాన్య ప్రజల మౌలిక అవసరాలను గుర్తించకుంటే ఎంతటివారికైనా ఇదే గతి పడుతుందనీ అంటున్నారు* **వై.ఎచ్.కె. మోహన్‌రావు**

ఓటర్లు తమ నిజాయితీని మరోమారు ధృవపరుచుకున్నారు. ప్రజలు డబ్బు తీసుకునే ఓట్లేస్తారనే అవినీతి పరులైన రాజకీయ నాయకుల వంకర మాటలకు చెక్ పెట్టారు. నీతివంతమైన నాయకులకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఓటు భజాయించి చెప్పారు. సేవా దృక్పథమే సిద్ధాంతంగా చేసుకుని రాజకీయాలలోకి వచ్చిన పార్టీలకు హారతిపట్టి అధికారాన్ని పువ్వుల్లో పెట్టి అర్పించుకుంటారని చాటి చెప్పారు. ఇటీవలి ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల ఫలితాలు భారత రాజకీయ ముఖచిత్రంపై అనేక నూతన విషయాలను ఆవిష్కరించాయి. దేశంలో ప్రస్తుతం నడుస్తున్న రాజ్యాంగ వ్యతిరేక రాజకీయాలను బలిపీఠం ఎక్కించాయి. అనేక సంప్రదాయ రాజకీయ పార్టీలకు కనువిప్పు, మార్గ దర్శనం అయ్యాయి. ఢిల్లీ రాష్ట్ర ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయం నిజంగా ప్రజా విజయం. ఆప్ విజయాన్ని దేశంలోని ప్రజాస్వామ్య వాదులంతా ఆకాంక్షించారు. ఢిల్లీ ప్రజలతో పాటు దేశ ప్రజలంతా కేజ్రీవాల్ బృందమే అధికారాన్ని చేపట్టాలని కోరుకున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆమ్ ఆద్మీ పార్టీ సాధించిన ఫలితాలను మీడియా, సర్వే సంస్థలు కూడా పసికట్టలేకపోయాయి. వాస్తవానికి భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత జరిగిన అనేక ఎన్నికలు ఈ దఫా జరిగిన ఢిల్లీ ఎన్నికలతో పోల్చలేం. ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా, ధన మద్య ప్రభావాల జోలికిపోకుండా ఆప్ సాధించిన ఘన విజయం ఒక సంచలనం. ఎతావాతా ఆ పార్టీ పుట్టుక, ఎదుగుదల, 49 రోజుల పాలన, అనంతర రాజీనామాలు, అప్రతిహతంగా తిరిగి అధికారాన్ని చేపట్టడం ఒకదాని వెంట ఒకటిగా జరిగిన అన్నీ కూడా మహాద్భుతాలే. ఈసారి జరిగిన ఢిల్లీ ఎన్నికలను మనదేశ మీడియా ఆసక్తిని మించి విదేశీ మీడియా ఉత్కంఠంగా పరిశీలించింది. టెలిగ్రాఫ్ పత్రిక ఢిల్లీ ఎన్నికల ఫలితాలను భారత రాజకీయాలలో పెను సునామిగా అభివర్ణించింది. ప్రఖ్యాత విదేశీ పత్రికలు ఆప్ తిరుగులేని ఫలితాలను పతాక శీర్షికలకెక్కించి హర్షతాండవం చేశాయి.

శిరస్సులేని మొండెంలా ఉంది ఇప్పుడు భారతీయ జనతా పార్టీ తీరు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో అది ఒక ఖండిత దేహంలా కనిపిస్తుంది. మహారాష్ట్రలో శివసేన పార్టీని భయపెట్టి పబ్బం గడుపుకున్న నరేంద్రమోడీకి ఢిల్లీ ఓటరు మాత్రం ఆ అవకాశం దక్కనివ్వలేదు. మహారాష్ట్ర రాజకీయాలను కిరికిరి చేసినట్లుగా కేజ్రీవాల్ ఆమ్ ఆద్మీ పార్టీని సంక్షోభంలోకి నెట్టే అవకాశం కలగకపోవడం మోడీకి పెద్ద నిరాశాజనకం. ఆప్ విజయంపై ఎన్నికల ప్రచారం మొదలైనప్పటి నుండీ అతికొద్ది కాలంలో మీడియాలో వచ్చిన వ్యాసాలు, కథనాలు పుంఖాను పుంఖాలుగానే ఉన్నాయి. అయినా ఢిల్లీ ఎన్నికలూ, ఫలితాల గురించి చెప్పుకోవలసినదీ, చర్చించవలసినదీ ఎంతో ఉందనేది నా అభిప్రాయం. ఏడు నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఢిల్లీ రాష్ట్రంలోని 7 ఎంపి సీట్లు గెలుచుకున్న బిజెపి అసెంబ్లీ ఎన్నికలలో 70 సీట్లకు గాను కేవలం 3 సీట్లకే పరిమితం కావడం వినూత్న పరిణామం. సార్వత్రిక ఎన్నికల నుండి ప్రారంభమై అప్రతిహతంగా దూసుకుపోతున్న బిజెపి విజయ పరంపరను ఢిల్లీ ఫలితాలు శృంగభంగం చేశాయి. మహా వ్యూహకర్తగా ముద్ర పడిన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, గొప్ప విజయాల నాయకుడిగా పేరొందిన ప్రధాని నరేంద్రమోడీల విజయ జంట ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో బొక్క బోర్లా పడింది. వారిరువురి దూకుడుకు ఢిల్లీ ఓటరు కళ్లెం వేశాడు.

భారత రాజకీయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక ప్రధానమంత్రి ఢిల్లీలోని గల్లీ గల్లీ తిరిగి శాసన సభ ఎన్నికలలో ప్రచారం గావించడం పసికూన లాంటి ఆమ్ ఆద్మీ పార్టీ పైనా, ఆ పార్టీ ప్రధాన నేత కేజ్రీవాల్ పైనా సంధించిన వాగ్దానాలు పరాజయం రూపాన్ని సంతరించుకుని తిరిగి ఆయన పొదిలోకే వచ్చి చేరాయి. మతాన్ని, కులాన్ని, గోత్రాన్ని సైతం ఎన్నికల ప్రచారంలోకి లాగి ఆప్‌ను, దాని నాయకులను బదనామ్ చేయడానికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకున్న బిజెపికి ఢిల్లీ ఓటర్లు మూడు స్థానాలను ముష్టిచ్చారు.

కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉండి ఉద్యమాలు చేపట్టినా, ఉన్న పళంగా ముఖ్యమంత్రిగా తప్పుకున్నా అన్నీ తమ బాగోగుల కోసమేనని ఢిల్లీ ఓటర్లు నమ్ముతూ అక్కున చేర్చుకున్నారు. అరాచకవాదులెవరో?, అపరిపక్వ పాలకులెవరో? నిలువెత్తు ఫలితాలతో ముఖం మీద గుద్దినట్లు తేల్చేశారు. ఎన్నికల ప్రచారంలో మోడీ వ్యాఖ్యానించినట్లు అడవుల్లోకి వెల్లవలసిన వారెవరో?, ఢిల్లీ పీఠంపై ఆసీనులు కావలసిన వారెవరో? ఓటర్లు మూల్యాంకనం చేశారు. పరిపాలన చేపట్టవలసిన వారెవరో? పీఠాలకు దూరంగా ఉంచవలసింది ఎవరినో? లెక్కలు తేల్చారు. ఎవరికి ఓట్లో ఎవరికి తూట్లో ఆచరణలో స్పష్టం చేశారు. నోట్లు, మద్యం ఓటరు విజ్ఞత ముందు నిలువలేక పలాయనం చిత్తగించాయి. గత సంప్రదాయ అక్రమ విధానాలను ఢిల్లీ ఓటర్లు ఛీకొట్టి నిలిచారు. నిజాయితీకే తమ ఓటంటూ విజ్ఞత ప్రదర్శించారు. లోక్‌పాల్ బిల్లు ఆమోదించుకోలేని నిస్సహాయ స్థితిలో ముఖ్యమంత్రి పీఠాన్ని తృణప్రాయంగా త్యజించి అధికారాన్ని విడిచిన ఆమ్ ఆద్మీ పార్టీ గత 8 నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఢిల్లీ రాష్ట్రంలో 7 ఎంపి స్థానాల్లో ఒక్కటిని కూడా దక్కించుకోలేక పోయింది. అయినప్పటికీ పడిలేచిన కెరటంలా ఇప్పుడు జరిగిన శాసన సభ ఎన్నికలలో తనతో పోటీకి దిగిన అన్ని రాజకీయ పార్టీలను మట్టికరిపించి తన 'చీపురు'తో ఊడ్చి పారేసింది. ఈ

పరిణామాన్ని విశ్లేషించినప్పుడు కొన్ని ఆసక్తికర వాస్తవాలు మన ముందు సాక్షాత్కరిస్తాయి. మహాభారత ఇతిహాసంలో ధృతరాష్ట్రుని సంతానం నూరుగురు పుత్రులలో సుయోధనునితో పాటు వికర్ణుడు కూడా ఒకరు. అయితే మహా భారత గాథ మొత్తంలో వికర్ణుడు మనకు రెండు పర్యాయాలు తెరపై కనిపిస్తాడు. ద్రౌపదీ దేవిని సుయోధనుడు జ్యూత గృహానికి ఈడ్చుకు రమ్మని దుశ్శాసనుని ఆదేశించినప్పుడు ఆ చర్యను వ్యతిరేకిస్తూ అధర్మమని ప్రకటించి జ్యూత గృహాన్ని విడిచి వెళ్ళి నిరసన ప్రకటిస్తాడు. రెండవది శ్రీకృష్ణుని రాయబార సన్నివేశంలో పాండవులకు సూది మొన మోపినంత భూమిని ఇచ్చేది లేదని సుయోధనుడు తెగేసి చెప్పినప్పుడు వికర్ణుడు ఆ నిర్ణయాన్ని గర్హిస్తూ వారి రాజ్యాన్ని వారికి ఇవ్వమని సలహా ఇస్తాడు. ఈ రెండు సంఘటనలతో మహా భారతంలో వికర్ణుని నైజమేమిటో మనకు స్థిరపడుతుంది. ధర్మం తప్పని వాడని, మహిళల పట్ల గౌరవం కలవాడని మనకు బోధపడుతుంది. అదే విధంగా ఢిల్లీ శాసన సభ ఎన్నికల నాటికి అక్కడి ఓటర్లకు కేజ్రీవాల్ నడవడి తేటబడిన ఏటినీరని, నరేంద్రమోడీ వ్యక్తిత్వం కలుషితమైన కోనేటి నీరని స్పష్టమైంది. రెండు సంఘటనల ఆధారంగా వికర్ణుడు సన్మార్గుడని ధృవీకరణ అయినట్లు ఎన్నికల వాగ్దానాలలో భాగంగా 49 రోజుల అతి స్వల్ప పాలనా కాలంలోనే ఢిల్లీ ప్రజల నిత్యవసారాలైన విద్యుత్తును తక్కువ ధరకు, ఉచితంగా తాగునీరు అందించి రెండు కార్యక్రమాల ద్వారా కేజ్రీవాల్ మాటతప్పని వాడుగా శిఖర సమానుడై నిలిచాడు ఢిల్లీ ఓటరుకు. ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగించే ప్రజా ప్రతినిధిగా గుర్తింపుకొచ్చాడు.

ఈ నేపథ్యంలోనే ఎన్నో ఆశలతో సాధారణ ఎన్నికల్లో 7 ఎంపి స్థానాలను గంప గుత్తగా ఇచ్చిన ఢిల్లీ ప్రజలకు నరేంద్రమోడీ 7 నెలల కాలంలో ఒనగూర్చిన ప్రయోజనం ఖాళీ పిడికిలి, మొండి చేయి. ఈ పూర్వ రంగంతోనే మోడీపై నిలుపుకున్న నమ్మకాలు ఆవిరై ప్రజల పక్షాన పనిచేసిన కేజ్రీవాల్‌కు, ఆయన ఆమ్ ఆద్మీ పార్టీకి ఢిల్లీ ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలను పురస్కరించుకుని ప్రాసపదాలతో ప్రసంగాలను ముంచెత్తే కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడి వ్యాఖ్యలు గమనిస్తే ఢిల్లీ ఓటర్లను మభ్యపెట్టలేకపోయామనే బాధ వ్యక్తమవుతుంది. భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారం చేపట్టిన వెంటనే ఢిల్లీ ఎన్నికలకు వెళ్ళక పోవడం పెద్ద తప్పిదంగా ఆయన వాపోయారు. వెంటనే ఎన్నికలు జరిగితే తమ రంగు బయట పడేది కాదనీ, ఢిల్లీ ఓటర్లు తమకే అధికారాన్ని అప్పగించేవారనేది ఆయన ఏడుపు. ఆయన వ్యాఖ్యల్లోని సారం ఈ విధంగా చెప్పుకోవచ్చు. ఈ ఏడు నెలల కాలంలో ప్రజలకు బిజెపి ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదు కాబట్టి ఢిల్లీ ప్రజలు బిజెపిని తిప్పి కొట్టారని చెప్పవచ్చు. నిజం చెప్పుకోవాలంటే అభివృద్ధి, సంక్షేమాలలోనే కాదు రాజకీయాలలో కూడా బిజెపి అనుసరించిన మంచి విధానాలు లేకపోగా రైల్వేచార్జీల పెంపు వంటి ప్రమాదాలనే సామాన్యుడి నుండి ప్రతి ఒక్క పౌరునికి తెచ్చి పెట్టింది. ఈ పరిణామాలే బిజెపి వైపున్న నమ్మకాలను వమ్ము చేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

చాయ్ వాలానంటూ 10 లక్షల విలువగల కోటుతో మెరిసిపోవడం నరేంద్రమోడీ ఢిల్లీ ఎన్నికల ముందు చేసిన గొప్ప తప్పిదం. ఈ ఖరీదు కోటు ప్రచారం ప్రజల వద్దకు అతి సమీపంగా వెళ్ళినట్లు బహిర్గతమైంది. వాస్తవానికి మోడీ తప్పిదాలు ఎప్పటి నుండో ప్రారంభమయ్యాయి. స్వచ్ఛమైన రాజకీయాలు లక్ష్యమంటూ కేకలు వేసి అధికారంలోకి వచ్చిన మోడీ వక్రమార్గం పట్టి ప్రయాణించడం ఏనాడో మొదలైంది. అవకాశం లభించినప్పుడల్లా వంకర నడక అందుకుంటూనే ఉన్నాడు. ఒకవైపు కేజ్రీవాల్ సామాన్యుడిలా ప్రజల వద్దకు వెళ్ళి స్వచ్ఛమైన హామీలు ఇచ్చి ప్రజలను ఆకట్టుకుంటే మోడీ ఆయన అనుచర వర్గం పాత మోసపూరితమూ విధానంతోనే వెళ్ళారు. పార్లమెంట్‌లో స్పష్టమైన ఆధిక్యాన్నిచ్చి స్వచ్ఛమైన రాజకీయాలు, పాలన సాగించమని ప్రజలు అధికారాన్ని కట్టబెడితే ఆయన తొలి అడుగే మురుగులో పడింది. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని బిజెపి హస్తగతం చేయడం కోసం శివసేన పార్టీని బెదిరించే క్రమంలో ఆ పార్టీ ఎంపికి బిజెపి తీర్థమిచ్చి మంత్రి పదవిని కూడా కట్టబెట్టిన వైనం విలువలు పతనమైన మోడీ రాజకీయాలకు దర్పణం పట్టింది. ఆ పార్టీ ఎంపిని తమ వైపుకు మళ్ళించుకుని బిజెపి మహారాష్ట్రలో అధికారంలోకి వచ్చేందుకు తప్పనిసరిగా మద్దతునిచ్చే ఒక విపత్కర పరిస్థితికి శివసేన పార్టీని నెట్టి వేశారు. ఇంతకంటే రాజకీయ పతనం మరొకటి ఉండబోదేమో! ఇవన్నీ పసిగట్టిన ఢిల్లీ ఓటర్లు 7 నెలల క్రితం సార్వత్రిక ఎన్నికల్లో తీసుకున్న నిర్ణయాన్ని నిర్ద్వందంగా మార్చుకుని ఆప్‌కు జేజేలు పలికారు.

ఢిల్లీ ఎన్నికల ఫలితాలు చవి చూసిన తర్వాత కూడా బిజెపి ప్రభుత్వ వైఖరిలో పెద్ద మార్పేమీ కనిపించడం లేదు. వారి బాస దాటుడు పూర్వ పద్ధతులకే కట్టుబడి నడుస్తున్నట్లు వెల్లడి అవుతుంది. ఉదాహరణకు ఢిల్లీ ఎన్నికలను పురస్కరించుకుని బిజెపి ఎన్నికల ప్రణాళికలో ఆ రాష్ట్రానికి పూర్తి స్థాయి హోదా కల్పిస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ గతంలో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇదే విషయాన్ని శాసన సభలో ఆమోదం తెలిపి కేంద్రానికి నివేదించారు. అనంతరం ఒక పర్యాయం పార్లమెంట్ ఎజెండాలోకి కూడా ఈ అంశం వచ్చి అక్కడే నిలిచిపోయింది. ఈ పూర్వ రంగంలో ఆమ్ ఆద్మీ పార్టీ కూడా గత ఎన్నికలలోనూ, ఈ ఎన్నికలలోనూ ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా కోసం పోరాడుతామని తెలుపుతూ ఆ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. ఫలితాలనంతరం ఆప్ శాసన సభాపక్ష నాయకుడు కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా తాను రామ్‌లీలా మైదానంలో చేస్తున్న ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానిస్తూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, పార్లమెంట్ వ్యవహారాల మంత్రి వెంకయ్య నాయుడి వద్ద ఈ విషయాన్ని ప్రస్తావనకు తెచ్చినప్పుడు వెంకయ్యనాయుడు సాధ్యం కాదని, ఇవ్వలేమని సమాధానమిచ్చిన తీరు గమనిస్తే బిజెపి నమ్మక ద్రోహ పోకడ బట్టబయలవుతుంది. వాగ్దాన భంగానికి పాల్పడిన ఆ పార్టీని ఏడు నెలల కాలంలో ఓటరు ఛీకొట్టినా ఆ పార్టీకి జ్ఞానోదయమయినట్లు కనిపించడం లేదు.

ఢిల్లీ ఎన్నికల ఫలితాల అనంతరమైనా ఆ పార్టీ విధానంలో మార్పు తెచ్చుకోక పోవడం బిజెపి అహంభావాన్ని ఆవిష్కరించింది. రుజు మార్గంలో నడవడానికి ఆ పార్టీ ఇష్టపడడం లేదని వెల్లడవుతుంది. ఇది ఇట్లా ఉంటే రైల్వే బడ్జెట్‌ను, ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన అనంతరం విభజన రాష్ట్రాలైన ఏపి, తెలంగాణ అగ్గిమీద గుగ్గిలంగా మారాయి. ఏపిలోనైతే పాలనలో భాగస్వామ్య పార్టీ అనే విషయాన్ని సైతం విస్మరించి బిజెపి ప్రభుత్వంపై టిడిపి ఒంటి కాలిపై లేస్తుంది. విభజన సందర్భంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై అనేక విమర్శలు పెట్టి వెంకయ్యనాయుడు రాజ్యసభలో చేసిన ప్రతిపాదనలను సైతం ఆ పార్టీయే అధికారంలో

ఉండి తుంగలో తొక్కిందని టిడిపి విరుచుకుపడింది. సంకీర్ణ ధర్మాన్ని దాటి ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం రెక్కలు విరిచి ఎగురమంటుందంటూ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ ఎపిని ఊరిస్తూ వచ్చిన బిజెపి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చుక్కలు చూపించిందని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికి బిజెపి కేంద్ర పాలక ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటిగానే వ్యవహరిస్తూ ఏరుదాటిన తర్వాత తెప్పతగలేసే విధంగా ప్రవర్తిస్తుందని ప్రజలంతా ముక్త కంఠంతో చెపుతున్నారు.

ఇది ఇలా ఉంటే తమకు సమీపంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అనుసరిస్తున్న నూతన రాజకీయ ఒరవడిని చూసి కూడా బిజెపి స్వీకరించడానికి ముందుకు వస్తున్నట్లుగా అనిపించడం లేదు. రాజకీయాలలో విలువల నిర్మాణానికి కంకణబద్ధమై ప్రయాణం చేస్తున్న ఆప్ అడుగుజాడలను గమనించడానికి బిజెపికి మనస్కరించడం లేదు. ఈ అంశాన్ని విశ్లేషిస్తే ఢిల్లీ అసెంబ్లీలో బిజెపికి ప్రతిపక్ష హోదా దక్కాలంటే 10వ వంతు శాసనసభ్యులు 7 మంది ఆ పార్టీకి కావాలి. అయితే బిజెపి గెలుపొందిన స్థానాలు మూడు మాత్రమే. అయినప్పటికీ రాజకీయాలలో నైతిక విలువలను, ఉత్తమ సంప్రదాయాలను స్థాపించే క్రమంలో ఆప్ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బిజెపికి ప్రతిపక్ష హోదా ఇస్తామని ప్రకటించి పెద్ద మనిషిలా వ్యవహరించారు. గత ఎనిమిది నెలలుగా పార్లమెంట్‌లో ప్రతిపక్ష హోదా కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంది. 41 మంది ఎంపిలు కలిగిన కాంగ్రెస్ పార్టీకి చట్ట ప్రకారం ప్రతిపక్ష హోదా దక్కకపోవచ్చు. అయితే అత్యధిక ఎంపిలు కలిగిన పార్టీగా తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని గగ్గోలు పెడుతుంది. బిజెపి కేంద్ర పాలకులు మాత్రం ససేమిరా అంటున్నారు. తోటి పార్టీ ఆప్ స్వచ్ఛందంగా బిజెపి కోరకుండానే ప్రతిపక్ష హోదా ఇస్తామని ప్రకటించిన అనంతరం కూడా బిజెపికి బుద్ధి కుదుటపడినట్లు లేదు. పాతరోత విధానాలతోనే కక్ష సాధింపు ధోరణితోనే బిజెపి ముందుకు వెలుతుంది.

సాధారణంగా ఓటమికి గురైన పార్టీ నేతలను గెలిపించిన పార్టీ వారు దూషించడం, హేళన చేయడం, అవమానపరచడం వంటి మునుపటి అవాంఛనీయ పద్ధతులకు భిన్నంగా కేజ్రీవాల్ బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థి కిరణ్ బేడీ, కాంగ్రెస్ సిఎం అభ్యర్థి మాకెన్‌లతో సంప్రదించి రాష్ట్రాభివృద్ధికి సలహాలనూ, సహకారాలనూ స్వీకరిస్తామని చెప్పి చాలా హుందాగా ప్రవర్తించారు. ఆ ధోరణి బిజెపిలో ఏకోశానా కనిపించడం లేదు. ఢిల్లీ ఎన్నికలు చాచి ముఖం మీద ఒకటిచ్చినా ప్రవర్తన మార్చుకోక పోవడం బిజెపి నియంత పోకడను తెలియచేస్తుంది. కేజ్రీవాల్ తిరిగి అధికారం చేపట్టిన వెంటనే కూడా నెల తిరగకుండా ఎన్నికల వాగ్దానాలలో భాగంగా ఢిల్లీ ప్రజలకు ఇచ్చిన హామీలలో ప్రధానమైన రెండింటిని విద్యుత్ చార్జీలు 400 వందల యూనిట్ల వరకూ సగానికి తగ్గించారు. అదే విధంగా ప్రతి ఇంటికీ రోజుకు 700 వందల లీటర్ల తాగునీరు ఉచితంగా ఇవ్వమని ఉత్తర్వులు జారీ చేసి మాట నిలుపుకోవడమంటే ఇలా ఉంటుందని చాటి చెప్పారు. ఇట్లాగే ఇదివరలో దివంగత ముఖ్యమంత్రులు ఎన్‌టిఆర్, వైఎస్. రాజశేఖరరెడ్డి కూడా ప్రమాణ స్వీకార వేదిక పైనుండే వాగ్దానాలను అమలు పరుస్తూ దస్త్రాల మీద సంతకాలు చేశారు. నిజంగా ఆమ్ ఆద్మీ పార్టీ దేశంలోని రాజకీయ పార్టీలన్నింటికీ ఆదర్శమే. నేటి పాలకులకు ఆప్ నాయకుడు కేజ్రీవాల్ మార్గ దర్శకుడు. పారదర్శకమైన పాలనకు, స్వచ్ఛమైన రాజకీయాలకు, హామీల అమలుకు, నీతివంతమైన నడవడికీ ఆప్ మిగతా దేశంలోని రాజకీయ పార్టీలకు రోల్ మోడల్.

ఎన్నికలు బూటకమని, వాటికి తాము దూరమని చెపుతున్న మావోయిస్టు పార్టీని పక్కన ఉంచితే! ఎన్నికలలో భాగస్వామ్యమవుతున్న దేశ వ్యాప్త కమ్యూనిస్టు పార్టీలన్నింటికీ ఢిల్లీ ఫలితాలు ఒక మేలుకొలుపే. ఢిల్లీ ఫలితాల తరువాతైనా ఆయా పార్టీలు తమ స్థానం ఎక్కడ ఉందో ప్రశ్నించుకుని తమకు తామే సమాధానం రాబట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తొమ్మిది దశాబ్దాల రాజకీయ ప్రయాణం తరువాత తాము ఎదిగామా? ఒదిగామా? అన్న విషయాన్ని తర్కించుకోవాల్సిన తక్షణ అవసరం వాటిముందు కనిపిస్తుంది. క్షేత్ర స్థాయిలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకుల ప్రవర్తనను మూల్యాంకనం చేసుకోవాల్సిన కర్తవ్యం వారిముందు నెలకొంది. కమ్యూనిస్టులుగా ఎందుకు విస్తరించలేదోనని ఆత్మవలోకనం చేసుకోవాల్సిన అగత్యం స్పష్టమైంది. గిడస బారుతున్న పార్టీల సూచీలకు కారణాలను అన్వేషించుకుని లోపాల దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. వ్యక్తిగత స్థాయి నుండి పార్టీలను పునర్నిర్మించుకోవడం ద్వారానే ఆయా పార్టీలు తిరిగి బట్టకట్టే పరిస్థితికి చేరుకుంటాయి. కమ్యూనిస్టులు ఆకాంక్షిస్తున్న పద్ధతిలోనే ఆప్ ఎన్నికలలో పాల్గొని తిరుగులేని విజయాన్ని లిఖించిందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి కమ్యూనిస్టులు ఎందుకు ఫలితాలను చేరుకోలేక పోతున్నారు. ఎక్కడ దోషం ఉంది? ఆశయ సాధన దిశలో ఆప్ ఆచరించి నిరూపించింది. అయితే కమ్యూనిస్టులు ఎక్కడ వైఫల్యం చెందుతున్నారు. ఆశయానికి అనుగుణంగా ఆచరణలో వెళ్లలేకపోతున్నారా? అనేది తర్కించుకోవాల్సిన విషయం. ఢిల్లీలో బిజెపిని చిత్తుగా ఓడించిన ఆప్ గురించి వేదికలపై గొప్పగా చెపుతున్న కమ్యూనిస్టులంతా ఆప్ వ్యూహాన్ని, నడవడినీ క్షుణ్ణంగా పరిశీలించి చర్చించుకోవడం ద్వారా మార్గ నిర్దేశం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా కనిపిస్తుంది.

డబ్బును వెదజల్లి ఓట్లను కొనుగోలు చేయడం, ఓటరును మద్యం మత్తులో ఊగించడం, బూటకపు వాగ్దానాలతో మభ్యపెట్టడం, దొంగ ఓట్లు, పోలింగ్ కేంద్రాలను దౌర్జన్యంగా స్వాధీన పరుచుకోవడం, భయభ్రాంతులను చేసి ఓటర్లు కేంద్రాల వద్దకు రాకుండా నిరోధించడం వంటి ప్రజాస్వామ్య వ్యతిరేకంగా ఎన్నికలను నడుపుతున్న సంప్రదాయ జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నింటికీ ఆప్ అందుకున్న ఫలితాలు ఒక చారిత్రక హెచ్చరిక. నీతివంతులు, నిజయితీ కలిగిన పార్టీలు వస్తే వారికి వెన్ను దన్నుగా నిలవడమే కాక ఈ దుష్టాచార రాజకీయ పార్టీలను పాతిపెడతామని ఢిల్లీ ఓటర్లు చాటి చెప్పారు. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ఓటమి పాలైన పిదప మునిగిపోయామని లబోదిబోమని నెత్తి నోరు బాదుకునే నాయకులకు దిమ్మతిరిగే ఫలితం ఇది. డబ్బు ఇతరత్రా తప్పుడు పద్ధతులు అవలంభించకుండానే ఎన్నికలు నడపవచ్చని నిరూపించినవి ఢిల్లీ ఎన్నికలు. ఇప్పటికైనా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ అనుచిత పాత పద్ధతులను విడనాడి ఆప్ దిశగా అడుగులు వేస్తాయని ఆశిద్దాం. కేజ్రీవాల్‌ను ఆదర్శంగా తీసుకుని రాజకీయ నాయకులు, పాలకులు నీతివంతమైన రాజకీయాల వైపు మళ్లుతారని నమ్ముదాం.

(రచయిత పల్నాడు రచయితల సంఘం అధ్యక్షులు) వీ

ఆమ్ ఆద్మీ పార్టీ ప్రత్యామ్నాయమేనా?

***ఆమ్ ఆద్మీ పార్టీ గెలుపు ప్రజా ప్రత్యామ్నాయం కాదని, బిజెపిపై ప్రజల అసంతృప్తే ఈ పార్టీ గెలుపుకు కారణమైందని, అంతిమంగా ప్రజా పోరాటాలే ప్రత్యామ్నాయం అవుతాయని అంటున్నారు* షేక్ కరిముల్లా**

ఢిల్లీ అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలతో ఏదో అద్భుతం జరుగుతోందని మీడియాలో బాగా ప్రచారమైంది. 'సామాన్యుడి అసామాన్య విజయం ఎన్నికల చరిత్రలోనే ఊహించని ఫలితం. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ చీపురు విధిలించింది. అన్ని పార్టీలను ఊడ్చేసి క్లీన్ స్వీప్ చేసింది. 70 అసెంబ్లీ స్థానాలలో 67 చోట్ల విజయ దుందుభి మోగించింది. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సృష్టించిన సునామిలో విపక్షాలన్నీ నామ రూపాలు లేకుండా పోయాయి. బిజెపి సిఎం అభ్యర్థి కిరణ్‌బేడితో సహా హేమాహేమీలంతా మట్టి కరిచారు. ఇక కాంగ్రెస్ పార్టీ డకౌట్' అంటూ ఆకాశానికి ఎత్తేస్తూ కథనాలు ప్రచురించబడ్డాయి. 'భారతదేశ రాజకీయాలలో కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా ఒక బలమైన రాజకీయ శక్తి ముందుకు వస్తే ప్రజలు ఆహ్వానిస్తారని ఢిల్లీ ఫలితాలు రుజువు చేస్తున్నాయని, అలాగే ప్రస్తుతం ఉన్న రాజకీయ సంస్కృతి పట్ల ముఖ్యంగా కాంగ్రెస్, బిజెపిల విధానాల పట్ల ప్రజలలో వ్యక్తమవుతున్న తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనం' అంటూ రాజకీయ పండితులు సైతం వ్యాఖ్యానించారు. నిజమే ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ప్రగతి కాముకులకు ఉత్సాహాన్ని నింపాయి లౌకిక ప్రజాస్వామ్య శక్తులకు కొంత ఊరటను ఇచ్చాయి. ఆప్ రాబోయే రోజుల్లో త్వరలో జరగబోయే పంజాబ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేస్తుందని, మరిన్ని రాష్ట్రాలకు విస్తరించనున్నామని ఆప్ నాయకులు ప్రకటించారు.

ఈ నేపథ్యంలో ఆప్ నిజంగా మూడో ప్రజా ప్రత్యామ్నాయమా? అనేది మౌలిక ప్రశ్న. ఈ విషయాన్ని పై అంశాలతో కాకుండా కొంత చారిత్రక దృక్పథం నుంచి పరిశీలించాల్సి ఉంటుంది. అప్పుడే వాస్తవం మనకు బోధపడుతుంది. భారతదేశంలో ఎన్నికల విధానం ప్రారంభమైన 1920ల నుంచి, నేటి రూపంలోకి మారిన 1952ల మొదటి సార్వత్రిక ఎన్నికల నుంచి నేటి వరకు భారతదేశంలో ప్రజల ఆకాంక్షలకు, ప్రజల మౌలిక సమస్యల పరిష్కారాలకు, రాజకీయాలకు ఎటువంటి సంబంధంలేని స్థితిని గమనించవచ్చు. రాజకీయాలంటే కేవలం పదవులు, ధనార్జన మార్గంగా తయారైన స్థితిని నేడు చూస్తున్నాం. భారత రాజకీయాలలో బ్రిటిష్ పార్లమెంటరీ విధానం ప్రవేశపెట్టబడిన అసంబద్ధత ఎన్నికల విధానంలో నిజమైన ప్రాతినిధ్య పద్ధతి అపహాస్యమయ్యే తీరు, దేశంలోని కుల, మత, వర్గ, ప్రాంతీయ, స్త్రీ, పురుష అసమానతలు, అవినీతి పెచ్చరిల్లుతున్న స్థితిలో ఎన్నికలలో జరుగుతున్న అక్రమాలు ఇవన్ని ఎంత మాత్రం ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించడం లేదని, ఉన్నత వర్గపు పెత్తనందారులు జూదపు క్రీడలో ప్రజలు పావులుగా మారిన వైనాన్ని మనం చూడవచ్చు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు ఎన్నికల విధానం ఎంత అసంబద్ధమో తెలుసుకున్న ప్రజలు ఓటింగ్ వ్యవస్థకు దూరంగా జరుగుతున్నారు. ఇది గమనించిన పాలకులు అనేక జిమ్మిక్కుల ద్వారా ప్రజలను ఓటింగ్‌కు దగ్గర చేయాలని తపన పడుతున్నారు. ఉదాహరణకు ఇటీవల ఎన్నికల వ్యవస్థలో ప్రవేశ పెట్టబడిన 'నోటా' విధానాన్ని చెప్పుకోవచ్చు. అయినా భారత ఎన్నికల చరిత్రలో ఈ 60 సంవత్సరాలలో ఏనాడు పోలింగ్ శాతం 50 – 60 శాతానికి మించలేదు. అస్సాంలో అతి తక్కువగా 5–6 శాతం పోలింగ్ జరిగినా కూడా ప్రజా ప్రతినిధులను ఎన్నుకుని ఘనత వహించిన ప్రజాస్వామ్యం మనది. నిన్నటి 16వ సార్వత్రిక ఎన్నికలలో డబ్బు పాత్ర, ఎన్నో ప్రలోభాలు అన్ని ఇన్ని కావు. ఇన్ని అక్రమాలు చోటు చేసుకుంటున్న ఎన్నికల పవిత్రత గురించి మాట్లాడడం అర్థ రహితం. ఎన్నికలు నిజమైన ప్రజాస్వామిక ఆకాంక్షలకు అద్దం పడుతాయని, ఎన్నికల ద్వారా వ్యవస్థలో మార్పులు తేవచ్చు అనుకోవడం ఉట్టి భ్రమే అవుతుంది. ఈ 60 ఏళ్లుగా సాగుతున్న ఎన్నికల నాటకాలు పరిశీలిస్తే ఎన్నికలు బూటకమని అర్థమవుతుంది. మౌలిక మార్పులు ఎన్నికల ద్వారా రావడం సాధ్యం కాదని, ప్రజా ఉద్యమాల ద్వారా మాత్రమే సాధ్యమని తేలిపోయింది.

ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ విజయం లాంటి ఘటనలు భారత ఎన్నికల చరిత్రలో లేకపోలేదు. 1967 ఎన్నికలలో 7 రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. 1977లో ఇందిరా నిరంకుశత్వం గద్దెదిగి, జనతా ప్రభుత్వం ఏర్పడింది. రాష్ట్రంలో 1983లో జరిగిన మార్పు అంటే తెలుగుదేశం పార్టీ విజయం సాధించడం వంటివి కూడా రూప పరమైన మార్పులే తప్ప సారాంశంలో నిజమైన మార్పులు కావని చరిత్ర చెప్పిన వాస్తవం. ఎన్నికల ప్రక్రియ ద్వారా ఈ దేశ వ్యవస్థలో మౌలికమైన మార్పులు తేవడం అసాధ్యమని రుజువైంది. కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో వామ పక్షాల విజయం, యుపి, బీహార్‌లలో మాయావతి, ములాయంసింగ్ యాదవ్, లల్లూ ప్రసాద్ యాదవ్‌ల నాయకత్వంలో దళిత, బిసిల పార్టీలు విజయం సాధించాయి. కశ్మీర్, పంజాబ్‌లలో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సిపి), (పిడిపి) అకాలీలు లాంటి మైనారిటీ వర్గాల పార్టీలు విజయం సాధించాయి. అలాగే ఈశాన్య అస్సాంలో అస్సాం గణపరిషత్ (ఎజిపి) విజయం సాధించింది. ఈ ఎన్నికల పార్టీలు ప్రజల మౌలిక సమస్యల పరిష్కారంలో విఫలమైన చరిత్ర నేడు మన ముందుంది. ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ విజయాన్ని కూడా ఈ నేపథ్యం నుంచి పరిశీలించకపోతే సమగ్రంగా అర్థం చేసుకోలేం. ఈ వెలుగులో ఆప్‌ను పరిశీలిద్దాం. ఈ సందర్భంగా ఓటు వల్ల, ఎన్నికల వల్ల ప్రజాస్వామ్యం నిలబడుతుందని ప్రజల జీవితాలు మరుతాయని భావించే సాధారణ పేద ప్రజలకు కొన్ని వాస్తవాలు తెలియాలి.

ఏ వ్యవస్థలోనైనా, ఏ దేశంలోనైనా, రాష్ట్రంలోనైనా రాజకీయ పార్టీలు అవి విప్లవ రాజకీయ పార్టీలు కావచ్చు, ఎన్నికల రాజకీయ పార్టీలు కావచు. ఒక సిద్ధాంత ప్రాతిపదిక మీదే ఏర్పడ్డాయి. అవి ప్రజల చారిత్రక అవసరాలలో భాగంగా ఆవిర్భవించాయి. ఇలా నిర్మితమైన పార్టీలు బలమైన ప్రజా పునాదులు కలిగి ఆటు పోటులు ఎదురైన

కార్పొరేట్‌ల మేలుకే సుబ్రమణియన్ కమిటీ

***కార్పొరేట్ సంస్థలకు అడ్డుపడుతున్న పర్యావరణ నిబంధనలను తొలగించడానికి వచ్చిందే సుబ్రమణియన్ కమిటీ అనీ, ఈ కమిటీ ముందుకు తెచ్చిన సిఫారసులను అడ్డుకోవాలనీ అంటున్నారు* పి.వి. రమణ**

కార్పొరేట్ శక్తులకు అవసరమైన భూసేకరణలో ఎదుర్కొంటున్న అడ్డంకులను తొలగించడానికి మోడీ ప్రభుత్వం ఇప్పటికే భూసేకరణ చట్టాన్ని భూస్వాధీన చట్టంగా మారుస్తూ ఆర్డినెన్సు తెచ్చింది. దీన్ని లోక్‌సభ కూడా ఆమోదించింది. దీంతో ఇక మీదట భూముల సేకరణ బుల్డోజర్ పద్ధతిలో కొనసాగుతుందని వేరే చెప్పనవసరం లేదు. మరోవైపు పర్యావరణ పరిరక్షణ పేరుతో కార్పొరేట్ శక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా పూర్తిగా తొలగించడానికి ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలనే ద్విముఖ లక్ష్యాల సాధన పేరుతో మోడీ ప్రభుత్వం 2014 ఆగస్టు 29న కేంద్ర కేబినెట్ కార్యదర్శి టి.ఎస్.ఆర్. సుబ్రమణియన్ నాయకత్వంలో ఒక హైలెవెల్ కమిటీని నియమించింది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రస్తుతమున్న ఆరు చట్టాలను పరిశీలించి రెండు నెలల కాలంలో నివేదిక ఇవ్వాలని కోరింది. తరువాత కమిటీకి మరో నెల వ్యవధిని పొడిగించారు.

కమిటీ పరిశీలించిన ఆరు చట్టాలు

1. పర్యావరణ పరిరక్షణ చట్టం (1986); 2. అటవీ సంరక్షణ చట్టం (1980); 3. నీటి కాలుష్య నియంత్రణ, రక్షణ చట్టం (1974); 4. వన్యమృగ సంరక్షణ చట్టం (1972); 5. గాలి, కాలుష్య నియంత్రణ, రక్షణ చట్టం (1981); 6. భారత అటవీ చట్టం (1927)

కేవలం మూడు నెలల వ్యవధిలోనే జరిపిన పరిశీలన తరువాత కమిటీ 113 పేజీల నివేదికలో 55 సూచనలతో సమర్పించింది. కమిటీ నివేదించిన నివేదికలో రాష్ట్రాలలో ఉన్న కాలుష్య నియంత్రణ మండలాలను, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలినీ రద్దు చేసి వాటి స్థానంలో 'నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ అథారిటీ' (ఎన్.ఇ.ఎం.ఎ- నేమా) ని, 'స్టేట్ ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ అథారిటీ' (ఎస్.ఇ.ఎం.ఎ-సేమా) లను ప్రతిపాదించారు. ఉన్న చట్టాల స్థానంలో 'ది ఎన్విరాన్‌మెంటల్ లాస్ (మేనేజ్‌మెంట్) చట్టం (2014)'

నిలదొక్కుకుంటున్నాయి. ఉదాహరణకు 2000 సంవత్సరంలో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి. ఇలా కాక ప్రజల అవసరాలతో, ఆకాంక్షలతో నిమిత్తం లేకుండా వ్యక్తులు స్థాపించిన పార్టీలు ఇట్టే పుట్టి ఇట్టే అంతరిస్తున్నాయి. ఉదాహరణకు ప్రజారాజ్యం పార్టీ, జై సమైక్య ఆంధ్ర పార్టీలను చెప్పుకోవచ్చు.

ఇక ఆమ్ ఆద్మీ పార్టీ పునాదులు అవినీతి నిర్మూలన అంటూ కొద్ది నెలలు సాగిన ప్రాధాన్యతలేని ఉద్యమ నేపథ్యంలో తప్ప చెప్పుకోదగినది ఏమీ లేదు. అభినవ గాంధీలా గాంధీ టోపీలు ధరించిన అన్నా హజారే, అరవింద్ కేజ్రీవాల్, కిరణ్‌బేడీలు అవినీతి నిర్మూలనకు 'జన్ లోక్‌పాల్' బిల్లు కోసం ఢిల్లీలో ఉద్యమించారు. ఈ ఉద్యమం కార్పొరేట్ పెట్టుబడి వెనుక ఉండి నడిపించిన ఉద్యమం. అప్పటికే అనేక అవినీతి కుంభకోణాలతో చచ్చిన పాములాగా ఉన్న యుపిఎ కూటమిని మరింత భ్రష్టు పట్టించి మోడీ, బిజెపి హిందూత్వ కూటమిని అధికారంలోకి తీసుకురావడానికి కార్పొరేట్ పెట్టుబడి తెరవెనుక ఉండి ఆడించిన నాటకం. పెట్టుబడికి పుట్టిన మీడియా ఈ ఉద్యమాన్ని బాగా పైకెత్తి పట్టింది. కొంత కాలం పాటు మధ్య తరగతిని ఈ ఉద్యమం తీవ్రంగా ప్రభావితం చేసింది. ఇప్పుడు ఈ ఉద్యమం గురించి మాట్లాడేవారే లేరు. యుపిఎ ప్రభుత్వం గద్దెదిగి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కార్పొరేట్ పెట్టుబడి ఆడిన నాటకమని సింపుల్‌గా అర్థం అవుతుంది. అన్నా హజారే ఉద్యమం ప్రధానంగా ఉపరితల అంశమైన పరిపాలనా పరమైన అవినీతిపైనే దృష్టి నిలిపింది కాని వ్యవస్థీకృతమైన దోపిడీకి, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మలచలేక పోయింది. అయినా అవినీతిపై వ్యతిరేకతతో తీవ్రంగా మధ్య తరగతి వర్గం స్పందించింది. వ్యవస్థీకృతమైన దోపిడీకి వ్యతిరేకమైన ఉద్యమమే అంతిమంగా ప్రజల విముక్తి బాటలు వేస్తుందనేది చారిత్రక వాస్తవం.

ప్రైవేట్ కార్పొరేట్ పెట్టుబడి, మధ్య తరగతి జీవుల అండదండలతో ఆప్ అతి తక్కువ కాలంలోనే దేశ రాజకీయాలలో ప్రభంజనం సృష్టించింది. మెరుపుల ఢిల్లీ ఎన్నికలలో ఆప్ పార్టీ 70 స్థానాలకు 67 స్థానాలు గెలవడం అంతరించి పోతున్న పార్లమెంటరీ ఎన్నికల విధానానికి చిగురు తొడిగినట్లయినది. ఇది కూడా సాధారణ మధ్య తరగతికి మరింతగా పార్లమెంటరీ రాజకీయాలపై భ్రమలు పెంచడమే కాక అంతిమంగా ఆప్ పార్టీ అయినా, మరో రూపంలో కొత్తగా వచ్చే పార్టీ అయినా పాత విధానాలు అమలు చేసే కొత్త పాలకులుగా ఉంటారే తప్ప అంతిమంగా ప్రజలను వ్యవస్థీకృత దోపిడీ, ఆర్థిక అసమానతల నుండి విముక్తి చేయజాలవు అనే వాస్తవాన్ని ప్రజలు గుర్తించాలి. కుళ్లి కంపుకొడుతున్న పార్లమెంటరీ రాజకీయాలను చూసి విసుగెత్తి వేసారి పోతున్న ప్రజలు ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాల వైపు వెళ్లకుండా ఆప్ పార్టీ లాంటివి సరికొత్త గారడీ నాటకాలతో ప్రజల ముందుకు రావడం పాలక వర్గాలకు తప్పనిసరి అవసరం. ఇలాంటి ప్రయోగమే ఒకటి తెలుగు రాష్ట్రాలలో కూడా జరిగింది. అదే జయప్రకాశ్ నారాయణ స్థాపించిన 'లోక్‌సత్తా పార్టీ'. అయితే ఈ ప్రయోగం విజయవంతం కాలేదు కాబట్టి ప్రజలారా! తస్మాత్ జాగ్రత్త. పాలకులు రకరకాల వేషాలతో నాటకాలతో మోసం చేయడానికి ప్రజల ముందుకు వస్తారు. దీనికి బలికావద్దు. దేశ రాజకీయాలను, చరిత్రను, అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేసి నిజమైన ప్రజా ప్రత్యామ్నాయ ఆర్థిక అసమానతలు లేని సమసమాజ స్థాపనకై ముందడుగు వేయడమే నేడు ప్రజల ముందున్న కర్తవ్యం.

(రచయిత ఉపాధ్యాయులు)

(ఇ.ఎల్.ఎం.ఎ–ఎల్మా) ని ప్రతిపాదించారు. దీన్ని బట్టి పర్యావరణాన్ని పరిరక్షించడానికి బదులు పర్యావరణంపై అజమాయిషీ చేయడానికి నిర్ణయించారని తెలుస్తుంది. ఇంతేకాదు, అటవీ హక్కుల చట్టం (2006), 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం (2010)'లలో కూడా ప్రాథమికమైన మార్పులను ప్రతిపాదించారు.

దేశ వ్యాప్తంగా పర్యావరణ విధ్వంసం కారణంగా తీవ్రమైన మార్పులు చోటు చేసుకుంటున్న సందర్భంలో ఉన్న చట్టాలను మరింత పటిష్ఠంగా అమలు చేయడానికి కొత్త ప్రతిపాదనలు చేయాలి. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకంగా న్యాయవ్యవస్థ వెలువరించిన అనేక ప్రజానుకూల తీర్పులను పరిశీలించాలి. ప్రజలతో, సంఘాలతో, మేధావులతో చర్చించి నేటి సమాజానికి అవసరమైన మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. కాని, అటువంటి బాధ్యతా యుతమైన చర్యలేవీ తీసుకోకుండా కేవలం కొన్ని నగరాలలో చర్చకు నామమాత్రపు సమావేశాలను ఏర్పాటు చేశారు. బెంగుళూరులో కొన్ని ప్రజా సంఘాలు చర్చల్లో పర్యావరణ విధ్వంసానికి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు వేయగానే చర్చలను అర్థాంతరంగా ఆపివేసి కమిటీ మధ్యలోనే లేచి వెళ్లి పోయింది. దీన్ని బట్టి కమిటీ ఎటువంటి చర్చకూ సిద్ధంగా లేదని రుజువైంది. ఈ కమిటీలో కేంద్ర ప్రభుత్వ విశ్రాంత కార్యదర్శులు ముగ్గురు, ఒక విశ్రాంత హైకోర్టు జడ్జి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది లతో పాటు, గుజరాత్ కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శి ఉన్నారు.

కమిటీ సమర్పించిన నివేదిక పీఠికలో 'ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరాలలో ఢిల్లీతో పాటు దేశంలో అనేక నగరాలున్నాయి. వాతావరణ మార్పుల ప్రమాదాల గురించి ఐపిసిసి చేసిన హెచ్చరికలను మనం గుర్తించాల్సిన అవసరం ఉంది. మన పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్తులు చట్టపరమైన నిబంధనలను కాలదన్ని అడ్డదారిలో తమ లక్ష్యాలను సాధించుకుంటున్నారు. ఉన్న చట్టాలు చాలా బలహీనంగా ఉన్నాయి. పెరుగుతున్న కాలుష్య నివారణకు అయ్యే ఖర్చు ఎవరు భరిస్తారు? ఎవరు బాధలు పడుతున్నారు? ఎవరు చర్యలు తీసుకుంటారు? కాలుష్య సమస్యను నిర్దిష్టంగా నివేదించడంలో బలహీనంగా నిర్వర్తిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ చట్టాలను మరింత పటిష్ఠంగా తయారు చేసి బాధ్యతతో కూడిన నాణ్యమైన విధానాల ద్వారా పర్యావరణ సమతుల్యతను సాధించాలని సమస్య తీవ్రతను ఎంతో లోతుగా అధ్యయనం చేసినట్లు ప్రకటించిన కమిటీ చివరిలో అసలు రంగు బయటపెట్టింది. అదేమిటంటే 'సమానత్వం సాధించడానికి జరిగే అభివృద్ధికీ, పర్యావరణ సమతుల్యతల మధ్య సమతూకాన్ని సాధించాలి' అని ప్రకటించింది. పర్యావరణ విధ్వంసం ఆగాలంటే నేటి అభివృద్ధి విధానాలలో మార్పు రావాలి. విధ్వంసానికి కారణమైన పెట్టుబడిదారీ శక్తులకు మరింత దూకుడుగా పర్యావరణాన్ని నాశనం చేసే చట్టపరమైన అధికారాలు కల్పిస్తూ సమతూకం సాధించాలనే మాటకు అర్థం ఉండదు.

అటవీ భూముల విషయంలో ప్రాజెక్టులకు అనుమతులివ్వడంలో ప్రస్తుతం ఉన్న నిబంధనల కారణంగా విపరీతమైన ఆలస్యం జరుగుతుంది. కాబట్టి కమిటీ సూచనల ప్రకారం అటవీ చట్టంలో గ్రామసభల అనుమతి అవసరం అన్న నిబంధనను తొలగించాల్సి ఉంది. అలాగే అటవీ భూమిని వాడుకునే వ్యాపారస్తులే అటవీ భూమిని తొలగించడం ద్వారా ఏర్పడిన నష్టాన్ని భరించాలని, దాని కోసం అటవీ భూమికయ్యే ఖర్చుకు రెట్టింపు వ్యయంతో ఇతర భూముల్లో చెట్లు నాటాలని చెప్పింది. అంటే డబ్బు చెల్లించి అటవీ భూమిని స్వాధీనం చేసుకోవడానికి అవకాశం కల్పించారు.

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ఆస్తులు, అప్పులు అన్నీ 'నేమా'కు, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలాల ఆస్తులు, అప్పులు 'సేమా'లకు బదిలీ చేయాలని ప్రతిపాదించారు. నేమా, సేమా లకు విధి విధానాలు నిర్వచించడంలో కేంద్ర ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉంటాయని ప్రతిపాదించారు.

ప్రాజెక్టుల కోసం జరిపే ప్రజాభిప్రాయ సేకరణ విధానానికి మార్పులు చేసి, ప్రజాభిప్రాయ సేకరణ నిజాయితీగా జరగాలనీ, దాని కోసం ఇకమీదట కేవలం ప్రాజెక్టు ప్రాంత ప్రజలు మాత్రమే పాల్గొనేటట్లు చేయాలనీ, ప్రజాభిప్రాయ సేకరణకు పరిస్థితులు అనుకూలంగా లేవని భావిస్తే పాత చట్టంలో ఉన్నట్లుగానే ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే కార్యక్రమాన్ని నిర్వహించవచ్చని ప్రతిపాదించారు. అలాగే ప్రజల నివాసాలు ప్రాజెక్టు ప్రాంతానికి దూరంగా ఉంటే అలాంటి చోట్ల ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేదని ప్రతిపాదించారు. దీని ద్వారా ప్రజా సంఘాలు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనకుండా కట్టుదిట్టం చేశారు.

ప్రాజెక్టుల నిర్మాణాలకు ముందు నిర్వహించే 'సామాజిక ప్రభావ మదింపు' (ఇ.ఐ.ఎ) గతంలో వలే స్వతంత్ర నిపుణులతో కాకుండా స్వయంగా ప్రాజెక్టు నిర్వాహకులే తయారు చేయాలి. అది కూడా కేవలం 10 రోజుల వ్యవధిలోనే పూర్తి చేయాలి. దీని వలన ప్రాజెక్టు నిర్వాహకులు వారికి కావలసిన విధంగా సామాజిక ప్రభావ మదింపును తయారు చేసుకుంటారని వేరే చెప్పనవసరం లేదు.

కొత్తగా ప్రతిపాదించిన పర్యావరణ అజమాయిషీ చట్టం 2014 (ఎల్మా) ప్రకారం, కొత్తగా అనుమతివ్వబోయే ప్రాజెక్టులను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆధ్వర్యంలో పరీక్షించి అనుమతులివ్వడంలో ఉన్న దాని అధికారాలను తగ్గించివేసింది. ఇకమీదట ప్రాజెక్టుల క్లియరెన్స్‌కు ఎల్మాదే చివరి మాటగా ప్రతిపాదించారు. ఈ చట్టం ప్రకారం కేవలం పారిశ్రామిక వేత్తల అవసరాలే కాకుండా వారి లాభాపేక్ష (గ్రీడ్) ను కూడా పట్టించుకోవాలని కోరింది.

కమిటీ దేశ వ్యాప్తంగా కాలుష్యమైపోతున్న నదుల గురించి, నీటి వనరుల గురించి, పారిశ్రామిక కాలుష్యం గురించి పట్టించుకోలేదు. పైగా నిబంధనలను పాటించిన పరిశ్రమలకు ఆర్థిక బహుమతులను (ఇన్సెంటివ్) ప్రకటించాలని కోరింది.

కాలుష్య సమస్య దేశ వ్యాప్తంగా తీవ్రంగా మారినప్పుడు 2009లో కేంద్ర ప్రభుత్వం 'కాంప్రహెన్సివ్ ఎన్విరాన్‌మెంటల్ పొల్యూషన్ ఇండెక్స్' (సి.ఇ.పి.ఐ)ల ద్వారా కాలుష్యకారక పరిశ్రమల ప్రాంతాలను గుర్తించారు. గాలి, నీరు, భూమి కాలుష్యంతో పాటు వీటివలన ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై కూడా అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఆ విధంగా 2009లో అత్యంత కాలుష్యంతో నిండిన 88 పారిశ్రామిక ప్రాంతాలను గుర్తించారు. వాటిలో 'అత్యంత తీవ్రమైన కాలుష్య ప్రదేశాలు'గా 43 పరిశ్రమ ప్రాంతాలనూ, 'తీవ్రమైన కాలుష్య ప్రాంతాలు'గా, 32 పరిశ్రమల ప్రాంతాలనూ గుర్తించి పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీని మీద 13 జనవరి 2010న అత్యంత తీవ్రమైన కాలుష్య ప్రాంతాలలో కొత్త పరిశ్రమలు స్థాపించడం గాని, ఉన్న పరిశ్రమల విస్తరణ గాని జరపడాన్ని నిషేధించింది. కాని బడా వ్యాపారస్తుల కోసం కేంద్ర పర్యావరణ శాఖా మంత్రి అధికారం స్వీకరించిన కేవలం 11 రోజులలోనే అత్యంత తీవ్రమైన కాలుష్య పారిశ్రామిక ప్రాంతాలలో ఉన్న నిషేధాన్ని ఎత్తివేశారు.

విద్యుత్, మైనింగ్, జనహిత ప్రాజెక్టులు, జాతీయ ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టులూ అన్నీ 'సత్వర అనుమతులు' (ఫాస్ట్ ట్రాక్) పొందాలని కమిటీ

తీర్మానించింది. పర్యావరణ అనుమతులు ఇచ్చే ప్రస్తుత యంత్రాంగం అనేక విధాలుగా లోపభూయిష్ఠంగా ఉందని, ప్రతిపాదిత ప్రాధికార సంస్థలలో, కాలుష్య నియంత్రణ మండలాలతో పాటు పర్యావరణంపై సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కేంద్ర సాధికార సంఘంతో సహా అన్ని కమిటీలు విలీనం కావాలని ప్రతిపాదించింది.

సంపూర్ణ విశ్వాసంతో పారిశ్రామిక వేత్తలే తమ పరిశ్రమల వలన పర్యావరణ హాని ఏమేరకు, ఏ తీరుగా ఉంటుందో, దాన్ని ఏయే జాగ్రత్త చర్యల ద్వారా ఎలా పరిహరించగలరో, వారి దరఖాస్తుతో పాటే వివరించాలంటూ వారికి అన్ని రకాల వెసులుబాటును కల్పిస్తూ, తప్పు చేస్తే వారిని కూడా వదిలేది లేదని చెప్పడానికి హాస్యాస్పదంగా వాస్తవాలను కప్పి పుచ్చేవారిని కఠినంగా శిక్షించాలని కమిటీ సూచించింది. ఆచరణలో అది అమలు జరగదని కమిటీకి తెలుసు.

కార్పొరేట్ శక్తులకు దాసోహం

మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్యావరణ పరిరక్షణకు భంగం కలిగించే ప్రాజెక్టులను పరిశీలించి సలహాలనిచ్చే నిపుణుల 'ఎక్స్‌పర్ట్స్ ఎడ్వయిజరీ కమిటీ' (ఇఎసి) నీ, అటవీ భూములను ప్రాజెక్టులకూ, మైనింగ్‌లకూ ఇవ్వడంలో సలహాలనిచ్చే 'ఫారెస్ట్ ఎడ్వయిజరీ కమిటీ' (ఎఫ్ఎసి) నీ మార్చేశారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ వైల్డ్ లైఫ్‌లో ప్రభుత్వంతో సంబంధం లేకుండా స్వతంత్రంగా కార్యక్రమాలు నిర్వహించే నిపుణులు ఎనిమిది మంది ఉంటే వారిని కేవలం ఒకరికే పరిమితం చేశారు.

అధికారంలోకి వచ్చిన వంద రోజులలో రహదారులూ, విద్యుత్తు ప్రాజెక్టులూ, చమురు తవ్వకాల కోసం పెండింగ్‌లో ఉన్న 325 ప్రాజెక్టులలో 240 ప్రాజెక్టులకు అనుమతులిచ్చేశారు. వీటి కోసం 7 వేల హెక్టార్ల అటవీ భూమిని కూడా కేటాయించేశారు. చమురు, సహజ వాయువు కంపెనీల సామర్థ్యం, విస్తృతి పెంచుకోవడానికి ఎటువంటి పర్యావరణ పరిమితులూ లేకుండా అనుమతులిచ్చేశారు.

పర్యావరణ శాఖా మంత్రిగా అధికారం స్వీకరించిన కేవలం 11 రోజులలో పర్యావరణ శాఖామంత్రి 'జావేద్కర్' అత్యంత విషతుల్యమైన, ప్రమాదకరమైన పారిశ్రామిక ప్రాంతాలుగా, క్యాన్సర్, న్యూరో వ్యాధుల కారక ప్రదేశాలుగా గుర్తించబడి, వాటిలో నూతన పరిశ్రమలు స్థాపించ కూడదని ఉన్న నిబంధనలను ఎత్తివేశారు. వీటిలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఉన్న 'సింగ్రౌలీ', గుజరాత్‌లో ఉన్న 'వాపి' ఉన్నాయి.

16 మిలియన్ టన్నుల కన్నా తక్కువ ఉత్పత్తి చేసే బొగ్గు గనుల విస్తరణకు ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేదని ఆదేశాలిచ్చారు.

2 వేల హెక్టార్ల ప్రాంతంలో జరిగే నీటి పారుదల ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు అవసరం లేదని తేల్చి చెప్పారు.

ఆదివాసుల సమస్యలపై వేసిన హైలెవెల్ ప్యానెల్ '1947 నుండి 2000 వరకూ దేశంలో ఏర్పడిన ప్రాజెక్టుల కారణంగా 6 కోట్ల మంది నిర్వాసితులయ్యారు. కేంద్ర ప్రభుత్వమే నియమించిన ఎక్స్‌పర్ట్ గ్రూపు అంచనాల ప్రకారం వీరిలో 47 శాతం ఆదివాసులే. వీరందరూ అటవీ భూముల నుండి తొలగింపబడ్డారు. సహజ వనరులతో నిండిన అటవీ భూములను ప్రాజెక్టులకిస్తే ప్రతి నలుగురు ఆదివాసులలో ఇద్దరు నిర్వాసితులు అవుతార'ని చెప్పింది.

ఇప్పటికే బొగ్గు ప్రాజెక్టుల విస్తరణ కార్యక్రమాలలో పబ్లిక్ కన్సల్టేషన్‌ను తొలగించారు. పర్యావరణ పరిరక్షణ పరంగా ప్రత్యేకించిన స్థలాల్లో ప్రాజెక్టులు నిర్మించేటప్పుడు సామాజిక ప్రభావ మదింపు చేసే సంస్థల అధికారాలు తగ్గించివేశారు. అత్యంత తీవ్రమైన కాలుష్య పరిశ్రమల ప్రాంతాల మీద ఉన్న నియంత్రణలను తొలగించారు. మైనింగ్ చేయాలని నిర్దేశించిన అటవీ ప్రాంతాలలో 'నోగో' పాలసీని సైతం సరళీకరించారు. వెయ్యి హెక్టార్ల భూముల్లో ఏర్పాటు చేసే ప్రాజెక్టులకు నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే అనుమతి ఇచ్చేయవచ్చు.

చట్టంలోనే అణుశక్తి, గనుల తవ్వకాలూ, జాతీయ రహదారులూ, పెట్రోలియం, మినరల్ పైపులైన్లూ, బొగ్గున్న ప్రాంతాలూ, విద్యుత్‌శక్తి, రైల్వేలూ లాంటి వాటికి 'సామాజిక ప్రభావ మదింపు' అవసరం లేదు. కానీ జాతీయ భద్రత కోసం, రక్షణ కోసం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం, పారిశ్రామిక ప్రాంగణాలూ, పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంలో మౌలిక వనరుల నిర్మాణాలకు కూడా అవసరం లేదని ఆర్డినెన్సు తెచ్చారు.

ఈ ఆర్డినెన్సు ద్వారా చట్టంలో ఉన్న ప్రజాభిప్రాయ సేకరణ, సామాజిక ప్రభావ మదింపు, ప్రజల అంగీకారం లాంటి ప్రధానమైన అంశాలను తొలగించి, కార్పొరేట్ శక్తులకు అడ్డంకులు తొలగించారు. 'ప్రాజెక్టులకు అవసరమైన భూమిని త్వరగా సేకరించడానికి విడుదల చేసిన ఈ ఆర్డినెన్సు ఆహ్వానించదగ్గదే, దీని వలన అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెరుగుతుంది. నిలిచిపోయిన 300 బిలియన్ డాలర్ల ప్రాజెక్టులకు మోక్షం కలుగుతుంద'ని కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా (సి.ఆర్.ఇ.డి.ఎ.ఐ) చైర్మన్ ఎల్ కె జైన్ అన్నారు.

'ఇది చాలా ధైర్యమైన చర్య, మా కార్యక్రమాలకు మంచి ఊపునిస్తుంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిబంధనలను సులువు చేయడం వలన రియల్ ఎస్టేట్ రంగం వేగంగా పని చేస్తుంది. గతంలో ఉన్న అనేక అడ్డంకులు తొలగిపోతాయ'ని నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎన్ఆర్ఇడిసి) ప్రెసిడెంట్ సునీల్ మంత్రి అన్నారు.

'భారతదేశంలో ప్రస్తుతం అత్యంత అవసరమైన అభివృద్ధికి ఈ ఆర్డినెన్సు చాలా అవసరం. గ్రామీణ అవసరాలు తీర్చడానికీ, విద్యుత్ శక్తి సరఫరాకూ, పారిశ్రామిక ప్రాంగణాలూ, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ప్రాజెక్టుల కోసం అవసరమైన భూమి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఇది వచ్చింది. ఖర్చెక్కువైనా ఫర్వాలేదు మనకు వెంటనే భూమి సేకరించడం ముఖ్యం. ఈ ఆర్డినెన్సు వలన పూర్తిగా ఇబ్బందులు తొలగిపోతాయి. ఇంకా వస్తు తయారీ పరిశ్రమల్లో భూమి సమస్య పరిష్కారం కాలేదు. అక్కడ ఇంకా సామాజిక ప్రభావ మదింపు, ప్రజల అంగీకారం అవసరం ఉంది. 13 చట్టాల చేర్పు వలన నష్ట పరిహారం, పునరావాసానికి చాలా ఖర్చవుతుంది. అయినా ఫర్వాలేదు' అని గోల్డ్‌మెన్ సాక్స్ సంస్థ ప్రకటించింది. దీనిని బట్టి ప్రభుత్వ విధానాలు కార్పొరేట్ శక్తులకు ఎంత ఆనందాన్ని కలుగజేస్తున్నాయో మనకు అర్థమవుతుంది.

మొత్తం మీద సుబ్రమణియన్ కమిటీ చాలా ప్రమాదకరమైన సిఫారసులు చేసింది. ప్రాజెక్టుల పేరుతో ఇప్పటికే తీవ్ర పర్యావరణ విధ్వంసానికి కారణమవుతున్న బడా కార్పొరేట్ సంస్థలకు ఎటువంటి అడ్డంకులు లేకుండా మరింత విధ్వంసాన్ని కొనసాగించడానికే ఈ సిఫారసులు దారితీస్తాయి. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రాజెక్టు ప్రాంత ప్రజలకు సంబంధించిందే కాదు. నేడు జరుగుతున్న సహజ వనరుల విధ్వంసం కారణంగా ఇప్పటికే దేశ ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రత, వనరుల కొరత, నిర్వాసిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. కమిటీ సిఫారసులు ప్రభుత్వం అమలు చేస్తే దేశ ప్రజలు మరింత ప్రమాదంలో పడతారని వేరే చెప్పనక్కర్లేదు. ప్రజా వ్యతిరేకమైన సుబ్రమణియన్ కమిటీ సిఫారసులను వ్యతిరేకించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలి.

(రచయిత కార్మికోద్యమ నాయకులు) వీ

కార్డన్ సర్చ్ రాజ్యాంగ విరుద్ధం

ప్రజల మౌలిక సమస్యలు పరిష్కరించకుండా, కార్డెన్ సర్చ్ పేరుతో అప్రజాస్వామికంగా కాలనీలపై పోలీసులు అర్ధరాత్రి మూకుమ్మడిగా దాడి చేసి ప్రజల హక్కులను కాలరాస్తున్నారని అంటున్నారు **తుంపాల శ్రీరామమూర్తి**

2015 మార్చ్ 1న విశాఖపట్నం నగర శివారు జివిఎంసి నాలుగో వార్డు మధురవాడ దరి సేవానగర్ వాసులపై తెల్లవారు జామున మూడు గంటలకు 450 మంది పోలీసులు మూకుమ్మడిగా చుట్టుముట్టి సోదా, తనిఖీల పేరుతో దాడి ప్రారంభించారు. ఈ దాడి ఉదయం ఆరు గంటల వరకు కొనసాగింది. ఈ సేవానగర్ జెఎన్‌యుఆర్‌ఎం 960 ఇండ్లలో సుమారు 3,500 మంది నివసిస్తున్నారు. సాయుధులైన పోలీసులు మొత్తం అన్ని ఇండ్లను చుట్టుముట్టి ఇండ్లలో చొరబడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఆందోళన కలిగించారు. ఎందుకు దాడి చేస్తున్నారో కాలనీ వాసులకు తెలియదు. దొంగలు, ఇతర నేరగాళ్లను అదుపులోకి తీసుకోవడానికి ఈ ఆపరేషన్ చేపట్టామని పోలీసులు ప్రకటించారు. 960 ఇళ్లలో ఉంటున్న ప్రతి ఒక్కరి గుర్తింపు కార్డును పరిశీలించారు. కార్డులు లేని 30 మంది అపరిచితులను గుర్తించి అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ జరిపి విడిచిపెట్టారు. నేరస్తులు ఎవరూ దొరకలేదు.

ఈ ఆపరేషన్‌కు క్రైం ఎడిసిపి వరదరాజులు నేతృత్వం వహించారు. 15 మంది ఎసిపిలు, 35 మంది సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. వృద్ధులు, మహిళలు, చంటిపిల్లలు తీవ్ర ఆందోళనకు గురై ప్రశ్నించగా తగిన సమాధానం ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించారు. అంతేకాకుండా ఈ కాలనీలో నేరస్తులు, దొంగలు ఉన్నారని ప్రకటించినందువలన వీరికి కూలి పనులు ఎవరూ ఇవ్వడం లేదు. పాఠశాలకు వెళ్లే పిల్లలను తోటి విద్యార్థులు దొంగల కాలనీ నుంచి వచ్చిన వారని నిందలు మోపుతూ హేళన చేస్తూ, వివక్షతతో అంటరాని వారిగా చిత్రిస్తున్నారు.

ఈ కాలనీలో ఉన్న వారందరూ దళిత బలహీనవర్గాలకు చెందిన వారు. కూలీ పనులు, ఇండ్లలో పాచి పనులు చేసుకుని ఏ పుటకు ఆ పూట తిండికి యాతనపడే బడుగుజీవులు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును ఇప్పుడు వారు కోల్పోయారు. పనులు లేక పస్తులు ఉంటున్నారు. పోలీసులు ఎప్పుడు ఏం చేస్తారోనని వారి బంధువులు కూడా ఇక్కడకు రావడానికి భయపడుతున్నారు.

నేరస్తులను పట్టుకోవడానికి నిఘా వ్యవస్థ ద్వారా సమాచారం సేకరించి అదుపులోకి తీసుకునే ప్రక్రియ జరపవచ్చు. అంతేకాని కాలనీ మొత్తాన్ని చుట్టుముట్టి దాడి చేయడం, వారు జీవించే హక్కును కాలరాయడమే. అందుకే ఆపరేషన్ కార్డన్ సెర్చ్ రాజ్యాంగ విరుద్ధం. కాలనీ వాసుల ఆగ్రహంతో జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర 2015 మార్చ్ 4న కుటుంబాలతో ధర్నా చేసి తమ కాలనీపై ఉన్న చెడు ముద్రను తొలగించే విధంగా పోలీసులు ప్రకటన చేయాలని, ఇటువంటి దాడులు చేపట్టరాదని, ఇది తమ ఆత్మగౌరవానికి భంగం కలిగిందని, దళితులను దొంగలుగా ముద్రవేయడం తగదని పోలీసుల ముట్టడిపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాల్సిందిగా కోరుతూ జిల్లా కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రం అందజేశారు.

విశాఖ ఏజెన్సీలోని 11 మండలాల్లో ఆరు లక్షలపైగా గిరిజనులు నివసిస్తున్నారు. 1987 మే నెలలో నక్సలైట్లను అదుపులోకి తీసుకునే పేరుతో చింతపల్లి మండలం 60 గ్రామాల్లో నక్సలైట్ల ఆచూకి పేరుతో సుమారు 620 ఇండ్లను పోలీసులు తగులబెట్టారు. మూడు వేల మందిని నిరాశ్రయులను చేశారు. దీనిపై అప్పటి ఎ.పి. పౌరహక్కుల సంఘ కార్యదర్శి డా. బాలగోపాల్, ముగ్గురు రిటైర్డ్ న్యాయమూర్తుల నేతృత్వంలో విశాఖపట్నంలోనే ప్రైవేటు విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. జస్టిస్ కృష్ణయ్యర్ సూచనలతో ఏర్పాటు చేసి ప్రజా విచారణ కమిటీ బాధితులను విచారించి ఆ రిపోర్ట్‌ను ప్రభుత్వానికి నివేదించింది. ఇది ఒక సంచలనమైన సంఘటన. ఈ విచారణకు హాజరయ్యే గిరిజనుల బాధితులకు పోలీసుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. 2007 ఆగస్టు 20న జి. మాడ్గుల మండలం, వాకపల్లి గ్రామంలో మావోయిస్టు పార్టీ నాయకుడు గుణేష్ ఉన్నాడని గ్రేహౌండ్స్ పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి సోదాలు చేసి 11 మంది గిరిజన యువతులపై 21 మంది పోలీసులు అత్యాచారం చేశారు. ఆ తదుపరి అత్యాచారానికి గురైన ఇద్దరు గిరిజన మహిళలు చనిపోయారు. ఇప్పటికీ కేసు విచారణకు రాలేదు. గ్రేహౌండ్స్ పోలీసులు ఈ కేసులో విచారణకు హాజరు కాకుండా ఉండేందుకు హైకోర్టు నుంచి అనుమతి పొందారు. ముంచింగుపుట్టు మండలం, బబుసాల పంచాయితీ పరిధిలో భల్లుగూడ గ్రామాన్ని పోలీసులు చుట్టుముట్టి నలుగురు మహిళలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఇప్పటికీ ఈ కేసు విచారణకు రాలేదు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో రాళ్లగడ్డ తదితర గ్రామాలను చుట్టుముట్టడం అనే సాంప్రదాయం గత కొంతకాలంగా పోలీసులు కొనసాగిస్తూ గిరిజనులపై అక్రమ కేసుల బనాయిస్తున్నారు. ఇప్పుడు ఈ సాంప్రదాయం మైదాన ప్రాంతానికి కూడా పోలీసులు విస్తరించడానికి సేవానగర్ సంఘటన ఉదాహరణ. ఇటువంటి చర్యలు నగర పరిధిలోకి గాజువాక, ఆరిలోవ ప్రాంతాలపై కూడా ఈ ఆపరేషన్ కొనసాగిస్తామని పోలీసులు హెచ్చరించడం అప్రజాస్వామికం, అనైతికం.

సేవానగర్ పూర్వ చరిత్ర

విశాఖనగరం పరిధిలోని రైల్వే స్టేషన్‌కు దగ్గరలో ఉన్న 44 వార్డులో రైల్వే స్థలంలో 1958 నుంచి దళిత, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు గుడిసెలు, గుడారాలు వేసుకుని ప్రస్తుతం 750 కుటుంబాలు జీవిస్తున్నాయి. దీనికి సేవానగర్ అని పేరు పెట్టారు. వీరిలో ఎక్కువ మంది రైల్వే కాంట్రాక్టర్ల వద్ద కూలీలుగా రైల్వే ప్లాట్ ఫారాలు శుభ్రం

విదేశీ పల్ప్ దెబ్బకు స్వదేశీ బిల్ట్ లాకౌట్

ఎన్నో వేల మందికి ఉపాధినిస్తున్న దేశీ కాగితపు పరిశ్రమ ప్రపంచ బ్యాంక్ ఆర్థిక విధానాల ఫలితంగా మూసివేతకు గురవుతోందనీ, కార్మికుల బతుకు వీధిపాలవుతోందనీ అంటున్నారు **సిరిసనగండ్ల సాహితి, సూత్రపు అనిల్**

పాలకులు అవలంబిస్తున్న ప్రపంచీకరణ విధానాలు, స్వేచ్ఛా వాణిజ్యం పేరిట విదేశీ వస్తువుల దిగుమతి ఫలితంగా రాష్ట్రంలో మరో దేశీ పరిశ్రమ లాకౌట్ ప్రకటించింది. వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బతుకుదెరువు నిచ్చిన బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిల్ట్) పరిశ్రమ మూతపడింది. కాగితపు పరిశ్రమకు ముడిసరుకైన పల్ప్ ఉత్పత్తిని ఎనిమిది నెలల క్రితం నిలిపివేసిన బిల్ట్ యాజమాన్యం జనవరి 21న పరిశ్రమను పూర్తిస్థాయిలో మూసివేసింది. ఫలితంగా వేలాది మంది కార్మికుల జీవితాలు రోడ్డునపడ్డాయి.

వరంగల్ జిల్లాలోని అటవీ ప్రాంతమైన మంగపేట మండలం కమలాపురంలో బిల్ట్ పరిశ్రమను 1978లో ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా 3000 మందికి, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి కల్పించేది. బిల్ట్ ఏర్పాటుతో మారుమూల అటవీ ప్రాంతంలోని కమలాపురం ప్రాంతం పారిశ్రామికవాడగా మూడు దశాబ్దాలుగా వెలుగొందింది. 30 ఏళ్లుగా బిల్ట్ నుంచి పల్ప్‌ను బిర్లా కంపెనీకి చెందిన గ్రాసిం పేపర్ ఫ్యాక్టరీ కొనుగోలు చేస్తుండేది. భారత పాలకవర్గాలు ప్రపంచీకరణకు జీ హుజూర్ అంటూ విదేశీ వస్తువులకు, ముడిసరుకు దిగుమతులపై సుంకాలు, ఆంక్షలు ఎత్తివేయడం దేశీయ పరిశ్రమలకు ఆశనిపాతంగా మారింది. ఇలాంటి ఆర్థిక విధానాల ఫలితంగానే పల్ప్ కొనుగోలు కోసం బిర్లా కంపెనీ ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించింది. ఇతర దేశాల్లో బిల్ట్ పల్ప్ కంటే తక్కువ ధరకు పల్ప్ వస్తుండడంతో గ్రాసిం పేపర్ ఫ్యాక్టరీ యాజమాన్యం తక్కువ ధరకు వచ్చే పల్ప్‌నే కొనుగోలు చేయసాగింది. కొన్నేళ్లుగా ఈ ఒక్క కంపెనీ తప్ప మరే ఇతర క్లయింట్ బిల్ట్‌కు లేకపోవడంతో పరిశ్రమ పల్ప్ ఉత్పత్తిని నిలివేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

2014, ఏప్రిల్ 5 నుంచి యాజమాన్యం పల్ప్ ఉత్పత్తి నిలిపివేస్తూ నిర్ణయం తీసుకోవడంతో సుమారు 1000 మంది పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులు రోడ్డునపడ్డారు. ఆ తర్వాత పరిశ్రమను నడిపేందుకు ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపుతూ యాజమాన్యం ఆరు నెలల పాటు కర్మాగారాన్ని నిలిపివేసేందుకు లే ఆఫ్‌కు ప్రభుత్వాన్ని అనుమతి కోరింది. అయితే ఇందుకు ప్రభుత్వం అంగీకరించకపోవడంతో తిరిగి సెప్టెంబర్ 21న క్లోజర్, లేఆఫ్‌కు అనుమతి కోరుతూ మరో దరఖాస్తు చేసుకుంది. స్పందించిన ప్రభుత్వం తెలంగాణలో పరిశ్రమలను మూసివేసేందుకు కుదరదని స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే బిల్ట్ యాజమాన్యం పెట్టుకున్న దరఖాస్తును డిసెంబర్ 26న తోసిపుచ్చుతూ బిల్ట్

చేయడం, చెత్త తొలగించడం, మరికొంత మంది కూలీలు గా బతుకుతున్నారు. సేవానగర్‌కు ఆనుకుని 1995లో ఓంకార్‌నగర్ ఏర్పడింది. ఇక్కడ సుమారు 350 కుటుంబాలు షెడ్డులు, పాకలు వేసుకుని జీవిస్తున్నాయి. వీరిలో ఎక్కువ మంది పంజాబు రాష్ట్రం నుంచి వచ్చిన సిక్కులు గమేళాలు, పారలు, తాపీలు, కత్తులు తయారు చేసి బతుకుతున్నారు. ఈ రెండు కాలనీల చుట్టూ మురికి కాలువలే ఉన్నాయి. దగ్గుపాటి పురందేశ్వరి పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నపుడు ఆమె నిధుల నుంచి ఏడు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి విద్యుత్ సౌకర్యం కల్పించారు. మున్సిపల్ కార్పొరేషన్ ట్యాంకులతో మంచినీరు సరఫరా చేస్తున్నారు. విశాఖనగరంలో 741 మురికివాడలు ఉన్నాయి. ఈ మురికివాడల్లో సుమారు ఎనిమిది లక్షల మంది కుటుంబాలత నివసిస్తున్నారు. ఎక్కువ మంది కుటుంబాలతో జీవిస్తున్న పెద్ద మురికివాడలు సేవానగర్, ఓంకార్ నగర్. వీరికి ఓటర్‌కార్డ్, రేషన్‌కార్డ్‌లు రైల్వే యాజమాజ్యం కార్పొరేట్ సంస్థలకు ఈ స్థలం ఇచ్చేయడానికి నిర్ణయించి వీరిని అక్కడి నుంచి తరలించడానికి ఏర్పాట్లు చేసింది. దీనికి మున్సిపల్ కార్పొరేషన్ వత్తాసు పలికి వారికి సంబంధం లేకపోయినప్పటికీ అప్పటి కమిషనర్ రామాంజనేయులు దూకుడుగా పోలీసులతో ముట్టడించి 2011 డిసెంబర్ 9న మధురవాడలో ఉన్న జెఎన్‌ఎంయుఆర్‌ఎం ఇళ్లకు తరలించారు. ఈ ప్రక్రియ 2011 డిసెంబర్ 18 వరకు సాగింది. వందల సంఖ్యలో పోలీసులను పహారాగా ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతేకాకుండా అతని హయాంలో 30 మురికి వాడలను ఇక్కడ నుంచి నగర శివారుకు తరలించడానికి ప్రయత్నాలు చేయగా పిఒడబ్ల్యు, మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం పౌరహక్కుల సంఘం, దళిత సంఘాలు తరలింపు జరగకుండా ఉద్యమించాయి. అక్రమ అరెస్టులకు, కేసులకు గురయ్యారు. ఈ కమిషనర్ దళిత కులానికి చెందిన వాడైనప్పటికీ బలహీన వర్గాల ప్రజలపై దయ చూపలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కైన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నగరానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న మధురవాడ, పెందుర్తి దగ్గర ఉన్న పులగాలవాని పాలెంకు సేవానగర్, ఓంకార్‌నగర్ వాసులను తరలించారు. వారు కూలీ పనుల కోసం పట్టణానికి రావాలంటే రోజుకు 60 రూపాయల రవాణా చార్జీ అవుతుంది. ఈ విధంగా ఉపాధి కోల్పోయారు. ఇప్పుడు వారు నివసిస్తున్న ఇండ్లకు నీటి సదుపాయం ఇతర మౌలిక సదుపాయాలు లేవు. ఏ సదుపాయాలు ఏర్పాటు చేయనప్పటికీ వారిని దొంగలుగా ముద్రవేసి పోలీసులు జరిపిన ఈ ముట్టడిని నగర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముట్టడి జరిగిన ఈ కాలనీ మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు నియోజక వర్గ పరిధిలో ఉంది. దీనిపై ఆయన స్పందన లేదు.

(రచయిత పౌరహక్కుల అధ్యక్షులు, విశాఖపట్నం) వీ

యాజమాన్యానికి, కార్మిక జెఏసి నాయకులకు లేఖలు పంపింది. అయితే యాజమాన్యం ప్రభుత్వానికి క్లోజర్‌కు దరఖాస్తు చేసుకున్న తర్వాత భవిష్యత్ నిర్ణయానికి ప్రభుత్వానికి మూడు నెలల గడువు ఉంటుంది. దీని ప్రకారం డిసెంబర్ 21లోపు యాజమాన్యానికి ప్రభుత్వం తన లేఖను అందించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుంచి 24వ తేదీన నివేదిక అందడంతో యాజమాన్యం తమ దరఖాస్తుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లేనని భావించిన బిల్ట్ యాజమాన్యం పరిశ్రమను నిరవధికంగా బంద్ చేయడానికి నిర్ణయించింది.

కర్మాగారాన్ని తెరిపించాలని కార్మిక జెఏసి నాయకులు ప్రభుత్వ పెద్దలను, కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రులను, రాష్ట్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. అంతేగాక డిసెంబర్ 21 వరకు ప్రభుత్వం తమకు ఎలాంటి సమాచారం ఇవ్వనందు వల్ల క్లోజర్‌లో భాగంగా ప్రభుత్వ నిబంధనలకు లోబడి కార్మికులకు నష్ట పరిహారం చెల్లిస్తామని, అందుకు ప్రభుత్వ అనుమతిని ఇవ్వాలని యాజమాన్యం మరొక దరఖాస్తు చేసింది. పరిశ్రమ మూసివేయడమనేది ఖాయం కావడంతో గత 20 సంవత్సరాలుగా కంపెనీ కోసం, తమ కుటుంబాల కోసం కష్టపడిన కాంట్రాక్ట్ కార్మికులు అడ్డా కూలీలుగా మారిపోయారు. కుటుంబాల జీవన పరిస్థితి భారం కావడంతో నిన్నటి వరకు ఇంటి పనులకు మాత్రమే పరిమితమైన మహిళలు కూడా కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి తలెత్తింది. దీంతో పట్టణాల్లో అడ్డా కూలీల మాదిరిగా గ్రామంలోని పలు ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకుని పనుల కోసం నిరీక్షిస్తున్నారు. కాగా బిల్ట్ కర్మాగారాన్ని పది నెలలుగా నిలిపివేయడంతో ఫ్యాక్టరీలో పనిచేసే పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులు, దినసరి కార్మికులకు బయట పనులు దొరకకపోవడంతో ఆయా కార్మికుల కుటుంబాల జీవనం దుర్భరంగా మారింది. దీంతో పలువురు కార్మికులు మండలంలో భవన నిర్మాణ పనులకు, వ్యవసాయ పనులకు వెళుతుండగా, మరికొందరు కార్మికులు ఉపాధి కోసం పొట్ట చేత పట్టుకుని వరంగల్, హైదరాబాద్ ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు తదితర ముఖ్య పట్టణాలకు వలస వెళ్లారు. కంపెనీ పర్మినెంట్ కార్మికులకు కూడా నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు అల్లాడుతున్నాయి. నేడు, రేపు అనుకుంటూ వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు అందకపోవడంతో స్థానిక వ్యాపారులు కూడా అప్పులు ఇవ్వకపోవడంతో కార్మికులు చెప్పుకోలేని మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.

ఇలా బిల్ట్ మూతపడడాన్ని తట్టుకోలేక డిసెంబర్‌లో ఓ మహిళ మృతిచెందింది. కమలాపురంలోని సీపీ నగర్‌లో నివాసముండే సాంబలక్ష్మి (54) బిల్ట్‌లో గత 30 సంవత్సరాలుగా స్వీపర్‌గా పని చేస్తోంది. డిసెంబర్ 11న సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చిన ఆమె కుమార్తె ప్రభావతి, ఇద్దరు మనవళ్లతో కలిసి భోజనం చేసిన తర్వాత కంపెనీ మూతపడుతుందని, అటు తర్వాత ఎట్లా బతకాలని అనే విషయమై వారితో చర్చించి నిద్రించింది. గురువారం తెల్లవారు జామున మనవడు పాఠశాలలో ఎన్‌సీసీ పరేడ్‌కు వెళ్లే క్రమంలో ఆమెను లేపగా విగత జీవిగా పడి ఉంది.

ఇదిలా ఉండగా సుమారు రెండు నెలలుగా కంపెనీలు తెరిపించాలని కార్మికులు ఆందోళన చేస్తున్నారు. 50 రోజులుగా రిలేనిరహార దీక్షలు చేస్తున్నా ఇటు ప్రభుత్వం, అటు యాజమాన్యం స్పందించకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఇన్నాళ్లు కార్మికుల పిల్లలకు చదువు చెప్పిన థాపర్ పాఠశాలను కూడా వచ్చే విద్యాసంవత్సరం నుంచి మూసివేయాలని భావిస్తున్నారని తెలిసి కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

బిల్ట్‌కు ప్రత్యమ్నాయం పవర్ ప్రాజెక్టు

బిల్ట్ కర్మాగారానికి పవర్ ప్రాజెక్టు ప్రత్యమ్నాయంగా మారనుంది. అందుకు అవసరమైన టర్బయిన్ జనరేటర్లు, బాయిలర్లు, కూలింగ్ టవర్ సిద్ధంగా ఉండడం, బొగ్గు, నీరు, స్థలం కూడా అందుబాటులో మంచి అవకాశం. పవర్ ప్రాజెక్టును నిర్మిస్తే అవసరమైన పవర్ అందిస్తుంది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలనలో తెలంగాణలోని అనేక ప్రభుత్వ రంగ సంస్థలు నిజాం షుగర్స్, అజాంజాహి మిల్లు, ఆల్విన్, ఐడిపిఎల్ లాంటి కంపెనీలను దివాళా తీయించిన విషయం తెలిసిందే. అందుకే తెలంగాణ రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపన ఎలా ఉన్నప్పటికీ.. వేలాది మంది కార్మికులకు ఉపాధినిస్తున్న బిల్ట్‌లాంటి భారీ పరిశ్రమను తిరిగి తెరిపించేలా యాజమాన్యంపై ఒత్తిడి పెంచాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. అంతేగాక ఇన్నాళ్లు ప్రభుత్వ రంగ సంస్థల మూసివేతకు కారణమైన ప్రపంచీకరణ, నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు ఇపుడు స్వదేశీ ప్రైవేట్ పరిశ్రమలు నష్టాల ఊబిలో కూరుకుపోవడానికి, ఇక్కడి ఉత్పత్తులకు డిమాండ్ లేకుండా కావడానికి కారణమవుతున్నాయి. ఫలితంగా స్వదేశీ పెట్టుబడిదారులు కూడా కంపెనీలు మూసుకునే పరిస్థితి తలెత్తుతోంది. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ విదేశీ కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరుస్తున్న ప్రస్తుత తరుణంలో దేశంలో బిల్ట్ లాంటి ప్రైవేట్ కంపెనీలు మరికొన్ని మూతపడే ప్రమాదం ఉన్న దృష్ట్యా బలమైన కార్మికోద్యమ నిర్మాణ బాధ్యత కార్మిక సంఘాలపై ఎంతైనా ఉంది.

(రచయితలు సోషల్ వర్క్ లెక్చరర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, హన్మకొండ; పరిశోధక విద్యార్థి) వీ

రాబోయే సంచికలలో...

- **కోచింగ్ సెంటర్లు ఎవరి కోసం - బి. రామకృష్ణ**
- **వివిధ పోరాట రూపాల భూమిక - హేమా వెంకట్రావ్**
- **మైనారిటీలకు సాధికారత ఎలా? - ఇర్ఫాన్ ఇంజనీర్**

కౌలు రైతుల సమస్య పరిష్కారం అత్యవసరం

కౌలు రైతులను నిజమైన సాగుదారులుగా గుర్తించి వారిని ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకున్నప్పుడే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంటున్నారు ఆశాలత

రెండు తెలుగు రాష్ట్రాలలోను కూడా వ్యవసాయ సంక్షోభ భారాన్ని అత్యధికంగా కౌలు రైతులే భరిస్తున్నారు అనడంలో సందేహం లేదు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న మొత్తం రైతు ఆత్మహత్యలలో 80 శాతం మంది కౌలు రైతులు ఉన్నట్లు క్షేత్రస్థాయి అధ్యయనాలు తెలియ చేస్తున్నాయి. కౌలు రైతుల సమస్యల తీవ్రతను ఇది చాటి చెపుతున్నది. కౌలు రైతుల హక్కుల పరిరక్షణ కోసం కౌలు దారీ చట్టాలు, ఇటీవల వచ్చిన భూ అధీకృత రైతుల చట్టం వంటివి అమలులో ఉన్నప్పటికీ వాటి అమలు చాలా నిరశాజనకంగా ఉంది. భూమిని కౌలుకు తీసుకుని సాగు చేయడం అనేది భూమి లేనివారికి, భూమి తక్కువగా ఉన్న వారికి ఒక అవకాశంగా ఉంచడం ఎంత నిజమో వారి హక్కులకు ఎటువంటి హామీ లేకపోవడం అంతే నష్టదాయకంగా ఉంది. గత 20 ఏళ్లలో కౌలు రైతుల సంఖ్య విపరీతంగా పెరిగిన నేపథ్యంలో భూమినే నమ్ముకొని జీవనాధారం కొనసాగిస్తూ సమస్యల వలయంలో కూరుకు పోయిన కౌలు రైతుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వ యంత్రాంగం మేల్కొని సత్వర చర్యలు తీసుకోవడం అత్యవసరం.

రాష్ట్ర విభజన పూర్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 26 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు అధికారిక అంచనా. వీరిలో 10 లక్షల మంది తెలంగాణలో, మిగిలిన 16 లక్షలు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో ఉన్నట్లు తెలుస్తున్నది. కోస్తా ఆంధ్రా జిల్లాలలో అత్యధికంగా, మొత్తం రైతులలో దాదాపు 80 శాతం మంది, తెలంగాణలో 40–50 శాతం మంది కౌలు రైతులున్నారని రైతు సంఘాలు, పరిశోధకుల అధ్యయనాలు తెలియ చేస్తున్నాయి. భూమి లేని వారికి భూమిని పంచి ఇచ్చే ఉద్దేశంతో ముందుకు వచ్చిన భూ సంస్కరణలు విఫలమవడంతో భూమి లేని రైతులు, రైతు కూలీలు భూస్వాముల వద్ద కౌలుకు తీసుకోవలసిన పరిస్థితి వల్ల కౌలుదారుల సంఖ్య పెరిగింది. నిజానికి కౌలు రైతులే వాస్తవ సాగుదారులు. కానీ వారికీ భూమి పట్టా లేకపోవడం చేత సంస్థాగత రుణాలు తదితర రాయితీలు, సౌకర్యాలు అందడం లేదు. దీనితో అధిక వడ్డీకి – ప్రైవేట్ అప్పులు తీసుకుని నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభ పరిస్థితుల భారానికి తోడు పంటలు సరిగా పండినా పండక పోయినా యాజమానికి కౌలు చెల్లించక తప్పని పరిస్థితిలో వారి కష్టమంతా కౌలు రూపంలో భూ యజమానులకు చేరుతున్నది. ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను కౌలు రైతులే భరించవలసి వస్తున్నది. కౌలు పద్ధతులలో అనేక మార్పులు జరిగి, కౌలు ధరలపై నియంత్రణ లేకుండా పోయి, కౌలు రైతులకు చట్టబద్ధమైన హక్కులు లేకుండా పోవడంతో వారి సమస్య రానురాను జటిలమైంది.

భూ యజమాని – కౌలుదారు మధ్య సంబంధాలలో కౌలు రైతులది బలహీనమైన పాత్ర, కనుక కౌలు రైతులకు రక్షణ కల్పించే ఉద్దేశంతో, వారికి భూమి హక్కులు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వాలు రక్షిత కౌలుదారీ చట్టాలను తీసుకొచ్చాయి. 1956లో హైదరాబాదు, ఆంధ్ర రాష్ట్రాలను కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పరచే నాటికి రెండు ప్రాంతాలలోనూ విడివిడి గా కౌలుదారీ చట్టాలున్నాయి. 1950లో వచ్చిన తెలంగాణ ప్రాంత కౌలుదారీ చట్టం 1956లో వచ్చిన ఆంధ్ర ప్రాంత కౌలుదారీ చట్టానికంటే ప్రగతిశీలమైనది. ఈ చట్టం ప్రకారం కౌలు ఒప్పందం రాతపూర్వకంగా ఉండి భూ యజమాని తహసిల్దార్ వద్ద నమోదు చేయవలసి ఉంటుంది. కౌలు ఒప్పందం కనీసం ఐదేళ్ల పాటు ఉండాలి, కౌలు రైతులు వరుసగా ఆరు ఏళ్ల పాటు ఒక భూమిని సాగు చేసుకున్నట్లయితే వారు రక్షిత కౌలుదారుగా పరిగణించబడతారు, ఆ భూమిని కొనుగోలు చేసే హక్కును పొందుతారు. రైతు చెల్లించే కౌలు మొత్తం భూమి శిస్తుకు 3–5 రెట్లు కాని లేక స్థూల ఉత్పత్తిలో నాలుగు నుంచి ఐదవ వంతు వరకు ఉండాలనే పరిమితి కూడా ఈ చట్టం విధించింది. అయితే ఈ చట్టం 1953 తర్వాత కొన్ని సందర్భాలలో తప్ప (మైనారిటీ దాటని వారు, ఒంటరి మహిళలు, సైన్యంలో పని చేసేవారు తప్ప) మిగిలిన వారు కౌలుకు ఇవ్వడాన్ని నిషేధించింది. 1956 నాటి ఆంధ్ర ప్రాంత కౌలుదారీ చట్టం (1974లో సవరించబడింది) కౌలును నిషేధించలేదు కానీ కౌలు కాల పరిమితి, ధర వంటి అంశాలలో కఠినమైన నియంత్రణ విధించింది. దానితో చాలా వరకు కౌలు ఒప్పందాలన్నీ మౌఖికంగానే ఉండి పోయాయి. దీనికి ఈ చట్టాలు కౌలుదారులకు రక్షణ కల్పించేవి గానూ భూస్వాములపై నియంత్రణ విధించేవిగానూ ఉండడం కూడా ఒక కారణం. దీనితో కౌలు అనేది రికార్డులలోకి ఎక్కకుండా అదృశ్యంగా ఉండి పోయింది. ఆంధ్ర ప్రాంత కౌలుదారీ చట్టం భూస్వామి అమ్మడానికి సంసిద్ధత వ్యక్తపరిస్తే తప్ప కౌలు రైతు తాను సాగుచేస్తున్న భూమిని కొనుగోలు చేసే హక్కు కల్పించలేదు. అయితే ఈ కౌలుదారీ చట్టాలు 1970 వరకు కొంత అమలు జరిగినప్పటికీ ఈ తర్వాత రకరకాల కారణాల చేత అమలుకు నోచుకోలేదు. రాష్ట్రంలో జరుగుతున్న కౌలు లావాదేవీలను ఈ చట్టాలు ఏమాత్రం పరిపాలించడం లేదనీ, పైగా చట్టంలోని కొన్ని అంశాలు అనియత కౌలు పద్ధతులకు దారి తీశాయనీ 2006లో నివేదిక ఇచ్చిన కోనేరు రంగారావు కమిటీ స్పష్టంగా తేల్చి చెప్పింది.

భూమి యాజమాన్యంలో ఉన్న అసమానతలు, సాగు భూమి కొద్ది మంది భూస్వాముల చేతిలో పోగుబడి పోవడం వల్ల వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న రైతులు, వ్యవసాయ కూలీల చేతిలో భూమి లేకపోవడం చేత వారు భూ యజమానుల వద్ద రకరకాల పద్ధతులలో కౌలుకు తీసుకుని సాగు చేయడం చాలా దశాబ్దాలుగా జరుగుతున్నది. 1970 తర్వాత కౌలు విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. హరిత విప్లవంతో పాటు ప్రవేశించిన వాణిజ్య పంటల సాగు,

భూస్వాములు పట్టణాలకు వలస వెళ్లడం వంటి పరిణామాల వల్ల ఎక్కువ మంది చిన్న సన్నకారు రైతులు, భూమిలేని రైతులు భూమిని కౌలుకు తీసుకుని సాగు చేయడం పెరిగింది. 1990ల తర్వాత కౌలు రైతుల సంఖ్య విపరీతంగా పెరిగినట్లు అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. ప్రాంతాలను బట్టీ, పంటలను బట్టీ, వనరులను బట్టీ ఈ కౌలు పద్ధతిలో అనేక వ్యత్యాసాలు చోటుచేసుకున్నాయి. పాలు పద్ధతి నుండి నిర్ధారిత నగదు చెల్లించే పద్ధతికి మార్పు జరిగింది. పత్తి, పొగాకు, మిర్చి, చెరుకు వంటి వాణిజ్య పంటలు పండించే భూములకు కౌలు మొత్తం నగదు రూపంలో ముందుగానే చెల్లించే పద్ధతి అమలులోకి వచ్చింది. వరి లాంటి పంటలకు పెట్టుబడి – దిగుబడులను పంచుకునే పాలు పద్ధతి ఇప్పటికీ కొన్ని చోట్ల అమలులో ఉంది. భూసారం, నీటి వసతిని బట్టి కౌలు ధరల నిర్ణయం జరుగుతున్నది. అయితే ఈ కౌలు ధరలకు ఎటువంటి అధికారిక పరిమితి లేదు. కౌలు పద్ధతులకు ఎటువంటి చట్టబద్ధత లేదు. కొన్ని ప్రాంతాలలో భూమి తక్కువగా ఉంచడం చేత కౌలు దారుల మధ్య పోటీ కారణంగా కౌలు ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గి, సబ్సిడీలు తగ్గి, ఖర్చులు పెరిగి, వర్షాలు సమయానికి పడక, దిగుబడులు రాక, పండిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం కౌలు రైతులకు మరింత తీవ్రస్థాయిలో అనుభవంలోకి వస్తున్నది. భూమి యజమానులకు అందుబాటులో ఉన్న బ్యాంకు రుణాలు, విత్తనాలు తదితర ఉత్పాదకాల సబ్సిడీలు, పంటల బీమా సౌకర్యం మొదలైనవి కౌలు రైతులకు దక్కడం లేదు. రుణమాఫీ వంటి పథకాలు భూమి యజమానులకే దక్కుతున్నాయి తప్ప వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు అందడం లేదు. పైగా కౌలు రైతులకు నిర్దిష్ట కాలం పాటు భూమి అందుబాటులో ఉంటుందన్న హామీ లేకుండా పోయింది. వీటన్నిటి దృష్ట్యా కౌలు రైతులకు మేలు కలిగే విధంగా కౌలు చట్టాలను సరళీకరించాలనే డిమాండు కొంత కాలంగా ముందుకొస్తున్నది. వ్యవసాయరంగంలో – ప్రైవేట్ పెట్టుబడులు పెంచడానికి వీలు కలుగుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వ విధానాలు కూడా దీని వైపు మొగ్గు చూపాయి. భూములు పడావు పడకుండా, దీర్ఘకాలం పాటు కౌలు రైతులు పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సహించాలంటే కౌలు పద్ధతిని పరిమిత స్థాయిలో చట్టబద్ధం చేయాలని 11వ పంచవర్ష ప్రణాళిక పకటించింది. భూమి యజమానుల ఆస్తి హక్కుకు ప్రమాదం వాటిల్లకుండా మరో వైపు చిన్న సన్నకారు కౌలు రైతులకు సంస్థాగత రుణాలు అందించడం వంటి ప్రయోజనాలను కల్పించే విధంగా కౌలు రైతులను నమోదు చేయాలని 12వ పంచవర్ష ప్రణాళిక పేర్కొంది. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ 2013 జూలైలో విడుదల చేసిన జాతీయ భూసంస్కరణల ముసాయిదా విధానం కూడా చిన్న సన్నకారు కౌలు రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు చట్టబద్ధమైన రక్షణలు కల్పించాలనీ, అన్నిరకాల కౌలు ఒప్పందాలను స్పష్టంగా నమోదు చేయాలనీ, పాలుకు తీసుకోవడాన్ని కూడా కౌలుగా పరిగణించాలనీ సూచించింది. అంతకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో రైతు ఆత్మహత్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో వ్యవసాయ సంక్షోభ పరిష్కారాన్ని సూచించడానికి నియమించబడిన జయతీ ఘోష్ కమిషన్ 2005లో కౌలు రైతులను నమోదు చేసి, పాస్ పుస్తకాలను ఇచ్చి సంస్థాగత మద్దతు అందించాలని సూచించింది. భూ పంపిణీ కార్యక్రమాల అమలును, భూమి సమస్యలను పరిశీలించడానికి 2006లో ఏర్పాటైన కోనేరు రంగారావు కమిటీ కౌలు రైతుల సమస్యను ఒక ప్రధానమైన సమస్యగా గుర్తించింది. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులను జారీ చేసి బ్యాంకు రుణాలను అందించాలని ఆ కమిటీ సూచించింది.

కోనేరు రంగారావు కమిటీ సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2011లో ఆంధ్రప్రదేశ్ భూ అధీకృత రైతుల చట్టం (ది ఆంధ్రప్రదేశ్ లైసెన్సెడ్ కల్టివేటర్స్ యాక్ట్) తీసుకొచ్చింది. దీని ప్రకారం కౌలు రైతులు రుణ అర్హత కార్డులను పొంది బ్యాంకుల నుండి రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంట భీమా, ప్రకృతి వైపరీత్యాల సందర్భంలో నష్టపరిహారం పొందవచ్చు. అయితే ఈ కొత్త చట్టం కౌలు రైతులకు భూమి హక్కులు కల్పించడం గురించి ఏమీ మాట్లాడకుండా కేవలం కౌలుదారులను నమోదు చేయడం గురించి మాత్రమే చెపుతుంది. ఈ చట్టంలో అనేక పరిమితులు, దీని అమలులో అనేక లోపాలు ఉన్నాయి. కౌలు రైతుల రుణ అర్హత కార్డుల కాలపరిమితి ఒక ఏడాది మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత ప్రతి ఏడాది రేన్యువల్ చేసుకోవలసి ఉంటుంది. భూమి సమస్య చాలా సున్నితమైన సమస్య అయినందున భూమికి సంబంధించి ఎటువంటి చట్టం వచ్చినా ముందుగా భూమి యజమానులకు అనేక భయాలు, అపోహలు తలెత్తుతాయి. కౌలు రైతుల రుణ అర్హత కార్డుల గురించి కాని, భూ యజమానుల భయాలను పోగొట్టడానికి కాని, రెవిన్యూ శాఖ ఎటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టక పోవడం చేత ఈ చట్టం అమలు సక్రమంగా జరగడం లేదు. నిజానికి రెవిన్యూశాఖ ఈ చట్టాన్ని అమలు చేయడానికి యంత్రాంగాన్ని సంసిద్ధం చేయలేదు.

ఒక అంచనా ప్రకారం 2012–13 నాటికి రాష్ట్రం 20 శాతం మంది కౌలు రైతులకు మాత్రమే రుణ అర్హత కార్డులు లభించాయి, వారిలో 30 శాతం మంది మాత్రమే బ్యాంకు రుణాలు అందాయి. అంటే మొత్తం కౌలు రైతులలో 7 శాతం కంటే తక్కువ మందికి రుణాలు అందాయి. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఉన్నప్పటికీ బ్యాంకు రుణాలు అందక పోవడానికి పలు కారణాలున్నాయి. కేవలం ఒక ఏడాది మాత్రమే కాలపరిమితి గల రుణ అర్హత కార్డులపై రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు సిద్ధంగా లేవు. ఎందుకంటే ఆ రుణాలు తిరిగి చెల్లిస్తారన్న హామీ లేదు కనుక. అందుకోసం బ్యాంకర్లు భూమి సర్వే నెంబర్లు, భూమి యజమాని సంతకం ఉండాలనే షరతు విధిస్తున్నారు. భూమి యజమనులకుండే అపోహల వల్ల వారు అందుకు సిద్ధంగా లేరు. దీనితో ఈ చట్టం ఉండి కౌలు రైతులకు పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. ఈ చట్టం దాని పరిమితులలోనైనా సక్రమంగా అమలు జరగాలంటే ముందుగా రెవెన్యూశాఖ రాష్ట్రస్థాయిలో భూ యాజమాన్య కమిషనర్ మొదలుకొని గ్రామస్థాయిలో గ్రామ రెవెన్యూ అధికారి వరకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. రుణ అర్హత కార్డుల జారీ కోసం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలి. కౌలు రైతులు సాగుచేస్తున్న భూమి సర్వే నెంబర్లు గ్రామ రెవెన్యూ అధికారులే అందించే వీలు కల్పించాలి. బ్యాంకులు కౌలు రైతులకు రుణాలు ఇచ్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు భరోసా కల్పించడానికి కౌంటర్ గ్యారెంటీ ఇవ్వాలి.

ఇక రాష్ట్ర విభజన నేపథ్యంలో కౌలు రైతులు అత్యంత నిర్లక్ష్యానికి గురయ్యారు. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇచ్చే ప్రక్రియను మండల రెవెన్యూ కార్యాలయం సిబ్బంది ప్రతి ఏడాది ఫిబ్రవరి ఒకటి నుండి మే 15లోపు పూర్తిచేసి జూన్ 15 నాటికి వ్యవసాయశాఖకు, బ్యాంకులకు అందజేయాలి. మొదటి రెండేళ్లు ఇది కొంతవరకు అమలు జరిగినప్పటికీ 2014లో రాష్ట్ర విభజన, అసెంబ్లీ ఎన్నికల మూలంగా ఆ ప్రక్రియ పూర్తిగా మూలలోకి వచ్చిన పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలలో రైతులకు ప్రధానంగా హామీ ఇచ్చిన రుణమాఫీపై పెట్టిన కసరత్తులో

ఇజ్రాయిల్‌లో జాత్యహంకారుల గెలుపు

పాలస్తీనా ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కాలరాచి, జాతి వైరుధ్యాలను రెచ్చగొట్టి, అత్యంత పాశవికంగా వారిని అణచివేసి మళ్లీ అధికారాన్ని చేపట్టిన నెతన్యాహు దురాగతాలను ఇంకా కొనసాగించే అవకాశం ఉందని అంటున్నారు బైరెడ్డి సతీష్

తాను ప్రధానమంత్రిగా ఉన్నంతకాలం స్వతంత్ర పాలస్తీనా రాజ్యం కలను నిజం కానివ్వనని, ఇటీవలి ఇజ్రాయిల్ టీనేజర్ల హత్యకు బాధ్యుల్ని చేస్తూ పాలస్తీనా ప్రజల నెత్తురు పారించిన బెంజమిన్ 'బిబి' నెతన్యాహు నాలుగవసారి అధికారాన్ని చేపడుతున్నాడు. 120 స్థానాలు కలిగిన ఇజ్రాయిల్ శాసన వ్యవస్థ 'సెనెట్'లో తన నాయకత్వంలోని లికుడ్ పార్టీకి కేవలం 30 స్థానాలే లభించినప్పటికినీ, 'భావ సారూప్యత' కలిగిన ఇతర పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పరుస్తున్నాడు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తన పార్టీకి సంపూర్ణ మెజారిటీ రాదని సర్వేలు సూచించిన నేపథ్యంలో యూదు జాత్యహంకారాన్ని రెచ్చగొట్టి, ఇజ్రాయిల్‌లో నివసించే అరబ్బుల పట్ల విద్వేశాన్ని వెళ్లగక్కుతూ, పాలస్తీనా రాజ్యాన్ని ఏర్పడనీయనని భీషణ ప్రతిజ్ఞతో ఈ మాత్రం ఫలితాలని సాధించాడు. ఈ పరిస్థితుల్లో కూడా వామపక్ష, అరబ్బు పార్టీల కూటమి అయిన జాయింట్ లిస్ట్ 12 స్థానాలను సాధించుకొని గతంలో కంటే బలాన్ని పెంచుకొని తమ గళాన్ని బలంగా వినిపించబోతుంది. తమ నేలమీద తామే శరణార్థులుగా బతుకులీడుస్తున్న పాలస్తీనీయుల స్వరాజ్యకాంక్షను దశాబ్దాలుగా రక్తపు మడుగుల్లో ముంచుతున్న ఇజ్రాయిల్ పాలకుల్లో నెతన్యాహు మొదటి వాడూ కాదూ చివరి వాడూ కాదూ.

ఏ దేశంలోనైనా సాధారణ ఎన్నికలు జరిగిన ప్రతి కొత్త సందర్భంలో ఏవో మార్పులు ఉంటాయని ఆశించడం సహజం. కానీ దానికి భిన్నంగా ఎటువంటి మార్పులుండకపోగా నెతన్యాహు నాయకత్వంలో గత 9 సంవత్సరాలుగా కొనసాగుతున్న అణచివేత విధానాలనే పాలస్తీనా విషయంలో కొనసాగించబోతున్నారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ రెండు స్వతంత్ర రాజ్యాలుగా ఉండాలన్న భావనను నిర్ద్వందంగా తిరస్కరించిన వాడు నెతన్యాహు. జాత్యహంకార నెతన్యాహు నాయకత్వంలో లికుడ్ పార్టీ అధికారంలోకి రావడం ఒక్క పాలస్తీనా భవిష్యత్‌కే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా అనేక దుష్పరిణామాలకు దారితీసే సంఘటన. అమెరికా అధ్యక్షుడితో సంబంధాలు పణంగా పెట్టి మరీ నెతన్యాహు వ్యవహరిస్తున్నాడంటే అమెరికాలో యూదు లాబీపైన ఎంతటి గాఢమైన విశ్వాసం ఉందో అర్థం అవుతుంది. అధ్యక్షుడితో సంబంధం లేకుండానే అమెరికన్ కాంగ్రెస్ స్పీకర్ అహ్వానం మేరకు ఆ దేశాన్ని సందర్శించి అమెరికా, ఇజ్రాయిల్ ప్రజా వ్యవహారాల కమిటీ (ఎఐపిఎసి) సమావేశంలోనే ఒబామా ఇరాన్‌తో పౌర అణు చర్చల విషయంలో వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా వ్యతిరేకించాడంటే ఇజ్రాయిల్ లాబీ అమెరికాలో ఎంత బలంగా పాతుకుపోయిందో అర్థం అవుతుంది. అది

వీసమెత్తు కూడా కౌలు రైతుల సమస్యపై పెట్టలేదు. రుణమాఫీ జరిగిన కొద్దిమేర కూడా కౌలు రైతులకు ఒరిగింది అతి తక్కువ. తెలంగాణలో మొత్తం వ్యవసాయ రుణాలు రు. 23,000 కోట్లు అయితే వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు అందిన రుణాలు 23 కోట్లు (0.001 శాతం) మాత్రమే. అంటే వారికి ఈ పథకం ఎంతవరకు లాభించిందో లెక్క కట్టవచ్చు. ఈ ఏడాది మార్చ్ పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇచ్చే ప్రక్రియ ఇంకా మొదలు కానేలేదు.

ఇక వ్యవసాయంలో 70 శాతం పనులు నిర్వహిస్తున్న మహిళలకు భూమి హక్కులు లేక పోవడంతో అసలు రైతులు గానే గుర్తించకపోవడం వల్ల భూమిని కౌలుకు ఇచ్చే వారిగా గానీ కౌలుకు తీసుకుని సాగు చేసే వారిగా గానీ మహిళలని పరిగణించడం లేదు. వాస్తవానికి కౌలు ఒప్పందాలు చేసుకోవడం, కౌలు నామాలు రాసుకోవడం మొదలైన వ్యవహారాలలో పురుషులే ప్రధాన పాత్ర వహిస్తున్నప్పటికీ చాలా చోట్ల మహిళలు కూడా కౌలు రైతులుగా భూములను సాగు చేస్తున్నారు. మహిళలు బృందాలుగా ఏర్పడి సమిష్టిగా కౌలకు తీసుకుని సాగు చేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అందుకే ప్రభుత్వం కౌలుదారీ చట్టాలను సమీక్షించి, సాగుకు యోగ్యంగా ఉండి ఉపయోగించకుండా ఉన్న భూములను భూమి లేని మహిళలను సహకార సంఘాలుగా ఏర్పరచి వారికి కౌలుకు ఇచ్చే విధంగా సవరణలు చేయాలి. కౌలు కాలపరిమితి కనీసం పదేళ్లు ఉండేటట్లు చూడాలి. ఈ మహిళా రైతు బృందాలకు సంస్థాగత రుణాలు, తదితర మద్దతు వ్యవస్థలు కల్పించాలి.

నిజానికి అత్యంత తీవ్రంగా ఉన్న కౌలు రైతుల సమస్యకు రుణ అర్హత కార్డులు, బ్యాంకు రుణాలు ఇవ్వడం మాత్రమే పరిష్కారం కాదు. ఇది ఒక తాత్కాలిక ఉపశమనం మాత్రమే. వీరి సమస్య శాస్వతంగా పరిష్కరించబడాలంటే కౌలు రైతులకు రక్షణ కల్పించాలి. వాస్తవ సాగుదార్లకు భూమి హక్కులు కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. వ్యవసాయం కూడా ఒక ప్రజా ప్రయోజనంగా గుర్తించి సాగు చేయని వారి వద్ద నుండి భూమిని సేకరించి ఎవరైతే సాగు చేయడానికి సిద్ధంగా ఉన్నారో వారికి దానిపై హక్కు కల్పించాలి.

ఆర్థిక సంస్కరణలు నయా ఉదారవాద ఆర్థిక విధానాల నేపథ్యంలో వ్యవసాయంలో ప్రభుత్వ పెట్టుబడులు బాగా తగ్గిపోయి పెట్టుబడుల భారాన్నంతా రైతుల పైనే నెట్టి వేయడం జరిగింది. వ్యవసాయంలోకి ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కౌలు చట్టాలను సరళీకరించాలని పూనుకుందే కాని ప్రభుత్వ పెట్టుబడులను పెంచి వ్యవసాయ రంగానికి జవసత్వాలను ఇచ్చి రైతులను సంక్షోభం నుండి బయట పడవేయడానికి పూనుకోవడం లేదు. ఇది జరిగితే తప్ప కౌలు రైతులు, చిన్న సన్న కారు రైతులు అప్పుల ఊబి నుండి బయట పడి, ఆదాయం పొంది గౌరవంగా జీవనం గడపడం సాధ్యం కాదు. వీ

(రచయిత సామాజిక కార్యకర్త)

అమెరికా విదేశీ వ్యవహారాల విధాన నిర్ణయాలను నిర్దేశించే స్థాయికి వెళ్లింది. ఇరాన్‌తో అణు చర్చలకు వెంటనే ముగింపు పలకాలనీ, యూరపియన్ యూనియన్ అమెరికాలు సంయుక్తంగా ఇరాన్‌పై తీవ్రమైన ఆంక్షలు విధించి కట్టడి చేయాలని, అయినా దారికి రాకపోతే ఇరాన్‌పై యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలని అమెరికాను ప్రేరేపించే పనిలో పడ్డాడు నెతన్యాహు. ఈ నేపథ్యంలోనే బెంజమిన్ నెతన్యాహు ఎన్నికల విజయాన్ని, భవిష్యత్ పరిణామాల్ని విశ్లేషించుకోవాలి.

ఒకవైపు ఇటువంటి దౌర్జన్యపూరిత, ఆధిపత్య విధానాలను అంతర్జాతీయంగా ఎంతో కొంత అడ్డుకట్ట వేయగలిగిన రష్యా నేడు తన పాత సోవియట్ ప్రాంతంలో 'నాటో' విస్తరణను అడ్డుకునేందుకు ఉక్రెయిన్ వ్యవహారంలో తలమునకలైంది. మరోవైపు యూరపియన్ యూనియన్ అంతర్గత సమస్యలతో, ఆర్థిక సంక్షోభాలతో సతమత మవుతూ బయటి వ్యవహారాలను అంతగా పట్టించుకునే స్థితిలో లేదు. ఇప్పటికే అనేక యుద్ధాలతో సతమతమవుతున్న అమెరికాను ఎట్లాగైనా ఇరాన్ అణు చర్చల నుండి పక్కకు తప్పించి మరో యుద్ధం చేయించే కుతంత్రాలకు తెరలేపుతున్నది ఇజ్రాయిల్. భౌగోళిక సారూప్యత రీత్యా అమెరికా ఇరాన్‌తో యుద్ధం చేస్తే తాను వెన్నుదన్నుగా ఉంటానని, భవిష్యత్‌లో అమెరికా ఆధిపత్యానికి ఢోకా ఉండదని, తన సమీప దేశాలపై తనూ ఆధిపత్యం చేయడం సులభం అవుతుందని తద్వారా పాలస్తీనా స్వరాజ్యకాంక్షను శాశ్వతంగా అణిచివేయాలని చూస్తుంది ఇజ్రాయిల్. ఫలితంగా పాలస్తీనాకు మద్దతునిచ్చే ఇస్లామిక్ దేశాల, హిజ్బుల్లా ముప్పును కూడా తొలగించుకోవాలని చూస్తుంది ఇజ్రాయిల్.

అంతర్జాతీయ క్రిమినల్ నేరాల కింద ఇజ్రాయిల్‌ను విచారించాలని అంతర్జాతీయ న్యాయస్థానాన్ని (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) పాలస్తీనా ఆశ్రయించడం కూడా ఒక తక్షణ కారణం అవుతున్నది. గాజా ప్రాంతంలో అధికారంలో ఉన్న హమాస్‌తో చేతులు కలిపి పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో దానిని సాకుగా చూపించి చర్చల ప్రక్రియ నిలిచిపోయే దశకు తీసుకొచ్చింది కూడా నెతన్యాహునే.

ఈయన కాలంలోనే తమ స్వాధీనంలోని అరబ్ తూర్పు జెరూసలెంలో యూదులకు వేలాది గృహాలు నిర్మించడం మొదలవ్వడమే కాకుండా ఆ ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లే ప్రమాదం కూడా భవిష్యత్‌లో ఉంది. పాలస్తీనా ప్రజల ప్రాథమిక హక్కుల్ని తీవ్రంగా ఉల్లంఘించడమే కాకుండా, అనేక ప్రపంచ దేశాల నుండి మానవతా దృక్పథంతో అందించబడుతున్న ఆహారాన్ని, ఔషధ సరఫరాను కూడా అడ్డుకొని తన అమానవీయతను బయట పెట్టుకుంటున్నది ఇజ్రాయిల్. ఇజ్రాయిల్ టీనేజర్ల హత్యను సాకుగా చూపి జరిగిన ఏకపక్ష యుద్ధకాండ వల్ల వేలాది మంది మృత్యువాత పడడంతో పాటు, వందలాది పాఠశాలలు, ఆస్పత్రులు ధ్వంసమైన వర్తమాన చరిత్ర ఇజ్రాయిల్ ఉన్మాదానికి ప్రతీక.

ఒబామా పదవీకాలం ఇంకా రెండేళ్లే ఉంది. ఈ లోపే పాలస్తీనా, ఇజ్రాయిల్ సమస్య పరిష్కారం మాటేమో కానీ, ఇరాన్ అణు చర్చలు కూడా ఒక కొలిక్కి వస్తాయనే పరిస్థితి లేదు. ఇజ్రాయిల్‌లో ఏ ప్రభుత్వం ఉన్నా, అమెరికాలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దురహంకార పూరిత, ఆధిపత్య ధోరణినే కొనసాగిస్తాయి. అయితే అమెరికాలో డెమోక్రాట్స్ ఆధ్వర్యంలో ఉండే ప్రభుత్వాలు మౌలిక విధానాల్లో తేడాను ప్రదర్శించక పోయినా, ఆయా వ్యవహారాలలో రిపబ్లికన్ ప్రభుత్వాల కంటే కాస్త అటు ఇటుగా తీవ్రతలో తేడాను చూపే అవకాశం ఉంటుంది. అమెరికా వచ్చే ఎన్నికల్లో రిపబ్లికన్‌లు అధికారం లోకి వస్తే మాత్రం ఇరాన్‌పై యుద్ధం చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రిపబ్లికన్ పార్టీలో ఇజ్రాయిల్ అనుకూల యూదులాబీ మరింత బలంగా ఉండడం దీనికి కారణంగా అర్థం చేసుకోవచ్చు. ఆ లోపు పాలస్తీనా, ఇజ్రాయిల్ పరిష్కార ప్రక్రియలో ఎటువంటి పురోగతి లేకపోగా, ఇరాన్‌పట్ల శత్రుపూరిత వైఖరిని కొనసాగిస్తూ యుద్ధాన్ని ప్రేరేపించే పాత్ర ఇజ్రాయిల్ తప్పక పోషిస్తుంది. దాని ఫలితంగా ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సంక్షోభం తలెత్తే ప్రమాదం పొంచి ఉంది.

ఉక్రెయిన్‌లో అమెరికా ప్రత్యక్ష జోక్యం కంటే ఇరాన్ అంశంలో ఇజ్రాయిల్ ప్రేరేపణతో యుద్ధానికి పురిగొల్పడంలో అమెరికా కంటే ఎక్కువగా ఇజ్రాయిల్‌కు ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఇరాక్, సిరియాలలో సున్నీల నాయకత్వంలో చెలరేగిపోతున్న ఐసిస్ (ఐఎస్ఐఎస్) ను ఇరాన్ మద్దతు లేకుండా కట్టడి చేయడం అమెరికాకు చాలా కష్టం. అందుకే ఒబామా కూడా ఇజ్రాయిల్ కంటే ఇరాన్ అణు అంశానికి దాని ద్వారా ఐసిస్‌ను నిలువరించడానికే అధిక ప్రాధాన్యతను ఇస్తున్నాడని అర్థమవుతుంది. ఇరాన్‌ను మరో పదేళ్లు అడ్డుకోగలిగితే ఆలోగా 1979 నాటి ఇస్లాం విప్లవం తాలుకూ ప్రభావం పట్టు సడలడమే కాకుండా ఇరాన్ సుప్రీం లీడర్ ఖొమేని ప్రభావం కూడా క్రమంగా తగ్గుముఖం పడుతుందని, నేటి యువతరం ఆధునిక జీవనశైలితో పాటు ఆధునిక ధోరణులు కోరుకుంటున్నారని దాని ఫలితంగా ఇరాన్‌తో భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బంది ఉండదని అమెరికాలో ఒక మేధావి వర్గం అంచనా వేస్తుంటే అదే వైఖరిని ఒబామా కొనసాగిస్తున్నాడు. ఇదంతా ఇరాన్ అణు కార్యక్రమం అణు ఇంధనం కోసం, శాంతియుత పౌర ప్రయోజనాల కోసం కాదని, అణ్వాయుధాల అభివృద్ధే లక్ష్యంగా పెట్టుకొన్నదని ఇరాన్ ఒక్కసారి అణ్వాయుధాలను సమకూర్చుకుంటే తన మనుగడకే ముప్పని ఇజ్రాయిల్ బలంగా నమ్మడమే కాకుండా అమెరికాపై బలంగా ఒత్తిడి తెస్తున్న క్రమంలోనే ఇరుదేశాల సంబంధాలలో ఒక స్తబ్దత నెలకొని ఉంది. భవిష్యత్‌లో ఇజ్రాయిల్ ఏకాకిగా మిగిలిపోయే అవకాశం ఉంది.

ఒకవేళ ఐరాసలో 1967కి ముందున్న సరిహద్దులతో పాలస్తీనా రాజ్య ఏర్పాటుకు అమెరికా మద్దతు తెలిపే అవకాశం ప్రస్తుతం ఉన్నా (నెతన్యాహు వైరం మూలంగా), రెండు రాజ్యాల పరిష్కారానికి కట్టుబడి అమెరికా అలాచేసినా అది భవిష్యత్‌లో అత్యంత ప్రభావంతమైన యూదులాబీ ఒత్తిళ్లను కాదని జరుగుతుందా అనేది అనుమానాస్పదం. ఇజ్రాయిల్‌లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా జాత్యహంకారమే మూల సిద్ధాంతంగా ఉండి అరబ్బుల అస్తిత్వాన్ని, మనుగడను మరుగునపరిచే దుర్మార్గాలకే ఒడిగడుతుంటారు. నిరంతర హింసను అనుభవించడం పాలస్తీనా ప్రజల జీవితాల్లో భాగమైంది. ఇస్లామిక్ దేశాల్లో ఐక్యత లోపించడం, అంతర్గత ఘర్షణకు దిగడం, అగ్రరాజ్యానికి ఊడిగం చేయడం వల్ల పాలస్తీనా స్వతంత్ర రాజ్యంగా ఏర్పడకుండా పోతుంది. పాలస్తీనా, ఇజ్రాయిల్ సంఘర్షణ నేపథ్యంలో జాతీయవాద పార్టీగా చెప్పుకునే బిజెపికి సహజంగానే పాలస్తీనా ప్రజలకంటే జాత్యహంకారాన్ని ప్రదర్శించే ఇజ్రాయిలే తనకు సహజ మిత్రురాలు అవుతుంది. పాలస్తీనా ప్రజల స్వయం పాలన, స్వరాజ్య హక్కుకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేని ఈ శక్తులకు సహజంగానే ఆసక్తి ఉండదు. ఈ భావజాల సాన్నిహిత్యానికి తగ్గట్టుగానే భారత ప్రధాని నరేంద్రమోడీ నెతన్యాహుకు ఇజ్రాయిల్‌కు ఎన్నికల ఫలితాలు విడుదలైన వెంటనే అభినందన సందేశాన్ని పంపారు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

మత స్వేచ్ఛ - రాజ్యాంగ హక్కు

***ప్రజాస్వామ్య దేశంలో గుజరాత్ మారణహోమం, మోడీ ప్రధాని కావడం, సామ్రాజ్యవాద దేశాధినేత భారతదేశం వచ్చి మత స్వేచ్ఛ గురించి మాట్లాడడం వెనుక గల పరిణామాలను వివరిస్తున్నారు* ఎ. రాజేంద్రబాబు**

ఆరున్నర దశాబ్దాల భారత గణతంత్ర దినోత్సవానికి ముఖ్య అతిథిగా అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా దేశ రాజధానికి వచ్చిన సందర్భంగా ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు గమనించ దగ్గవి. అణు ఒప్పందం, మరి కొన్ని వ్యాపార ఒడంబడికల పేరుతో అమెరికాలోని కాలం చెల్లిపోయిన యంత్ర సామాగ్రిని భారతదేశానికి అంటగట్టే ఉద్దేశమే ప్రధానంగా ఉన్నప్పటికీ ('కాలం చెల్లిపోయిన యంత్ర సామగ్రిని భారత్‌కు అంటగట్టడమే బరాక్ పర్యటన ప్రధాన ఉద్దేశమని' అమెరికా సామ్రాజ్యవాద కుయుక్తుల పట్ల ఏహ్యాభావం కలిగిన నేను ఆపాదిస్తున్న ఉద్దేశం కాదు. సాక్షాత్తు ప్రధానమంత్రి మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లోని దేశీయ పెట్టుబడిదారుల సంఘం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) కు మొరపెట్టుకుంటూ సమర్పించుకున్న అర్జీలో పేర్కొన్న విషయం ఇది) ఆయన పోతూ పోతూ నరేంద్ర మోడీ ప్రభుత్వానికి ఒక చురక అంటించి పోయాడు. బహుళజాతి, విభిన్న మత వ్యవస్థలయిన అమెరికా, భారత్‌ల సామాజిక పరిస్థితులను ప్రస్తావిస్తూ ఆయన భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25ను ఉదహరించాడు. ఆర్టికల్ 25(1) ఈ విధంగా చెపుతుంది. 'భారత పౌరులందరికి మత స్వేచ్ఛ ఉంటుంది. ఏదైనా మతాన్ని తమ ఆత్మ ప్రబోధం ప్రకారం విశ్వసించుటకు, ఆచరించుటకు, ప్రచారం చేసేందుకు భారత పౌరులందరు పూర్తి స్వేచ్ఛ కలిగి ఉంటారు'. ఈ రాజ్యాంగ స్ఫూర్తి కొనసాగినంత కాలం భారత అజేయంగా ఉంటుందని నర్మగర్భితంగా హెచ్చరించిన ఒబామా, అమెరికా తిరిగి వెళ్లిన రెండు రోజులకే మరింత స్పష్టంగా తన అభిప్రాయం వ్యక్తపరిచాడు. 'ఒక వేళ గాంధీజీ ఈ రోజు బతికి ఉండి ఉంటే, భారతదేశంలోని మత విద్వేషాలను గమనించి పెద్ద షాక్‌కు, దిగ్భ్రాంతికి గురై ఉండేవాడు' అన్నది ఆయన సూటిగా మాట్లాడిన మాట.

కేంద్ర ప్రభుత్వం తరపున అరుణ్ జైట్లీ ఈ వ్యాఖ్యలను తిరస్కరించినప్పటికీ మనదేశంలోని మతవాద శక్తులు విపరీత పోకడలు పోతున్నాయన్న విషయం ప్రపంచ దృష్టిని ఆకర్షించిందన్నది వాస్తవం. దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి అతి ఘోరమైన తిరస్కరణకు గురి కావడానికి రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఈ 'విపరీత' పోకడలు కూడా ఒక కారణం. ఢిల్లీ నగరంలో 25 లక్షల జనాభా గల దళిత సమూహం మొదట కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌గా ఉండేది. మెల్లమెల్లగా అది కాంగ్రెస్ నుండి దూరమై బహుజన సమాజ్ పార్టీ వైపు మారింది. 2015 ఎన్నికల్లో ద్విగుణీకృత ఉత్సాహంతో దళితులందరూ ఆప్ వైపు మొగ్గు చూపారని విశ్లేషకులు చెపుతున్నారు. దళితులు, క్రిస్టియన్లు, ముస్లిం మైనారిటీలు, సిక్కు మతస్తులు అందరూ ఆమ్ ఆద్మీ పార్టీనే సమర్థించారు. అభివృద్ధిని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీ అభివృద్ధి అంటే తన పంథాలో భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చడమేనన్నట్లుగా ప్రవర్తించడం, ఆర్థిక రంగంలో కాంగ్రెస్ అవలంబించిన పాత విధానాల కంటె భిన్నమైన ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పన లేకపోవడం ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి ఓటమికి కారణాలుగా చెప్పవచ్చు.

దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలు శ్రుతిమించుతున్నాయి అనడానికి ఒబామా వ్యాఖ్యలు నిదర్శనం. అధికారం హస్తగతం చేసుకోవడానికి కులాల మధ్య, మతాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకొనే రాజకీయాలు మనదేశానికి కొత్త గాక పోయినా, 2014లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అవి మరీ పెచ్చరేగిపోయాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య అనంతరం సిక్కు మతస్థుల మీద ద్వేషాన్ని రెచ్చగొట్టి ఢిల్లీలో ఇతర ప్రాంతాలలో వారిని ఊచకోత కోసి తదుపరి ఎన్నికలలో ఉత్తర భారతదేశ వ్యాప్తంగా లబ్ధిపొందిన రాజీవ్‌గాంధీ వైనం చరిత్ర పుటల్లో నిక్షిప్తమై ఉంది. 1990వ దశకంలో బాబ్రీ మసీదును కూల్చివేసి దేశ వ్యాప్తంగా ముస్లింల పట్ల విద్వేషాన్ని రగిల్చి వాజపేయి గ్రూపు అధికారంలోకి రావడం ఈ దేశం మౌనంగా వీక్షించింది. కేంద్రంలో, రాష్ట్రంలో బిజెపి అధికారంలో ఉండగా నరేంద్రమోడీ మొదటిసారిగా ముఖ్యమంత్రి అయిన నాలుగు నెలలలోనే గుజరాత్‌లో వేలాది ప్రజల మారణహోమం జరిగి దేశాన్ని నిస్థాణువుగా చేసిన రావణకాష్టం మనముందుంది.

ఈ విద్వేష భావాలను కొన్ని తరాల పాటు సజీవంగా ఉంచడం కోసం విద్యారంగాన్ని కాషాయీకరణ చేయడానికి ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నరేంద్రమోడీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌లోనే ఈ ప్రయత్నాలు మొగ్గ తొడిగి ఒక స్పష్టమైన రూపు తీసుకున్నాయి. అమెరికా సంయుక్త రాష్ట్రాల విదేశీ వ్యవహారాల శాఖ 2003లో వెలువరించిన అంతర్జాతీయ నివేదిక ఈ విధంగా పేర్కొంది. 'గుజరాత్ రాష్ట్రంలో 98 శాతం పాఠశాలలు గుజరాత్ హయ్యర్ సెకండరీ బోర్డ్ అధీనంలో ఉంటాయి. నాజీయిజంను క్షమించి వదిలేసి, ఆ భావాలు మాత్రం కొనసాగాలని ఉద్బోధించే పుస్తకాలను ఆ స్కూళ్లల్లో ఉపయోగించాలని బోర్డు ఆదేశాలు జారీ చేసింది. పదవ తరగతి సాంఘిక శాస్త్రంలో 'మహోన్నతుడైన హిట్లర్' 'ఆకర్షణీయమైన విజయాల' గురించి సుదీర్ఘంగా వివరించిన పాఠాలు ఉన్నాయి. ఆ పాఠ్యపుస్తకంలో యూదుల పట్ల వ్యతిరేకత, జర్మన్ జాతి ఔన్నత్యానికి వత్తాసుపలకడం లాంటి సూచనాప్రాయమైన వ్యాఖ్యలు తప్ప నాజీల వినాశకర విధానాల గురించి గాని, కాన్‌సంట్రేషన్ క్యాంపుల గురించి గాని ప్రస్తావనే లేదు. 9వ తరగతి సాంఘిక శాస్త్రంలో ముస్లింలు, క్రిస్టయన్లు, పార్శీలు, యూదులు 'విదేశీయులని అర్థం వచ్చేలా పాఠాలు

ఉన్నాయి. 2002లో గుజరాత్ హయ్యర్ సెకండరీ బోర్డ్ వారి ఒక పరీక్షలో ఈ అర్థం వచ్చేట్టుగా ఇంగ్లిష్‌లో వాక్య నిర్మాణం చేయమని ప్రశ్న ఒకటి ఉంది. 'రెండు పరిష్కార మార్గాలు ఉన్నాయి. అందులో ఒకటి నాజీ మార్గం. నీకు ఎవరి పట్ల అయినా అయిష్టం ఉంటే వారిని సమూహం నుండి విడదీయి. దారుణంగా హతమార్చు. ఆ తర్వాత గర్వంగా ఠీవిగా నిలబడు. ఈ భూమికి నమ్మకస్తున్నని, విశ్వాస పాత్రుడినని ప్రకటించు'.

ఈ తరహా ఆలోచనా పద్ధతి దేశవ్యాప్తంగా విస్తరింపచేయాలని ఒక ప్రణాళిక ప్రకారం కుట్ర జరుగుతుందనడానికి నిదర్శనమే ఈ మధ్య ఢిల్లీ నగరంలో చర్చీలపై దాడులు. డిసెంబర్ 2014 నుండి ఫిబ్రవరి 2015 మొదటి వారం వరకు జరిగిన ఆరు సంఘటనలలో చర్చీ భవనాలు దాడులకు గురయ్యాయి. ఒక క్రిస్టియన్ స్కూలు కూడా వాటిలో ఉండడం గమనార్హం. భారతదేశంలో ఇతరుల మత విశ్వాసాల పట్ల అసహనం ప్రదర్శించడాన్ని అమెరికా అధ్యక్షుడు ఒబామా కంటె ముందుగా అమెరికాలోని రిపబ్లిక్ పార్టీ సెనేటర్ జోపిట్స్ ఒక సుదీర్ఘమైన పత్రికా ప్రకటనలో తీవ్రంగా ఖండించాడు. భారతదేశంలో 38 సార్లు క్రిస్టియన్ మైనారిటీల పట్ల దాడులు, ఆకృత్యాలు జరిగాయని సోదాహరణంగా వివరించాడు. 'భారత్‌లో చరిత్రాత్మకమైన బహుళత, అన్ని మతాల మధ్య సామరస్యం స్థానంలో ఇప్పుడు భేద భావాలు, అసహనం, సంఖ్య పరమైన మత ఆధిక్యత చోటు చేసుకుంటున్నాయి' అని ఆందోళన వ్యక్తపరిచాడు.

బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డ కొద్ది రోజుల్లోనే అన్ని రాష్ట్రాలలో మారుమోగుతున్న పదం 'లవ్ జిహాద్'. ఉత్తరప్రదేశ్‌లో ప్రారంభమైన 'లవ్ జిహాద్'పై దూమారం అన్ని రాష్ట్రాలకు వ్యాపించింది. మతాంతర వివాహాలు దేశానికేమీ కొత్త కాదు. కాని ముస్లిం యువకుల, హిందూ యువతుల మధ్య జరుగుతున్న అరకొర వివాహాలపై దాడి ఈ మధ్య తీవ్రమైంది. అన్ని ప్రేమ వివాహాలలో ఉన్నట్టు ఈ వివాహాలలోను ప్రేమ, ఆకర్షణ ప్రధానంగా ఉన్నప్పటికీ, ముస్లిం యువకులకు ఏవో ఉద్దేశాలు అంటగట్టి వాటికి మత విద్వేషం రంగు పులిమే ప్రయత్నం జరుగుతున్నది. ఎన్‌డిటివి ఛానల్ వారు ప్రసారం చేసిన పరిశోధనాత్మక నివేదికలో ఇది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) వారు రూపొందించి, సానబట్టిన రాజకీయ అస్త్రం అని తేలింది. త్వరలోనే ఎన్నికలు జరుగబోతున్న ఉత్తరప్రదేశ్‌లో గడప గడపకూ వెళ్లి ముస్లింలను దూరంగా ఉంచండి లేకపోతే మీ ఇంట్లో ఆడ పిల్లలను ప్రేమ పేరుతో ఎత్తుకు పోతారని హెచ్చరించే కార్యక్రమం ఆర్ఎస్ఎస్ చేపట్టింది. దేశంలో ఎక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలలో ఒకటైన ఉత్తరప్రదేశ్ హిందూ సమాజమని, ముస్లిం సమాజమని రెండుగా విడిపోవడానికి సిద్ధంగా ఉంది. సాక్షి మహరాజ్ అనే పార్లమెంటు సభ్యుడు ముస్లిం బాలల కోసం నిర్వహించే మదరసాలలో పిల్లలకు తీవ్రవాదం పాఠాలు బోధిస్తున్నారని, ఆ విధంగా అవి ఉగ్రవాదులను తయారు చేస్తున్న కర్మాగారాలని పేపరు ప్రకటనలు ఇస్తున్నాడు. నరేంద్రమోడీ ప్రభుత్వంలో సీనియర్ కేబినేట్ మంత్రి మేనకాగాంధీ హిందువులు పవిత్రంగా భావించే ఆవులను చంపి వాటి మాంసాన్ని, చర్మాన్ని, ఎముకలను విక్రయించగా వచ్చిన డబ్బును ఉగ్రవాద చర్యలు ప్రోత్సహించడానికి ముస్లింలు చందాగా ఇస్తున్నారని వాదించి అగ్నికి ఆజ్యం పోసే ప్రయత్నం చేశారు.

వీటన్నిటికి పరాకాష్ఠ 'ఘర్ వాపసీ' కార్యక్రమం. హిందూ మతాన్ని వీడి ఇతర మతాలను పుచ్చుకున్న వారిని తిరిగి హిందువులుగా మార్చే కార్యక్రమం తీవ్ర స్థాయిలో చేపట్టాయి విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ తదితర ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు. 1947 స్వాతంత్ర్యం తరువాతి కాలంలో 15 కోట్ల మంది హిందువులు హిందూ మతం వీడి ఇతర మతాలను ఆశ్రయించారని వారందరిని తిరిగి హిందువులుగా మార్చే వరకు ఈ కార్యక్రమం ఆగదని విశ్వహిందూ పరిషత్ నాయకులు ప్రకటించారు. విశ్వ హిందూ పరిషత్ ప్రభావం అంతగాలేని తెలంగాణలోనే గత ఆరు నెలల్లో 1200 మంది తిరిగి హిందువులుగా మారారట. ఈ విషయం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విహెచ్‌పి ఇన్‌చార్జీ వెంకటేష్ ప్రకటించాడు. '1200 మందికి పైగా (కుంటుంబ సభ్యులతో కలిపి) హైదరాబాద్‌లో హిందూ మతంలోకి పునఃప్రవేశించారు. కుషాయిగూడలోని బాలాజీ నగర్, ఎస్‌టి హిల్స్, బోరబండ, ఉప్పల్ తదితర ప్రాంతాలలో ఈ కార్యక్రమం జరిగింది' (డక్కన్ క్రానికల్ 4 జనవరి 2015). ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో దాదాపు 8000 మంది ఈ మధ్య కాలంలో ఘర్‌వాపసీ కార్యక్రమంలో భాగంగా హిందూ మతస్తులయ్యారని విశ్వహిందూ పరిషత్ ప్రకటించింది. వామపక్ష ఉద్యమ ప్రభావం ఉన్న కేరళలోను క్రిస్టియన్ మతస్తులు ఎక్కువగా ఉన్న గోవా రాష్ట్రంలో ఘర్‌వాపసీ కార్యక్రమాన్ని రెట్టింపు ఉత్సాహంతో అమలు పరిచే ప్రయత్నం చేస్తున్నారు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు. ఇక ఉత్తరప్రదేశ్ సంగతి చెప్పనక్కర్లేదు!

ఘర్‌వాపసీకి సంబంధించి నారాయణగూడ (హైదరాబాద్)లోని ఒక బ్యాంక్‌లో పని చేసే దళిత యువకుడు రాజు ఓ ప్రశ్న వేశాడు. 'మా పూర్వీకులు మాదిగ కులానికి చెందిన వాళ్లు. ఇప్పుడు మేం దళిత క్రిస్టియన్లం. మేం మతం మార్చుకొని మళ్లీ హిందూ మతంలోకి వస్తాం. అయితే మమ్మల్ని బ్రాహ్మణ కులంలోకి అనుమతిస్తారా? బ్రాహ్మణులు మాతో వియ్యమందడానికి ఒప్పుకుంటారా?' ఈ ప్రశ్నకు ఆర్ఎస్ఎస్ వద్ద సమాధానం లేదు. దళితులు మతం మార్చుకుంటే మతం మార్చిదే గాని కులం మార్చిడి ఉండదు. రాజ్యానికి దగ్గరగా ఉండే ఉద్దేశంతో అగ్రకులాల నుండి కూడా కొందరు (వైఎస్ కుటుంబం లాంటిది) ఇతర మతాలలోకి, ముఖ్యంగా క్రిస్టియన్ మతంలోకి మారిపోయారు. దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలలో కడు పేదరికంలో మగ్గుతున్న వారినే లక్ష్యంగా పెట్టుకున్నారే తప్ప అలాంటి వారిని గురించి అసలు పట్టించుకున్నట్టే లేదు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని 'ఘర్ వాపసీ' కింద హిందూ మతంలోకి మార్చే ప్రయత్నం చేస్తే ఆర్ఎస్ఎస్ చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. అసలు హిందూ మతంలోంచి వెళ్లిపోయి వేరే మతం పుచ్చుకోవడానికి కారణాలేమిటో 'ఘర్‌వాపసీ'లో అన్వేషించినట్టు ఎక్కడా కనపడదు. అసమ కుల వ్యవస్థ ద్వారా మనుషుల పుట్టుకతోనే ఉచ్చ, నీచ భావాన్ని వ్యవస్థీకృతం చేసిన హిందూ మతాన్ని వదిలిపెట్టి బౌద్ధ మతాన్ని స్వీకరించిన అంబేద్కర్ ఉదంతాన్ని ఈ సందర్భంగా ప్రజా పక్షం మేధావులు చర్చకు పెడితే బాగుండేది.

నరేంద్రమోడీ ప్రపంచానికి విస్తృతంగా పరిచయం అయింది గుజరాత్ అల్లర్ల వల్లనే. ఏ కోర్టు గాని, సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక విచారణ బృందం (సిట్) గాని అల్లర్లు జరగడంలో మోడీ ప్రత్యక్ష ప్రమేయం ఉందని, వాటిని నివారించడంలో మోడీ అలక్ష్యం వహించాడని నిరూపించలేక పోయినా, ఆనాటి ముఖ్యమంత్రి మోడీపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని ప్రజలెవరూ నమ్మడం లేదు. మారణహోమాన్ని నివారించగలిగే చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ వైఫల్యమే గాని వ్యక్తిగతంగా మోడీ వైఫల్యం కాదన్న వింత వ్యాఖ్యానాలు మన న్యాయస్థానాలు చేశాయి. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే మాయని మచ్చలాగా మిగిలిపోయిన ఈ దుశ్చర్యలో మొదటి మూడు రోజులు

రాష్ట్రం మొత్తం ఉడికిపోయింది. ఆ తర్వాత రాష్ట్ర రాజధాని అయిన అహ్మదాబాద్‌లో మూడు వారాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా మరి మూడు నెలలు అడపదడపా సామూహిక హత్యలు జరుగుతూనే వచ్చాయి. ముస్లిం స్త్రీలను చెరిచారు; పురుషులను, పిల్లలను సజీవ దహనం చేశారు. ముస్లింలకు చెందిన ఆస్తులు తగులబెట్టారు.

2002 ఫిబ్రవరి 27న గోద్రా రైల్వే స్టేషన్లో అయోధ్య నుండి రామమందిర నిర్మాణ పనుల ముందస్తు ఏర్పాట్లకు హాజరై సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో అహ్మదాబాద్‌కు తిరిగి వస్తున్న కర సేవకులు ప్రయాణం చేస్తున్న రైల్వే బోగీని తగలబెట్టి 59 మంది మృతికి దారితీసిన సంఘటనకు ప్రతీకారంగా ముస్లింలకు వ్యతిరేకంగా ఈ అల్లర్లు జరిగాయని చెపుతారు. కాలి పోయిన ఆ బోగీ లోపలి నుండి మంటలు వ్యాపించాయని విచారణకోసం నియమించిన దర్యాప్తు సంఘాలు తేల్చి చెప్పాయి. కాని, లోపలి నుండి మంటలు ఎలా వ్యాపించాయి అన్న విషయంలో స్పష్టమైన నిర్ణయానికి రాలేక పోయాయి. 'ముందస్తు వ్యూహంతోనే పకడ్బందీ ప్రణాళికతో పన్నిన పన్నాగం అది' అని ఒక బలమైన అభిప్రాయం ఉంది. అయితే గోద్రా సంఘటన పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంఘటనగా చిత్రీకరించి ఆ తరువాత ముస్లింలపై జరిగిన దుర్మార్గమైన చర్యలను సమర్థించుకోబోయాడు నరేంద్రమోడీ.

గోద్రా సంఘటన జరగగానే విశ్వ హిందూ పరిషత్ గుజరాత్ రాష్ట్ర మంతటా బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్ సమయంలో జాగరూకతతో ఉండుండవలసిన ప్రభుత్వం, పోలీసులు నిర్లిప్తంగా ఉండి లూటీకి, దహనకాండకు, మానవ హననానికి తమవంతు సహాయం చేశారు. వేలాదిగా ముస్లింలు హతమవడానికి కారకులయ్యారు. అందుబాటులో ఉన్న సైన్యాన్ని మూడు రోజుల పాటు రంగంలోకి దించకుండా హత్యాకాండకు తావిచ్చింది గుజరాత్ ప్రభుత్వం. ఈ అల్లర్లలో రాష్ట్ర వ్యాప్తంగా 500 మసీదులు ధ్వంసం అయ్యాయని వాటి పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని ఒక ముస్లిం స్వచ్ఛంద సంస్థ గుజరాత్ హైకోర్టులో వ్యాజ్యం వేస్తే అది న్యాయబద్ధమైన కోరికయేనని, పునర్నిర్మాణం బాధ్యత ప్రభుత్వానిదేనని గుజరాత్ హైకోర్టు తీర్పు చెప్పింది. గుజరాత్ అల్లర్ల సందర్భంగా మొత్తంగా 4000 పోలీసు కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాతి కాలంలో సాక్ష్యాధారాలు లేవని అన్ని కేసులు మూసివేశారు. అలా మూసివేయడం చట్ట సమ్మతం కాదని సుప్రీంకోర్టు తేల్చింది. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు వాటిల్లో 2000 కేసులను తిరిగి సమీక్షించగా 640 దొమ్మీ చేసిన వ్యక్తులు, 40 మంది పోలీసు ఆఫీసర్లు దోషులుగా తేలారు.

ఈ అల్లర్లలో ముస్లిం మతస్తులకు చెందిన ఒక లక్ష ఇళ్లు, 1100 హోటళ్లు, 1500 దుకాణాలు, 3000 తోపుడు బండ్లు, 5000 వాహనాలు ధ్వంసం అయ్యాయి. కొంత కాలం తర్వాత నిర్వహించిన 101 పునరావాస శిబిరాలలో ఒక లక్ష మంది ముస్లింలు తల దాచుకున్నారు. రెండు వారాలకే ఆ శిబిరాల సంఖ్య 104 కు పెరిగి వాటిల్లో 1,50,000 మంది ముస్లింలు చేరారు. అన్ని పునరావాస శిబిరాలు ప్రభుత్వ సహాయం ఏమీ లేకుండా, స్వచ్ఛంద సంస్థలు, సహాయక సంస్థలు నడిపినవే! సహాయం ఏమీ చేయకపోగా ముఖ్యమంత్రి నరేంద్రమోడీ వాటికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. 2002 సెప్టెంబర్ 9న నరేంద్రమోడీ ఒక ఉపన్యాసంలో ప్రభుత్వం తరుపున పునరావాస శిబిరాలు నడపడానికి తాను వ్యతిరేకం అన్నాడు. ఆ ఉపన్యాస పాఠాన్ని ప్రత్యేక పరిశోధనా బృందం (సిట్) కు ఇవ్వకుండా గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం తొక్కిపెట్టింది. సుప్రీంకోర్టు కలుగజేసుకుంటే గాని ఆ ఉపన్యాసం సిట్ దృష్టికి రాలేదు.

ఆ ఉపన్యాసంలో మోడీ ఏమన్నారంటే... 'నేను పునరావాస శిబిరాలు నడపాలా? ఎందుకు? అవి పిల్లలను పుట్టించే కేంద్రాలు. గుజరాత్ ప్రభుత్వం కుటుంబ నియంత్రణ విధానానికి కట్టుబడి ఉంది'... పునరావాస కేంద్రాలలో పనేమీలేక పిల్లల్ని పుట్టించడానికి తప్ప వేరే పనికి ఉపయోగపడవని ఎద్దేవా చేసిన ఘనత మన ప్రధానమంత్రిది!

గుజరాత్ అల్లర్లను సమర్థిస్తూ విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్ తొగాడియా 'హిందూత్వ వ్యతిరేకులందరికి మరణదండనే తగిన శిక్ష' అన్నాడు. అప్పటి విహెచ్‌పి అధ్యక్షుడు అశోక్ సింఘాల్ 'గుజరాత్ ప్రయోగం విజయవంతం అయింది. ఈ ప్రయోగం దేశ వ్యాప్తంగా అమలు జరుగుతుంద'ని ప్రకటించాడు.

గుజరాత్ అల్లర్లకు కారణాలను వెలికి తీయడానికి, జరిగిన విధ్వంసాన్ని లెక్క గట్టడానికి 60 జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు పూనుకుని, తీవ్ర పరిశోధనలు జరిపి నివేదికలు సమర్పించాయి. అందులో 'హ్యూమన్ రైట్స్ వాచ్' అనే సంస్థ గణనీయమైన కృషి సల్పింది. అమెరికా, యునైటెడ్ కింగ్‌డం, ఫ్రాన్స్, జర్మనీ, శ్రీలంక దేశాల మహిళా ప్రతినిధులు ఒక అంతర్జాతీయ నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి గుజరాత్ అల్లర్లలో ముస్లిం స్త్రీలపై జరిగిన అత్యాచారాలపై నివేదిక ఒకటి ఐక్యరాజ్య సమితికి సమర్పించారు. జాతీయ, అంతర్జాతీయ నివేదికలన్నీ గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాయి.

గుజరాత్ అల్లర్ల గురించి ఇలా రాస్తూ పోతే ఒక ఉద్గ్రంథమే అవుతుంది. గుజరాత్‌లో హిందూయేతరులకు వ్యతిరేకంగా జరిగిన దహనకాండకు నాయకత్వం వహించింది ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు. ఆర్‌ఎస్ఎస్ సైద్ధాంతికంగా నాజీయిజానికి, ఫాసిజానికి వారసురాలు. ఆర్ఎస్ఎస్ పునాదుల్లోనే హిట్లర్, ముస్సోలినీల ఆలోచనలు పాదుకున్నాయి. ఆర్ఎస్ఎస్ నేపథ్యంలోంచి వచ్చిన నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత దేశంలో పరిస్థితులు మత విద్వేషాల వైపు మళ్లాయి. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు బలం పుంజుకుని ద్విగుణీకృత ఉత్సాహంతో ముస్లిం, క్రిస్టియన్, దళిత వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టడంతో బరాక్ ఒబామా కూడా నరేంద్రమోడీకి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25ను గుర్తు చేయాల్సి వచ్చింది. ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు మత విద్వేషాన్ని రెచ్చగొట్టే చర్యలు ఎన్ని చేపట్టినా, బిజెపి ఎంపిలు, మంత్రులు సెక్యులర్ వ్యతిరేక మెజారిటీ తమ అనుకూల బహిరంగ వ్యాఖ్యానాలు ఎన్ని చేస్తున్నా ప్రధానమంత్రి హోదాలో ఉన్న నరేంద్రమోడీ ఖండించకపోవడం, మౌనం వహించడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది.

క్రిస్టియన్ మత పెద్దలు కొంత మంది డిసెంబర్‌లో ప్రధానమంత్రిని కలిసి ఘర్‌వాపసీ కార్యక్రమం పట్ల, క్రిస్టియన్ మిషనరీలకు చెందిన చర్చి భవనాలను తగులబెట్టిన దుండగల చర్యల పట్ల తమ భయాందోళనలు వ్యక్తపరిచి ఆ సంఘటనలను ఖండించి మైనారిటీ ప్రజలకు ఆసారాగా భారత ప్రభుత్వం ఉంటుందని పత్రికా ప్రకటన చేయమని కోరితే నరేంద్రమోడీ తిరస్కరించారని ది హిందూ పత్రిక వెల్లడించింది. చిట్టచివరికి ఆయన మౌనంపై దేశవ్యాప్తంగా చర్చ జరిగి, అంతర్జాతీయ వేదికలపై ఫోకస్ అయ్యి, ఢిల్లీ ఎన్నికలలో ప్రజలు గుణపాఠం నేర్పిన తర్వాత, ఫిబ్రవరి 17న నరేంద్రమోడీ మత స్వేచ్ఛను కాపాడతానని, తమ విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఢిల్లీలో ఒక చర్చీ సమావేశంలో మాట్లాడుతూ హెచ్చరికలు జారీ చేశాడు.

ఇప్పటికైనా మేలుకున్నందుకు సంతోషమే కాని, ఆయన హెచ్చరికలు

జర్నలిజం మోడల్స్ మారాలా?

***ప్రస్తుత మీడియా రంగం నిర్వహణాపరంగా వ్యాపార ధోరణిని అవలంబిస్తోందనీ, దీని వల్ల సమాచారం కూడా విలువలు లేనిదిగా మారిపోయిందనీ అంటున్నారు* టంకశాల అశోక్**

జర్నలిజం పరిస్థితులను, అవి క్రమంగా ముందుకు పోతున్న ధోరణులను గమనించినప్పుడు మీడియా మోడల్స్ మారవలసిన అవసరం ఉందనిపిస్తుంది. మారవలసింది కంటెంట్ పరంగా, వ్యాపార నిర్వహణ పరంగా కూడా.

ఈ చర్చలోకి వెళ్లేముందు ప్రస్తుత పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో చూద్దాం. కంటెంట్ రీత్యా, వ్యాపార నిర్వహణ పరంగా కూడా జర్నలిజం తన ఫోర్త్ ఎస్టేట్ ధర్మాన్ని నిర్వహించగల పరిస్థితులు వేగంగా పోతున్నాయి. మీడియా సంస్థలు కంపెనీలకు, పార్టీలకు, ధనవంతులకు ఉపయోగపడే విధంగా మారడం గురించి మాత్రమే ఇక్కడ మాట్లాడడం లేదు. నిజానికి ఈ చర్చ ఎప్పటి నుంచో ఉన్నదే గనుక కొత్తగా చెప్పుకోవలసింది ఎక్కువ లేదు. మనం మరో కోణాన్ని చూడవలసి ఉంది.

ఏ మీడియా సంస్థ అయినా డబ్బు ఖర్చుతో కూడుకున్నది. ఈ ఖర్చులు రానురాను బాగా పెరిగిపోతున్నాయి. ఎంత సేవా భావం గల సంస్థ అయినా అతి తక్కువ లాభాలతో సరిపుచ్చుకోవచ్చునేమో గాని భారీ నష్టాలతో చిరకాలం పత్రికలను, ఛానళ్లను నడపలేదు. ఏవైనా సామాజిక సంస్థలు, యాక్టివిస్టులు, మిత్ర బృందాలు నిర్వహించే చిన్న మేగజైన్ల గురించి కాదు ఈ మాట అంటున్నది. వారు నడిపినంత కాలం నడిపి తర్వాత మూసి వేస్తారు. మళ్లీ డబ్బు ఉన్నప్పుడు మొదలు పెడతారు. అందులో లాభ నష్టాలు, ఉద్యోగాల ప్రసక్తి లేదు. సర్క్యులేషన్లు పరిమితం కనుక అవి వచ్చినట్లు గాని, పోయినట్లు గాని తెలిసేది కొద్ది మందికే తప్ప విస్తృత సమాజానికి కాదు.

తగినంత పెట్టుబడి, సర్క్యులేషన్, ఉపాధి కల్పనలు ఉండే పత్రికలు ప్రభుత్వ వ్యాపార ప్రకటనల నుంచి అరకొర ఆర్జించినా, ప్రైవేట్ ప్రకటనలు లేకుండా నడవలేవు. ఆ తరహా ఆదాయం లేనిదే సర్క్యులేషన్ ఎంత పెరిగితే అంత నష్టమనేది తెలిసిందే. ప్రతికాపీ ధరకు ఉత్పత్తి వ్యయం కొన్నిరెట్లు ఉంటుంది గనుక. ఛానళ్ల లెక్కలు కూడా ఇటువంటివే.

మరి ఈ రోజున ఒకసారి చుట్టూ చూస్తే పత్రికలు, ఛానళ్లు అనేకం ఉన్నాయి. వీటిని పెద్ద లాభాలతో మాట అట్లుంచి కనీస లాభాలతోనో, అధమ పక్షంలో నష్టాలు లేకుండానో నడిపేందుకు అవసరమైన రెవెన్యూ మార్కెట్ నుంచి రావడం లేదు. కొంతకాలం క్రితం వరకు ఒక పరిస్థితి ఉండేది. డబ్బున్న వ్యక్తులో, కంపెనీలో పత్రికలను, ఛానళ్లను అడ్డు పెట్టుకుని ప్రభుత్వం నుంచి అడ్డదిడ్డంగా సంపాదిస్తూ అందులోంచి కొంత మీడియాలో పెట్టుబడి పెట్టేవారు. కనుక మీడియా ద్వారా మార్కెట్ నుంచి తగినంత రెవెన్యూ లభించకున్నా సమస్య అయ్యేది కాదు. రాష్ట్ర విభజన తర్వాత ఇటువంటి అడ్డదిడ్డపు సంపాదన అవకాశాలు కొంత పరిమితమైనట్లు కనిపిస్తున్నది. ఇతరత్రా సంపాదించుకునే వారు మీడియా ఆసరాతో సంబంధం లేకుండా తమతమ పద్ధతులలో ఆ పని చేస్తుండవచ్చు. కాని, మీడియాను ఆసరా చేసుకునే పద్ధతికి బ్రేక్ పడుతున్నట్లు తోస్తున్నది. ఇది కొంతకాలం గడిచినాక పునరుద్ధరణ అయితే చెప్పలేం గాని ప్రస్తుతానికి కొంత తేడా కనిపిస్తున్నది.

మరి యథాతథంగా మార్కెట్ నుంచి రెవెన్యూ లేక, మీడియా ఆధారంగా సంపాదించుకునే అవకాశాలు తగ్గినప్పుడు, మీడియాను నడిపేది ఏ విధంగా? పాత పత్రికలు, ఛానళ్లు కొన్ని ఈ పరిస్థితిని ముందే గుర్తెరిగి కొన్ని పద్ధతులను సంవత్సరాల క్రితమే ప్రవేశపెట్టాయి. ఒరిజినల్‌గా జర్నలిస్టులు బ్లాక్ మెయిలింగ్ చేస్తుండగా తర్వాత స్వయంగా

ఎంత వరకు కార్యచరణకు దారితీస్తాయన్నది చర్చనీయాంశం. మోడీలో ఇప్పుడు ఇద్దరు మనుషులు ఉన్నారు. బుద్ధి తెలిసినప్పటి నుండి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలతో మమేకం చెంది ఆర్‌ఎస్‌ఎస్ శాఖలో శిక్షణ పొంది, ఆ భావజాలాన్ని పూర్తిగా వంట బట్టించుకున్న పార్శ్వం ఒకటైతే, భారతదేశ రాజ్యాంగపు సూత్రాలకు కట్టుబడి ఉంటానని ప్రమాణం చేసి పరిపాలనా పగ్గాలు చేపట్టిన ప్రధానమంత్రి రూపం ఇంకో పార్శ్వం. పరస్పరం విరుద్ధ వ్యక్తిత్వాలు, భావజాలం కలిగిన ఈ ఇద్దరు మనుష్యులలో ఎవరిది పై చేయి అవుతుందో భవిష్యత్తు కాలంలో గాని బయటపడదు.

అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా చేసిన ఇంకొక వ్యాఖ్యపై కూడా మనం దృష్టిసారించాలి. 'తిను బండారాలు అమ్ముకునే ఒక హోటల్లో పని చేసే వంటవాని కుమారుడు అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు కాగలగడం, చాయ్ వాలా కొడుకు అతిపెద్ద దేశమైన భారత్‌కు ప్రధానమంత్రి కావడం, బహుళ మతాలు, విభిన్న జాతులు, అత్యధిక జనాభా గల భారతదేశానికి రాజ్యాంగం రాసే చట్టసభకు ఒక దళితుడు అధ్యక్షుడు కావడం ప్రజాస్వామ్యంలో మాత్రమే సాధ్యం' అని ఒబామా భారత పర్యటన సందర్భంగా ప్రజాస్వామ్యాన్ని కీర్తిస్తూ సందేశం ఇచ్చాడు. నిజమే, భారత, అమెరికా దేశాలలో రాజ్యాంగాలు ప్రవచిస్తున్న ప్రజాస్వామ్యంలో ఈ వెసులుబాటు ఉంది. కాని, హోటల్ యజమాని – వంటవాడు అనే తారతమ్యం లేకుండా, ఒక పెద్ద భూస్వామి లేదా బాగా డబ్బు గల వాడు – టీలు అమ్ముకునే వాడు అనే భిన్న స్థాయిలు లేకుండా, దళితులు – అగ్రవర్ణాల వారు అనే భేద భావం లేకుండా సమాజపు సమిష్టి మనుగడ కోసం అందరూ తమ శక్తి మేరకు శ్రమించి, తమ అవసరం మేరకు సమిష్టి సంపద లోంచి ఉపయోగించుకునే వ్యవస్థ ఇంకెంత సుందరమైనదో, ఉన్నతమైనదో కదా!

(రచయిత రిటైర్డ్ ఇంగ్లిష్ అధ్యాపకులు) వీ

మేనేజ్‌మెంట్లే క్రమం తప్పని బ్లాక్ మెయిలింగ్ ప్రారంభించాయి. రిపోర్టర్ల ద్వారా వేరుగా బ్లాక్ మెయిలింగ్, సాధారణమైన ఒత్తిళ్లు చేస్తూ వీధి దుకాణం నుంచి మొదలుకొని పైస్థాయి వరకు వ్యాపార ప్రకటనలు, నగదు వసూళ్లు సంపాదిస్తున్నాయి. ఒత్తిళ్లలో పత్రికల చందాలు వసూలు చేసి పత్రిక మాత్రం లేకుండా ఆ డబ్బు మిగిల్చుకుంటున్నాయి. బాబాలు, అమ్మలతో సహా రకరకాల మోసగాళ్లకు అండగా నిలిచి ప్రచారం కల్పించి లేదా బెదిరించి సంపాదిస్తున్నాయి. అట్లా తమ మీడియా కంపెనీలను నడుపుతున్నాయి.

మొత్తం మీద గుర్తించవలసింది ఏమంటే, సవ్యమైన విధంగా మార్కెట్ నుంచి చాలినంత రెవెన్యూ సంపాదించి సవ్యమైన మీడియాను నడపగల పరిస్థితులు లేవు. ఈ విషయాన్ని ఎత్తి చూపించేందుకే పై తరహా అవలక్షణాలను పేర్కొన్నాం తప్ప అవి ఎవరికి తెలియవని కాదు. సంతోషించవలసిన ఒక విషయమేమంటే కొన్నేళ్లుగా మీడియా చీకటి రహస్యాలు పల్లెటూరి వాసులకు సైతం తెలిసిపోతున్నాయి. ఒకటి రెండు అగ్రస్థాయి పత్రికలు, ఛానళ్లు మినహా ఈ రోజున అన్నీ నష్టాలలో ఉన్నవే. కొన్ని పత్రికలు పూర్తిగా ఆయా పార్టీల కోసం నడుస్తున్నవి అయినందున, నష్టాలతో నడుస్తున్నప్పటికీ అక్కడ రెవెన్యూ మోడల్ గురించిన చర్చకు బహుశా ఆస్కారం లేదు. బహుశా అనడం ఎందుకంటే, మౌలికార్థంలో చూసినప్పుడు అవి ఫోర్త్ ఎస్టేట్ ధర్మం ప్రకారం నడిచే అవకాశం లేదు గనుక పరోక్షంగా అది ఆ విలువలకు హానికరమే గనుక. అనగా, రెవెన్యూ సమస్య లేకపోయినా జర్నలిజం ధర్మపు సమస్య ఉంటుంది. ఆ విధంగా సమాజానికి నష్టమే. మరీ సంకుచితంగా రెవెన్యూ కోణం నుంచి, ఆ రెవెన్యూ ఆధారంగా సదరు మీడియా నడవడం గురించి మాత్రమే ఆలోచించినట్లయితే విచారించనక్కర లేదు.

ఇవన్నీ చెప్పుకున్న తర్వాత తేలేదేమంటే, ఇటువంటి పరిస్థితులలో ఇటువంటి మోడల్‌తో నడిచే మీడియా సంస్థలు సమాజానికి అవసరమా? అందులో తగినన్ని మూతబడితే నష్టమేమిటి? ఒక్క ఉపాధి అవకాశాల కోణం నుంచి ఆలోచిస్తే తప్ప, ఇతరత్రా నష్టాలేమైనా ఉన్నాయా?

ఒక సమస్య ఏమంటే, ఎవరైనా పూర్తిగా ఆరోగ్యకరమైన మీడియా సంస్థలను ఆరంభించదలచినా, అందుకు రెవెన్యూ కోణం నుంచి ఈ కలుపు మీడియా అంతా ఆటంకం కాగల పరిస్థితులున్నాయి. ఎవరో ఆరోగ్యకరమైన ఫోర్త్ ఎస్టేట్‌ను నడపదలచుకున్నారని ఈ తరహా కలుపు మీడియా అంతర్ధానమవుతుందని కాదు. కాని ఇదంతా పరిస్థితులను చెప్పుకోవడం, ఒక కోణం నుంచి చర్చించడం వరకే.

ఇక కంటెంట్ విషయం కూడా గమనిస్తే పైన చెప్పుకున్న సమస్య మరింత తీవ్రంగా ముందుకొస్తుంది. కంటెంట్ ఏ విధంగా ఉంటున్నదో అందరూ మాట్లాడుతున్నదే. అందుకు ఒక కారణం పైన వివరించుకున్న నిర్వహణ పరమైన మోడల్ కాగా, మరొక కారణం ఆ మోడల్ పెంచి పోషిస్తున్న కంటెంట్ మోడల్‌లో తయారవుతున్న జర్నలిస్టులు. వారు ఉత్పత్తి చేస్తున్న కంటెంట్. మొత్తం మీద ఒకవైపు నిర్వహణ మోడల్, కంటెంట్ మోడల్ కలిసి ఫోర్త్ ఎస్టేట్‌ను భ్రష్టుపట్టించే దశ వచ్చివేసింది. కంటెంట్‌లో మినహాయింపులు ఉండవచ్చు. కాని సర్వ సాధారణ స్థితి మాత్రం ఆ విధంగా ఉంది. నిజానికి మినహాయింపులన్నవి హైదరాబాద్ నుంచి గ్రామీణ స్థాయి వరకు జర్నలిస్టుల వ్యక్తిగత లక్షణాలను బట్టి ఉన్నది తప్ప, వారిని తాము పనిచేస్తున్న రెండు మోడల్స్ నిర్దేశిస్తున్న దానిని బట్టి కాదు.

ఇప్పుడు నిర్వహణ మోడల్‌ను బట్టి చలామణీలో గల కంటెంట్ మోడల్ ఎట్లుందో, ఏ విధంగా పనిచేస్తున్నదో, దాని మంచి చెడులేమిటో అందరూ చూస్తున్నదే. ఆ విధంగా ఈ రెండూ సమాజం తిరస్కరించ దగిన నమూనాలుగా మారాయి. పైన అనుకున్నట్లు నిర్వహణ మోడల్ యాజమాన్యాల వైపు నుంచి మారగల అవకాశాలు సమీప భవిష్యత్తులో కనిపించడం లేదు. ఆర్థిక, రాజకీయ పరిస్థితులు నానాటికి విలువలను కోల్పోయే దిశలో క్షీణిస్తుండడం అందుకు కారణం. తమ అంతర్గతమైన, బాహిరమైన పరిస్థితుల ఒత్తిడివల్ల కొన్ని మీడియా సంస్థలు తమంతట తాము కుప్పగూలవచ్చు గాక. దాని అర్థం ఆ మోడల్స్ దెబ్బతిన్నాయని గాని ఆ ధోరణి మారనున్నదని గాని కాదు. మిగిలి ఉండే సంస్థలు రాటుదేలి నిలబడి, అవే మోడల్స్‌కు కొన్ని మెరుగులు దిద్దుకుని, అదే మార్గంలో ముందుకు పోతాయి. కనుక, కొన్ని సంస్థలు పతనం కావడంలో సంతోషించదగిందేమీ ఉండదు. మోడల్స్ మారినప్పుడే సంతోషించాలి. ఆ మోడల్స్‌ను ఢీకొనగల, ఢీకొని వాటిని భంగపరచక పోయినా కనీసం తమంతట తాము నిలవగలవి రూపుదిద్దుకున్నప్పుడే సంతోషించేందుకు ఏమైనా ఉంటుంది.

మరి ఇది ఏ విధంగా? గుర్తించవలసింది ఏమంటే, అసలు మీడియా సంస్థలంటూ నిలిచేందుకు రెవెన్యూ మోడల్ విజయవంతమై మీడియాను స్వతంత్రంగా నిలపగలగడం ఎంత ముఖ్యమో, పాఠకులను, పాఠకులతో కూడిన సమాజాన్ని తమ వెంట నిలబెట్టుకో గలగడం అంత ముఖ్యం. వాటికి సరిసమాన ప్రాముఖ్యతలుంటాయి. ఈ రెండింటిని సాధించగల గాలంటే, వాటిలో మొదటనే తగినంత పెట్టుబడి సమకూర్చుకుని ఆరంభించి, ఆరోగ్యకరమైన జర్నలిజంతో సమాజాన్ని వెంట తీసుకుంటూ, తద్వారా తదుపరి దశలో ఆరోగ్యకరమైన రెవెన్యూ మోడల్‌ను అభివృద్ధి పరుచుకోవడం ఒక పద్ధతి. ఆరోగ్యకరమైన జర్నలిజం మోడల్ గురించి చాలా విస్తృతమైన ప్రచారం ద్వారా సమాజాన్ని కదిలించి, తర్వాత ఒక మోస్తరు పెట్టుబడితో మీడియా సంస్థలను ఆరంభించి, రెండు మోడల్స్‌ను ఆరోగ్యకరంగా సమాంతరంగా పెంపొందించుకుంటూ పోవడం రెండవ పద్ధతి. థియరేటికల్‌గా, సాంకేతికంగా రెండూ సాధ్యమే. ఆచరణాత్మకంగా, ఉన్న పరిస్థితులను బట్టి చూసినప్పుడు, రెండవది ఎక్కువ సాధ్యం. ఎక్కువ సాధ్యమంటే తేలిక అని కాదు. నిజానికి మొదటి దానిలో కన్న రెండవ దానిలో శ్రమ ఎక్కువ. అయినప్పటికీ, మొదటి దానిలో ముందుగానే తగినంత పెట్టుబడి సమీకరణ అనే షరతు ఉన్నది గనుక, అది పగటికల అని భావించవచ్చునేమో గనుక, రెండవది ఎక్కువ సాధ్యమంటున్నాం. అందులో శ్రమ ఎక్కువైనా పగటికల ఫ్యాక్టర్ లేదు. ఆలోచిస్తే ఇంకా పద్ధతులు తట్టకపోవు.

ఇదేదీ లేదనుకుంటే మరి భవిష్యత్తేమిటి? ఒక సమస్య ఏమంటే, సమాజంలోనే గాక ఆరోగ్యకరంగా ఆలోచించే జర్నలిస్టులలోనూ ప్రస్తుత మోడల్స్ రెండింటి పట్ల, ఆ రెండింటి కలయిక ఉత్పత్తి చేస్తున్న వికృత శిశువు పట్ల నిరసన విస్తృతంగానే ఉంది. కాని పిల్లి మెడలో గంట కట్టడం అట్లుంచి ఇంత వరకు గంట కోసం, తాడు కోసం వెతకడమైనా మొదలు కాలేదు. శిశుపాలుడు నూరవ తప్పు చేయలేదనుకుంటున్నారా? నూరవ తప్పుకు ముందే కృష్ణుని వద్ద చక్రం సిద్ధంగా ఉండలేదా? పైగా, 99వ తప్పు వరకైనా సహిస్తూ పోవాలన్న నిబంధన ఏమైనా ఉందా?

(రచయిత సీనియర్ జర్నలిస్టు) వీ

నరహంతకులే నేతలై దేశం దిగాలు

చట్ట సభలకు ఎన్నికయ్యే సభ్యుల చరిత్రను పరిశీలిస్తే సగానికి సగం మంది నేరస్తులే ఉన్నారనీ, వారు చట్టాలను తమ చుట్టాలుగా మార్చుకుంటున్నారనీ అంటున్నారు **డా. నూకతోటి రవి కుమార్**

మహారాష్ట్రలో సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులో నేరస్తుడిగా ఉన్న ఒకప్పటి గుజరాత్ హోంమంత్రి, ఇప్పటి బిజెపి అధ్యక్షులు అమిత్ షా ప్రధాని మోడీ పక్కన కూర్చుని స్వచ్ఛభారత్ గురించి మాట్లాడుతుంటే జనం విస్తుపోతున్నారు. ఈ కేసులో అటు గుజరాత్, ఇటు మహారాష్ట్రల్లో ఏకంగా 15 మందికి పైగా ఎస్‌పిలను ఈ నేరంలో ఇరికించిన చరిత్ర ఆయనకున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటుండగా, సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ సాక్షిగా ఉన్న అతని భార్య కౌసర్‌బీని సైతం చంపి దహనం చేసిన చరిత్ర గురించి అప్పట్లో పెద్దఎత్తున చర్చ జరిగింది. ఆ నివేదికలేమయ్యాయో, ఆ చర్చలు ఏమయ్యాయో కానీ, ఇప్పుడాయన ప్రధాని పక్కన చిరునవ్వుతో దేశ ప్రజలకు శాంతి సందేశాలిస్తున్నారు.

ఇక గోధ్రా అల్లర్ల సంగతి అందరికీ తెలిసిందే. బక్కచిక్కిన వామపక్షాల చరిత్ర పెట్టుబడిదారులకు మద్దతు ఇచ్చే క్రమంలో సన్నగిల్లిపోగా, దేశంలో లౌకికవాదస్పృహ అంతకంతకూ తగ్గుతున్నది. యుపిఎ పక్షాలూ, కాకుంటే ఎన్‌డిఎ పక్షాలూ చరిత్ర నిండా పారించిన అధికార దాహం కింద నెత్తుటిని రికార్డు చేసే చరిత్రకారులు తక్కువ అవుతున్నారు. ఈ క్రమంలోనే దేశ సంపదను సృష్టించిన భూమి పుత్రులను ఏకంగా మైదాన ప్రాంతాల నుంచే నెట్టేసి, కులంపేరుతో, మతం పేరుతో మరింతగా వివక్షకు గురి చేసేశారు. తీరా ప్రస్తుత మోడీ ప్రభుత్వ కనుసన్నల్లో ఇప్పుడు సొంత ఇంటికి రండి అంటూ స్వామీజీలు స్వాగతాలు పలుకుతుంటే సంపద సృష్టికర్తలు అసహ్యించుకుంటున్నారు. దేశీయత పేరుతో విదేశాలకు తలుపులు బార్లా తెరవడమే కాదు, గాంధీని హత్య చేసిన గాడ్సేని స్వామీజీలు అనుకుంటున్న ఆధ్యాత్మిక వేత్తలే నెత్తిన పెట్టుకోవడం చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు. దేశంలో నేరస్తులు, మత ఉన్మాదం కలగల్సిపోయి, చట్టసభలను నెత్తుటిమయం చేస్తున్న చరిత్ర మన కళ్ల ముందు బోర విరుచుకుని నడయాడుతోంది. ఇవేవీ తెలియనట్టు స్వచ్ఛభారత్ పేరుతో రోడ్లను మాత్రం ఊడుస్తూ, జీవితమంతా ఊడిగం చేస్తున్న తల్లుల చరిత్రను అపహాస్యం చేస్తున్నారు. మహిళల హక్కులను తొలి ప్రధాని నెహ్రూ నుంచి ఇప్పటి వరకూ మహిళా బిల్లుపై జరుగుతున్న రాద్ధాంతం ఏ రకమైన భావజాలానిదో మనకు అర్థం కావాలి.

చెరసాలల్లో మగ్గాల్సిన వాళ్లు చరిత్రకారులు కావడం, చరిత్ర నిండా ప్రవహించిన శ్రమజీవుల నెత్తుటి మీద రంగులు చిమ్మి దానిపై సంస్కృతి ఉన్మాదంతో బొమ్మలు గీస్తున్న వాళ్లు పాలకులు కావడం వల్లనే పుణ్యభూమి మనదేశం భంగపడుతోంది. అయితే, ఇది ఈ దేశ చరిత్రకు కొత్తకాదు. జైళ్లల్లో మగ్గాల్సిన వాళ్లు చట్టసభల్లో మహారాజులై పోతున్నారు. నరహంతకులే ధరాధిపతులై పోతున్నారు. హంతకులు, ఉన్మాదులు, పెట్టుబడిదారులు, సంపద పిచ్చితో ఊగిపోతూ అగ్రదేశాల పాలకుల మధ్య దేశాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారు. ఇంతేనా, స్విస్ బ్యాంకులో మూలుగుతున్న మూడొంతుల నల్లధనం మన దేశ సంపన్నులదేననడానికి కాదు, దేశం నేరస్తుల సామ్రాజ్యంగా దేశం వర్ధిల్లుతుందదానికి ఇంకెన్ని సాక్ష్యాలు కావాలి. స్విస్ బ్యాంకులో మూలుగుతున్న నల్లడబ్బు కుబేరుల జాబితాను బహిర్గతం చేస్తామన్న ఈనాటి పాలకులు పలికిన చిలక పలుకులు విని మనం మురుసుకున్నాం. ఈ విషయమై ఇప్పుడు జరుగుతున్న తాత్సారం చూసి సాక్షాత్తూ సుప్రీంకోర్టు సైతం విస్తుపోతున్నది. ఇప్పుడు ఊడ్వాల్సింది రోడ్లమీద చెత్తను కాదు, చట్టసభల్లో పెట్టుబడిదారుల ఆస్తులను పెంచే యావతో పెట్రేగిపోతున్న ఈ నేరస్తులను ఊడ్చి అండమాన్ జైళ్లల్లో వేస్తే తప్ప దేశానికి ముక్తి లేదు.

చెరసాలల్లో మగ్గాల్సిన వాళ్లను చట్టసభలకు పంపిస్తున్న విశాల హృదయం మన భారతీయులది. మన రాజకీయ పక్షాలది. రెండు దశాబ్దాలుగా మహిళా బిల్లుపై నేతల్లో ఏకాభిప్రాయం ఎందుకు రావడం లేదని మనం అలోచించం. దేశంలో నేరగాళ్లు రాజకీయ రక్షణతో పేట్రేగిపోతూ చేస్తున్న తీర్మానాలన్నీ దాని ఉసురు తీస్తున్నాయన్న సత్యాన్ని మనం పట్టించుకోం. చివరికిప్పుడు ఇటువంటి నేరస్తుల జాబితా పార్టీలలో, చట్టసభల్లో మూడొంతులకు వచ్చింది. నేరగ్రస్త రాజకీయాల విష కౌగిలిలోంచి భారత ప్రజాస్వామ్యానికి విముక్తి కలిగిద్దాం అనే నేతలు అంతకంతకూ కనుమరుగవుతున్నారు. న్యాయమూర్తుల సూచనలు పట్టించుకునే నాథుడే కాదు, లా కమిషన్, ఎన్నికల సంఘం ప్రతిపాదనలకూ మోకాలడ్డే మేతాజీలూ దునియాను దున్నేస్తున్నారు. క్రమంగా ప్రజాస్వామిక స్పృహ అంతరించిపోతున్నది. అందుకే దేశం అధోగతి పాలు అయిపోతున్నది.

అసెంబ్లీ, పార్లమెంట్ సభ్యులపై నేరాలు కోర్టు గడపలు దాటి అవి రుజువై శిక్షపడిన వెంటనే వారికి అనర్హత దోషం వర్తించాలంటూ సుప్రీంకోర్టు న్యాయమూర్తులిచ్చిన చారిత్రాత్మక తీర్పును స్వీకరించి, కేంద్ర ఎన్నికల సంఘం పాత ప్రతిపాదనలు చట్టంగా తీసుకొస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం ఇప్పుడు దాని ఊసే పట్టించుకోవడం లేదు. సరికదా, ఏకంగా పార్లమెంట్‌నే హిందూత్వ వాద ప్రచారానికి వేదికగా ఉపయోగించు కుంటున్నది. ఈ వైనం శీతాకాల సమావేశాల్లో స్పష్టంగా బహిర్గతమైంది. కనీసం అయిదేళ్ల శిక్షపడే కేసుల్లో, ఎన్నికల షెడ్యూలు వెలువడడానికి ఆర్నెల్ల ముందుగా మేజిస్ట్రేట్ నేరాభియోగాలు నమోదు చేసినట్టయితే, అటువంటి వ్యక్తులను ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా ప్రకటించాలని చాలా కాలం నుంచి ఎన్నికల కమిషన్ కోరుతున్నది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ఆర్నెల్ల ముందు అనే మాటని ఎన్నికల కమిషన్ ప్రయోగించడానికి కారణం అటువంటి నేరస్తులు చట్టసభల

గడప తొక్కకూడదనే. కానీ, విచిత్రంగా సదరు నేరస్తులు విచారణ సమయంలోనే ఎన్నికల సందర్భంగా తప్పుడు ప్రమాణ పత్రాలు (అఫిడవిట్లు) సమర్పించి చట్టసభల గడప తొక్కుతున్నారు. ఆనక తమ కేసు విచారణలను కోర్టు గడపలు ఎక్కకుండా అడ్డుకుంటున్నారు. నిజానికి ఇటువంటి వారికి శిక్షలు పెంచడంతో అసలు అనర్హత వేటు వేయాలన్నది ఎన్నికల సంఘం తాజా ప్రతిపాదనల సారాంశం. విచారణ సమయంలో న్యాయస్థానాలకు తప్పుడు సమాచారం అందించిన వారికి ప్రకటించిన ఆర్నెల్ల జైలు శిక్ష, జరిమానాలు ఏ మాత్రం ప్రభావవంతంగా లేవన్నది అటు ఎన్నికల సంఘం, ప్రజాస్వామిక వాదులు పేర్కొంటూనే ఉన్నారు. తాజాగా ఇసి సమర్పించిన సూచనలను, కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ లా కమిషన్ పరిశీలన కోసం పంపింది. సుప్రీంకోర్టు సూచనల మేరకు ఇప్పటికే ఈ రెండు కీలకాంశాల్నీ అధ్యయనం చేసిన లా కమిషన్ తన సిఫార్సులను విస్పష్టంగా ప్రకటించించింది. ఇక ఎటొచ్చీ చట్టసవరణల రూపేణా ప్రభుత్వపరంగా సరైన కార్యాచరణ మాత్రమే మిగిలి ఉంది. దీనిపై ఇప్పటి మోడీ ప్రభుత్వం ఇంకెన్ని మీనమేషాలు లెక్కిస్తుందో చూడాల్సిందే.

'బయట మనం తలెత్తి చూడడానికి సైతం సిగ్గుపడే వారితో భుజం, భుజం రాసుకుని తిరగాల్సివస్తున్నది' అని ఒకప్పుడు ఉపరాష్ట్రపతిగా పని చేసిన కృష్ణకాంత్ చట్టసభల్లో నేరస్తుల గురించి చెప్పి వాపోయారు. 1997లో మనదేశ స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా నేరగాళ్లను దూరం పెడతామంటూ 'అజెండా ఫర్ ఇండియా'ను ప్రకటించారు. కానీ, ఆ ప్రకటించిన యుపిఎ మాటకు కట్టుబడలేదు. కేవలం యుపిఎనే కాదు, అన్ని రాజకీయ పక్షాలూ నేరస్తులకు కొమ్ముగాశాయి. సమాఖ్య స్ఫూర్తిని ఏడడుగల గోతిలో పూడ్చేశాయి. అందుచేతనే ఇటీవలి మహారాష్ట్ర ఎన్నికల్లో పోటీ పడినవారిలో 34 శాతం మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉంటే, వారిలో 23 శాతం మందిపై నేరాభియోగాలు రుజువయ్యాయి. అయినా, సరే మన ప్రజలు వారిని చట్టసభల్లోకి దర్జాగా నడిపించారు. ప్రజాస్వామ్యానికి ఇది మరిన్ని ప్రమాద ఘటికలను కొనితెస్తున్నది.

ఇక, 2014 ఎన్నికల నేపథ్యంలో అసోషియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడిఆర్) వెలువరించిన ఒక నివేదిక మన దిమ్మ తిరిగిపోయే వాస్తవాలను బహిర్గతం చేసింది. దేశంలోని 543 మంది ఎంపిల్లో 186 మంది క్రిమినల్ కేసుల్లో ఉన్నారు. అంటే, పార్లమెంట్‌లో 34 శాతం మంది క్రిమినల్స్ ఉన్నారు. 2009 ఎన్నికల్లో వీరి సంఖ్య 158 ఉంటే, ఇప్పుడా సంఖ్య 186కు పెరిగింది. వీరిలో 17 మంది ఎంపిలు హత్య కేసుల్లో ఉన్నారు. ఇద్దరు ఎంపిలు అయితే మహిళల్ని అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. 16 మంది ఎంపిలు మత కల్లోలాలను దగ్గరుండి నడిపించారు. పది మంది దొంగతనం, డెకాయిటీ కేసులు ఎదుర్కొంటున్నారు. ఏడుగురిపై కిడ్నాప్ కేసులున్నాయి. కాగా ఈ క్రిమినల్స్‌లో ఎక్కువగా బిజెపికి చెందినవారే ఉన్నారు. 63 మంది బిజెపి ఎంపిలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. ఇక 1997 ఎన్నికల్లోనైతే మొత్తం 1,37,752 మంది అభ్యర్థులు శాసనసభ ఎన్నికల్లో పోటీ పడితే, వారిలో 1500 మంది అభ్యర్థులు క్రిమినల్స్. వీరిలో ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 520మంది ఉన్నారు. బీహార్‌లో 350 మంది ఉన్నారు. దేశంలోని 25 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 4722 మంది ఎంఎల్ఎలలో 700 మంది ఎంఎల్ఎలు క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

నిజానికి పదేళ్ల క్రితమే ఎన్నికల సంఘం ఎన్నికల అక్రమాలను అడ్డుకునేందుకు, నేరస్తులను ఇంటిబాట పట్టించేందుకు 22 కీలక సిఫార్సులను చేసింది. అసహ్యకరమైన రీతిలో నేరాభియోగాలను ఎదుర్కొంటున్న వ్యక్తులను ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉంచేందుకు కీలక సూచనలు చేసింది. ఎన్నికల సమయానికి తాను చేసిన ప్రతిపాదనలు కొలువు తీరాలని భావించింది. కానీ, విచిత్రంగా 2007 మార్చిలో సుదర్శన నాచియప్పన్ నేతృత్వంలోని పార్లమెంటరీ సంఘం ఎన్నికల సంఘం చేసిన ఆ సూచలన్నింటినీ చర్చకే రాకుండా నెట్టేసింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభానికి ఆరు నెలల ముందుగా నేరాభియోగాలు నమోదైన కేసుల్లో మాత్రమేనని స్వీకరించాలని కోరింది. దీంతో ఈసి దీనినే స్పష్టీకరించాల్సిన తప్పని పరిస్థితిని కల్పించారు.

అధికార పార్టీల ఒత్తిడులకు ప్రాసిక్యూషన్ సైతం లోబడిపోవడం ఒకవైపు మనం చూస్తూనే ఉండగా, నిందితులకు తమ వాదనలు సరిగ్గా వినిపించే అవకాశం లేకుండా నేరాభియోగాలు నమోదు చేయడం ప్రమాదమంటూ, ఇది ఆమోదయోగ్యం కాదు పొమ్మంది. ఇక, మళ్లీ 2010 డిసెంబర్‌లో నేరగాళ్ల రాజకీయరంగ ప్రవేశాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం, న్యాయ మంత్రత్వశాఖ ఉమ్మడి కృషి చేస్తాయనే చర్చలూ జరిగాయి. కానీ, అవీ ఫలించలేదు. గత్యంతరం లేని ఒక అనివార్యతగా నేరస్తులు ప్రజాస్వామ్య ప్రక్రియలోకి చొచ్చుకువచ్చారు. ఈ అనివార్యత లోంచే యుపిఎ నిష్క్రమించింది. విచిత్రంగా ఇప్పుడు మోడీ ప్రభుత్వం కూడా ఈ విషయమై నోరు మెదపడం లేదు. మంచి చేసే వారికి అండదండలు అందించేందుకు, చెడు చేసేవారి పని పట్టేందుకే ప్రభుత్వాలు ఉండాలని ఆ మధ్య బ్రిటిష్ ప్రధాని విలియం గ్లాడ్‌స్టోన్ విశ్లేషించారు. కానీ, దురదృష్టమేమిటంటే, మన దేశంలో నేరగాళ్లే నిర్ణయాధికార స్థానాల్లో తిష్టవేసుకుని ఉన్నారు. చట్టసభల్లో మఠం వేసుకుని కూర్చుని ఇందుకు సంబంధించి వచ్చే ప్రతిపాదనలన్నింటినీ దుంపనాశనం చేయడం వారి పనిగా మారింది.

ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 62 (5) ప్రకారం, జైలులో ఉన్నవారికి, లేదా, కేసుల సందర్భంగా నిర్బంధంలో ఉన్నవారికి వోటేసే అధికారం లేదని, ఓటు వేసే అర్హత లేనివారికి ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదని గత ఏడాది సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. అయితే, వోటు వేయడంపై నిషేధం ఉన్నప్పటికీ ఓటర్ల జాబితాలో పేరు నమోదై ఉన్న వ్యక్తి వోటరు కాకుండా పోడన్న అదనపు వివరణను ఆధారం చేసుకుని జైళ్లల్లో ఉన్నవారు బోర విరుచుకుని ఎన్నికల్లో పోటీ చేసే వెసులుబాటును యుపిఎ ప్రభుత్వం కల్పించి దేశ ప్రజలను వంచించింది. మంచి వారితో పోలిస్తే నేరగాళ్లే అసలు సిసలు గెలుపు గుర్రాలనే ధోరణి మన రాజకీయ పక్షాల్లో బాగా ప్రబలిపోయింది. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఈ తరహా తెంపరితనాన్ని మనం ఊహించలేం. మనం ఎప్పటికప్పుడు చట్టాలను కట్టుదిట్టం చేస్తున్నామను కుంటున్నాం. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండని ప్రజాప్రతినిధులను సాగనంపే బ్రిటన్ తరహా రీకాల్ బిల్లు మనదేశంలో లేదు. ప్రజా జీవనం లోని మంచివారిని ఎంపిక చేసుకోవడమూ ఇక్కడ లేదు. మంచివారిని ఎన్నికల్లో నిలబెట్టాలనీ పార్టీ అనుకోవడం లేదు. దుర్మార్గమైన నేరాలను చేసిన వారినీ ఎన్నికల ప్రక్రియ నుంచి తప్పించడం లేదు. ఎన్నికల సంఘం చేస్తున్న సూచనలనూ పట్టించుకోవడం లేదు. ఇక నేరస్తులైన వారితో అసెంబ్లీ, పార్లమెంట్‌లు నిండిపోయాకనా మనం మేలుకునేది? వీ

(ఫ్రీలాన్స్ జర్నలిస్టు, అధ్యాపకులు)

జర్మనీతో శాంతి కోసం లెనిన్ పోరాటం

మొదటి ప్రపంచ యుద్ధం ముగిసే సమయంలో ఏర్పడిన బోల్షివిక్ ప్రభుత్వ నేతగా లెనిన్ జర్మనీతో శాంతి కుదుర్చుకోవడానికి చేసిన ప్రయత్నాలను వివరిస్తున్నారు ఎన్.వి.ఎస్. నాగభూషణ్

ఎవరైనా శత్రువులతో పోరాడాలనుకుంటారు గానీ, మిత్రులతో కాదు గదా? అయితే మిత్రుల మధ్య కూడా పోరాటాలు ఉంటాయని, ఒక్కోసారి అవి తీవ్రస్థాయిలో కూడా సాగుతుంటాయని మార్క్సిస్టు అభిమానులకు విదితమే! సైద్ధాంతిక నిబద్ధత కోసం, శత్రువులతో సంఘర్షణ ఎలా తప్పనిసరి అవుతుందో, అలాగే మిత్రులతో కూడా ఘర్షణలు ఒకానొకప్పుడు తప్పని సరిగా మారతాయి. అయితే ఈ రెండు రకాల ఘర్షణలకూ ఉండే తేడా అల్లా ఏమంటే, పోరాడే రూపాల్లోనే! కానీ ఈ వైరుధ్యాలు తీవ్రమైనప్పుడు, మిత్ర వైరుధ్యాలు కూడా శత్రు వైరుధ్యాల రూపాన్ని తీసుకోవడం జరగవచ్చుననుకోండి! ఇంతకీ ఈ చర్చ అంతా ఎందుకంటే, శాంతి సంధికోసం లెనిన్ పడ్డ తపన ఏ రూపం తీసుకుందో చెప్పడానికే.

మొదటి సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం (1914-18) ఇంకా కొనసాగుతుండగానే, అందులో తీవ్రంగా నష్టపోయిన రష్యా, యుద్ధ పర్యవసానాల్లో భాగంగా రెండు విప్లవాలను చవి చూసింది. అందులో మొదటిది 1917 ఫిబ్రవరి 27న జరగ్గా, ఫలితం మిత్రమండలి రాజ్యాలతో రహస్య సంధుల ద్వారా కుమ్మక్కైన జార్ రెండో నీకలస్ పదవీ భ్రష్టుడు కావడం! ఈ పదవీభ్రష్టత ఇతగాడి సింహాసనచ్యుతికి మాత్రమే పరిమితం కాకుండా, మొత్తంగా దేశంలో రాచరిక పాలన అంతంగా పరిణమించడం గొప్ప ప్రజా విజయంగా భావించాలి! ఎందుకంటే, యావన్మంది జార్ చక్రవర్తులూ రష్యాని యూరప్‌లోనే అత్యంత నిరంకుశంగా పాలించారు మరి! ఇక రెండో విప్లవం అదే సంవత్సరంలో మరి కొద్ది నెలలకే జరిగిన అక్టోబర్ విప్లవం!

ఫిబ్రవరి విప్లవంలో జారిజాన్ని కూలదోశాక, రాజీవాద సోషలిస్టుల సహాయంతో అధికారాన్ని చేపట్టిన బూర్జువాలు, ప్రజలకు పలు వాగ్దానాలు చేశారు. ప్రజలందరికీ శాంతినీ, అన్నార్తులకు రొట్టెనీ, రైతాంగానికి భూమినీ ఇస్తామని చెప్పి కూడా, యుద్ధ కాంట్రాక్టుల ద్వారా వచ్చే అతీత లాభాల రుచిమరిగి, భూస్వాములతో కుమ్మక్కై, యుద్ధంలో మరింతగా కూరుకుపోయారు. తద్వారా ప్రజల్లో వచ్చిన తీవ్ర వ్యతిరేకతను అణచివేసేందుకు గాను సైనిక తిరుగుబాటు కూడా ప్రయత్నించారు. ఫలితమే అక్టోబర్ విప్లవం!

బోల్షివిక్‌పార్టీ ఆధ్వర్యంలో సాగిన ఈ విప్లవానికి నాయకత్వం వహించిన లెనిన్, ప్రపంచలోనే తొలిసారిగా తమదేశంలో కార్మిక, కర్షక రాజ్యాన్ని నెలకొల్పేందుకూ, దేశ ఆర్థిక వ్యవస్థను సోషలిస్టు వ్యవస్థగా శాంతి శాసనాన్నీ, భూమి శాసనాన్నీ ప్రకటించాడు. ఒక కొత్త రకమైన పాలనా విధానమైన సోవియట్ల (ఒక విధమైన ప్రజా కౌన్సిళ్లు) పాలనను ప్రవేశపెట్టాడు. విప్లవ ప్రభుత్వం ఏర్పడ్డ తొలిరోజుల్లో, దానికి ఆటంకాలు కల్పించిన చిన్న చిన్న తిరుగుబాట్లనూ, విచ్ఛిన్న చర్యలనూ తేలిగ్గా అణచి వేసి, సుస్థిరపాలన అందించేందుకు కృషి చేశాడు. ఆర్థిక వ్యవస్థపై బూర్జువాల పట్టును తొలగించి, శ్రామిక వర్గ పట్టును బిగించేందుకూ, జాతి, లింగ, ప్రాంత వగైరా వివక్షలను రూపుమాపేందుకు, ప్రపంచంలోనే తొలి చట్టాలను తీసుకొచ్చి, వాటిని అమలు చేయడానికి కృతనిశ్చయం తో పూనుకున్నారు. అలాగే బూర్జువా రాజ్యాంగ యంత్రం లోనూ మార్పులు తెచ్చి, సోషలిస్టు పాలనా యంత్రాన్ని నిర్మించడంలో నిమగ్నుడయ్యారు. ఈ విధంగా పాలనలో పట్టుబిగిస్తూనే, దేశాన్ని పట్టి కుదిపేసిన, ఇంకా సమూలంగా కుదిపేస్తూనే ఉన్న శాంతి సమస్య పరిష్కారంపై దృష్టి సారించాడు.

నిజానికి అధికారానికి వచ్చిన తొలిరోజే శాంతి శాసనాన్ని తీసుకుని వచ్చినప్పటికీ, యుద్ధమగ్న దేశాల్లో ఏ ఒక్కటీ రష్యా చేసిన యుద్ధ విరామ ప్రతిపాదనల పట్ల ఆసక్తి చూపలేదు. మరో పక్క, ఇంకా కొనసాగు తున్న యుద్ధం వల్ల దేశం నానాటికీ తీసికట్టుగా తయారవు తోంది. సమాజంలోని ఒక్క ఉన్నత వర్గం తప్ప ప్రతి సెక్షనూ, ముఖ్యంగా శ్రామిక వర్గం, రైతాంగం యుద్ధం వల్ల అతలాకుతలమైపోతుంది. ఎందుకంటే, సెక్షన్లలోని ప్రజలే ఎక్కువగా సైన్యంలో పని చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోనే గాక, మారుమూల గ్రామ ప్రాంతాల్లో కూడా యుద్ధంలో చనిపోని, లేదా అంగవైకల్యం చెందడమో, జబ్బుపడడమో లేని ఒక్క ఇల్లూ లేదంటే అతిశయోక్తి కాదు. సుదూర ప్రాంతాల్లోని యుద్ధ భూమిలో దాదాపు 90 లక్షల మందికి పైగా సైనికులు ఇంకా దుర్భర పరిస్థితుల్ని ఎదుర్కొంటూ, ఇక ఏమాత్రం వాటిని భరించలేని స్థితిలో ఉన్నారు. శత్రు సైన్యాల చేతుల్లో కన్నా, సరైన ఆహారం లేక, చలికి తగిన దుస్తులూ, బూట్లు లేక, జబ్బుపడి చనిపోయే వారి సంఖ్యే అధికంగా ఉన్నది. అక్టోబర్ విప్లవంలో పూర్వం నుండే యుద్ధభూమి నుంచి పారిపోయి వచ్చే వారితో రైళ్లన్నీ నిండిపోయేవి. అలా పారిపోయి రావడం అప్పటికీ కొనసాగుతూనే ఉంది.

అందువల్ల ప్రభుత్వం శాంతి శాసనానికి అనుగుణంగా మిత్ర రాజ్యాల రాయబారులకు శాంతి ప్రతిపాదనలతో లేఖలు రాయడమే గాక, సర్వసైన్యాధిపతిగా 'దుఖోనిన్'కు టెలిగ్రాం పంపిస్తూ, శత్రు సైనిక అధికారులతో శాంతి సంభాషణలు ప్రారంభించాల్సిందిగా కోరింది. అయితే ఇందుకు మిత్రరాజ్యాల రాయబారులు అంగీకరించక పోవడమే గాక, రష్యన్ ప్రభుత్వ చర్య, తమ రాజ్యాలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించేట్లుగా ఉన్నదనీ, ఒకవేళ రష్యా జర్మనీతో విడిగా శాంతి ఒప్పందం గనుక చేసుకుంటే, ఫలితాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించాయి. అయితే వీరిలా హెచ్చరించడాన్ని నిరసిస్తూ రష్యా

ప్రభుత్వం, అది తమ అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవడమేననీ, అంతేగాక జార్ చేసుకున్న ఒప్పందాన్ని నూతన ప్రభుత్వం అమలు చేయాల్సిందని ఒత్తిడి చేయడమేననీ పేర్కొంది. అయితే ప్రభుత్వ ఆజ్ఞల్ని నేరవేర్చాల్సిన సైన్యాధిపతి దుఖోనిన్ విద్రోహబుద్ధితో విప్లవ ప్రభుత్వాన్ని తాను గుర్తించడమే లేదన్నట్లు ప్రవర్తించేసరికి, ప్రభుత్వం టెలిగ్రాం ఉత్తర్వుల ద్వారా దుఖోనిన్‌ని డిస్మిస్ చేసి, కొత్త సైన్యాధిపతిని నియమించడం, ఇంకా ధిక్కార స్వరాన్ని వినిపిస్తూనే ఉన్న దుఖోనిన్‌ని సైనికులే మరణదండన విధించడం చకచకా జరిగిపోయింది.

శాంతి ఒప్పందానికి మిత్ర రాజ్యాలు కలిసిరాని ఈ పరిస్థితుల్లో, తన ముందున్న కర్తవ్యం జర్మనీతో, దాని మిత్ర రాజ్యాలతో శాంతి సంప్రదింపులు జరపడం ఒక్కటే మార్గం నిశ్చయానికి లెనిన్ వచ్చాడు. అందువల్ల ఆ రాజ్యాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపేందుకు రష్యన్ ప్రతినిధి వర్గాన్ని 'బ్రెస్ట్ – లితోవ్‌స్క్' కు పంపించాడు .అది 1917 నవంబర్ 19న జర్మన్, దాని మిత్ర పక్షాల ప్రతినిధులతో సమావేశమై, డిసెంబర్ 2న షరతులతో కూడిన యుద్ధ విరమణ సంధి మీద సంతకాలు చేసింది. ఆ షరతుల్లో ముఖ్యమైనవి ఏమంటే, 1. శాంతి సంధి కాన్ఫరెన్స్ జరపడం. 2. ఒక పక్షానికి శాంతి ఇష్టం లేనప్పుడు, ఏడు రోజుల ముందు రెండో పక్షానికి హెచ్చరికలు చేసి, యుద్ధ చర్యలు ప్రారంభించవచ్చునని అంగీకరించడం.

పై షరతుల ప్రకారం శాంతి సంధి కాన్ఫరెన్స్ 1917 డిసెంబర్ 9న బ్రెస్ట్ – లితోవ్‌స్క్‌లో ప్రారంభమైంది. దానికి సోవియట్ ప్రతినిధి వర్గమూ, నాలుగు రాజ్యాల కూటమి (జర్మనీ, ఆస్రో – హంగరీ, బల్గేరియా, టర్కీ) ప్రతినిధి వర్గాలూ హాజరయ్యాయి. కాన్ఫరెన్స్ మొదటి సమావేశంలోనే సోవియట్ ప్రతినిధి వర్గం శాంతి సంధి షరతుల గురించి ఒక ప్రకటన చేసింది. అందుకు అనుగుణంగా 1918 జనవరి 5న నాలుగు రాజ్యాల కూటమి ప్రతినిధులు, తమకు రష్యా దేశానికి చెందిన ఏయే భూ భాగాలను కలపాల్సిందీ తెలిపే తమ ప్రభుత్వాల డిమాండ్లను సోవియట్ ప్రతినిధి వర్గానికి అందజేశాయి. ఈ డిమాండ్ల ప్రకారం రష్యా అంతకు ముందు యుద్ధంలో ఆక్రమించుకున్న ప్రాంతాలన్నింటినీ ఖాళీ చేయాల్సిరాగా, జర్మనీ మిత్ర పక్షాలు రష్యాలో ఆక్రమించుకున్న ప్రాంతాల్ని మాత్రం వారికే ఒదిలేయాలి. దీని ప్రకారం దాదాపు 1,50,000 చదరపు కిలోమీటర్ల భూభాగం జర్మనీకి, దాని మిత్ర పక్షాలకీ ఇచ్చేయాలి. అంతేగాక నష్టపరిహారంగా దాదాపు 300 కోట్ల రూబుళ్లను (ఖైదీల ఖర్చు పేరుతో) ను కొద్ది సంవత్సరాల్లో రష్యా చెల్లించాలి.

ఈ షరతులు అత్యంత దోపిడీ స్వభావం కలిగినవే అనడంలో సందేహం లేదు. అయితే అవి ఆ భూభాగాల్ని అప్పటికే ఆక్రమించుకుని ఉన్నాయి. మరోపక్క యుద్ధాన్ని కొనసాగించే పరిస్థితుల్లో రష్యా లేదు. దాని ఆర్థిక స్థితి విధ్వంసమై ఉంది. యుద్ధ శ్రేణులు కూలిపోతున్నాయి. సైన్యాలు యుద్ధ శ్రేణుల్ని వదిలి పారిపోతున్నాయి. యుద్ధం పట్ల దేశమంతా విసుగు చెంది ఉంది. ఇలాంటి విషమ పరిస్థితుల్లో యుద్ధాన్ని కొనసాగించడమంటే, కొత్తగా ఏర్పడ్డ సోవియట్ రిపబ్లిక్ ఉనికికే ప్రమాదం కలిగించడమవుతుంది. యుద్ధంలో బలహీనమైన పాత సైన్యం పోరాటానికి సిద్ధంగా లేదు. కొత్తగా సైన్యాన్ని రిక్రూట్ చేసుకునే పరిస్థితి లేదు. సైన్యం లేకుండా యుద్ధాన్ని కొనసాగించడమంటే, దేశ సార్వభౌమత్వానికే భంగం కలిగించడం! అందువల్ల ఎంత భారం అయినప్పటికీ, పరభక్షణాత్మకమే అయినప్పటికీ, శాంతి షరతుల్ని ఆమోదించడమేమేలని లెనిన్ భావించాడు. ఆ విధంగా కొంత విరామ సమయాన్ని చేజిక్కించుకుని, పొత్తిళ్లలోని శిశువైన సోషలిస్టు రష్యాను రక్షించుకోవడంతో పాటు, దాని అధికారాన్ని పటిష్టం చేసి, కార్మిక వర్గ విప్లవ లాభాల్ని నిలుపుకొని, కార్మికులకూ కర్షకులకూ సామ్రాజ్యవాద యుద్ధ బీభత్సాల నుండి కొంత విశ్రాంతి ఇవ్వాలని తద్వారా విప్లవ లాభాల్ని సంరక్షించగలిగే కొత్త కార్మిక, కర్షక సైన్యాన్ని సృష్టించుకొని, ఆపై రాగల యుద్ధానికి (ఇతర సామ్రాజ్యవాద దేశాలు ఎలాగూ సోవియట్ ప్రభుత్వానికి విశ్రాంతినివ్వవు) సన్నద్ధం కావాలని ఆయన ఉద్దేశించాడు. సోవియట్ అధికారాన్ని బలపరిచే రెడ్‌ఆర్మీని సృష్టించడానికి అలాంటి వ్యవధి ఎంతైనా అవసరం.

అయితే సాఫీగా జరిగిపోవలసిన ఈ వ్యవహారాన్ని సమయం కోసం కాచుకొని ఉన్న పార్టీలోని, పార్టీ బయటగల ఆయన ప్రత్యర్థులు, అత్యంత జటిలం చేశారు. శాంతి సంధి షరతుల్ని ఆమోదించి, సంతకాలు పెట్టాలన్న ఆయన, ఆయన అనుచరులకూ దురుద్దేశాలు అంటగట్టి, దేశంలోనూ, పార్టీలోనూ తీవ్ర దుమారం లేపారు. విప్లవ ప్రతిఘాతకులైన మెన్షివిక్కులూ (బోల్షివిక్కులకు వీరు దాయాదులు), సోషలిస్టు రివల్యూషనరీ లూ, వీరికి జత కలిసిన వైట్ గార్డులూ ఈ సంధిని వ్యతిరేకిస్తూ విపరీత దురావేశంతో దుష్ప్రచారాన్ని కొనసాగించారు. సంధి సంప్రదింపుల్ని భగ్నంచేసి, జర్మన్‌లు దాడిచేసేట్లు రెచ్చగొట్టడమే వీరి ఉద్దేశం! బలహీనం గా ఉన్న నవజాత శిశువైన విప్లవ ప్రభుత్వాన్నీ, కార్మికులూ, రైతులూ కలిసి సంపాదించిన విజయాల్నీ భగ్నం చేయడమే వీరి ఆశయం!

ఈ దుష్ట పన్నాగంలో వీరికి ట్రాట్స్కీ, అతని సహచరులతో పాటు, జత కలిసిన వారు బుహారిన్, రాడెక్, ప్యాతకొవ్‌లూ, వీరి సహచరులూ. చివరి ఈ ముగ్గురు 'వామపక్ష కమ్యూనిస్టుల'నే పేర ఒక ముఠాను స్థాపించి, ట్రాట్స్కీ అండదండలతో పార్టీలో లెనిన్‌కు వ్యతిరేకంగా తీవ్ర పోరాటం మొదలెట్టారు. ఈ ముఠా నాయకుడైన బుహారిన్, పార్టీ మహాసభలో లెనిన్‌కు వ్యతిరేకంగా పోటీ నివేదిక నివ్వడమే గాక, తాత్కాలికంగా మాస్కో కమిటీలో మెజారిటీ మద్దతును సంపాదించి, పార్టీలో చీలికకు కూడా ప్రయత్నించాడు. పెట్రోగ్రాడ్ కమిటీ పత్రిక ద్వారా వ్యతిరేక ప్రచారం నిర్వహించారు. ఇలాంటి దుందుడుకు పద్ధతుల ద్వారా పార్టీలో లెనిన్ వ్యతిరేక పోరాటాన్ని తీవ్ర స్థాయికి తీసుకెళ్లారు.

'జర్మనీతో శాంతి వద్దు, యుద్ధం వద్దు' అంటూ ట్రాట్స్కీ అదే సమయంలో ప్రమాదకరమైన, దేశ భద్రతకే ముప్పు కలిగించే తప్పుడు నినాదాన్ని లంకించుకున్నాడు. సైన్యాన్ని ఉపసంహరించుకోవాలనీ, జర్మన్ల గొంతెమ్మ కోర్కెల్ని తీర్చేరీతిగా శాంతి సంధి కుదుర్చుకోరాదనీ అతడు ఒక విచిత్రమైన వాదనను లేవదీశాడు. విదేశీ వ్యవహారాల కమిస్సార్‌గా ఉన్న ఇతడు, బాధ్యతగా వ్యవహరిస్తూ దేశానికి ఎదురైన ముప్పును నివారించడంలో లెనిన్‌కు సహకరించాల్సింది పోయి (ప్రధానిగా లెనిన్ పని చేస్తున్నాడు) మంత్రి మండలి నిర్ణయాలకూ, పార్టీ అభీష్టానికి విరుద్ధంగా, శాంతి సంధిపై సంతకాలు చేయడానికి వెళ్లి కూడా, సంతకాలు పెట్టకుండా తిరిగి రావడమే గాకుండా, సైన్యాల్ని పోరాట స్థలాల నుండి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించి, జర్మన్లకు దేశ ద్వారాలు బార్లా తెరిచాడు.

(ఇంకా ఉంది)

(రచయిత సామాజిక కార్యకర్త, లెనిన్ జీవిత పరిశోధకులు) వీ

మానవాభివృద్ధి అంటే ఏమిటి?

మానవాభివృద్ధి సాధించాలంటే ప్రధానంగా ప్రజల మౌలిక అవసరాలు తీర్చాలనీ, ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా నిర్దేశించుకున్న ఆదేశిక సూత్రాలను అమలు చేయాల్సిన అవసరముందనీ అంటున్నారు విద్యాభూషణ్

'వెనకటికి ఒకరు పిచ్చి ముదిరి, తలకి రోకలి చుట్టమన్నట్టు' ఇలా ఉంది నేటి మన పాలకుల పరిస్థితి. ఆర్థిక సంస్కరణల అమలు తీవ్ర స్వరానికి చేరేనాటికి అసలు 'మానవాభివృద్ధి' అర్థాన్ని తలకిందులు చేసి పారేశారు. 'అభివృద్ధి' అంటే ఫ్లైవోవర్లు, జాతీయ రహదారుల విస్తృతి, ఆకాశ హర్మ్యాల నిర్మాణం, పంట భూముల స్థానంలో ఆర్థిక మండళ్ల ఏర్పాటు, సేద్యాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తి నుంచి దారి మళ్లించి పండ్ల – పూల పెంపకాన్ని ప్రోత్సహించడమే కాకుండా, మొత్తానికి సేద్యాన్ని సంప్రదాయ విధి విధానాల నుంచి, విదేశీ విత్తనాల, రసాయన ఎరువుల వినియోగానికి నెలవులుగా, ఓ జూదంగా మార్చేశారు. చిన్న – సన్నకారు రైతాంగానికి అలవికాని యాంత్రిక విధి విధానాలను ప్రోత్సహించ ప్రారంభించారు. ఫలితంగా పల్లెలు ఖాళీ అయి నగర ప్రాంతాలకు వలసలు పెరిగాయి. ఇక నగరాల్లో ఉపాధి అంటే కాంట్రాక్టు కూలీలు అనే భావనను సుస్థిరం చేశారు.

ఎన్నో ఉద్యమ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కుల్ని (బాహాటంగా) కాలరాసేశారు. పబ్లిక్ రంగ సంస్థల్ని, ప్రైవేట్ పరం చేస్తూ అన్ని రంగాల్లోనూ ప్రైవేట్ వ్యక్తులకే పట్టం కట్టారు. ఈ ప్రక్రియలో దేశ ప్రజలందరీ హక్కైన జాతీయ వనరుల్ని నచ్చిన వ్యక్తులకు ధారాదత్తం చేయడం ఆరంభించారు. ఇంత చేసినా అనుకున్న స్థాయిలో ఆర్థిక సంస్కరణల అమలు జరగడం లేదనే పై వాటి వ్యాఖ్యలకు కట్టుబడి రాజ్యాంగాన్ని – చట్టాలను మార్చేయాలనే సాహసానికి ఒడిగడుతున్నారు. ఇందులో వీరు – వారు అనే భేదం లేదు. అన్ని పార్టీలదీ ఒకే ఎజెండా. సంస్కరణల అమలును వేగవంతం చేయాలి. దేశీయ వనరుల్ని దేశ – విదేశీ శక్తులకు ధారాదత్తం చేసేయాలి. వారి నీడన సేద తీరాలి. ఇదే తారకమంత్రం అందరి నోటా. దీన్ని ప్రతిఘటించాల్సిన శక్తులు మాత్రం స్వల్ప భిన్నాభిప్రాయాలతో ముక్కలు చెక్కలై ఈ పరిస్థితుల్ని వినోద భరితంగా చూస్తున్నారు మరి.

ఇలా యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ, సామాన్యుడు మాత్రం తన ఏకైక ఓటు సాధనాన్ని మాత్రం అన్ని వేళలా అధికార పాలక వర్గానికి వ్యతిరేకంగా, ప్రతిపక్ష నేతలకే పట్టం కడుతున్నారు. ఎన్నికల ప్రచార హోరులో వారిచ్చిన హామీలను నమ్మి, ఇలా ప్రతిపక్ష – అధికార పక్షాల ఒరవడి కొనసాగింపులో 'ఆర్థిక సంస్కరణలు' మాత్రం చాపకింద నీరులా విస్తరించేస్తూ, సామాన్యుడిని చుట్టు ముట్టేస్తున్నాయి. చివరకు అధికార – ప్రతిపక్షాల జంట గొంతులో ఏకగీతికయిన సంస్కరణల వెల్లువ 'అభివృద్ధి' అర్థాన్నే మార్చేసి, 'అభివృద్ధి'ని కాసుల భాషలో కొలవడం ఆరంభించాయి. ఈ నేపథ్యంలో అసలు 'అభివృద్ధి' అదే 'మానవాభివృద్ధి' అంటే ఏంటో చూద్దాం!

ఎనభై దశకం వరకూ కాస్తో – కూస్తో 'ప్రజాస్వామ్య అభివృద్ధి' ఈ దేశంలో బతికి బట్టకట్టగలిగింది. ప్రభుత్వ రంగ విస్తరణతో పాటు ప్రధాన వ్యవసాయ రంగంలో హరిత విప్లవం వంటివి చోటు చేసుకుని రత్నగర్భకు వన్నె తెచ్చాయి. తదనంతరం పాలకుల మెదళ్లలో మెదిలిన సంస్కరణల వెర్రి దశ తిరోగమనానికి నాంది పలికింది. హరిత విప్లవ కొనసాగింపుకు బ్రేక్ పడింది. సేద్యంలో యాంత్రీకరణ, విద్యా విధానంలో మార్పు, పారిశ్రామిక రంగంలో ప్రైవేటీకరణ, ఉపాధి కల్పన స్థానే ఉపాధి హామీ చోటు చేసుకుని, సామాన్యుడి జీవనాన్ని పాలకుల సంక్షేమానికి బలి పెట్టడం జరిగింది. విధి విధానాలన్నీ హామీలై కాలాన్ని నెట్టుకు రావడంతో 'అధికారం' కుర్చీలాటగా మారిపోయింది. రాజకీయానికి విధి విధానాల కన్నా అధికారమే కీలకమైంది. ఇందుకు ఎవరు మినహాయింపు కాదు. అందరిదీ ఒకటే బాట. కాస్త కుడి – ఎడమగా తేడా అంతే. దీంతో సంస్కరణల అమలు నల్లేరు మీద బండిలా సాఫీగా సాగిపోసాగింది.

మన రాజ్యాంగం మనకు నిర్దేసించిన 'మానవాభివృద్ధి'లో ప్రధాన అంశాలు ఏంటో చూద్దాం. సగటు ఆయుర్దాయం, దేశంలో పిల్లల అక్షరాశ్యతా శాతం, దేశ ప్రజలందరికీ రక్షిత మంచినీటి సరఫరా (ఈ విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సైతం జోక్యం చేసుకుంది) ఇక అందరికీ ఆరోగ్యం, దీనిలో భాగంగానే శిశు మరణాల రేటు, ఇందులో మళ్లీ ఐదేళ్లలోపు బాలల మరణాల రేటు ప్రసూతి మరణాలరేటు, పేదరికంతో మధ్యలోనే బడి మానేస్తున్న బాలల శాతం, బాల కార్మికుల శాతం వంటివి కీలకాంశాలు. ఈ అంశాలన్నింటిలో గత డెబ్బై ఏళ్ల పాలన, సాధించిన ప్రగతి చాలా పేవలం. నేటి ఆర్థిక సంస్కరణల ఉనికిలో ప్రగతిని బేరీజు వేసుకున్నప్పుడు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, సింహళంల కంటే మనం వెనుకబడే ఉన్నాం. ఇక మనరాష్ట్ర విషయాని కొస్తే ఇతర దేశాలతో పోల్చినప్పుడు మనదేశం ఎలా ఉందో, ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మనరాష్ట్రం అలానే ఉంది. ప్రపంచబ్యాంకు మన్ననలకు ఉబ్బి తబ్బిబ్బయిన సిఇఒల పాలన, పై కీలకాంశాల అన్నింటిలోనూ తిరోగమనాన్నే నమోదు చేసింది. నిరుద్యోగం స్థానంలో శాశ్వత ఉపాధి కాకుండా, కూలి దినాల సంఖ్యాధారమైన 'ఉపాధి' హామీ సేద్యం భారమై బడుగు రైతు ఆత్మహత్యలు, శిశు మరణాల వృద్ధి, అందరికీ ఆరోగ్యం స్థానంలో కార్పొరేట్ ఆరోగ్యం, ప్రాథమిక విద్య స్థాయిలోనూ కార్పొరేట్ విద్యా సంస్థలు వేళ్లూనుకొని మధ్యలో చదువాపేసిన బాలల సంఖ్య పెరిగింది. బతుకు భారమై చదువాపేసిన ఈ పేద బాలలు బాల కార్మిక వ్యవస్థకు సమిధలైపోయారు. వెట్టి చాకిరి వేళ్లూనుకొంది. పేదల బతుకుకు ఆసరానిచ్చిన పౌర పంపిణీ వ్యవస్థకు మంగళం పాడేశారు. సమగ్ర శిశు అభివృద్ధి – ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నామ మాత్రమై, మలేరియా – కలరా వంటి సంప్రదాయ

రోగాలకు గ్రామీణ ప్రాంతాలు నెలవైపోయాయి. వ్యవసాయ రుణాలు అధికార హయాంకు పరిమితమై, 'అభివృద్ధి' ప్రాంతీయ అసమానతలకు కీలకమై పోయింది.

అయితే భిన్న సంస్కృతులు, వెనుకబాటు తనానికి ఆలవాలమైన మన వర్గ సమాజంలో, దళితులు – స్త్రీలు, చిన్న – సన్నకారు రైతాంగం పరిపూర్ణమైన అవ్యవస్థీకృత రంగానికి లోబడి, పైన పేర్కొన్న నిర్దిష్టాంశాలు తీవ్ర ప్రభావాన్నే చూపాయి. ఆ ప్రభావం ఏ మేరకంటే, వారి వారి ప్రాథమిక అవసరాలనే కాలరాసే స్థాయిలో మరో మాటలో చెప్పాలంటే వారి ప్రాథమిక హక్కులనే హరించి వేశాయనవచ్చు. అది ఎలా అంటే? మన రాజ్యాంగం మూడో అధ్యాయంలో 'ప్రాథమిక హక్కులు' పొందుపర్చబడ్డాయి. వాటిలో మొదటిది సమానత్వహక్కు. ఇన్ని అంతరాల దొంతరల్లో ఎక్కడదీ సమానత్వం? దీనికనుబంధంగా మానవాభివృద్ధికి సంబంధించిన సూచికలను రాజ్యాంగం నాలుగో అధ్యాయంలో 'ఆదేశిక సూత్రాలు'గా జోడించారు. ఇది రాజ్యాంగం 42వ సవరణతో 1976లో ఉనికిలోకి వచ్చినా ఆచరణలో శూన్యం. ఇందులో మన సంస్కృతి విలువలన్నీ, ప్రజలందరి పట్ల సోదర సమానత్వాన్ని, జాతీయ వనరులను అభివృద్ధి పరుస్తూ రక్షించాలని, ప్రజా సంపదను కాపాడాలని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ ఆచరణ తద్భిన్నం. జాతీ సంపదను పోటీపడి విదేశీయులకు ధారాదత్తం చేస్తున్నారు. మానవత్వాన్ని, శాస్త్రీయ అవగాహనను పెంపొందించాలంటే కేవలం ఓ మత ప్రాతిపదికన అశాస్త్రీయాన్ని 'శాస్త్రీయం' అని నమ్మబలుకుతూ రాజ్యాంగ శీర్షికలోని సెక్యులరిజాన్నే ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ప్రజాస్వామ్యం పేరిట జరుగుతున్నదే మూడో అధ్యయంలోని ప్రాథమిక హక్కుల అర్థాన్ని పరమార్థాన్ని విస్తరిస్తూ, నాలుగో అధ్యాయంలోని ఆదేశిక సూత్రాలను 'ప్రాథమిక హక్కులు'గా దేశ అత్యున్నత న్యాయ స్థానం నిర్దేశించింది. అయినా ఇంతటి బహిరంగ ధిక్కరణ.

అందరికి విద్య! ఇది ఆదేశిక సూత్రాల్లో పొందపరిచినప్పటికీ, 21వ అధికరణంలోని ప్రాథమిక హక్కుల్లో ఒకటిగా చేరింది. ఈ 21వ అధికరణంలో సుస్పష్టం చేసిన జీవించే హక్కులోని మౌలిక అంశాలన్నీ మానవ అవసరాలే. అవి ఏమిటంటే, విద్య, జీవనోపాధి, ఆవాసం మొదలైనవన్నీ. జీవనోపాధి అంటే పనిహక్కు. ప్రతీ ఒక్కరికీ 'పని' కల్పించి, శాశ్వత ఉపాధి ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అదీ నాడు ఉపాధి హామీ పేరిట కూలీదినాల లెక్కలకు పరిమితమై పోయింది. అయితే ఈ పని హక్కు ఓ ప్రాథమిక హక్కే. కానీ ఆచరణలో ఇదీ వరస.

ఈ ప్రాథమిక హక్కులను గుర్తించి, వాటి ప్రాధాన్యతలను ప్రజల ముందుంచి వాటిని సాధించుకునే వాతావరణం కల్పించడం బుద్ధిజీవుల బాధ్యత. కానీ సరళీకరణ – ఈ బుద్ధిజీవుల బాధ్యతను పరాయికరణం చేసేసింది. విలువల అంతరం పెరిగిపోయి, మేము వాటి ప్రభావానికి అతీతులం కామన్న భావనను కల్పించేసింది. అయినా ఎక్కడో ఏదో ఆశ నిన్నటి నేపథ్యంలో 'మానవాభివృద్ధి'కి కీలకమైన ఈ అంశాల అమలును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్షించి, తగు కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంది. ఆరోగ్యం – విద్య ప్రజలందరికీ వర్తించేలా ముందు చూడాలి. ఇందుకనుబంధమైనది పోషకాహార భద్రత. ఇది ప్రధానంగా పేద స్త్రీలకు అత్యంత కీలకం. గర్భదారణ, శిశుపోషణలో కీలకమైంది. జన్మనిచ్చేందుకే కాకుండా బిడ్డ ఆరోగ్య ఎదుగుదలకూ ప్రధానమైంది. బిడ్డ పుట్టినప్పటి నుండి మూడేళ్ల వయసు వరకూ ఇది తల్లి – బిడ్డలకు అత్యంత ఆవశ్యకం. ఆ తరువాత, వ్యవసాయం, ఆహారోత్పత్తి, ఆరోగ్యం, సమగ్ర శిశు అభివృద్ధి పథకాలు, 'మానవాభివృద్ధి'లో అత్యంత ప్రధానమైనవి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జనాభా దామాషాలో ఏర్పాటు ఇందుకు దోహదపడుతుంది. వీటితో ప్రాథమిక విద్య ఉపాధి కల్పన ప్రాముఖ్యత అంశాలే. అయితే ఇవన్నీ చేయాలంటే ఏం చేయాలి?

ఇవన్నీ రాజ్యాంగబద్ధమైనవే. అలవికానివి కావు. ప్రజాహితాన్ని కోరుకుంటే అన్నీ ఆచరణకు సాధ్యమైయేవే. ఇందుకు ఎజెండాను మార్చుకోవాలి. దేశభక్తియుత, (భుక్తియుత స్థానే) శక్తులుగా యోచించాలి. స్థానిక సంస్థలకు అధికార వికేంద్రీకరణను వీలు కలిగించే రాజ్యాంగ 73, 74 సవరణలను సత్వరమే అమలు చేయాలి. సంప్రదాయిక విధి విధానాలను పరీక్షిస్తూ వికేంద్రీకృత వ్యవసాయ విధానాలను విస్తృత పరచాలి. యాంత్రీకరణ విధానాలకు స్వస్తి చెప్పాలి. దుర్భిక్షాన్ని అధిగమించే సంప్రదాయ సేద్యపు విధానాలపై పరిశోధనలను ప్రోత్సహించాలి. పౌర పంపిణీ విధి విధానాన్ని మెరుగుపర్చి, రాగి, జొన్న వంటి ధాన్యాలనూ పంపిణీ చేయాలి. ఈ పంటలకూ వరి పంట మాదిరిగా గిట్టుబాటు ధరలను ప్రకటించాలి. భూగర్భ జల దుర్వినియోగాన్ని నిరోధించాలి. జల వనరులను రక్షించుకోవాలి. ఉపాధి హామీ వేతనంలో పోషకాహారాన్ని భాగం చేయాలి. అంటే వేతనంలో సగం మేరకు ఆహార ధాన్యాలను పంపిణీ చేయాలి. కార్మికుల వేతనాలను కనీసం జీవన వ్యయానికి సరిపోయేలా నిర్దేశించాలి. రాజ్యాంగంలోని 43వ ఆర్టికల్‌కు అనుగుణంగా మెరుగైన జీవన స్థాయిలో నిర్ణయించాలి. మానవాభివృద్ధిని సమూలంగా కబళించే 'ఆకలి'ని నిర్మూలించాలి. అదే పేదరికాన్ని ఇక అందరికీ 'విద్య'ను అందించేలా సత్వర చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ విద్యకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలి. విద్యా రంగం కేటాయింపులను జాతీయోత్పత్తిలో ఆరు శాతానికి పెంచి, అందులో సింహ భాగాన్ని ప్రాథమిక విద్య/ ప్రాథమికోన్నత విద్యకు కేటాయించాలి, నైపుణ్యతను పెంచే దిశగా విద్యను విస్తరింపచేయాలి. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకు పౌర పంపిణీ, సమగ్ర శిశు అభివృద్ధి పథకాలను వర్తింపచేస్తూ, ప్రజా ఆరోగ్యాన్ని అందజేయాలి.

ఇక రైతాంగ విషయానికొస్తే పేద రైతులకు, వ్యవసాయ కార్మికులకు సంస్థాగత రుణాలను గరిష్ట స్థాయిలో కేటాయించాలి. పేదలందరికీ గృహ వసతిని అందివ్వాలి. పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి. కానీ మన ప్రభుత్వాలేమో పేదలకు సైతం అపార్ట్‌మెంట్లను, డూప్లెక్స్ ఇళ్లను ఇస్తామంటుంది. ఇస్తే – గిస్తే పెరటి తోటల పెంపకం ఎలా? ప్రజారోగ్య విస్తృతిలో వైద్యులను – సహాయక సిబ్బంది జనాభా దామాషాలో నియమిస్తూ వృత్తి పట్ల అంకిత భావం నెలకొనే తరహాలో ప్రోత్సాన్నివ్వాలి. ఈరోజున తొమ్మిది మంది డాక్టర్లకు, ఆరుగురు మాత్రమే సహాయ సిబ్బంది ఉన్నారు. ఈ స్థాయిని ఒక డాక్టరుకు కనీసం ముగ్గురు సహాయ సిబ్బంది ఉండేలా చూడాలి. గిరిజన గ్రామాల్లో వ్యాధి నిరోధక హక్కుకు హామీనివ్వాలి. ఈ వివరణను అంతటిని సూక్ష్మీకరిస్తే ఇదో ఉదాహరణ.

ప్రభుత్వం ఓ నగరానికి సమీపంగా ఉన్న పల్లెకు రహదారిని నిర్మించి రవాణా సౌకర్యం కల్పించిందనుకోండి. రహదారి నిర్మాణం – రవాణా

ఆదివాసులను చీకటి మయం చేస్తున్న బాక్సైట్

***పోరాడి సాధించుకున్న అటవీ హక్కులను సైతం హరించి, పిడికెడు మంది సంపన్నుల కోసం ఆదివాసులను నిర్వాసితులను చేసి, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న పాలకులను సంఘటితంగా ఎదుర్కోవాలంటున్నారు* కొర్ర జ్యోతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ జిల్లా ఏజెన్సీ (మన్యం) 60,293 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, 11 మండలాలు, 244 పంచాయితీలు, 3,574 గ్రామాలు, 6,00,500 మంది ఆదివాసులు పచ్చని కొండలు, జలజల పారే నీరు (ప్రకృతి) నడుమ జీవనం సాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో రాజ్యం ఉంది, పాలనా ఉంది, రాజ్యాంగం ఉంది. అయినా ఆదివాసులు నాగరికతకు ఆమడ దూరంలో బతుకుతున్నారు. కేవలం శ్రమతో, కాలం తెచ్చిన మార్పుతో జీవిస్తున్నారు. అడవిలో ఉన్న వనరులను తమకు అనుకూలంగా మార్చుకుంటూ తమ అవసరాలు తీర్చుకుంటున్నారు. అడవి తల్లినే నమ్ముకొని బతుకుతున్న ఆదివాసులను అడవి నుండి వేరుచేసి చూడలేం. అడవి నుండి వేరుచేసి చూస్తే తల్లి బిడ్డలను వేరు చేసినట్లుగా ఉంటుంది. ఆదివాసులు ఏడాదిలో 4-5 నెలలు కొండపోడు (వ్యవసాయం) మీద ఆధారపడితే మిగతా సమయం అడవి తల్లి ఒడిలోనే సేద తీర్చుకుంటారు. అడవిలో దొరికే అడ్డకు (పిక్కలు) చీపురు, షీకాయ, ఉసిరికాయ, కరకాయ, తేనె, మామిడి, పనస, జీడి, దుంపలు రకరకాల దినుసులపై ఆధారపడి తమ కడుపు నింపుకుంటారు. ఇలాంటి ఆదివాసులను అడవి నుండి దూరం చేయడానికి మన పాలకులు పూనుకుంటున్నారు.

విశాఖ మన్యంలో బాక్సైట్ ఎజెండా మరోమారు తెరపైకి వచ్చింది. 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2005 జూలై 1న జిందాల్‌తోను, 2007 ఫిబ్రవరి 14న రస్ అల్ ఖైమాతోను ఒప్పందం చేసుకుంది. ఈ రెండు సంస్థలకు ఎపిఎండిసి ద్వారా బాక్సైట్‌ను సరఫరా చేయాల్సి ఉంటుందని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన. బాక్సైట్ తవ్వకాలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆదివాసులు కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పి టిడిపిని గద్దెనెక్కించారు. అధికారంలోకి రాక మునుపు బాక్సైట్‌ను వ్యతిరేకించిన చంద్రబాబు అధికారం చేపట్టిన 60 రోజులు తిరగక మునుపే ఆగస్టు 9న (ప్రపంచ ఆదివాసి దినోత్సవం నాడు) మన్యంలో బాక్సైట్ తవ్వకాలు ఐటిడిఎ ద్వారా చేపడతామని తమ వైఖరిని చెప్పనే చెప్పాడు. దీన్ని కొంచెం వెనక్కి తిరిగి చూడాలి.

విశాఖ మన్యంలో బాక్సైట్ ఖనిజం ఉన్నట్లుగా 1970లో రష్యా సామ్రాజ్యవాదులు కనుగొన్నారు. 1975లో తవ్వకాలు మొదలెట్టి 1979లో విరమించుకుని వెనక్కి పోయారనేది ఈ ప్రాంత ఆదివాసులు స్పష్టంగా చెపుతారు. (నేటికి ఈ ప్రాంతంలో తీసిన గొయ్యిలు మనకు కనిపిస్తుంటాయి. ఈ గొయ్యిలలో అడవి జంతువులు, మనుషులు పడి శవాలుగా కనిపిస్తారు.) నాటి నుండి నేటి వరకు సామ్రాజ్యవాదులు ఆకలి కొన్న డేగల్లా మనదేశాన్ని, సంపదను లూటీ చేయడానికి ఎదురుచూస్తున్నారు. మరీ ముఖ్యంగా మనదేశం లాంటి అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దేశాలపై పడి చమురు, ఖనిజాల్ని లూటీ చేయడానికి సామ్రాజ్యవాదులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యంలో భాగంగానే మన్యంపై సామ్రాజ్యవాదుల కన్ను పడింది.

చరిత్ర ప్రారంభం నుండి బలమైన రాజ్యాలు, తెగలు బలహీనులపై దాడి చేస్తూనే ఉన్నాయి. అవి అలా చేయడానికి ఒకటే మౌలిక కారణం. కోరుకున్న వనరులను పొందడమే అంతిమ లక్ష్యంగా ఉంటుంది. ఈ లక్ష్యంలో భాగంగానే దేశాలను, రాష్ట్రాలను ఆక్రమించుకుని తన ఏజెంట్లను పెట్టి నడిపిస్తుంటారు. తమకు లొంగని దేశాలను అణు బాంబులు ఉన్నట్లుగా చిత్రీకరించి సాయుధ దాడులు చేసి, తమకు అనుకూలంగా ఉండే కీలుబొమ్మ (ప్రభుత్వాన్ని) పెట్టి నడిపించడం, అక్కడ ఉన్న చమురు, ఖనిజాల్ని లూటీ చేసి తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలి అనేది అమెరికా లాంటి అగ్రరాజ్యాల కుట్ర. ఈ కుట్రలకు తలొగ్గిన మనదేశ పాలకులు సామ్రాజ్యవాదులు రూపొందించిన పాలసీలను మనదేశంలో మరీ ముఖ్యంగా ఆదివాసులు నివసిస్తున్న ప్రాంతాలను ఖాళీ చేయించడానికి, ఆదివాసులను టెర్రరిస్టులుగా, తీవ్రవాదులుగా ముద్రవేసి పోలీసు పారామిలటరీ

సౌకర్యం కల్పించడం కాదు 'అభివృద్ధి' అది ప్రభుత్వ సేవల విస్తృతి. ఈ సేవల విస్తృతిని వినియోగించుకుని ఆ పల్లె పేదలు తమ గ్రామీణ ఉత్పత్తులైన పాలు, కాయగూరలను సమీప పట్టణానికి తీసుకుపోయి అమ్ముకోగలిగి తమ జీవన స్థాయిని పెంచుకోగలిగితే అదీ అభివృద్ధి! రవాణా సౌకర్యం ద్వారా వారి పిల్లలను చదివించుకోగలిగితే అదీ అభివృద్ధి!!

పై సహాయక చర్యలన్నీ అమలు చేయగలిగేవే అయితే ఇందుకు ప్రజాహితాన్ని కోరుకునే అభిమతం, చిత్తశుద్ధి ఉండాలి. లక్ష్య దిశ కార్పొరేట్ శక్తుల వైపు నుంచి పేద ప్రజల వైపు మళ్లాలి. విదేశీ శక్తులకు తాబేదార్లుగా వ్యవహరించేదుకు బదులు పేదల అభిమానులుగా మారాలి. అప్పుడే తరతరాలకూ పేరెన్నికగన్న నేతలుగా చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు. లేకుంటే సంస్కరణల ఊబిలో కొట్టుకుపోతున్న సామాన్యుడు మితి మీరిన బతుకు భారాన్ని వదిలించుకునేందుకు జూలు విదులుస్తాడు. అది ఎప్పుడు? ఎలా? అన్నది చెప్పలేం. అభివృద్ధి దిశగానే మార్పుంటుందని మహనీయులు ఎప్పుడో చెప్పారు చరిత్రలో. గాడి తప్పిన 'అభివృద్ధి' సక్రమం అయ్యేందుకు అనువైన క్రమానుగత మార్గం అనివార్యం. అది త్వరలోనే అని ఆశిద్దాం!!

(రచయిత పాత్రికేయులు) వీ

బలగాలతో హత్యలు, మహిళలపై అత్యాచారాలు చేయిస్తున్నారు. వాస్తవానికి పాలకులే పెద్ద టెర్రరిస్టులుగా, తీవ్రవాదులుగా, భూస్వాములుగా తయారై, ఆదివాసులు జీవిస్తున్న అడవులను ధ్వంసం చేయ పూనుకున్నారు.

విశాఖ మన్యం ప్రాంతంలో 11 మండలాల పరిధిలో ఐదు మండలాలో బాక్సైట్ నిక్షేపాలు ఉన్నట్లుగా నిర్ధారించారు. ఈ ప్రాంతం నుండి బాక్సైట్‌ను తరలించడానికి 17 సంవత్సరాల నుండి తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నారు. బాక్సైట్ గనుల స్థాపన రాజ్యాంగంలోని 244 షెడ్యుల్ ప్రకారం ఆదివాసుల ప్రయోజనాలకు వ్యతిరేకమైందని పాలకులు ప్రమాణం చేసిన రాజ్యాంగంలోనే ఉంది. ఇదే కాకుండా మరో దగ్గర ఏమి చెపుతుందో చూద్దాం. భారత రాజ్యాంగ 5వ, 6వ షెడ్యుల్ ప్రకారం 1990లో 73 రాజ్యాంగ సవరణ ద్వారా సంకల్పించిన పంచాయితీ రాజ్ షెడ్యుల్ ప్రాంతాల విస్తరణ చట్టాన్ని (పెసా) అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం అదివాసులు నివసించే ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న పథకాలు, కార్యక్రమాలు ప్రాజెక్టులకు, గనులకు అనుమతులు మంజూరు చేయాలన్న గ్రామ సభ అనుమతి పొందాలి. కానీ పాలకులు చేస్తుంది ఏమిటి? ప్రజల నుండి బలవంతంగా భూముల్ని ఆక్రమిస్తూ కొండల్ని బద్దలు కొట్టి బాక్సైట్ ఖనిజాల్ని జెర్రెల కొండల నుండి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాకవరపాలెం రిఫైనరీకి (దీని కోసం 1500 ఎకరాల భూముల్ని రైతుల నుండి బలవంతంగా సేకరించారు) తరలించనున్నారు. దీన్ని తరలించడానికి లోతుగడ్డ జంక్షన్ నుండి బలపం మీదుగా 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న గోపురం కొండ వరకు తారు రోడ్డు నిర్మాణం వేగవంతం చేశారు. ఈ ప్రాంతం నుండి ప్రతి సంవత్సరం 4.5 మిలియన్ టన్నుల బాక్సైట్‌ను జెర్రెలకొండల నుండి తరలించనున్నారు. దీనికోసం 16 టిప్పర్లను వినియోగిస్తే, సంవత్సరానికి 2.18 లక్షల లోడ్లు తరలించాల్సి ఉంది. అంటే ఆయా లారీలు రోజుకు 770 ట్రిప్పులు తిరగాలి. రోజుకు 8 గంటల పాటు రవాణా జరిగితే గంటకు 96 లారీలు బాక్సైట్ రవాణా చేస్తాయి. ఈ లెక్కన నిమిషానికి 1.6 ట్రక్కులు రోడ్డుపై బాక్సైట్‌ని మోసుకువెలుతాయి. దీని ప్రకారం గంటకు 60 ట్రిప్పులు వేయాలంటే నిమిషానికి ఒక లారీ ఈ రోడ్డుపై దర్శనం ఇస్తుంది. దీని ద్వారా 19 జలాశయాలు, చిత్రకొండ, పీలేరు, డంకరాయి విద్యుత్ కేంద్రాలకు ప్రమాదం ఏర్పడనుంది. నాలుగు మండలాల పరిధిలో 9312 కుటుంబాలు 44.010 మంది ప్రత్యక్ష ప్రమాదానికి గురికానున్నారు. పరోక్షంగా లక్షల మంది నిర్వాసితులు కానున్నారు. 60 వేలకు పైగా రైతులు, కార్మికులు ఉపాధిని కోల్పోతారు. ఎనిమిది వేల హెక్టర్ల అడవి నాశనమవగా, అటవీ ఉత్పత్తులపై ఆధారపడుతున్న ఆదివాసుల బతుకులు పెన్నం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా మారనున్నాయి. ఈ బాక్సైట్ ప్రమాదం ఆమడ దూరంలో ఉండగానే (దేశాల షేర్ల) రాజకీయ నేతలు, కార్పొరేట్ కుటుంబాలు ఆదివాసులను వారి మనాన వారికి వదిలేసి బాక్సైట్ విధ్వంసానికి ఆదివాసులను అప్పగించి తాము మాత్రం ప్రాణభీతితో విదేశాల్లోని బయటి ప్రాంతాలకు (సురక్షిత) పలాయానాలు చేసేందుకు మూట ముల్లే ముందే సర్దుకుంటున్నారు. 1947ల తర్వాత నుండి వివిధ భారీ ప్రాజెక్టులు, గనుల ద్వారా 30 మిలియన్ ప్రజలు నిర్వాసితులైనారు. ఇందులో 40 శాతం మంది ఆదివాసులే. ఒక పక్కన రాజ్యాంగం 5వ షెడ్యుల్‌లో ఆదివాసుల హక్కుల రక్షణకు స్పష్టమైన హామీ ఇచ్చింది. 1/70 గిరిజనేతరుల చేతుల్లోకి భూమి బదలాయింపు ఏ రూపంలోను జరగడానికి వీల్లేదని చెప్పింది. వడ్డి వ్యాపార నిషేధ చట్టం 2006 షెడ్యుల్ తెగలు ఇతర సంప్రదాయక అటవీ హక్కుల గుర్తింపు చట్టం వచ్చింది. ఇలాంటి చట్టాలను మనదేశ పాలకులే ఉల్లంఘిస్తూ వస్తున్నారు.

రాజ్యాంగంలో పొందపరిచిన తమ హక్కులను, చట్టాలను అమలు చేయాలని అడిగిన పది మందికి పైగానే ఆదివాసులను బూటకపు ఎన్‌కౌంటర్ల ద్వారా హత్య చేసింది. 15 మంది మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టింది. వందలాది మందిని జైల్లో పెట్టింది. మరీ ముఖ్యం గా 2008లో వచ్చిన ఆర్థిక ద్రవ్య సంక్షోభం సామ్రాజ్యవాదులు కొట్టుమిట్టాడుతున్నారు. దీని నుండి గట్టెక్కడానికి ఆదివాసి ప్రాంతాలలో ఉన్న ఖనిజాల్ని లూటీ చేయడానికి మనదేశ పాలకులు సామ్రాజ్య వాదులకు తలుపులు బార్లా తెరిచారు. బాక్సైట్ గనుల తవ్వకాలను వ్యతిరేకించిన ప్రజలపై, ప్రజాస్వామిక వాదులపై, విప్లవ పార్టీ పైన కాంగ్రెస్ ప్రభుత్వం 2009 సెప్టెంబర్‌లో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని తీవ్రతరం చేసింది. ఈ దాడిలో వందల మంది ఆదివాసులు ప్రాణాలు కోల్పోయారు. విలువైన ఆస్తులను, తల్లి బిడ్డను, బిడ్డ తల్లిని కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీ విధానాలను వ్యతిరేకించిన ప్రజలు 2014 మేలో జరిగిన ఎన్నికల్లో బిజెపిని గద్దెనెక్కించారు. అధికారం చేపట్టి సంవత్సరం తిరగకుండానే ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని మరింత తీవ్రతరం చేస్తూ దేశాన్ని సామ్రాజ్యవాదులకు దోచిపెట్టడంలో కాంగ్రెస్ పార్టీ కంటే మరింత పాద సేవకుడైన నరేంద్రమోడీ సామ్రాజ్యవాదుల సంకల్లో కూర్చొని ఉన్నారు. వీరి పార్టీలు వేరైనప్పటికీ వీరి లక్ష్యం మాత్రం ఒకటే. ప్రజల సంపదతో పాటు శ్రమ శక్తిని దోచుకోవడం ఆర్థిక లక్ష్యమైతే ప్రజలపై తమ దోపిడీ పీడనలను యథాతథంగా కొనసాగించడం రాజకీయ లక్ష్యంగా ఉంటుంది. ఈ లక్ష్యం కోసం తిమ్మిని బొమ్మిని, బొమ్మిని తిమ్మిని చేయడం కోసం ఎంతటికైనా దిగజారుతారు. మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమాలు ప్రజల్ని మభ్యపెట్టడమే.

మూడున్నర దశాబ్దాల నుండి తమ జన్మ హక్కైన జల్ – జంగల్ – జమీన్‌కై పోరాడుతున్న ప్రజల్ని పక్కదారి పట్టించడానికే, మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు. నరేంద్రమోడీ మేక్ ఇన్ ఇండియా, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు సామ్రాజ్యవాదులకు పాదసేవ చేయడమే తప్ప, పోరాడుతున్న ప్రజల భూమి సమస్యను, ఆదివాసి సమస్యను మాత్రం పరిష్కరించలేవు. ఈ 67 సంవత్సరాల కాలంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా ఆదివాసి పీడిత ప్రజల బతుకుల్లో ఆవగింజంత మార్పు రాకపోగా, మరింత కటిక దారిద్రంలోకి నెట్టబడ్డాయి. దేశంలో కొంత మంది దళారులు, రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులు (అంబానీ లాంటి వారు) విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారు. ఈనాడు అధికారంలో ఉన్న నరేంద్రమోడీ కానీ, చంద్రబాబు కానీ, చంద్రశేఖర్‌రావు కానీ సామ్రాజ్యవాదులకు, నిరంకుశ పెట్టుబడిదారులకు, భూస్వాములకు పాదసేవ చేయవల్సిందే.

ఎన్ని ప్రభుత్వాలు మారిన ఆదివాసి బతుకుల్లో మార్పురాదు. ఈ దేశంలో నూతన ప్రజాస్వామిక సమాజం నిర్మాణమైనప్పుడే ఆదివాసి ప్రజలకు విముక్తి లభిస్తుందని, ఆ సమాజ నిర్మాణం కోసం సంఘటితంగా కృషి చేయడమే ఏకైక మార్గం.

(రచయిత ఆదివాసి మహిళ సంఘం సభ్యులు) వీ

హిజ్రా సమస్య - 3

హిజ్రా సమస్యకు ఉన్న వ్యక్తిగత మానసిక, శారీరక, సామాజిక కోణాలను చర్చిస్తూ పరిష్కారాలు సూచిస్తున్నారు

రంగనాయకమ్మ

(గత సంచిక తరువాయి)

డాక్టర్ చెప్పిన ఎక్స్, ఎక్స్, వై కారణం గానీ, ఇంకో కారణం గానీ ఉంటే, ఆ ఆడ ఫీలింగ్స్ పోయే వైద్యం, దాన్ని తగ్గించే వైద్యం, ఉండదా? – అనేది ఇంకో ప్రశ్న.

హిజ్రా సమస్య గురించి డాక్టర్లతో మాట్లాడినప్పుడు 'హోమో సెక్సువల్స్' (స్వలింగ సంప ర్కుల) గురించి కూడా ప్రస్తావన వస్తూనే ఉంది.

డాక్టర్ ఇందిర, డాక్టర్ శ్రీహరిరావు కూడా కొన్ని మెడికల్ విషయాలు చెప్పి 'హోమో సెక్సువల్స్' గురించి, 'వాళ్ల సమస్యేదో వాళ్లకి ఉంది' అన్నట్టే అన్నారు. శ్రీహరిరావు, 'మా పక్క అపార్టుమెంటులోనే ఇద్దరు ఆడవాళ్లు భార్యా భర్తలుగా ఉన్నారు. ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటూ బాగా ఉంటారు' అని చెప్పారు.

నేను, 'భార్యా భర్తలందరూ చాలా బాగా ఉన్నట్టే కనపడతారు లెండి' అని, నా ప్రశ్నలు నేను అడిగాను. అప్పుడు, శ్రీహరిరావు, 'సుబ్బారావు అనే ఒక సైకియాట్రిస్టు ఆ రకం కేసులన్నీ చూస్తూ ఉంటారు. ఆ నంబరు ఇస్తాను. ఆయనతో మాట్లాడండి' అని ఆ నంబరు ఇచ్చారు.

బి. సుబ్బారావు కూడా అమెరికాలోనే ముప్పయి ఏళ్లుగా సైకియాట్రిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తూ ఉన్నారు. ఆయనకి ఫోన్ చేస్తే, వరసగా రెండు రోజుల్లో కొన్ని గంటల సేపు ఆయన చాలా చక్కగా, ఒక స్టూడెంట్‌కి చెప్పినట్టు చెప్పారు. 'ఆయన, పేషెంట్ల పట్ల దయగల డాక్టరు' అనే అభిప్రాయం కలిగింది నాకు.

ఆయన్ని నేను అడిగినవి ప్రధానంగా రెండే రెండు ప్రశ్నలు. 1) హిజ్రా సమస్యకి ఏదైనా సైన్సు కారణం ఉందా? 2) హోమో సెక్సువల్స్‌కి కూడా అలాంటి కారణం ఉందా? – సమాజంలో ఇవన్నీ ఇలా ఎప్పుడూ సాగవలిసిందేనా? వీటిని పరిష్కరించే వైద్య మార్గాలేవీ లేవా? – ఇవీ నా ప్రశ్నలు.

నేను, 'హిజ్రా సమస్య' అన్నప్పుడు ఆయన, 'అది, ఒక్క సమస్యే కాదు; అనేక సమస్యల కూడిక' అన్నారు. 'కమ్మని' తెలుగే మాట్లాడారు. మెడికల్ మాటల కోసమే ఇంగ్లిషు ముక్కలు వాడారు. ఒక సమస్యగా కనపడే వాటిలో, ప్రకృతి సైన్సుతో పాటు, 'సోషల్ అంశాలన్నీ ఉంటాయి. సమస్యలు సమాజ పరిస్థితుల్లో నుంచీ, కుటుంబ పరిస్థితుల్లో నుంచీ, పుట్టేవే' అన్నారు. 'డబ్బు పరిస్థితుల్లో నుంచీ, వైద్యానికి అడ్డుపడే పరిస్థితుల్లో నుంచీ పుట్టేవీ కూడా ఉంటాయి. మత పరిస్థితుల నుంచి కూడా' ఉన్నాయన్నారు.

హిజ్రా సమస్య గురించి ఆయన చెప్పింది, 'ఎక్స్, ఎక్స్, వైల సమస్య ఉన్నప్పటికీ, అది లేకుండా కూడా హార్మోన్ డిజార్డర్ సమస్య ఉండవచ్చు' అన్నారు. ఈ డాక్టరు, 70 ఏళ్ల పేషెంట్ సమస్య ఒకటి చెప్పారు. ఆ పేషెంట్ మగవాడే. పాతికేళ్ల వయసులో ఆడ మనిషితోటే పెళ్లి జరిగింది. పిల్లలూ ఉన్నారు. కానీ, అతనికి ఆ చిన్నతనం నుంచే ఆడమనిషిగా, ఆడ పేరుతో బతకాలని ఉందట. తను చచ్చిపోయినప్పుడు, కనీసం అప్పుడైనా, తనని ఆడమనిషిగా గుర్తించాలని అన్నాడట. తన పురుషాంగాన్ని తీయించేసుకుని ఆడమనిషిగా మారిపోవాలని ఆయన కోరిక అట. ఈ సైకియాట్రిస్టు డాక్టరు అనుమతి ఇస్తేనే ఆ పేషెంట్‌కి ఆ ఆపరేషన్ చేస్తారు. అందుకే ఆయన ఈ డాక్టరు దగ్గరికి వచ్చాడు.

ఆ పేషెంట్‌కి ఈ డాక్టరు చెప్పింది: 'ఆపరేషన్ అప్పుడే కాదు. కనీసం ఏడాది ఆగాలి. ఆలోగా మీరు హార్మోన్లు తీసుకుంటూ ఉండాలి. అంతకన్నా ముందు నుంచీ ఆడ పేరు పెట్టుకుని, ఆడ బట్టలు వేసుకుని, అందరి మధ్య తిరుగుతూ ఉండాలి. మీరు అలా చేయగలరంటే, తొందరగా హార్మోన్స్ ట్రీట్‌మెంట్ మొదలుపెడతాం. మెడికల్ బిల్లుల్లో గానీ, కారు లైసెన్సులో గానీ, ఇంకెక్కడైనా, మీ మగ పేరుని ఆడ పేరుగా మార్చి గుర్తించాలని రాసి ఇస్తాం. డాక్టర్ రిపోర్టు ఉంటే, మిమ్మల్ని 'ఆడ'గానే గుర్తిస్తారు. ఆపరేషన్ అవడం ఏడాది తర్వాతే. ఈ వరస అంతా సాగకుండా ఆపరేషన్ చేస్తే, అది నేరం అవుతుంది.' ఇలా చెప్తే, ఆ 70 ఏళ్ల పేషెంట్ ఇక ఆడ దానిగా మారాలని సంతోషంగా వెళ్లాడు. అతణ్ణి భార్య ఎప్పుడో వదిలేసింది. ఇదే రకపు ఇంకో భర్త విషయంలో, అతను 'ఆడ'గా మారడానికి భార్య అంగీకరించిందట! 'ఆమెకి ఆదాయం లేదు. పిల్లలున్నారు. కాబట్టి, భర్తని వదలకుండా, భర్త మారడానికి ఒప్పుకుంది' అన్నారు డాక్టరు.

నేను, 'ఆ రకం వాళ్లలో నల్లరంగు పేషెంట్లు కూడా ఉన్నారా?' అని అడిగాను.

'ఉన్నారుగానీ, ఎక్కువ సంఖ్య తెల్లవాళ్లే' అన్నారు.

డాక్టరు సుబ్బారావు ఇంకో కేసు చెప్పారు. ఒక పేషెంట్ 36 ఏళ్ల వాడు. 'నాకు చచ్చిపోవాలని ఉంటోంది. ఒకప్పటి నుంచీ అలాగే ఉంటోంది. అయినా ధైర్యం లేదు. నేనేం చేయాలి?' అని అడిగాడు.

డాక్టరు నాతో చెప్పింది: 'అతని పాత చరిత్ర తెలుసుకోవాలంటే, పేషెంట్ తొందరగా చెప్పడు. నమ్మకంగా చెప్పడు. పైగా అతను ఒక రకం మనోవ్యాధి మనిషి. బుజ్జగిస్తూ, నమ్మించి అడగాలి. అతనికి తల్లి దండ్రులు లేరు. వాళ్లేమయ్యారో కూడా అతనికి తెలియదు. పద్నాలుగేళ్ల వయసులో మొగాళ్లు అతన్ని చెత్తగా ఉపయోగించారు. అప్పటి నుంచే అతనికి బతకకూడదని అనిపిస్తోంది. ఆ తర్వాత కాలంలో కొన్నాళ్లు ఒక అమ్మాయితో డేటింగు. అదీ వదిలేశాడు. కొన్నాళ్లు ఎన్నికల ప్రచారంలో పని చేశాడు. మంచి చదువు లేదు. ఉద్యోగం లేదు. డబ్బు

లేదు. ఆ మనిషి, ఇప్పటి దాకా బతికి ఉన్నాడంటే, బాగా ధైర్యస్తుడే అనుకోవాలి. అతని మనోవ్యాధికి సమాజ పరిస్థితులు కారణం గాక ఇంకేం కారణం? అతన్ని వెంటనే ఆస్పత్రిలో చేర్చుకోమని రాశాను. కొన్నాళ్లు ఆస్పత్రిలో ఉండి బయటికి వెళ్లాడు. బయట ఏం ఉంది? తర్వాత ఏమైందో మళ్లీ అతను వస్తేగానీ తెలియదు. వస్తాడో లేదో కూడా తెలియదు.'

సైకియాట్రిస్టు డాక్టరు, ఏ పేషెంట్ కోసమైనా ఎక్కువ శ్రద్ధతో ఎక్కువ టైం పెడితే, ఇన్సూరెన్స్ కంపెనీ వాళ్లు ఒప్పుకోరట! '70 ఏళ్ల వాడికి ఎంత చెపితే మాత్రం ఏం మారతాడు? చావడానికి సిద్ధంగా ఉన్నవాడికి ఎంత నేర్పితే మాత్రం ఏం బతుకుతాడు? – అంటారు ఇన్సూరెన్స్ వాళ్లు. ఒక పేషెంట్ కోసం డాక్టరు ఎక్కువ టైం పెడితే, ఇన్సూరెన్స్ వాళ్లు ఎక్కువ డబ్బు కట్టాలి. మానవత్వంతో తగినంత వైద్యం చేయాలంటే వాళ్లు అడ్డం పడతారు. ఇవన్నీ డబ్బు ఇబ్బందులు' అన్నారు డాక్టరు.

'అంటే, మొత్తం ప్రపంచం అంతా వ్యాపార ప్రపంచం అయినట్టే కదండీ? ఈ ప్రపంచం, లాభాల కోసం తపించే బూర్జువా ప్రపంచమే కదండీ? మీరు 'మానవత్వం' అంటున్నారు చాలా సార్లు. 'డబ్బు' గాక, మానవత్వం ఎక్కడైనా కనపడిందా మీకు?' అన్నాను నేను. ఆయన బూర్జువా సమాజంలో సంగతులే చెపుతున్నారు. కానీ 'మానవత్వం' అంటారు. 'లాభం' పక్కన, మానవత్వం కూడా ఉండాలని!

ఆయన, పెద్ద డాక్టరు. పైగా, అమెరికాలో ఉన్న డాక్టరు. అంటే, 'స్వర్గం'లో ఉన్నట్టు! స్వర్గంలో ఉన్న వాళ్లతో వాదించడానికి సరదాగా ఉంటుంది కదా? సుబ్బారావు చాలా స్నేహంగా మాట్లాడారు. అందుకే చనువుగా మాట్లాడాను.

'ఆడా – ఆడా' 'మగా – మగా' సంబంధాల గురించి అడిగితే, అది ఆయనకి వ్యక్తిగత స్థాయిలో ఇష్టం లేదు. కానీ, డాక్టరుగా చెప్పడానికి ప్రయత్నించారు. 'అసలు మనుషులు జంతు స్థాయి నుంచి డెవలప్ అవుతున్నారు కదా? ఆ జంతు లక్షణాలే కొనసాగుతున్నాయి' అన్నారు మొదట.

నేను, 'మనుషుల్ని ఆ విషయంలో జంతువులతో ఎలా పోల్చగలరు? రెండు ఆడ జంతువులు గానీ, రెండు మగ జంతువులు గానీ, అలా ప్రవర్తించడం ఎక్కడైనా జరుగుతుందా?' అన్నాను.

ఆయన, 'జంతువు అంటే, 'ఆలోచించలేనిది' అని. మనిషి కూడా ఆలోచించలేని పనులు చేస్తూ ఉంటే, అలా జంతువుతో పోలుస్తాం' అన్నారు. మళ్లీ ఆయనే, 'కానీ, భార్యా భర్తలుగా ఉండే ఇద్దరు ఆడ వాళ్లు గానీ, ఇద్దరు మగ వాళ్లు గానీ, బాగానే ఉంటున్నారు' అన్నారు.

'డాక్టరు! వాళ్లు బాగా ఉన్నారా లేరా అన్నది కాదండీ సమస్య. ఇద్దరు ఆడ వాళ్లకి గానీ, ఇద్దరు మగ వాళ్లకి గానీ, శారీరక సంబంధం అంటే, అది ప్రకృతి సహజత్వం అవుతుందా? డాక్టరుగా మీ అభిప్రాయం కావాలి నాకు' అని నా ప్రశ్న అడిగాను. మళ్లీ నేనే 'ప్రకృతిలో కూడా వికృతులు వస్తాయి. ఒక చేతికి 6 వేళ్లు ఉంటాయి. కవల పిల్లలు, అంటుకుని పుడతారు. 'అంధత్వం' వికృతమే కదా? ఇలాంటి వికృతాలు జరిగినట్టుగానే, హోమోల్ని వికృతాలుగా అర్థం చేసుకోమంటారా?' అన్నాను.

డాక్టరు: 'మా ప్రొఫెసర్లలో కొందరు, ఆడా – ఆడా మగా – మగా రకం సంబంధాలు తప్పని, వాళ్లకి బోధించి దాన్ని మార్చాలని, చాలా ప్రయత్నించారు. చివరికి మా వాళ్లు ఎలాంటి అవగాహనకి వచ్చారంటే, తమ ప్రయత్నాలే తప్పనీ, హోమోల కోరికల్లో ఏదో కారణం ఉందనీ, అలాంటి అభిప్రాయానికే వచ్చారు. హిజ్రా కేసుల్లో కొన్ని సైన్సు కారణాలు కనపడుతున్నాయి గానీ, హోమోస్‌లో అంత స్పష్టమైన కారణలేవీ ఇప్పటికీ రికార్డు కాలేదు' అన్నారు.

డాక్టర్ల వైద్యానికి ఇన్సూరెన్సు వాళ్లు అడ్డం పడ్డట్టు, మా సంభాషణకి మా ఫోను వందసార్లు ఇబ్బందులు పెట్టింది. రెండు నిమిషాలకో సారి కట్ అవుతూ ఉంటుంది ప్రభుత్వం వారు నడిపే లాండ్ ఫోను. ఏడాది నుంచీ పడుతున్నాం ఈ సమస్య.

ఫోను దయదలిచి, 'సరే, మాట్లాడుకోండి' అని అనుమతి ఇచ్చినప్పుడల్లా, నేను పిలవగానే డాక్టర్ సుబ్బారావు విసుగు లేకుండా కేసుల సంగతులు చెప్పారు. 'హోమో సమస్యలో సైన్సు కారణం ఉందని డాక్టర్లు చెప్పగలరా?' అని నేను అడిగిన దానికి ఆయన, డాక్టర్ ఇందిర లాగే 'అన్ నోన్ (తెలియనిది)' అన్న జవాబే చెప్పారు. ఆ జవాబుతో పాటు, ఇంకా కొన్ని విషయాలు చెప్పారు.

డాక్టరు: 'ఇది వరకు హోమో పేషెంట్లు మా దగ్గరికి మనోవ్యధలతో (డిప్రెషన్స్) వచ్చినప్పుడు, తాము హోమో సంబంధంలో ఉన్నామని చెప్పేవారు కారు. ఆ సంగతి దాచి ఉంచేవారు. తమ డిప్రెషన్‌కి వేరే కారణాలుగా, 'మా డాడీ మంచివాడు కాదు, మా మమ్మీ మంచిది కాదు, నా ఉద్యోగం పోయింది' అంటూ చెప్పేవారు. ఆ కారణాలు కూడా నిజమే కావచ్చు గానీ, అసలు కారణం అది కాదని తర్వాత ఎప్పటికో తెలిసేది. ఇప్పుడైతే, రాగానే 'ఐయాం హోమో (నేను హోమోని)' అని కేర్‌లెస్‌గా చెప్పేస్తారు. వాళ్ల కంప్లయింట్స్ ఏమిటంటే, ప్రధానంగా డిప్రెషన్. లేదా, సెక్స్ రోగాలు. నా కేసుల్ని బట్టి నాకు తెలిసినంత వరకూ, స్త్రీ పురుష సంబంధాల్లో ఎన్ని సమస్యలు ఉంటాయో, హోమో జంటల్లో కూడా అవన్నీ ఉంటాయి. కొన్నాళ్లు ఇద్దరూ కలిసి ఉన్న వాళ్లల్లో ఎవరో ఒకరు ఇతరులతో రహస్య సంబంధాలు పెట్టుకుంటారు. దానితో గొడవలు మొదలు! అంతే కాదు, ఒకళ్లకి ఉద్యోగం నిలబడి, ఒకళ్ల ఉద్యోగం ఊడుతుంది. ఇద్దరూ స్త్రీలే. లేదా, ఇద్దరూ మగవాళ్లే. కానీ భార్యా భర్తలు. ఉద్యోగంలో ఉన్న భార్య, ఉద్యోగం పోయిన భర్తని, ఇంకో ఉద్యోగం తొందరగా చూసుకోమంటుంది. ఉద్యోగం దొరకదు. కొన్నాళ్లకి, ఉద్యోగంలో ఉన్న భార్య, 'నేను నా భర్తని పోషించలేను' అంటుంది. కానీ అది డాక్టర్లు పరిష్కరించగలిగే సమస్య కాదు. మా చేతిలో ఉన్నదేదో మేం చెపుతాం. తర్వాత, వాళ్లు ఏమయ్యారో మా దాకా రారు. వస్తారు, వెళ్తారు.'

నేను: 'అసలు హోమో సమస్యకి సైన్సు కారణం ఉందంటారా?' అని మళ్లీ నా ప్రశ్న.

డాక్టరు: 'ఈ ప్రశ్న మీరు చాలా సార్లు అడిగారు. 'అన్ నోన్' అనే జవాబే డాక్టర్లు చెప్పగలరు. ఇప్పటికి ఇంకా ఏ కారణమూ బయటికి రాలేదు. ఇది వరకు అయితే హోమో కేసుల గురించి 'ఎబ్ నార్మల్ కండిషన్ (సాధారణం కాని పరిస్థితి)' అనే వాళ్లం. ఇప్పుడు డాక్టర్లు ఆ మాటలు వాడడం లేదు. అసలు ఈ సమస్యలో అనేక పరిస్థితులు ఉన్నాయి. ఈ దేశంలో దాదాపు 80 శాతం వరకూ పన్నులు కడతారు. భార్యా భర్తలుగా ఉండేవాళ్లకైతే పన్నులు తగ్గుతాయి. ఆ ఇద్దరిలో ఒక్కరి ఇన్సూరెన్స్ రెండో వ్యక్తికి కూడా కొన్ని సందర్భాల్లో పని చేస్తుంది. ఒక వేళ ఒకరు మరణించినా, వాళ్ల బ్యాంకు ఎమౌంట్లు రెండో వాళ్లకి

అందుతాయి. ఈ విషయాలన్నీ భార్యా భర్తలుగా ఉంటేనే. ఈ సమస్యలో, ఆ అవసరాలన్నీ కలిసే ఉంటాయి. రాజకీయాల వాళ్లయితే, ఎక్కువ ఓట్లు రావడానికే, దానికి కావలసిన చట్టాలు చేస్తారు. హోమోల పెళ్లిళ్లు చట్టబద్ధమే. ఇదంతా డబ్బూ, ఉద్యోగాలూ, ఓట్లూ, మారే ఐడియాలూ, ఇవన్నీ కలిసిన సమస్యగానే ఉంటుంది' అంటూ చెప్పారు.

నేను: 'హోమోలుగా ఉండే వాళ్లకి పిల్లలు ఉండరు. వాళ్లు పిల్లల్ని పెంచుకోవాలంటారు. ఆ పిల్లలు ఎలా తయారవుతారు? తండ్రి పెత్తందారీ తనం చూసి మగపిల్లలు అలాగే తయారవుతారు కదా? తల్లిదండ్రుల ప్రవర్తనలు పిల్లల మీద చాలా పని చేస్తాయి. హోమోల చేతుల్లో పెరిగే పిల్లలు, ఎన్నో అసాధారణ పరిస్థితుల్లో పెరిగినట్టు అవుతుందంటారా, కాదా?' – ఈ ప్రశ్నకి శ్రీహరిరావు చెప్పినట్టే ఈయన కూడా చెప్పారు.

డాక్టరు సుబ్బారావు: 'ఈ విషయంలో కూడా వాదాలు ఉన్నాయి. 'పెద్ద వాళ్లు పెంచినట్టే పిల్లలు తయారవుతారా? వాళ్ల వివేకంతో వాళ్లు ఆలోచించుకోరా?' అంటారు కొందరు. అది మంచిది కాదంటారు కొందరు.'

నేను: 'మీరైతే, ఏ కొందరిలో ఉంటారు?'

డాక్టరు నవ్వారు. 'పేషెంట్లకి బోధించడం మా డ్యూటీ కాదు. వాళ్ల కేసుని బట్టి ట్రీట్‌మెంటే చేస్తారు డాక్టర్లు. ఇక్కడ కాస్సేపు బోధించినా, బయట పరిస్థితులన్నీ అలా ఉండగా, ఈ బోధనలతో, పని జరిగేదేమీ ఉండదు.'

డాక్టర్ సుబ్బారావు, 'లోకంలో మార్పులు జరుగుతున్నాయి. వాటికి తగ్గ వైద్యాలే ఉంటాయి' అనే అర్థాలతో మాట్లాడారు.

'హోమోలు, పిల్లల్ని పెంచడాన్ని కొందరు మంచిది కాదంటారు' అన్న మాటలే, ఆలోచించవలసిన మాటలుగా అనిపించాయి నాకు. అంతకు ముందు కూడా నాకా అభిప్రాయం ఉంది. సాధారణ పరిస్థితుల్లో అయితే, ఆడ తల్లీ, మగ తండ్రీ ఉండే పరిస్థితుల్లోనే పిల్లలు పెరుగుతారు. హోమోలు పెంచే పిల్లలకు, ఆడ తల్లీ, ఆడ తండ్రీ ఉండడం, లేదా, మగ తల్లీ – మగ తండ్రీ ఉండడం, అర్థం కాని విషయం అయిపోతుంది. ఏ పిల్లలకీ సెక్స్ విషయాలు చిన్నప్పుడు తెలియవు. అది తెలిసే కాలం వస్తే, ఇద్దరు ఆడవాళ్ల సంబంధం వాళ్లకి చాలా వికృతంగా కనపడుతుంది. అలా లేకుండా పెంచే వాళ్ల సంబంధాలతోనే వాళ్లు ఏకీభవిస్తూ పెరిగారంటే, వాళ్లకి కూడా అలాంటి సంబంధాలు ఏర్పర్చు కోవడానికి అభ్యంతరం ఉండదు. హోమో సంబంధాలే సరైనవి అని నమ్మి, ఆడా – మొగా సంబంధాలే మూర్ఖత్వాలు అనుకుంటారు. ఇక విషయంలో ఇలాంటి భావాలు పుడితే, వాళ్లు ఇతర కోణాల్లో కూడా హేతు విరుద్ధంగా అవుతారు.

డాక్టరు చెప్పింది వినక ముందు కూడా నాకీ అభిప్రాయం ఉంది. హోమోలు, పిల్లల్ని పెంచడం హక్కుగా గాక, వేరే సందర్భాల్ని బట్టి ఉండాలి.

'హిజ్రా' సమస్యా, 'నపుంసకత్వం' సమస్యా, 'రెండు మర్మాంగాలతో పుట్టడం' సమస్యా, 'స్వలింగ సంబంధాల (హోమో)' సమస్యా, – ఇటు వంటి సమస్యల గురించి మాట్లాడవలసివస్తే, ఇవి అసలు నిజమైన సమస్యలేనా – అనే ప్రశ్న మొట్ట మొదట ప్రతీ సమస్య మీదా వస్తుంది.

1) 'నపుంసకత్వం' సమస్యలో, అసత్యం ఏదీ ఉండదు. అది, తాత్కాలిక అనారోగ్యంగానీ, లేదా అంధత్వం వంటి ఒక లోపంగానీ, అయి ఉంటుంది. దీనికి వైద్యం ఉంటుందంటారు డాక్టర్లు. కొన్ని కేసుల్లో వైద్యం వల్ల కూడా ఫలితం లేకపోతే అది సిగ్గు పడవలసిన విషయం కాదు. శరీరంలో ఏ అవయవానికైనా లోపాలు ఉండవచ్చు. అంధత్వం, చెవిటితనం, మూగతనం, కుంటితనం – వంటి లోపాలు ఉంటూనే ఉన్నాయి. అటువంటి ఒక లోపం మాత్రమే నపుంసకత్వం కూడా. ఏ లోపానికైనా డాక్టర్లు సాధ్యమైనంత వైద్యం చేయగలరు. మంచి ఫలితం రాకపోయినా, ఆ వ్యక్తి స్త్రీయా, పురుషుడా అనే ప్రశ్న రాదు. ఆ వ్యక్తికి ఇతర పురుష లక్షణాలన్నీ ఉంటాయి కాబట్టి, ఆ వ్యక్తి పురుషుడు కాకుండా పోడు.

2) రెండు మర్మాంగాలతో పుట్టే బిడ్డ విషయంలో కూడా సిగ్గు పడవలసిందేమీ ఉండదు. ఏ అంగాన్ని అభివృద్ధి పరచవచ్చో డాక్టర్లు గ్రహించి ఆ మార్గంలో వైద్యం చేస్తారు. ఒక అంగాన్ని తొలిగించి, ఒక అంగాన్ని మెరుగు పరిచే వైద్యం ఉంటుంది. ఆ బిడ్డ, స్త్రీగానో, పురుషుడి గానో, తేలుతుంది. ప్రకృతి సహజత్వంలో చాలా అరుదుగా జరిగే అవక తవకల కిందకి మాత్రమే ఇది వస్తుందని డాక్టర్లు అంటారు. ఇది పరిష్కారం లేని సమస్య కాదనీ, ఇది హిజ్రా వ్యవహారంలోకి చేరేది కాదనీ, అర్థం.

3) ఆడా – ఆడా, మగా – మగా శరీర సంబంధాల విషయం గురించి, డాక్టర్లు, 'అది, వాళ్ల అవగాహన' అన్నట్టే మాట్లాడతారు. ' 'అది వాళ్ల ఇష్టం' అని ఊరుకోవాలి. 'ప్రకృతి సహజత్వం' గురించి ఎత్తామంటే, 'ఏది ప్రకృతి? ఎవరు నిర్ణయిస్తారు దాన్ని?' అని మాట్లాడతారు వాళ్లు. వాళ్ల ప్రవర్తనలో మంచి చెడ్డలు వాళ్లే తెలుసు కుంటే తెలుసుకుంటారు, లేకపోతే లేదు. వాళ్ల ఇష్టం వాళ్లది' అన్నారు డాక్టర్లు.

'తప్పులు' అనేక రకాలు. సిగరెట్లూ, తాగుళ్లూ, వ్యభిచారాలూ అన్నీ తప్పులే. అలాంటి వాటి విషయంలో, 'అది తప్పు సుమా!' అనే బోధనలు అవసరం కావచ్చు. కానీ, 'స్త్రీ పురుష సంబంధాల' విషయంలో కూడా ఏది ప్రకృతో ఏది కాదో, మనుషులైన వాళ్లకి బోధనలు అవసరమా? 'ప్రకృతి సహజత్వమా? ఎవరు నిర్ణయిస్తారు దాన్ని?' అని వాదిస్తారా మనుషులు? 'ప్రకృతి సహజత్వాన్ని ప్రకృతే నిర్ణయిస్తుంది' అనేటంత చిన్నమాట కూడా తెలియదా ఆ మానవులికి? జంతువులకైనా, మనుషులకైనా, శరీరాల్లో ఏ అవయవ ధర్మం ఆ అవయవానికి ఉంటుందనే మాట కూడా తెలియదా ఆ ఆలోచనాపరులికి? అన్నం తినాలంటే, నోటితో తింటారా, మల ద్వారంతో తింటారా? – నోటి తోటే తింటాం, శరీరంలో మల ద్వారం ఉన్నది అన్నం తినడానికి కాదు' అని జవాబు చెప్పుకోవలిసి వస్తే, అదే మరి ప్రకృతి సహజత్వం!

మనుషులు (ఏ ప్రాణి అయినా), నేల మీద నడవాలంటే, నేలకి పాదాలు ఆనుంచి నడుస్తారా, నెత్తినే నేలకి ఆనుంచి నెత్తితో నడుస్తారా? – 'కాళ్ల తోటే నడుస్తాం' అని జవాబు వస్తే, అదే మరి ప్రకృతి సహజత్వం! కాళ్లు లేని వాళ్లయినా నెత్తితో నడవరు. ఏ ప్రకృతి విషయంలోనైనా తేడాలు వస్తే, అవి పరిశోధనల్లో తెలుస్తాయి. కానీ, స్వలింగాల వాళ్ల దృష్టిలో అసలు ప్రకృతే ఉండదు.

(ఇంకా ఉంది)

(రచయిత బహు గ్రంథకర్త, మార్క్స్ 'పెట్టుబడి' పరిచయకర్త) వీ

రాజకీయ ఖైదీలను విడుదల చేయాలి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని జైళ్లలో ఉన్న రాజకీయ ఖైదీలందరినీ భేషరతుగా విడుదల చేయాలని విరసం నేత వరవరరావు, సీనియర్ న్యాయవాది బొజ్జా తారకం, బల్ల రవీంద్రనాథ్, సినీనటుడు ఆర్. నారాయణ మూర్తి డిమాండ్ చేశారు. మార్చ్ 23న హైదరాబాద్‌లోని హైదర్‌గూడ న్యూస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. స్వాతంత్ర్య విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 84వ వర్ధంతి సందర్భంగా మార్చ్ 23 నుండి 30 వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ రాజకీయ ఖైదీల హక్కుల పోరాట వారోత్సవంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

తెలంగాణ బడ్జెట్ సమావేశాలు మార్చ్ 7 నుంచి ప్రారంభమయ్యాయి. ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ 2015-16 సంవత్సర బడ్జెట్‌ను మార్చ్11న శాసనసభలో ప్రవేశపెట్టారు. మొత్తం రు. 1,15,689.19 కోట్లు, ప్రణాళికా వ్యయం రు. 53,383.19 కోట్లు, ప్రణాళికేతర వ్యయం రు. 63,306 కోట్లు.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలు మార్చ్ 7 నుంచి ప్రారంభమయ్యాయి. బడ్జెట్‌ను ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు మార్చ్ 12న శాసనసభలో ప్రవేశపెట్టారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్ రు. 1,13,049 కోట్లు. ప్రణాళికేతర వ్యయం రు. 78,637 కోట్లు, ప్రణాళికా వ్యయం రు. 34,412 కోట్లు. రెవిన్యూ లోటు రు. 7300 కోట్లు, ఆర్థిక లోటు రు. 17584 కోట్లు.

పోడు వ్యవసాయదారుల తిరుగుబాటు

ఖమ్మం జిల్లా, చంద్రుగొండ మండలం, మద్రిగూడెం అటవీ ప్రాంతంలో అటవీ సిబ్బంది చేపట్టిన ప్లాంటేషన్ పనులను 200 మంది గిరిజన పోడు వ్యవసాయదారులు మార్చ్ 9న అడ్డుకున్నారు. అడ్డుకున్న గిరిజనులపై అటవీ సిబ్బంది దాడి చేయగా వారు తిరగబడి కారం, కర్రలతో, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘర్షణలో 15 మంది అటవీ సిబ్బందికి, 15 మంది గిరిజనులు గాయాలయ్యాయి.

రాళ్లబండి వెంకట ప్రసాద్ మృతి

ప్రముఖ సాహితీవేత్త రాళ్లబండి వెంకట ప్రసాద్ (కవితా ప్రసాద్) (56) అనారోగ్యంలో హైదరాబాద్‌లోని కేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మార్చ్ 15న చనిపోయారు. ఆయన 1961 మే 21న కృష్ణా జిల్లా, గంపలపాడు మండలం, సత్యాలపాడు గ్రామంలో జన్మించారు. ఆయన 500 పైగా అవధాన సభలను నిర్వహించారు. ఒంటరి పూలబుట్ట, పద్మమంటపం, అగ్నిహంస, ఇది కవి సమయం మొదలైన సంపుటాలు ఆవిష్కరించారు.

ఐఎఫ్‌టియు 8వ రాష్ట్ర మహాసభలు

తెలంగాణ రాష్ట్ర 'భారత కార్మిక సంఘాల సమాఖ్య' (ఐఎఫ్‌టియు) 8వ మహాసభలు మార్చ్ 13-15 తేదీల్లో హైదరాబాద్‌లోని వివిఎస్‌టి హాల్లో జరిగాయి. ఈ సభలలో పాల్గొన్న వక్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇష్టానుసారంగా భూములు కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నూతన అధ్యక్షులుగా వి. కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కె. సూర్యం, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, ఎస్.ఎల్. పద్మ, సంపత్‌లు ఎన్నికయ్యారు.

ఎన్‌టిపిసిలో సమ్మెలపై నిషేధం

తెలంగాణ రాష్ట్ర పరిధిలోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి) స్టేషన్లలో సమ్మెలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్చ్ 16న ఉత్తర్వులు జారీ చేసింది. అత్యవసర సేవల నిర్వహణ చట్టం - 1971 ప్రకారం వచ్చే ఆరు నెలల పాటు ఈ నిషేధం ఉంటుందని కేంద్ర ఇంధనశాఖ కార్యదర్శి అరవింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పాత్రికేయులు సివి రాజగోపాల్‌రావు మృతి

ప్రముఖ పాత్రికేయులు, రచయిత చంద్రుపట్ల వెంకట రాజగోపాల్ రావు (83) మార్చ్ 18న హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న ఆయన స్వగృహంలో గుండెపోటుతో చనిపోయారు. ఆంధ్రపత్రికలో నాలుగు దశాబ్దాలు పనిచేశారు. ఆయన తూర్పుగోదావరి జిల్లా, ఇందుకూరిపేట గ్రామంలో 1932 ఆగస్టు 12న జన్మించారు. ఆయన ఆంధ్రపత్రిక చరిత్ర, స్వాతంత్ర్య పోరాటం - జర్నలిస్టు యోధులు - జైలు శిక్షలు మొదలైన రచనలు చేశారు.

అంగన్‌వాడీ వర్కర్స్ చలో అసెంబ్లీ

అంగన్‌వాడి వర్కర్లు వేతనాలు పెంచాలని, తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 'ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్' ఆధ్వర్యంలో మార్చ్ 16న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రిలే దీక్ష నిర్వాహించారు. అలాగే మార్చ్ 17న రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి వేలాది అంగన్‌వాడి వర్కర్లు 'చలో అసెంబ్లీ' కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని అంగన్‌వాడి కార్యకర్తలను అరెస్టు చేశారు

రెండు తెలుగు రాష్ట్రాలలో రైతు ఆత్మహత్యలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నుంచి 2015 మార్చ్ 22 వరకు మెదక్-116, కరీంనగర్-94, మహబూబ్‌నగర్-78, నల్లగొండ-77, వరంగల్-52, ఆదిలాబాద్-71, నిజామాబాద్-43, రంగారెడ్డి-42, ఖమ్మం-22 మంది రైతులు వ్యవసాయం చేసి అప్పుల పాలై ఆత్మహత్య (593) చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి 2015 మార్చ్ 22 వరకు 63 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

ఆజాద్ ఎన్‌కౌంటర్‌పై పిటిషన్ కొట్టివేత

మావోయిస్టు పార్టీ అగ్రనేత ఆజాద్, జర్నలిస్టు హేమచంద్ర పాండేలను బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు చంపినారని 2011లో సామాజిక వేత్త స్వామి అగ్నివేష్, హేమచంద్రపాండే భార్య బబితాపాండే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్లు వేశారు. ఈ కేసు విచారించి నివేదిక సమర్పించవలసిందిగా సుప్రీంకోర్టు సిబిఐని ఆదేశించింది. ఆజాద్, హేమచంద్రపాండేలను పోలీసులు ఆత్మరక్షణ కోసం ఎన్‌కౌంటర్‌లో చంపారని సుప్రీంకోర్టుకు సిబిఐ నివేదిక అందజేసింది. సుప్రీంకోర్టు ఈ కేసును దిగువ కోర్టులో తేల్చుకోవాలని పిటిషనర్లకు సూచించింది. కోర్టు సూచన మేరకు ఆజాద్ భార్య పద్మ, బబిత ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 29 మంది పోలీసులపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని ఆదిలాబాద్ కోర్టులో 2013లో ప్రొటెస్టు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఏడాదిన్నర పాటు జరిగిన వాద ప్రతివాదనల అనంతరం ఆదిలాబాద్ జుడిషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ పిటిషన్‌ను 2015 మార్చ్ 25న కొట్టివేసింది. వీ

గోవింద పన్సారేను హత్య చేసిన మాఫియా

సిపిఐ నాయకుడు గోవింద పన్సారే (82)ను మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో టోల్‌టాక్స్ మాఫియా, మతవాద శక్తులు కలిసి ఫిబ్రవరి 16న కాల్చిచంపారు. గోవింద పన్సారే 1933, నవంబర్ 26న అహ్మద్‌నగర్ జిల్లాలో నిరుపేద కుటుంబంలో పుట్టారు. కొల్లాపూర్ మునిసిపల్ పాఠశాలలో ప్యూన్‌గా పనిచేస్తూ బిఎ పూర్తిచేసి ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. పేదలకు న్యాయం దక్కాలనే తపనతో న్యాయశాస్త్రం చదివి న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఆయన మరాఠా భాషా ఉద్యమం, గోవా స్వాతంత్ర్య పోరాటం, టోల్ గేట్ వసూళ్ల వ్యతిరేక ఆందోళన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. టోల్‌టాక్స్ పేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్న మహారాష్ట్ర రాజకీయ నాయకులు, మాఫియా ముఠాలు, అధికారుల సిండికేట్‌కు వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన ఉద్యమం మహారాష్ట్ర వ్యాప్తంగా విస్తరించింది.

2015-16 కేంద్ర బడ్జెట్

2015-16 గాను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో ఫిబ్రవరి 28న రు. 17,77,477 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. అందులో ప్రణాళికా వ్యయం రు. 4,65,277 కోట్లు; ప్రణాళికేతర వ్యయం రు. 13,12,200 కోట్లు; స్థూల పన్ను వసూళ్లు రు. 14,49,490 కోట్లు; మౌలిక వసతుల కల్పనకు రు. 70,000 కోట్లు; పన్నుల్లో రాష్ట్రాలకు రు. 5,23,958 కోట్లు; గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీలకు రు. 77,526 కోట్లు; రక్షణ రంగానికి రు. 2,46,727 కోట్లు; పన్నేతర ఆదాయం రు. 2,21,733 కోట్లు; విద్యారంగానికి రు. 69,074 కోట్లు కేటాయించారు.

జమ్ము కాశ్మీర్ సిఎంగా ముఫ్తీ మహ్మద్ సయీద్

జమ్ము కశ్మీర్ 12వ ముఖ్యమంత్రిగా పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) నేత ముఫ్తీ మహ్మద్ సయీద్ మార్చ్ 1న జమ్ములోని జోర్వార్ సింగ్ ఆడిటోరియంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఉప ముఖ్యమంత్రిగా బిజెపి నేత నిర్మల్ సింగ్, పిడిపి, బిజెపిలకు చెందిన 25 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఎన్.ఎన్. వోహ్రా వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ, భారతీయ జనతా పార్టీ కలిసి కశ్మీర్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.

జర్నలిస్టు వినోద్ మెహతా మృతి

ప్రముఖ పాత్రికేయులు వినోద్ మెహతా (73) ఊపిరి తిత్తుల సమస్యతో న్యూఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మార్చ్ 8న మృతిచెందారు. ఆయన 1942లో పాకిస్థాన్‌లోని రావల్పిండిలో జన్మించారు. మెహతా కుటుంబం దేశ విభజన క్రమంలో లక్నోలో స్థిరపడింది. 1974లో ఆయన పాత్రికేయ జీవితం ప్రారంభమైంది. 'డిబోనైర్' అనే పత్రికకు మొదట ఎడిటర్‌గా పనిచేశాడు. 'పయనీర్', 'సండే అబ్జర్వర్', 'ఇండియన్ పోస్టు', 'ద ఇండిపెండెంట్', 'ద పయనీర్ (ఢిల్లీ ఎడిషన్)', 'అవుట్ లుక్' వంటి పత్రికలను, మ్యాగజైన్‌లను ప్రారంభించారు. ఆయన మృతిచెందే నాటికి అవుట్ లుక్ పత్రికలో ఎడిటోరియల్ చైర్మన్‌గా పనిచేస్తున్నారు.

భూసేకరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

వివాదస్పద 'భూసేకరణ పునరావాస బిల్లు' మార్చ్ 10న లోక్‌సభ ఆమోదించింది. బిల్లులో ప్రభుత్వం తొమ్మిది సవరణలు చేసింది. మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదించారు. భూసేకరణ చట్టంలో మార్పులకు అంగీకరించేది లేదంటూ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో పద్నాలుగు పార్టీలు నిరసన తెలిపాయి. సోనియా గాంధీ నాయకత్వంలో వివిధ పార్టీలకు చెందిన వంద మందికి పైగా ఎంపిలు పార్లమెంట్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు మార్చ్ 17న ర్యాలీ నిర్వహించారు. చట్టంలో మార్పును ఉపసంహరించే వరకు పోరాడుతామన్నారు. అనంతరం ఒక ప్రతినిధి బృందం రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసి విజ్ఞాపన పత్రాలన్ని అందించింది.

ఐఎఎస్ అధికారి మృతిపై సిబిఐ విచారణ

వాణిజ్య పన్నుల ఉన్నతాధికారి డి.కె. రవి అనుమానస్పద మృతిపై కర్ణాటకలోని ప్రతిపక్షాలు సిబిఐ విచారణకు డిమాండ్ చేశాయి. వాణిజ్య పన్నుల అధికారిగా పన్ను ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్న బెంగళూరులోని బిల్డర్లు, వజ్రాల, స్వర్ణాభరణాల వ్యాపార సంస్థలపై రవి దాడులు జరిపి రెండు నెలల్లో 129 కోట్ల రూపాయల పన్నులు వసూలు చేశారు. మార్చ్ 17న మరిన్ని సంస్థలపై దాడులకు సన్నాహాలు చేస్తున్న దశలో ఆయన మృతి చెందడం అనుమానాలకు దారితీస్తోందని ప్రతిపక్ష సభ్యులు అంటున్నారు. రవి మృతిపై రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న ప్రజాందోళనలు, ప్రతిపక్షాల నిరసనల నేపథ్యంలో సిబిఐతో విచారణ జరిపిస్తామని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మార్చ్ 23న విధాన సభలో ప్రకటించారు.

అణిచివేత చర్యల ప్రసారంపై నిషేధం!

భద్రతా దళాలు చేపట్టే తీవ్రవాద వ్యతిరేక చర్యలను ప్రత్యక్ష ప్రసారం చేయకుండా టివి చానళ్లపై కేంద్రం నిషేధం విధించనుంది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ కొత్త నిబంధనలను ఆమోదించింది. ఇక కేబుల్ టివి నెట్‌వర్క్ నిబంధనల్లో ఈ కొత్త సవరణను చేర్చనున్నారు. కొత్త నిబంధనల ప్రకారం ఈ కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయరాదు. అలాంటి సంఘటనలకు సంబంధించి అధికారులు ఇచ్చే వివరాలను మాత్రమే ప్రసారం చేయాలి. అది కూడా ఆయా కార్యక్రమాలు పూర్తయ్యేంత వరకు మాత్రమేనని అధికార వర్గాలు వెల్లడించాయి.

మైనారిటీలపై కొనసాగుతున్న దాడులు

మధ్యప్రదేశ్‌లోని బజల్‌పూర్‌లోని చర్చ్‌పై భజరంగ్‌దళ్ కార్యకర్తలు మార్చ్ 20న దాడి చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ధర్మసేన అధ్యక్షుడు యోగేశ్ అగర్వాల్‌తో పాటు మరికొందరు భజరంగ్‌దళ్ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదుచేశారు. పాదర్ థాంక్‌చన్ జోన్ మతమార్పిడులకు పాల్పడుతున్నాడని ఆరోపించి భజరంగ్‌దళ్ కార్యకర్తలు చర్చ్ స్కూల్‌పై దాడిచేసి పాదర్ ఇంటి అద్దాలను పగులగొట్టారు. అక్కడే ఉన్న రవిఫ్రాన్సిస్‌ను కొట్టారు. ముంబయిలోని న్యూ పన్వెల్ ప్రాంతంలోని ఓ చర్చ్‌పై ముసుగులు దరించిన వ్యక్తులు మార్చ్ 21న రాత్రి సెయింట్ జార్జి క్యాథలిక్ చర్చ్‌పై రాళ్లతో దాడిచేశారు. క్రిస్టియన్ సన్యాసిని పై అత్యాచారం చేశారు.

స్వైన్‌ఫ్లూ మరణాలు

దేశంలోని 17 రాష్ట్రాల్లో జరిగిన స్వైన్‌ఫ్లూ మరణాల సంఖ్య మార్చ్ 23 నాటికి వరకు 1,911కి చేరింది. 32,233 మంది హెచ్1ఎన్1 బారిన పడ్డారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అత్యధికంగా గుజరాత్‌లో 410 మంది మరణించగా 6,360 మందికి వ్యాధి సోకింది. రాజస్థాన్‌లో 400 మంది మృతిచెందగా 6,409 మందికి వ్యాధి సోకింది. మహారాష్ట్రలో 347 మంది మరణించగా 4,082 మంది వ్యాధి సోకింది. మధ్యప్రదేశ్‌లో 281 మంది మరణించగా 2,094 మంది వ్యాధిగ్రస్తులైనారు. తెలంగాణలో 75 మంది మృతిచెందారు.

భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలి

వెబ్‌సైట్లలో అభ్యంతరకర సమాచారం ఉంచారనే కారణంతో ఆ వ్యక్తులను అరెస్ట్ చేసే వీలు కల్పిస్తున్న సైబర్ చట్టంలోని అంశాలను మార్చ్ 24న సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు 123 పేజీల తీర్పును జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఆర్.ఎఫ్. నారిమన్‌లతో కూడిన ధర్మాసనం వెల్లడించింది. ఆలోచన స్వేచ్ఛ వ్యక్తీకరణ అనేవి ప్రాథమికమైనవనీ ప్రజలకు తెలుసుకునే హక్కును సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐటి) చట్టంలోని సెక్షన్ 66ఎ నేరుగా ప్రభావితం చేస్తుందనీ వ్యాఖ్యానించారు. వీ

ఉక్రెయిన్ గనిలో ప్రమాదం

ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని డోనెట్స్క్ సమీపంలో ఉన్న జస్యాడ్కో గనిలో మార్చ్ 5న భారీ పేలుడు సంభవించింది. దాదాపు వంద మందికి పైగా మరణించారు. తెల్లవారుజామున సంభవించిన సమయంలో కార్మికులు భూగర్భం నుండి కిలోమీటర్ లోతున పనిచేస్తున్నారు. ఇంకా లోతుకు వెళ్లే కొద్దీ మిథేన్ గ్యాస్ వెలువడుతుందనీ, అక్కడే అగ్గిరవ్వలు రాజుకుని ఈ ప్రమాదం సంభవించి ఉండవచ్చనీ అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో గనిలో దాదాపు 200 మందికి పైగా ఉన్నారు.

ఇజ్రాయిల్ ప్రధానిగా బెంజిమిన్ నెతన్యాహూ

ఇజ్రాయిల్ పార్లమెంట్‌కు మార్చ్ 17న జరిగిన ఎన్నికల్లో ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూ నేతృత్వంలోని లికుడ్ పార్టీ విజయం సాధించింది. 120 సభ్యులున్న ఇజ్రాయిల్ పార్లమెంట్‌లో లికుడ్ పార్టీ 29 స్థానాలు గెలిచి అతిపెద్ద పార్టీగా అవతరించింది. ప్రతిపక్ష పార్టీ అయిన జియోనిస్ట్ యూనియన్‌కు 24 సీట్లు మాత్రమే వచ్చాయి. దీంతో గత తొమ్మిదేండ్లలో మూడు పర్యాయాలుగా అధికారాన్ని సాగిస్తున్న నెతన్యాహూ తిరిగి ప్రధానిగా ఎన్నికయ్యారు.

ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఆందోళనలు

జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో కొత్తగా నిర్మించిన యూరప్ సెంట్రల్ బ్యాంక్ (ఇసిబి) భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మార్చ్ 18న వేలాది మంది కార్మిక సంఘాల కార్యకర్తలు, నేతలు, ప్రజలు అడ్డుకున్నారు. మొత్తం 130 కోట్ల డాలర్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. ఇసిబి గ్రీస్ వంటి యూరప్ దేశాలపై విధిస్తున్న నిబంధనలకు వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభమయ్యాయి. ఈ ఆందోళనలో ప్రధానంగా కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు, జర్మనీ లెఫ్ట్ పార్టీ సభ్యులు పాల్గొంటున్నారు. పోలీసులు భారీ ఎత్తున బలగాలను మోహరించి వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా జరిగిన ఘర్షణల్లో వందలాది మంది గాయపడ్డారు.

ట్యునీషియాలో మిలిటెంట్ దాడి

ట్యునీషియా రాజధాని ట్యునీస్‌లోని పార్లమెంట్ భవనం దగ్గర మార్చ్ 18న మిలిటెంట్లు దాడి చేశారు. పార్లమెంట్ భవనం సమీపంలోని బార్డో మ్యూజియం దగ్గర మారణాయుధాలు ధరించిన ముగ్గురు మిలిటెంట్లు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దాదాపు ఇరవై మందికి పైగా మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. పర్యాటక ప్రాంతమైన బార్డో మ్యూజియం వద్ద జనసంచారం ఎక్కువ ఉండడంతో ప్రాణనష్టం అధికంగా ఉందని భద్రతా బలగాలు తెలిపాయి. భద్రతా సిబ్బంది ఇద్దరు మిలిటెంట్లను అదుపులోకి తీసుకున్నారు.

యెమెన్‌లో ఆత్మాహుతి దాడి

యెమెన్ రాజధాని సనాలో మార్చ్ 20న జరిగిన ఆత్మాహుతి దాడిలో 137 మంది మరణించారు. దాదాపు రెండు వందల మందికి పైగా గాయపడ్డారు. శుక్రవారం ప్రార్థనల సమయంలో రెండు మసీదుల సమీపంలో బాంబులు ధరించిన నలుగురు ఉగ్రవాదులు తమను తాము పేల్చుకొని ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.

పెరుగుతున్న ముడి చమురు ఉత్పత్తి

ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు ఉత్పత్తి పెరుగుతోందని వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక తెలిపింది. ప్రతిరోజు పదిహేను లక్షల బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్ ఉత్పత్తి అవుతోందనీ, దీనిని నిలువ చేసేందుకు ట్యాంకులు సరిపోవడం లేదనీ పత్రిక తెలిపింది. క్రూడ్ ఆయిల్ నిలువలు పెరిగిపోతున్నందు వల్ల ప్రపంచ వ్యాప్తంగా గత జూన్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గు ముఖం పట్టాయి. ప్రముఖ దేశాలలో ముడిచమురు నిలువ చేసే సామర్థ్యం తగ్గిపోతోంది. ఉత్పత్తి ఇదే విధంగా సాగితే అమెరికాలో చమురు నిలువ చేసే ట్యాంకులు ఏప్రిల్ మధ్యవారం వరకు నిండిపోతాయనీ యూరప్‌లో 90 శాతం నిండిపోతాయనీ, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, జపాన్ తదితర దేశాల్లో చములు నిలువలు 80 శాతం నిండిపోయాయనీ పత్రిక తెలిపింది.

స్పెయిన్‌లో భారీ ప్రదర్శన

పొదుపు చర్యలకు వ్యతిరేకంగా స్పెయిన్‌లో మార్చ్ 20న స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో నిరసనలు ప్రదర్శనలు జరిగాయి. 'ఆత్మ గౌరవం కోసం ప్రదర్శన' పేరుతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ ప్రదర్శనలో వేలాది మంది పౌరులు పాల్గొన్నారు. త్వరలో స్పెయిన్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఆర్థిక సంక్షోభం కారణంగా స్పెయిన్ ప్రభుత్వం పొదుపు చర్యలు ప్రారంభించడంతో నిరుద్యోగం పెరిగింది. దాదాపు 16-25 మధ్య వయసుగల యువతీ యువకులలో సగం మందికి ఉద్యోగాలు లేవు. 23.7 శాతం నిరుద్యోగం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది.

లీ కున్ యూ మృతి

సింగపూర్ పితామహుడూ, మూడు దశాబ్దాలు ప్రధాని బాధ్యతలు నిర్వహించిన లీ కున్ యూ మార్చ్ 23న మరణించారు. 1959లో సింగపూర్ బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తి పొందింది. ఆ సంవత్సరం జరిగిన మొదటి ఎన్నికల్లో లీ నేతృత్వంలోని పీపుల్స్ యాక్షన్ పార్టీ ఆధిక్యంతో అధికారం చేపట్టింది. అప్పటి నుంచి 1990 వరకు ఆయన సింగపూర్ ప్రధానిగా బాధ్యతలు నిర్వహించారు. నీటి కాలుష్యం, అవినీతి దేశంగా పేరున్న సింగపూర్‌ను ఆగ్నేయాసియాలోనే ప్రబల ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేయడంలో లీ చాలా కృషి చేశారు. అయితే వాక్ స్వాతంత్ర్యం, పత్రికా స్వేచ్ఛ, పౌరహక్కులపై నియంత్రణ, విపక్షాల అణచివేత చర్యలు తీవ్ర విమర్శలకు గురయ్యాయి.

ఫ్రాన్స్‌లో విమాన ప్రమాదం

మార్చ్ 24న ఫ్రాన్స్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో జర్మనీ విమాన సంస్థ లుఫ్తాన్సాకు విమానాన్ని నడుపుతున్న జర్మన్ వింగ్స్‌కు చెందిన విమానం కుప్పకూలిపోయింది. ఇందులో ప్రయాణిస్తున్న మొత్తం 150 మంది మరణించారు. స్పెయిన్‌లోని బార్సిలోనా నుంచి జర్మనీలోని డ్యూసెల్ డార్ఫ్‌కు వెళుతున్న విమానం ఆల్ప్స్ డి హాట్ ప్రావిన్స్‌లో బార్సిలోనెట్ అనే చిన్న పట్టన సమీపంలోని పర్వత ప్రాంతంలో కూలిపోయింది. సంఘటన జరిగిన ప్రాంతం మంచుతో నిండి ఉండడం, అక్కడికి హెలికాప్టర్‌లో మాత్రమే వెళ్లేందుకు అవకాశముండడంతో సహాయక చర్యలకు తీవ్ర విఘాతం ఏర్పడింది. ప్రమాద స్థలం సముద్ర మట్టానికి 1400 మీటర్ల ఎత్తులో ఉంది. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం : వై.రామచంద్రం, ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్ధాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(ఫిబ్రవరి 1 నుండి ఫిబ్రవరి 28, 2015 వరకు తెలంగాణలోని 6 జిల్లాలు (676), ఆంధ్రప్రదేశ్‌లోని 8 జిల్లాలలో (504) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1180)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	2	-	13	16	4	7	6	3	2	1	2	-	1	23	22	-	-	-	1	-
మెదక్	4	6	5	12	6	9	22	2	15	12	4	12	12	7	32	14	-	4	-	4	4
కరీంనగర్	వివరాలు అందలేదు																				
ఖమ్మం	-	-	-	2	1	4	11	2	-	1	3	1	-	4	16	19	-	-	-	-	-
మహబూబ్‌నగర్	-	4	-	18	20	3	-	4	6	10	10	12	11	10	55	3	-	-	-	-	-
రంగారెడ్డి	వివరాలు అందలేదు																				
నల్గొండ	వివరాలు అందలేదు																				
నిజామాబాద్	-	-	-	5	14	5	2	-	2	5	6	4	2	4	28	18	-	-	-	-	-
హైదరాబాద్	-	-	-	3	-	-	-	-	-	-	2	10	-	-	27	9	-	-	-	10	-
తెలంగాణ	**5**	**12**	**5**	**53**	**57**	**25**	**42**	**14**	**26**	**30**	**26**	**41**	**25**	**26**	**181**	**85**	**-**	**4**	**-**	**15**	**4**
అనంతపురం	-	2	1	1	16	1	4	2	1	4	2	4	5	2	22	3	-	-	-	-	-
చిత్తూరు	-	12	-	-	-	-	-	-	-	-	-	6	8	-	28	-	-	-	-	-	-
కడప	-	1	-	5	7	-	-	1	-	2	-	2	-	1	8	-	-	-	-	-	1
కర్నూలు		-	4	-	7	4	9	6	8	5	3	3	4	6	3	18	21	-	-	-	1
తూర్పు గోదావరి	-	-	-	1	3	2	1	6	2	1	5	3	3	2	15	21	-	-	-	-	-
ప్రకాశం	1	2	-	3	4	2	-	1	3	1	4	7	4	2	14	4	1	2	-	-	
శ్రీకాకుళం	-	-	-	6	3	3	6	2	1	2	2	1	3	1	15	15	-	-	-	1	-
విశాఖపట్నం	-	-	-	4	9	-	-	-	-	1	-	-	5	4	22	9	-	-	-	15	-
ఆంధ్రప్రదేశ్	**1**	**17**	**5**	**20**	**49**	**12**	**20**	**18**	**15**	**16**	**16**	**26**	**32**	**18**	**127**	**70**	**22**	**-**	**2**	**16**	**2**

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 75
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
వ్యవసాయం - ప్రపంచీకరణ	కె.ఆర్. చౌదరి	100
నిత్యజీవితంలో సోషలిజం	భూసారం శివన్న	100
విధ్వంసకల అభివృద్ధి	డిఎస్‌యు	180
భారతదేశంలో ఉత్పత్తి విధానం		
ఉత్పత్తి సంబంధాలు	విరసం	20

తెలంగాణ

లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
తిరగబడ్డ తెలంగాణ	ఇనుకొండ తిరుమలి	100
తెలంగాణ రాజకీయాలు	దాగ్మార్ బెర్న్‌స్టార్ఫ్, హ్యూగ్ గ్రే	80
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
తెలంగాణ జైత్రయాత్ర	ఘంటా చక్రపాణి	200
తెలంగాణ కాలజ్ఞాని ప్రొ. జయశంకర్	ఘంటా చక్రపాణి	20

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవకణాలూ నాడీకణాలూ	కొడవటిగంటి రోహిణీప్రసాద్	80
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
జీవశాస్త్ర విజ్ఞానం - సమాజం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
విజ్ఞాన శాస్త్రం మనిషి విస్తరణ	జెడి బెర్నాల్	80

కులం-మతం

భారతదేశంలో కుల సమస్య	అనురాధ గాంధీ	120
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	80
కులం వర్గం	బొజ్జా తారకం	30
ఎస్‌సి, ఎస్‌టి నిధులు, విధిలింపు - మళ్లింపు	బొజ్జా తారకం	40
ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు	బొజ్జా తారకం	50
ఖైర్లాంజి	ఆనంద్ తేల్‌తుంబ్డే	100
గులాంగిరి	జోతిబా ఫూలే	40
కుల నిర్మూలన	అంబేద్కర్	30
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
దళితులు - రాజ్యం	అంబేద్కర్	25
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	8
ఆధునిక భారతదేశంలో అంటరానితనం	అంబేద్కర్	25
దాస్య విముక్తి కోసం	అంబేద్కర్	15
భారతదేశం ప్రజాస్వామ్యం	అంబేద్కర్	12
ఆంగ్లేయపాలకులు - అంటరానివాళ్లు	అంబేద్కర్	20
రాష్ట్రాలు - మైనారిటీలు	అంబేద్కర్	40
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	20
మతతత్వంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
దేవుని రాజకీయతత్వం	కంచె ఐలయ్య	70
నేను హిందూవు నెట్లయిత?	కంచె ఐలయ్య	80

సాహిత్య విమర్శ - వ్యాసాలు

గురజాడ దేశభక్తి	ఎన్. వేణుగోపాల్	20
మహోదయం	కె.వి.ఆర్.	200
పరామర్శ	నల్లూరి రుక్మిణి	80
సాహిత్యంపై బాలగోపాల్	కె. బాలగోపాల్	150
విరసం సాహిత్య విమర్శ	విరసం ప్రచురణ	150
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-1	శారదాంబ స్మారక కమిటీ	300
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	శారదాంబ స్మారక కమిటీ	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	శారదాంబ స్మారక కమిటీ	250
సాహిత్య సమాలోచన	కృష్ణాబాయి	300
సందిగ్ధ సందర్భం	సి.వి. సుబ్బారావు	40
సామాజికం	వి. చెంచయ్య	30
స్త్రీవాద సాహిత్యం	డా. నళిని	70
రియాలిటీ చెక్	పూడూరి రాజిరెడ్డి	250
మన ప్రపంచం	దుప్పల రవికుమార్	75
దారులేసిన అక్షరాలు	భారతీయ మహిళల రచనలు	400

చరిత్ర-జీవిత చరిత్ర

భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయ	డి.డి. కొశాంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	40
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	50
చరిత్రలో ఏం జరిగింది?	గార్డన్ చైల్డ్	80
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	80
ఆధునిక భారతదేశ చరిత్ర	బిపిన్ చంద్ర	రు. 100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్‌సన్	150
24 గంటలు	కె.జి. కన్నబిరాన్	200
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	70
చేగువేరా	కాత్యాయని	80
ఒక సెక్స్ వర్కర్ ఆత్మ కథ	నళినీ జమీలా	50
పరాయి పాలనను ఎదిరించిన ఝాన్సీ	మహాశ్వేతాదేవి	150
నిర్జన వారధి	కొండపల్లి కోటేశ్వరమ్మ	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీ దేవి	120
పరిచయాలు	ఎన్. వేణుగోపాల్	50
నా ప్రజాజీవితం	పెండ్యాల రాఘవరావు	50
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
నూరేళ్ల కాళోజీ	వరవరరావు	60
ఆకుల భూమయ్య రచనలు	తెలంగాణ విద్యార్థి గళం	40
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్సన్	150

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ	డా. శ్రీనివాస్	100
మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్సిజం-లెనినిజం-మావోయిజం	విరసం	125
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్ ప్రచురణలు అన్ని		

విప్లవోద్యమం

పోలీసులు అరెస్ట్ చేస్తే	బొజ్జా తారకం	30
భారత్‌పై అరుణతార	యాన్ మిర్డాల్	100
జంగల్‌నామా	సత్నామ్	100
కోటి జ్ఞాపకాలు	విరసం ప్రచురణ	50
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
రివిజనిజం	విరసం ప్రచురణ	75
జనతన జైత్రయాత్ర	విరసం ప్రచురణ	20
అంతర్యుద్ధంలో ఆదివాసులు	విరసం ప్రచురణ	20
ఆదర్శ జీవులు ఆమరులు	విరసం ప్రచురణ	30
మావో రచనలు - 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు - 2	విరసం ప్రచురణ	220

కథ - నవల

దండకారణ్య కథలు(2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
రేపు కథ	వెర్నన్ గొంజాల్వెస్	20
మిగిలేటోళ్లు	బాసిత్	50
కాంత పున్నం వెన్నెల	పద్మకుమారి	20
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	80
కథలగూడు	దేవులపల్లి కృష్ణమూర్తి	60
పథేర్ పాంచాలి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
చంద్రగిరి శిఖరం	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	50
అపరాజితుడు	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	100
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
పంచతంత్రం	బొజ్జాతారకం	100
ఇంట్లో ప్రేమ్‌చంద్	శివరాణీదేవి ప్రేమ్‌చంద్	120
ఇస్మత్ చుగ్తాయి కథలు	ఇస్మత్ చుగ్తాయి	100
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	80
రేపటి కల	రిచర్డ్ రైట్	50
పంచమం	చిలుకూరి దేవపుత్ర	100
ఒంద్రుమట్టి	నల్లూరి రుక్మిణి	170
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
హింసపాదు	బమ్మిడి జగదీశ్వరరావు	180

డివిడి

వీక్షణం (2003 - 2012)	200
సృజన (1966-1992)	240
అరుణతార (1970-2013)	125
'ఓయు'ద్ధకాండ	100

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 165 - April 2015 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/3/2014 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2014-16


Date of Posting : 29th, 30th

‘వీక్షణం’ను ఆదుకుందాం
‘వీక్షణం’ నాలుగు కాలాల పాటు నిలిచేందుకు చేయూతనిద్దాం

తెలుగులో ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ వంటి పత్రిక ఉండాలనే ఆలోచనతో, సీనియర్ పాత్రికేయులు వి. హనుమంతరావు సంపాదకులుగా 2003లో ప్రారంభమై, 2005 నుంచి ఎన్. వేణుగోపాల్ సంపాదకత్వంలో నడుస్తున్న రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక ‘వీక్షణం’ తెలుగు సమాజానికి అవసరమైన చర్చావేదికగా పనిచేస్తున్నదని, మనందరితో పాటు ఎందరో పాఠకుల ఆదరాభిమానాలు చూరగొన్నదని మనకు తెలుసు. పన్నెండు సంవత్సరాలుగా నిరంతరాయంగా నడుస్తున్న ఈ పత్రిక ఆర్థిక పరిస్థితి ఇప్పటికీ దినదిన గండంగానే ఉంటున్నది. ఎప్పుడు ఆగిపోతుందో తెలియదని దాదాపు ప్రతినెలా పత్రికలో అచ్చవుతున్న ఆందోళనాకరమైన ప్రకటన, ఈ పత్రికను నిలబెట్టడానికి తోడ్పడమనే అభ్యర్థనలు మా ఈ బహిరంగ ప్రకటనకు కారణం. ఇంతకాలంగా నిర్వాహకులు కష్టనష్టాలు భరిస్తూ సాగించిన కృషికి ఇప్పుడు మన సహకారం అవసరమని చెప్పడానికే ఈ ప్రకటన.

‘వీక్షణం’ ఈ పన్నెండు సంవత్సరాలలో మూడువేలకు పైగా వ్యాసాలను ప్రచురించి ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ అంశాలెన్నిటి పైననో తెలుగు సమాజానికి అత్యవసరమైన సమాచారాన్నీ, వివరణలనూ, విశ్లేషణలనూ అందించింది. సంపాదకుడి అభిప్రాయాలే వైనప్పటికీ, తెలుగు సమాజంలో ఉన్న ప్రగతిశీల భావాలకూ, ధోరణులకూ అన్నిటికీ ప్రజాస్వామిక స్ఫూర్తితో వేదిక కల్పించింది. ప్రతిష్ఠాత్మకమైన ఐఎస్ఎస్ఎన్ గుర్తింపు సంపాదించి పరిశోధక విద్యార్థులకు, విశ్వవిద్యాలయ అధ్యాపకులకు అవకాశాలు కల్పించింది. ప్రతి సంవత్సరం రచయితల సమావేశాలు, సంభాషణలు ఏర్పాటు చేసి తెలుగు సమాజంలో సామాజిక శాస్త్ర రచనను ప్రోత్సహించింది. వ్యాసరచనా అధ్యయన తరగతులు నిర్వహించి వ్యాసప్రక్రియ ప్రమాణాలు పెంచడానికి తన వంతు కృషి చేసింది. పత్రికలో లబ్ధప్రతిష్ఠుల రచనలు ప్రచురించడంతో పాటు, విషయమే ప్రధానంగా ఐదారు వందలమంది కొత్త వ్యాసకర్తలకు అవకాశం కల్పించింది. ‘ఒక దళారీ పశ్చాత్తాపం’ వంటి విస్తృత ప్రచారం పొందిన పుస్తకంతో సహా దాదాపు డజను పుస్తకాలు ప్రచురించింది.

తెలుగు సమాజానికీ, మేధో ప్రపంచానికీ, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణకూ ఇంత దోహదం చేసిన ‘వీక్షణం’ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు, ఆ దీపం కొడిగట్టిపోకుండా కాపాడడం సమాజం బాధ్యత. ఇతోధిక పాఠకులను తయారు చేయడం, విరివిగా చందాలు చేర్పించడం, వ్యాపార ప్రకటనలు సేకరించిపెట్టడం, విరాళాలు అందించడం మన కనీస కర్తవ్యం. ‘వీక్షణం’ శ్రేయోభిలాషి, చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ ‘వీక్షణం’ రచయితల సమావేశాల్లో సూచించినట్టుగా ఆర్థిక ఇబ్బందుల నుంచి సుస్థిరమైన పద్ధతిలో గట్టెక్కాలంటే ‘వీక్షణం’కు ఒక మూలనిధి కూడ ఏర్పాటు చేయవలసి ఉంది. మనంతట మనం మన శక్తి మేరకు గాని, విరాళాలు ఇవ్వగలిగిన మిత్రుల ద్వారా గాని ఈ మూలనిధి విరాళాలు సేకరించి మనందరికీ, మొత్తంగా సమాజానికీ అవసరమైన ‘వీక్షణం’ రాజకీయార్థిక, సామాజిక మాసపత్రికను కాపాడుకుందాం. ఈ చైతన్యజ్వాల ఆరిపోకుండా మన రెండు చేతులూ అడ్డుపెట్టి వెలుగు నిరంతరం ప్రసరించనిద్దాం.



Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Deccan Press for Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020 and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao